

ప్రబోధ

ఇందూ ధర్మప్రదాత
సంచలనాత్మత రచయిత, త్రైత సిద్ధాంత ఆదికర్త

శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వర్లు

ప్రచురించినవారు :

ఇందూ జ్ఞానవేదిక (Regd.No. : 168/2004)

ప్రబోధ

విషయ సూచిక

ఓ మానవులారా!

నేను కొద్దిగా చదువుకొన్న వాడిని. నాకు భాషయందు పాండిత్యము లేదు. కావున నేను వ్రాసిన గ్రంథమునందు అనేకముగా భాషలో, అక్షరములలో తప్పులు యుండవచ్చును. కాని భాషను ముఖ్యముగా దృష్టిలో యుంచుకొనక భావనను ముఖ్యముగ దృష్టిలో యుంచుకోవలయునని ముందుగా కోరుచున్నాను.

ఈ కాలములో మోక్షమునందు కోరిక కలవారు కొందరుయున్నారు. వారికి సరియైన మార్గము లభించక, ఒక వేళ లభించిన అవి సంశయములతో కూడుకొని యుండుట వలన వారు ముందుకు సాగలేక ఎక్కడ యున్నవారు అక్కడనే యుండుట సంభవించుచున్నది. దేశములో భగవంతునియందు భక్తి కలిగిన వారు మగవారి కంటే స్త్రీలే ఎక్కువగ ఉన్నారు. వారు మగవారి బానిసత్వానికి గురియైనవారై బయటికి రాలేక బోధను తెలుసుకోలేక పోవుచున్నారు. అటువంటి వారికి ఈ గ్రంథము ఎంతో మేలు చేయగలదు. మరియు కొంతమంది జ్ఞాన జిజ్ఞాసపరులై మేము ధనికులము మర్యాదస్తులము అయి ఈ విషయముల కోసము ఎట్లు ఇతరుల దగ్గరకు పోయేది అను అభిమానముతో జ్ఞానమునుతెలుసుకోలేక పోవుచున్నారు. అటువంటి వారికి కూడ ఈ గ్రంథము అక్షర రూపముగా బోధచేసి మేలు చేకూర్చగలదు. ఇంకనూ కొద్దిమంది పరమాత్మ విషయములను కొద్దిగ తెలుసుకొని మాకు పూర్తిగా తెలుసు అని గర్వపడుచు జ్ఞానులు చెప్పిన మాటలను వినకయున్నారు. వారు గ్రంథరూపముగా తెలుసుకొని తమ లోని లోపములను సవరించుకొనుటకు వీలుకల్గునట్లు ఈ గ్రంథము వారికి మేలు చేయును.పుస్తకములు చదివి అంతా తెలిసినది ఇక గురువుతో పనిలేదు అని అనుకొనువారికి గురువు ద్వారా ఇంకా ఎంతో తెలుసుకోవలసినది ఉన్నది అని ఈ గ్రంథము తెలిపి మేలు చేయగలదు. పూర్వజన్మమున కొద్దిగా జ్ఞానపరులై యున్న వారికి ఈ జన్మమున పూర్తి జ్ఞానమును యిచ్చి ఈ గ్రంథము వారికి మేలు చేయగలదు. పుస్తకములు చదివి అనుభవము లేకున్న అనుభవము ఉన్న జ్ఞానులను

అడ్డ ప్రశ్నలడుగు కుమతులకు మంచి బోధనిచ్చి ఈ గ్రంథము మేలుచేయగలదు. నిజము తెలియక దేవతలను నమ్మినవారికి నిజము తెలిపి పరమాత్మను నమ్మునట్లు చేసి ఈ గ్రంథము మేలుచేయగలదు.

నేటికి నాశరీర వయస్సు 30 సంవత్సరములు. కాని పైకి కనుపించునది 20 సంవత్సరముల లాగా ఉండును. కావున నేను ప్రత్యక్షముగా యుండి ఏమిచెప్పిన నావయస్సును చూచి అందరు నామాటలు పెడచెవిని పెట్టుదురు. పెడచెవిని పెట్టినదియే కాక హేళనగా మాట్లాడుదురు. మానవులు పూర్వము కూడ పెద్ద పెద్ద వారిని అట్లే చేసినారు. వారి మహత్యములు కొంతమంది తెలుసుకొని బాగుపడినవారు ఉన్నారు. అట్లే నా విలువ తెలిసిన వారు తప్పక మేలు పొందుదురు. నావిలువ తెలియవలయునన్న జ్ఞానము తప్పక యుండవలయును. జ్ఞానికాని వానికి నా పై శరీరము కనిపించును. ప్రకృతితో తయారయిన నా శరీరమును చూచిన, ఎవరు నన్ను నామహత్యమును గుర్తించలేరు. ఈ కాలములో చాలామంది పైచూపు చూచు వారే ఉన్నారు. కాబట్టి నన్ను తెలుసుకోలేరు, నా మాటలు వినరు. అందువలన నేను నాలోపలి నుండి వచ్చిన విషయములను గ్రంథ రూపముగా వ్రాసినను, ఇట్లు వ్రాయుట వలన నామాటలు వినుటకు చాలామందికి అవకాశము లభించును.

నా బోధయంతయు గీతాశాస్త్రమే ఆధారము. కాబట్టి గీతాశాస్త్రమునకు ఎవ్వరయితే విలువ ఇచ్చుచుందురో వారందరు ప్రబోధ గ్రంథము యొక్క విలువ తప్పక గ్రహించుకొందురు. గీతాశాస్త్రమునకు ఎవ్వరు విలువ ఇవ్వకుందురో వారికి ఈ గ్రంథము నిష్ప్రయోజనము అని చెప్పవచ్చును.

మానవులకు కొన్నాళ్లకొక జన్మ మారుచున్నది. ఒకే జన్మ ఎవరికి శాశ్వితము కాదు. జన్మశాశ్వితము కానిది ఆ జన్మలోని ధనము భూమి ఇంకనూ ఇతర విషయములపై కొంతకాలమే తను (జీవుడు) అధికారిగా ఉండును. తర్వాత ఏ బికారిగా జన్మించునో తనకే తెలియదు. కావున అటువంటి జన్మలమీద మీ తెలివి ఉపయోగించక నేనుచెప్పు విషయముల మీద కూడ కొద్దిగా బుద్ధి ఉపయోగించవలయునని కోరుచున్నాను.

ఇట్లు :– గ్రంథకర్త.

నా మాట

మహాభక్తులారా ఈ గ్రంథముయొక్క విశిష్టత అపూర్వముగా ఉన్నది. ఎన్నియో గ్రంథములు ఇంతకుముందు చదివినాము కాని ఈ గ్రంథము అన్ని గ్రంథములపైకి ప్రత్యేకత కలిగియున్నది. ప్రాణాయామమును గురించి ఇంతకుముందు తెలుసుకొన్న దానికి ఇపుడు ఈ గ్రంథము చదివి తెలుసుకొన్న దానికి ఎన్నో రెట్లు బేధము కనుపించుచూ యున్నది. అందరు శ్వాస చక్రములను తిరిగి వస్తున్నది అనియే వ్రాసినారు. అది ఎలా సాధ్యమగును? అని నాకు చాలా అనుమానముగా ఉండెను. డాక్టర్లను విచారించగా శ్వాస ఊపిరితిత్తులనుండి తిరిగి వచ్చుచుండును అని తెలిపినారు. ఎందరో వ్రాసిన ప్రాణాయామములను చదివి అందు శ్వాస బ్రహ్మనాడిలోని చక్రములను ఎలా తిరిగి వచ్చుచుండును? అను అనుమానముతో కూడుకొని ఉంటిని. ఈ గ్రంథము చదివిన ప్రాణాయామములో శరీరమునందు ఏయే మార్పులు జరిగేది, లోపలికిపోయి చూచినట్లు ఉన్నది. మరియు ఎన్నాళ్ళ నుండియో నాలోయున్న సంశయములన్నియు పటాపంచలయినవి. పూర్తి దరిద్రము అనుభవించువానికి ఒక నిధి దొరికినట్లు, నదీప్రవాహములో కొట్టుకపోవుచు బయటపడవలెనని తాపత్రయపడువానికి ఆధారము దొరికినట్లు నాకు ఈ గ్రంథము జ్ఞాన దీపమై లభించి నాపాలిట కల్పవృక్షమై నా సంశయముల మొత్తము తీర్చినది.

చాలా నిగూఢముగా యున్న ఆహా బ్రహ్మాండమైనది ఆది మంత్రముఅను తత్వమును ఎంతో సులభముగా అర్థమగునట్లు తెలియపరుచబడి ఉన్నది. ఇంతవరకు ఈ తత్వమునకు సరయిన అర్థము చెప్పిన వారిని నేను చూచి యుండలేదు. ఈ ఒక్క తత్వములోనే గ్రంథకర్త యొక్క జ్ఞానదృష్టి ఎంతగా యున్నదో తెలుసుకొనువారికి బాగుగ తెలియుచున్నది. ప్రపంచములో ఇంతవరకు తెలియని విషయములను తెలిపి శ్రీ ప్రబోధానందస్వామి తన జన్మ కారణజన్మ అని రుజువు చేసుకొన్నట్లు ఉన్నది. యోగదండముయొక్క ప్రాముఖ్యత గురించి

ఇంతగా బోధించిన గ్రంథములు ఇంతవరకు ఒక్కటియు లేవు. భారతదేశములో కాల కర్మచక్రముల గురించి కంటికి కనుపించునట్లు చిత్రములతో సహా చూపించిన వారుఇంతవరకు ఎవ్వరు లేరు. కంటికి కనుపించని ఈ చక్రములను జ్ఞానదృష్టి ద్వారా తెలుసుకొని స్థూలకన్నులకు కనుపించునట్లు చేసిన భక్తాగ్రగణ్యుడు ఈయన ఒక్కడే. ఇటువంటి విషయములు అనేకము తేట తెలుగునందు విశదీకరించబడిన ఈ గ్రంథము దేశములోయున్న గ్రంథములలోకెల్ల మిన్న అని నేను తెలుసుకొని మీకు తెలుపుచున్నాను. మరియు ఒక్క మాటలో చెప్పవలయునంటే ఈ గ్రంథము సహస్రగ్రంథ సారాంశమునకు సాటి అని చెప్పవచ్చును. ఈ గ్రంథమునందలి విషయములు కొన్ని కొంతమంది భక్తులుకాని భక్తులకు వ్యతిరేకముగా వేమన యోగి చెప్పిన మాదిరి వాస్తవమును తెలియజేయుచున్నవి. దేశములో పెద్దస్వాములు అని పేరుగాంచిన ప్రయోజనము లేదు. పరమాత్మ దృష్టిలో పెద్దస్వాములు కావలయును అను విషయము వేమనయోగి చెప్పినట్లున్నది. భక్తి విషయములో ఇపుడు ప్రజలయందుండు భక్తి ఇటువంటిది అని ఎవరికి జంకక తెలియజేసిన గ్రంథము ఇదియే. అన్ని గ్రంథములు ప్రజల మన్ననలను పొందవలయునని ప్రజలకు వ్యతిరేకము కనుపించనట్లుగా వ్రాయబడుచున్నవి. కాని ఈ గ్రంథము అట్లుకాక ప్రజలలో కొంతమందికి వ్యతిరేకత అయినా పరవాలేదు వారియందు సరియైన భక్తి బీజమును నాటవలయునని వ్రాయబడి ఉన్నది. ఈ గ్రంథము ఎవరికి చేతికి దొరుకునో అతను వెనుకటి జన్మమున పుణ్యముచేసి ఉండును. పుణ్యము లేనివానికి ఈ గ్రంథము దొరకుట కూడ దుర్లభముగానే ఉండును. ఈ గ్రంథము ఎన్నియో గ్రంథములు పైకి మేటిగా కనిపించి నాకు అనేకమయిన జ్ఞానము ప్రసాదించినది. మీకు కూడ అలాగే చేయగలదని భావించుచున్నాను.

ఇట్లు
శ్రీ పరమాత్మ దాసుడు,
వి. నారాయణ రెడ్డి. తిరుపతి.

నా అభిప్రాయము

మహాశయులారా దేశములో భక్తి అనునది నానాటికి క్షీణించుచున్నది. పిల్లలు అందరు కాలేజీలలో విజ్ఞాన శాస్త్రములు (సైన్సు) చదువను మొదలు పెట్టి దేవుడు లేదని వాదించుచున్నారు. మరియు పూర్వము పెద్దలు చెప్పిన విషయములను అన్నిటిని మూఢనమ్మకములు అని అనుచు దైవభక్తి కొద్దిగా కూడ లేనివారై పోవుచున్నారు. నేడు చిన్నలే రేపు దేశమున పెద్దలు చిన్నవయసులో భక్తి అనునది తెలియకపోతే పెద్దలయిన తర్వాత, అది పట్టుపడదు. కావున 20 లేక 30 సంవత్సరముల లోపల వయస్సు యుండు వారందరు భక్తి అను విషయము తెలుసుకొనుటకు వారికి అర్థమయేలా ఈ గ్రంథము ఉన్నది. ఈ కాలమున నవయువతీ యువకులకు భక్తి దేవుడు అనువిషయములో అనేక అనుమానములు వచ్చి వారు ఇతరులను అడుగగా, వారి అనుమానములకు సరిఅయిన సమాధానము దొరుకకపోగా వారు భక్తి దేవుడు అనునది అంతయు అబద్ధము అని అనుచున్నారు. అటువంటివారికి విజ్ఞాన రూపకముగా జవాబు లొసగి ఈగ్రంథము వారి యందు భక్తిబీజము నాటగలదని భావించుచున్నాను. ఏమి తెలియని అజ్ఞానులందు ఉద్భవించు అనుమానములనే ప్రశ్నల రూపకముగా పొందుపరచి దానికిసమాధానములు చెప్పబడి ఉన్నవి. కాలేజీలలో సైన్సు చదివి దయ్యములు లేవు అనువారికి మన సూక్ష్మశరీరమే దయ్యమని విజ్ఞాన రూపకము గా తెలియబరచబడి యున్నది. ఈగ్రంథమున అనేక విషయములు నిదర్శనములతో సహా విజ్ఞాన పూర్వకముగ తెలియపరచబడి యున్నవి. కాబట్టి నేటి నవయువకులు కూడ తప్పక విశ్వసింపవలసి వచ్చును. ఈగ్రంథమునందు యున్న విషయము చాలా సులభమయిన భాషయందు యుండుటవలన ప్రతి ఒక్కరు అర్థము చేసుకోగలరు. దేశములో కొందరు భక్తి మార్గము అంటే భయపడుచున్నారు. ఎందుకనగా జ్ఞానమార్గము అవలంభించిన సంసారము విడువవలయునేమోనని వారు తలంచుచున్నారు. మరియు గృహములను విడచి కాషాయ వస్త్రములు ధరించి సన్యాసులలో కలియవలయునేమో అని వారి భావన ఉండును. అందువలన జ్ఞానమార్గము అంటే అసహ్యించుకొనుచుందురు. ఈ గ్రంథము చదువుట వలన

జ్ఞానమార్గము అంటే సంసారము విడచి దేశదిమ్మరులై పోవునది కాదని తెలుసుకొని జ్ఞానమార్గమును అసహ్యించుకొనరు.

యమబాధలు అనుభవించుచు తెలియక యమలోకమనునది ఎక్కడో వున్నదని భ్రమించు వారందరికి యమలోకమును గురించి ఈ గ్రంథము విపులముగా తెలియజేసినది. సర్వ ప్రపంచములోని జీవులు కార్యములను చేయుటకు కారణము గుణములని తెలిపి కంటికి కనుపరాని గుణములు ఎట్లున్నది, ఏమి తెలియని మూఢులకు సహితము అర్థమయేలాగ చిత్రములతో సహ చూపి బోధించినది నాకు తెలిసినంతలో ప్రబోధానంద స్వామియేనని నేను నిర్ఘాటముగ చెప్పగలను. ఎవరికి తెలియని కాల కర్మ చక్రములు అనునవి మనయందే ఉన్నవని రుజువుచేసి గీతయందు పరమాత్మ కాలచక్రమును ఉద్దేశించియే యోగుల మరణమును సూచించి నాడని తెలియజేసినాడు. కపాలమునందుగల కర్మచక్రములోని కర్మనుబట్టియే జీవులందరు సుఖదుఃఖాలను పొందుచున్నారని తెలిపి కర్మకు సంబంధించిన సంశయములు తీసివేసినాడు. సాధకులకు తెలియని నిగూఢ రహస్యములను తెలిపి వారు సాధన చేయుటకు మార్గములను విపులముగ తెలియజేసినది ప్రబోధగ్రంథము. రాజయోగులు బ్రహ్మయోగులు అంటే అందరు వేరే భావనలో యుండగ వారందరికి తెలియని నిజమైన భావన తెలియపరిచినది ఇంతవరకు ఈ గ్రంథము ఒక్కటియే. గ్రంథము ఆఖరు భాగమున తెలిపిన మాటలు ఈ కాలములో వున్న అజ్ఞానమునకు పెద్ద గొడ్డలి పెట్టులాంటివి. దీని ప్రత్యేకత ఏమి అనగా గీతాశాస్త్రము అంత్యములో ఏ భావనతో ముగిసినదో అదే భావనతో ప్రబోధ గ్రంథము ముగిసినది.గీతాశాస్త్రముగింపు ప్రకారము ఇంతవరకు ఏ గ్రంథము ముగిసియుండలేదు. ప్రబోధలో పొందుపరచబడిన ప్రతి విషయము ప్రత్యేకత కలిగియున్నది. యోగశక్తి అంటే ఏమిటో, అది ఎట్లు లభ్యమగునో, దేనికి ఉపయోగపడునో ఎవ్వరికి తెలియదు. అటువంటి విషయమును ప్రబోధించిన ప్రబోధ, జ్ఞానార్థులకు అమృత భాండము లాంటిది. ప్రపంచములో ఒకరు చెప్పిన విషయమునే ఇంకొకరు చెప్పుచు పోయినట్లు కాకుండ ప్రబోధానందస్వామి అన్ని విషయములను ప్రత్యేకించి ఇంతవరకు ఎవ్వరు చెప్పని విధముగ తెలియజేసి తన జన్మను సార్థకము

చేసుకొన్నాడు. భక్తి అను విషయమును వేరు విధముగా పోల్చుకొనిన ప్రజలయందు, బ్రహ్మవిద్యను ప్రపంచ విద్యగ భావించుకొన్న భక్తులందు, యోగమును కూడ తపస్సు మాదిరే తలచుకొనిన జ్ఞానులందు, ఫలితములేని సాధనచేయు యోగులందు ఈ గ్రంథము జ్ఞానరత్నములను వెదజల్లి మేలు చేకూర్చగలదని భావించుచున్నాము.

ఇట్లు
శ్రీ గురు పాదరేణువు
చింతా తులసీ దాసు, నరసాపురం.

ఓం గురవేనమః

1) ఓం గురుర్బృహ్మ గురుర్విష్ణుం గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరబ్రహ్మం తస్మై శ్రీ గురువే నమః.

2) ఓం మన్నాథో శ్రీ జగన్నాథ, మద్గురు శ్రీ జగద్గురు,
మమాత్మ సర్వభూతాత్మ తస్మై శ్రీ గురువే నమః.

3) ఓం బ్రహ్మనందమ్ అచలపూర్ణమ్ త్రిగుణాతీతమ్ ఆత్మసాక్షాత్ కారమ్
అద్వైతానందమూర్తిమ్ ఆనందనిత్య సద్గురుమ్ తమ్ నమామి.

4) వందే గురూనాం చరణారవిందే సందర్శిత స్వాత్మ సుఖావభోధే
జనస్య యే జాంగలి కాయమానే సంసార హాలాహల మోహశాంత్యై

5) ఓం జన్మ కర్మ విలీన కారణహేతుభూతమ భూతకం,
జన్మ కర్మ నివారకం రుచి పూరకం భవ తారకం,
నామ రూప వివర్జితం నిజానాయకం శుభదాయకం,
ప్రాతరేవహి మానసాన్తర్భావ యేద్గురు పాదుకం.

6) ఓం మంగళం గురుదేవాయ మహనీయ గుణాత్మనే,
సర్వలోక శరణ్యాయ సాధురూపాయ మంగళం.

మానవజీవిత ప్రాధాన్యత

ప్రపంచములో జీవరాసులు ఎనుబదినాల్గు లక్షల రకములుగా ఉన్నవి అని పెద్దలు చెప్పుచున్నారు. జీవులు ధరించిన శరీరనిర్మాణములను బట్టి ఇన్ని రకములుగా ఉన్నవి అని తెలియుచున్నది. అనగా మృగములలో సింహములు ఎన్ని యున్న ఒక జాతిలోనివే. అట్లే పులులు , కుక్కలు, నక్కలు మొదలగు వివిధ జీవరాసులు వివిధ జాతులుగా పరిగణింపబడుచున్నవి. ఈవిధముగా పరమాత్మ తన సృష్టిలో జీవులను ఎనుబది నాల్గు లక్షల రకములుగా తయారు చేశాడు. అందు మానవ రకము కూడ ఒకటి. మానవులుగా యున్న మన మందరము ఒక్క జాతిలోని వారమే. ఈ మానవరకములలో ప్రత్యేకత కల్గియున్నదని పెద్దలు తెలియజేయుచున్నారు. అది ఎట్లనగా వినుము.

జంతువులు పక్షులు మొదలుగాగల జీవరాసులన్ని ఆహారము సంపాదించుకొని తినడము, నిద్రించడము, సంభోగసుఖము అనుభవించడము తప్ప మరి ఏమి తెలియక అజ్ఞానములో మునిగి ఉన్నవి. పరమాత్మ ఆయా జన్మలలో ఆయా జీవరాసులకు విచక్షణా జ్ఞానము లేకుండ చేసినాడు. అందువలన జీవరాసులు దేవుడెవడని?

మంచిపని ఏదని? చెడ్డపని ఏదని? పాపమేది? పుణ్యమేది? అని తెలుసుకోలేక పోతున్నవి. కాని మానవజన్మలో తినడమేకాక, నిద్రించడమేకాక, సంభోగసుఖము అనుభవించడమే కాక అన్ని విధముల జ్ఞానము మానవునకు దేవుడిచ్చాడు. అన్ని జీవరాసులను అదుపులోనికి తెచ్చుకొను శక్తిని మానవునకు ఇచ్చినాడు.

మరియు పాపము, పుణ్యము, మంచి చెడ్డ, సుఖము దుఃఖము అన్ని తెలుసుకొనే తెలివి మానవునకు ఉన్నది. అందువలన మొత్తము జీవరాసుల రకములలో మానవ జన్మ చాలా ముఖ్యమయినది, పవిత్రమయినది. మరియు అతి దుర్లభమయినది. ఎందువలననగా ఒక జీవుడు ఎంతో పుణ్యము సంపాదించుకొని యుంటేనే మానవ శరీరం లోనికి పోయి ప్రపంచములో తిరుగుతాడు. పుణ్యఫలము తక్కువ యున్న జీవునకు వాని కర్మానుసారము మిగత జాతి శరీరములు దొరుకుట సంభవించును. కావున అన్నిటి కంటే తెలివైన మానవజన్మ లభించడము చాలా కష్టము.

కొంతమంది పవిత్రమయిన మానవజన్మ సంపాదించుకొని, పాపమేది పుణ్యమేది అని విచారించక, ప్రాపంచిక విషయములే గొప్పగా తలచుకొంటూ, విచక్షణా జ్ఞానము లేక, అజ్ఞానములో మునిగి, దేవుని ఏమాత్రము తెలుసు కొనలేక, అందుకు ప్రయత్నమును చేయక, కాలమును పాపకృత్యములకు వినియోగించుకుంటూ, పశువులకంటే అథములుగా తయారగుచున్నారు. అన్ని తెలువులు యుండినా కొంతమంది మనుష్యులు కంటే పశు పక్షి మృగాదులు మేలు, ఎందుకనగా మనకంటే అవి తక్కువ పాపము సంపాదించుకొనుచున్నవి. మనుష్యులు వాటికంటే ఎక్కువ పాపము సంపాదించుకొనుచున్నారు. దుర్లభమయిన ఈ జన్మలో జ్ఞానము అంటే ఏమిటి అని తెలుసుకోలేక పోవడమేకాక, జ్ఞాన పరులను చూచి పిచ్చివారని, తెలివి తక్కువ వారని అనుకుంటున్నారు. అజ్ఞానముతో కూడుకొన్న మానవులు పశువుల కంటే హీనులు. పశువులు గడ్డిని తిని పాలు ఇస్తున్నవి. మనుష్యులు అన్నము తిని వారిలో యున్న విషబుద్ధిని ప్రయోగిస్తున్నారు. అదృష్టవశాత్తు మానవాకృతిలోనికి వచ్చిన ఓ జీవులారా! మన కర్మలను నాశనముచేసుకొని, చావు పుట్టుకలు లేని మోక్షమును సంపాదించుకొనుటకు ఈ జన్మే చాలాపవిత్రమయిన అవకాశము. కావున ఇప్పటి నుంచి

అయినా మన తెలివిని బ్రహ్మవిద్యవైపు మరల్చిదాని ద్వారా పరమాత్మను తెలుసుకోండి. దేవుడున్నాడు అని అందరు అనుచున్నారు. కాని ఎట్లున్నాడు? అని అడిగిన తెలియదంటున్నారు.మానవజీవితము ఎంతో తెలివితో కూడుకొని ఉన్నది. కావున తెలియనిదానినే ప్రయత్నముచేసి తెలుసుకోవలయును. ప్రహ్లాదుడు చిన్నవయస్సులోనే మనకు తెలియని దానిని తెలుసుకున్నాడు. అంటే మనకుఇంత తెలివియుండి ఇంజనీర్లుగా, డాక్టర్లుగా, మరియు ఇంకా పెద్దగాయున్న మనము పిల్లవానికి తెలిసినదానిని తెలుసుకోలేక పోతున్నామంటే మనమందరము ఏమి పనికిరామన్న మాట. మనజీవితమే వ్యర్థమన్నమాట.అటువంటపుడు మానవజన్మకు ప్రాధాన్యత మనము చేకూర్చలేని వారమయినామన్నమాట. ఇప్పటి నుంచి మేల్కొని ప్రహ్లాదునికి తెలిసి మాకు తెలియకున్నది ఏమిటి? దానిని తెలుసుకొని తీరుదుము అని ప్రతిజ్ఞ చేసి, పట్టుపట్టి సాధించు సాధనచేయవలయునని నా మనవి. సాధనను సరిగ నడుపుటకు గురువును ఆశ్రయించవలయును.

అజ్ఞానమును పోగొట్టి జ్ఞానమును కలుగజేయువాడు గురువు.మాయ అను సముద్రమునుండి బయటికి వేయువాడు గురువు. జీవునికి అనర్థము చేయు కామము, క్రోధము, గర్వము, అసూయ, లోభము,మోహము అను ఆరు గుణములను మనచేతనే నరికించివేయువాడు గురువు.జనన మరణ చక్రములో చిక్కుకొని బాధపడు జీవునికి బాధతీర్చి మోక్షమునకు చేర్చువాడు గురువు. చిన్న చిన్న మాటలు చెప్పనేల బాగఅర్థము చేసుకొంటే అండ పిండ బ్రహ్మాండము అనగా ప్రపంచముఅంతటా నిండియుండేవాడే గురువు. దేవుడు అని మనము అనుకొనే ఆ దేవదేవుడే గురువు. ఏ కారణములేక, ఏ గుణములేక, ఏదియునుకాక,చెప్పశక్యముకాక, ఊహించనూకాక నిరాకారముగా అంతటను వెలసియున్న పరమాత్మ సాకార రూపమే గురువు. సూదిమొపను సందులేక నీలో నాలో వెలయువాడే గురువు. శివుడు, విష్ణువు, బ్రహ్మకాక ముగ్గురికి అతీతుడై యుండువాడే గురువు.

కొందరికి గురువు అంతటి వాడయితే దేశములోనికి ఎందుకు రావలయును? అతను దేశములో సాకారముగా యుండినా మనకు ఎక్కడ కనుపించలేదే! అను అనుమానము రావచ్చును. దేవుడు మానవునితో మొదటనే "అజ్ఞానమును పోగొట్టి జ్ఞానమును కలుగజేయుటకు, అధర్మమును నిర్మూలించి ధర్మమును నెలకొల్పుటకు అవతరమెత్తి మీ మధ్యనే తిరుగుచు, మీ తోనే మాటలాడుచు కలసి మెలసి యుంటూ నా లక్ష్యము నేను చేయుదును" అని అన్నాడు. కావున ఆయన ప్రపంచములో మన ఆకారముతోనే ఉన్నాడు. ఆయనను తెలుసు కొనుటకు మన తెలివిని సరైన మార్గములో ఉపయోగించవలయును. విష్ణువాంశ కలిగిన పరమాత్మయే భూమి మీద రామునిగా కనుపించిన రోజు మానవులమయిన మనము పరాయి మగవాడు తీసుకపోయిన సీతను తెచ్చుకొన్న రామునికి మొగతనము లేదని అనలేదా? సరైన రాజు కాదని దూషించలేదా? ఈనాడు తెలిసినవాడు ఒకడు రాముడు దేవుడంటే అందరము పూజించడములేదా? ఆనాడు రాముడు శరీరముధరించి మన యెదుట తిరుగు చున్నందువలన మనతో సమానుడని మానవులయిన మనము గర్వించి అతనిలోని దైవత్వమును ఏమాత్రము తెలుసుకోలేక పోయినాము. ఈనాడు రాయికి రాముడని పేరుపెట్టి పూజిస్తున్నామంటే మానవులయిన మన తెలివి ఎలా యుందో చూచుకోండి. ద్వాపరయుగమున దేవుడే జీవుడై కృష్ణుడు అని పేరుపెట్టుకొని అందరి మధ్య తిరిగినా, ఎన్నో అద్భుత మహిమలను చూపించినా, మానవులు కృష్ణుని మాయావి, మంత్రగాడు, మోసగాడు, పదహారువేల మంది స్త్రీలతో రమించిన కాముడు,పాండవపక్షపాతి అని ఇంకా ఎన్నో దూషణలు చేసినారు. చివరికి విప్పిచెప్పి నిజ స్వరూపాన్ని చూపేంతవరకు అర్జునుడు కూడ కృష్ణుని సాధారణ మానవుడేయని అనుకొనియుండెను. ఆనాడు కృష్ణావతారములోయున్న భగవంతుని ప్రతిపని ధర్మము నెలకొల్పుటకు జ్ఞానము కల్గించుటకు అని ఏమాత్రము తెలుసుకోలేని ప్రజలు ఈనాడు కృష్ణుడు దేవుడని ఎంతగా పూజలు చేస్తున్నారో చూడండి మన తెలివి ఏ మార్గములో యున్నదో ఆలోచించండి. ప్రజలకు జ్ఞానోపదేశము చేయుటకయి వచ్చిన విష్ణు వాంశ సంభూతుడైన వీరబ్రహ్మముగారిని బ్రతికిన మనిషికి పాడెకట్టి హేళన చేయలేదా, ఆయన తనను తెలుసుకోవల యునని ఎన్నో మహత్తులు చూపిన అర్థముచేసుకోలేక, ఆయనను ఎవరు గుర్తించక ఆయన చాటు అయిన తర్వాత దేవుడని భక్తి చూపించే ప్రజలను ఏమని చెప్పవలయును. అనగా మన తెలివి చాలా

హీనదశలో యున్నదని తెలియు చున్నది.మనకు తెలివియున్న అది సరైన మార్గములోలేనిదాని వలన గురువును గుర్తించుట చాలా కష్టము. కావున మన తెలివిని సరైన మార్గములో యుంచుకొని గురువును అన్వేషించవలయును అట్లు అన్వేషించిన గురువు తప్పక తటస్థించును.

గురువు లభించిన నమ్మిక అనునది ముఖ్యముగా ఉండవలయును, ఆ నమ్మికలేనిచో గురువు వద్ద నుంచి గ్రహించునది ఏమియు ఉండదు. నమ్మికయున్ననాడే గురువువద్దనుండి సర్వము గ్రహించవచ్చును. నమ్మిక అనునదియే భక్తి. భక్తిలేనివాడు ఏమనిషి అయిన నిష్ప్రయోజకుడు. మోక్షము అను సింహాసనము అధిష్టించుటకు నాల్గు మెటికలు కలవు అని పెద్దలు తెలియజేసినారు. ఆ మెటికలలో మొదటిది భక్తి. దీనిని ఎక్కిన తర్వాతనే రెండవ మెటిక ఎక్కవచ్చును. భక్తి, జ్ఞాన, ధ్యాన, యోగము అనునాల్గు మెటికలు వరుసగా ఎక్కిన తర్వాతనే మోక్షము వచ్చును. అట్లు లేనియెడల మోక్షము లభించదు. మానవజన్మ ఎత్తి మనకున్న తెలివి అంతయు కొంతకాలముందు ప్రపంచములో వినియోగించి చనిపోవుచున్నాము కదా! ఏమి ప్రయోజనము? మన తెలివి ఏదానిమీద ఉపయోగించ వలయునో తెలుసుకొని దానిమీద ఉపయోగించిన మానవ జన్మకు సార్థకత ఏర్పడును. అట్లుకానియెడల పశువులకు మనకు ఏమి తేడాఉన్నది? అవి పని చేయుచున్నవి, తింటున్నవి. అట్లే మనము పనిచేయుచున్నాము తింటున్నాము అపుడు పశువులతో సమానమయి పోతాము. కావున అట్లు కాకుండ మానవ జన్మను ప్రత్యేక పరచవలయునంటే ఏ జీవరాసి చేయనిదానిని మనము చేయవలయును. అదియే పరమాత్మను సాధించు సాధన. ప్రతియొక్కరు సాధన పరులై మానవ జన్మ అన్ని జన్మలకంటే ఉత్తమమయినదని నిరూపించండి. మీ జీవితమును నానా మార్గములనుండి పరమాత్మ మార్గమునకు మరలించుకోండి.

_________ (౦) _________

భక్తి – దేవాలయములు

పరమాత్మను తెలుసుకొనుటకు మొదట భక్తి ఉండవలయును. నమ్మిక (భక్తి) లేనివాడు పరమాత్మను తెలుసు కొనలేడు. కావున మొదట భక్తిని గురించి తెలుసుకోవడము మంచిది. ఈ కాలములో అనేకమంది భక్తులు ఉన్నారు. వారిలో కొంతమంది వారి భక్తిని సరైనమార్గములో పరమాత్మ మీద చూపుచు దానివలన మోక్షసిద్ధిని పొందుచున్నారు కొంత మంది వారి భక్తితో కామ్యసిద్ధిని పొందుచున్నారు. ఇంకా కొంతమంది భక్తులు ఎలాయున్నారు అనగా! వారికి తెలిసినదే భక్తి అనుకొని, వారు ఆచరించు ఆచారమే నిజమైనదని పొరపాటుపడి ఎవరు చెప్పినను వినక వారి ఇష్టమువచ్చినట్లు పూజలు చేయుచున్నారు. వీరిని గురించి భగవద్గీతయందు పరమాత్మ " తమ ప్రభావమే గొప్పదనుకొనుచు ధన మాన మదముల బూని అశాస్త్రీయపద్ధతిలో పూజలు చేయుచున్నారు. ఆ పూజలు నామకార్థపు పూజలు అనబడును" అని తెలిపియున్నారు. ఏ విధముగా దేవుని పూజించవలయునో తెలియక వారి పూజలన్నియు వ్యర్థము చేసుకొనుచున్నారు. తెలియనివారు కొంతమంది చేయు పూజలు ఎట్లున్నవనగా! నానావిధ కోర్కెలతోను, నానావిధ ఆచారములతోను నానావిధ జీవహింసలతోను నిండుకొని ఉన్నవి. మరియు రాత్రి పూట దేవాలయములలో భజనచేయు కొంతమందిని గమనించగా, అందుపాట పాడువాడు తాళము శృతితప్పుతుందేమోనను నిగాతోనే పాటను సాగిస్తు ఉండెను. తాళము కొట్టువాడు పాటకు అనుగుణముగా కొట్టుచుండెను శృతి వాయించువాడు పాటపాడువాని నోటిని చూస్తూ వాయించుచుండెను. ఇట్లు వారి వారి వాయిద్యములమీద వారి వారి మనసు పెట్టుకొని భజనచేస్తూ యుంటే, నిజముగా వారిమనస్సు దేవునిపై నిలిచేదెపుడు? దేవుని మనస్సులో భజించునది భజన అట్లుకాక భజనలను పాటకచ్చేరీలుగా మార్చిన ఏమి ప్రయోజనముండును? భజన వినుటకై వచ్చియున్న మనుజులు వాడు బాగా పాడినాడు, వీనికి పాడేదానికి రాదు వానికి కంఠము చాలా సన్నగా ఉన్నది. వీనికి కంఠము లావు అని అనుకుంటూ వృధావచనములు పలుచుండిరేకాని, దేవునిమీద వారి మనసు ఏమాత్రము నిలుపలేదు. ఇంకనూ కొంతమంది దేవుని ఆలయములోనున్నాము అను భయమును

లేక ప్రక్క యున్న స్త్రీలమీద వారి చూపులు సారించుచు మనసును కామముతో పూరించుకొని ఆమెను ఎట్లయిన కలుసుకోవలయును అని అనుకొనుచున్నారు. ఇట్లు అనుకోవడమేనా భక్తి? కొంతమంది స్త్రీలు వాడు పంచకట్టుకున్నాడు పంచకట్టుకొంటే ఎంతబాగున్నాడు అని అనుకొనుచున్నారు అట్లు అనుకోవడమా భక్తి? యువతీ యువకులు ఒకరినొకరు చూచుకొనేదానికి ఇండ్లవద్ద అనుకూలించదని దూరంగా జరిగే తిరునాళ్లకు పోయి ఒకరి నొకరు చూచుకోవడమా భక్తి? గుడిదగ్గరకు పోయి దేవుని దర్శించక గుడిముందర ఆడే భోగమోళ్లను చూస్తూయుండిపోవడమా భక్తి? ఒక టెంకాయ తీసుకపోయి పూజారికిచ్చి కొట్టించుకొని నేనుచేయు పనులు అన్నియు జరుగవలయునని మ్రొక్కడమా భక్తి? అభిషేకములు చేయించి నేను చేసే వ్యాపారములో దండిగా లాభమువస్తే నీకు పావలా భాగము ముడుపు ఇస్తాను అని కోరడమా భక్తి? తిరుపతికి పోయి దొంగతనము చేసి సంపాదించిన డబ్బు హుండీలోనికి వేసి మేము చేయు దొంగపనులు అన్నియు నెరవేరవలయునని మ్రొక్కడమా భక్తి? ఈవిధముగా భక్తి అనుదాని విలువ నానావిధములుగా హీనదశకు పోతూ ఉన్నది. ఈ కాలములో మనుష్యులకు దేవుడు డబ్బుకు పనిచేయు మనిషి మాదిరి కనుపించునట్లున్నది ఆశచూపి కోర్కెలు కోరుచున్నారు. కర్మానుసారము వారి కోర్కెలు నెరవేరకపోతే దేవుని నిందించుతూ ఉన్నారు. ఈవిధముగా అజ్ఞానవశమున భక్తి అని ఆచరించునది భక్తి కాదు.

ఏ ఆకారములేని దేవుని అజ్ఞానములోయున్న మానవులకు తెలుపుటకు పెద్దలయిన జ్ఞానులు దేవాలయములను నిర్మించినారు. ఈ కాలములో మనుజులు దేవాలయములను ఎందుకు నిర్మించినారు అనునది మరచిపోయి కోర్కెలు కోరడమే ముఖ్యమని, దేవాలయములు కోర్కెలు నెరవేర్చు కేంద్రములని అనుకొనుచున్నారు. కోర్కెలుతీర్చేదానికి కదా దేవుడుండేది అని అంటున్నారు. దేవుడు ఎక్కడయిన చెప్పినాడా! ప్రాపంచిక కోర్కెలు కోరమని దేవుడు ఆదినుంచి తనను తెలుసు కొమ్మనియే చెప్పుచున్నాడు. దేవాలయములుకూడ నన్ను తెలుపుటకై నిర్మాణముఅయినాయి అని అంటున్నాడు. కాని కోర్కెలు కోరమనడము లేదు. మనలో చాలమంది దేవాలయములకు పోవుచుందురు. దేవాలయములో ప్రవేశించుతూనే మొదట గంటను మ్రోగించుతారు. తర్వాత

నమస్కరించడమో, ప్రదక్షణచేయడమో ఏదోఒకటి చేయుచున్నారు కాని గంటను మరచిపోవుచున్నారు. గంటను ఎందుకు కొట్టవలయునని కొందరిని అడిగితే దేవుడు నిద్రపోయిఉంటాడు, గంటశబ్దమువిని లేస్తాడు అని జవాబు చెప్పుచున్నారు. ఇదిసరయిన సమాధానము కాదు. దేవుడు సర్వప్రపంచము నిండినిబిడీకృతముగా ఉండగా, పరమాత్మకు తెలియక గడ్డిపోచ అయినా కదలకఉండగా, పరమాత్మ అన్ని జీవరాసులను బొమ్మలాటమాదిరి ఆడించుచుండగా, దేవునికి నిద్రయుందా? ఆయనను మనము లేపేవారమా? పవిత్రమయిన గంటానాధములోయున్న ఒక స్థాయిని తెలుసుకొనలేక పొరపాటు పడుచున్నాము. ఒక్కమారు గుడిలో గంటను మ్రోగించి గంటానాదము వినండి టంగ్.....గ్.....గ్.....గ్........ అని దీర్ఘముగా ఏకస్థాయిగాయున్న నాదమును వింటే మీకే అర్థమవుతుంది. మీ మనస్సునుకూడ ఆ శబ్దములో ఐక్యముచేయండి. అపుడు కోతిలాగ విషయ విషయముపై పరుగెత్తెడి మనస్సు గంటానాదము జతలోకూడి నాదము ఏకస్థాయిప్రకారమే మనస్సుకూడ ఏకస్థాయిలో వచ్చి నిలబడుచున్నది. ఏ తలంపులేకుండ మనస్సు నిలపడానికే గంటను ముందుగా పెట్టినారు. మనస్సును గంటానాదముద్వారా స్వాధీనపరచుకొని ఏ తలంపు లేకుండాచేసుకుంటే తర్వాత దేవుని మీదికి సులభముగా నిలుస్తుంది. అందువలన గంటను ప్రతిఒక్కరు మ్రోగించి నాదములో మనస్సును ఐక్యముచేసి, మనస్సును నిలుపుకున్న తర్వాత దేవునిపై పూజలు మొదలుపెట్టండి. మనస్సు నిలకడలేని పూజలు వ్యర్థము. ప్రతి పనికి మనస్సు ముఖ్యము కాబట్టి మనస్సు ఎక్కడో పెట్టుకొని చేయు పూజలు నిరర్థకము. అందువలన గుడిలో గంటను మ్రోగించి దాని ద్వారా మనస్సును స్వాధీనపరచుకొని అపుడు చేయు పూజలుమీద పెట్టుకొనండి. ఒక్కమారు గంటను మ్రోగించినంతమాత్రమున మీమనస్సు స్వాధీనపడకపోతే తిరిగి గంటనుమ్రోగించి మనస్సును ఏకస్థాయిలోనికితెచ్చుకొని దేవుని పూజించండి. అట్లుకాక గుడికిపోయి గంటను సరదాగాకొట్టితే ఏమిప్రయోజనము ఉండదు. గంటలోయుండే సారాంశమును తెలుసుకుంటే ఎంతో ప్రయోజనము ఉంటుంది. టెంకాయను ప్రతిమ ముందర ఎందుకు కొట్టుతారు? అని కొందరిని అడిగితే, టెంకాయను దేవునికి అర్పితముచేసి దానిని మనము ప్రసాదముగా తీసుకోవడానికి ముఖ్యమయినది అని తెలిపినారు. టెంకాయ ఎందుకు ముఖ్యమయినది? ఇతర కాయలు ఎందుకు పగుల

కొట్టకూడదు అని అడిగితే దానికి సరయిన సమాధానము చెప్పక పెద్దలు చేసినట్లు చేయవలయునుకాని వివరించి అడగకూడదు అని అన్నారు. ఇంకను కొంతమందిని టెంకాయకు పీచు అంతాపెరికి పైన జుట్టు కొంచెము పెట్టుచున్నామే ఆకొద్దిగా ఎందుకు ఉంచవలయును? అని అడిగితే పూర్వము నుంచి వచ్చే పద్ధతినే చేయవలయును కాని దానిని విమర్శన చేయకూడదు అని అన్నారు. వారికి తెలియక అట్లు అన్నారుకాని టెంకాయలో ఎంతో అర్థము ఉన్నది. ఆ అర్థము తెలుసుకోలేక దానిని పూజాసాధనముగా పెట్టుకొని దేవునితో బేరములు ఆడుచున్నాము. టెంకాయయొక్క సారాంశము తెలుసుకొంటే భక్తి ఎంతో బాగుండేది. దాని సారాంశము తెలియక కొంతమంది భక్తులు ఒకరు నాలుగు, ఒకరు రెండు, డబ్బున్న వారు ఇంకా ఎక్కువ కొట్టుచున్నారు దండిగా టెంకాయలు కొట్టితే భక్తి, లేకపోతే భక్తి కాదా? ఏమీలేని బీదవాడు టెంకాయ కొట్టలేకపోతే వానిది భక్తికాదంటామా? దేవుడు ఒప్పుకోడంటామా? అన్నిటికి ముఖ్యమయినది మనస్సు, ఏది లేకపోయిన మనసుయుంటే అంతకంటే నాకు ప్రియులు లేరని దేవుడు గీతయందు చెప్పి ఉన్నాడు. అయితే టెంకాయ ఎందుకు కొట్టుచున్నాము? దాని ప్రత్యేకత ఏమి? అంటే, టెంకాయకూడ పరమాత్మను తెలుసుకొనుటకు ఉపయోగపడుచున్నది. కావున పూర్వము పెద్దలు టెంకాయను దేవాలయములలో ఉపయోగించినారు. టెంకాయతో అజ్ఞానులు జ్ఞానులుగా మారుదురని పెద్దలు ఈపనిని చేసినారు. కాని కాలక్రమేణ దాని అర్థము పోయినది, దాని అర్థము తెలియజేయువారు పోయినారు. ఈకాలములో టెంకాయ మానవులకు దేవునికి మధ్య వ్యాపార వస్తువుగా మారిపోయినది.

టెంకాయచుట్టు యుండె పీచునంత వలువగ కాయ మూడుభాగములుగా కనిపించుచున్నది కాయమీదయున్న మూడుసారలు కాయను మూడు భాగములుగా కనుపించునట్లు చేయుచున్నవి. ప్రతి భాగముపైన కన్ను మాదిరి ఒక తగ్గుఉన్నది, మూడు భాగములకు మూడు కన్నులు ఉన్నవి. అందువలన టెంకాయకు ముక్కంటి అని పేరువచ్చినది. టెంకాయకుయున్న మూడుభాగములకు పైన జుట్టుగా కొంత పీచు నిలుపుతున్నాము. చివరనయుండె ఈజుట్టుకు ప్రత్యేకత ఉన్నది. టెంకాయ జుట్టును పైకి

చేసి దానిమీదయున్న పెద్దకడుపును (పెద్దభాగమును) మనకు ఎదురుగా పట్టుకొని చూచిన పెద్దభాగమునకు రెండువైపులా రెండు భాగములు యుండునుకదా, ఆ భాగములపైన కన్నులు (గుంతలు) యున్నవికదా! కుడివైపుయున్న భాగమును సూర్యనాడి అనియు, ఆభాగమునకు పైనయున్న కన్నును ఆనాడి కేంద్రమనియు, ఎడమప్రక్కయున్న భాగము చంద్రనాడి అనియు, ఆభాగముపైనయున్న కన్నును ఆనాడి కేంద్రమనియు, రెండు భాగములకు మధ్య పెద్దభాగమై యున్నదానిని బ్రహ్మనాడి అనియు, ఆభాగముపైనయున్న కన్నును ఆనాడి కేంద్రమనియు తెలుసుకోవలయును. సూర్య, చంద్ర, బ్రహ్మ నాడులు ఏకమయిననే జ్ఞానముద్భవించును. ఆతర్వాత జీవుడు దేవుడుగా మారిపోయి చావుపుట్టుకలు పొందక పోవును. ఈమూడు నాడులను ఒక్కటిచేసినవాడు యోగి అని తెలుపుటకు టెంకాయమీదకూడ మూడు భాగములనుంచి ఏకముగా జుట్టు పెట్టబడినది. మూడునాడులు ఏకము అయినవాడు జన్మలులేక ఆత్మయందు ఐక్యము చెందును. కావున మూడుభాగముల నుండి ఏకముగా మారిన జుట్టు కొనభాగము ఆకాశమును చూపుచూ ఉన్నది. జీవుడు ఏ ఆకారము లేనిదానియందు ఐక్యముఅగును. కావున జుట్టు కొనకూడ ఏ ఆకారము లేని ఆకాశమును చూపుచూఉన్నది. మూడు నాడులు ఏకముచేసినవాడు జ్ఞానము చివరి భాగమునకు చేరియుండును. కావున టెంకాయ జుట్టుకు కూడ “జ్ఞానశిఖ” అని పేరువచ్చినది. జ్ఞానశిఖ అనగా జ్ఞానమునకు చివరి భాగము అని అర్థము. వివేకవంతులయిన బ్రాహ్మణులు వారి తలలమీద జుట్టు ఎందుకు పెట్టు చున్నారనగా! జ్ఞానశక్తి నిలువయుండుచోటు శరీరమునందు తల కావున జ్ఞానశక్తియున్న బ్రాహ్మణులు బాహ్యార్థమై తలలోయుండు వెంట్రుకలు అన్నియు తీసి శిఖను మాత్రము ఉంచుచుండిరి. తలయే జీవునకు స్థానము దానియందే తలంపులు ఉద్భవించుచున్నవి. బ్రహ్మజ్ఞానులు తలంపులను జయించి యుందురు కాబట్టి వారు మాయందు ఏతలంపులు లేవను భావనలో బాహ్యార్థముగా తలమీద వెంట్రుకలు తీసివేయుచున్నారు.

అట్లే టెంకాయకు కూడా చుట్టుయున్న పీచు పెరుకబడుచున్నది. తలలోనే బ్రహ్మనాడియొక్క ఏడవకేంద్రము ఉన్నదికదా! దానిద్వారానే జీవుడు బ్రహ్మమందు ఐక్యము కావలయును. బ్రహ్మనాడి శరీర మధ్యభాగమున ఉన్నది. తలమీదకూడ దాని స్థానము మధ్యనే ఉన్నది. కావున బ్రహ్మ జ్ఞాన శక్తి యున్నవారు తమతలమీద మధ్యభాగములో జ్ఞానశిఖ అను పేరుతో కొన్నివెంట్రుకలు విడిచివేయుచున్నారు. అట్లే టెంకాయకు కూడ పైన జుట్టు విడుచుచున్నారు. పూర్వము ఈ విధముగా చేయు చుండిరి. కాలభ్రమణమున జుట్టును ఎక్కడ పెట్టవలయునని తెలియక, ఎవరు పెట్టుకోవలయునని తెలియక, ఎందుకు పెట్టుకోవలయునని తెలియక చాలామంది పొరపడుచున్నారు. పూర్వకాలమున బ్రహ్మజ్ఞాని అయిన ఈశ్వరుడు తన తలమీదయున్న వెంట్రుకలను విచ్చలవిడిగా లేకుండ జ్ఞాన శిఖగా ముడివేసినాడు. ఆ ముడి ఈశ్వరుని తలమధ్యభాగమున ఉన్నది. అట్లే బుద్ధుడు కూడ జ్ఞాన శిఖను తలమీద మధ్యభాగమున ఉంచినాడు. ఇట్లు ఎందరో జ్ఞానులు తమ సూర్య, చంద్రనాడులను బ్రహ్మనాడియందు ఐక్యముచేసి దాని బాహ్యార్థము తలలమీద బ్రహ్మ స్థానమయిన మధ్య భాగమున వారి వెంట్రుకలను ముడివేసినారు. బ్రహ్మస్థానము చిన్నపిల్లల తలమీద ప్రత్యక్షముగ చూడవచ్చును. ఒక సంవత్సరము లోపల పిల్లల తల మధ్యభాగమున బ్రహ్మనాడి స్పర్శను చూడవచ్చును. ఆ భాగముననే జ్ఞానశిఖను జ్ఞానులు వేయుచుందురు. జ్ఞానశిఖ ఈకాలములో చాలామందికి తలమధ్య భాగమున లేక కొంచెము వెనుకకు పోయిఉన్నది. బయట జ్ఞానశిఖ ఎక్కడున్నను పరవాలేదు. మనకు లోపల ముఖ్యమయినది జ్ఞానమున్న చాలు. టెంకాయను పరిశీలించితే ఎంత అర్థము యుందోచూడండి. టెంకాయను జ్ఞాన స్వరూపమైన పరమాత్మగా భావించవలయును.

అగ్ని నుండి చిన్న చిన్న అగ్నిరవ్వలు బయల్పడినట్లు పరమాత్మ నుంచి జీవుడు బయల్పడినాడు. ఒకే అంశ అయినా జీవుడు దేవుడు అని వేరయినాడు. ఈ విధముగానే పరమాత్మ స్వరూపమయిన టెంకాయను కొట్టగా రెండు చిప్పలుగా పగిలిపోవుచున్నది. అందు ఒక చిప్పకు జ్ఞానశిఖ మిగిలిపోవుచున్నది. రెండవ చిప్పకు ఏమి మిగలక పోవుచున్నది. జ్ఞానమునకు నిలయమైన బ్రహ్మనాడి కేంద్రము బ్రహ్మశిఖ మిగిలిన చిప్ప

పరమాత్మగాను జ్ఞానశిఖ లేకుండ మూడు భాగములుగానే మిగిలియున్న రెండవ చిప్ప జీవాత్మగాను పరిగణింపబడుచున్నది. టెంకాయను రెండు చిప్పలుగా దేవుని ముందర పగులకొట్టి ఒకే పరమాత్మ అంశనుండి నీవు నేను వేరయినాము అని బాహ్యార్థముగా చూపుచున్నారు. ఈవిధభావనతో పూర్వము జ్ఞానులుచేయుచుండిరి. ఇపుడు కొంతమంది ఏభావనలేకున్న కోరికలు మాత్రము చాలా పెట్టుకొని టెంకాయలు చాలా కొట్టుచున్నారు. టెంకాయను కొట్టువారందరు దానియొక్క ప్రాముఖ్యతను తెలుసుకొంటే ఎంతో శ్రేయస్కరముగా ఉండును. టెంకాయను పగులకొట్టగా రెండుభాగములు అగుచున్నది కదా, ఆ రెండు చిప్పల లోపలిభాగమున తెల్లని రంగుకల్గి ఏ కల్మషము లేక ఉండును. దాని అర్థమేమనగా నీవు దేవునివి నేను జీవుడిని నీవు ఏగుణములులేక నిష్కల్మషముగా ఉన్నావు. నేనును నీమాదిరే ఏకోర్కెలు ఏతలంపులులేక నిష్కల్మషముగా మారి ఉన్నాను అని బాహ్యార్థముగా తెలియచేయుటకు రెండుచిప్పలు తెల్లగా ఉన్నవి. ఈవిధముగా జ్ఞానులు టెంకాయలు పగులకొట్టి బాహ్యార్థముగా చూపించినారు. మరియు రెండుగా మారిన నీవును నేనును ఏకము కావలయునని బాహ్యార్థముగానే రెండుచేతులను కలిపి చూపించినారు. దానినే మనము నమస్కారము అని అనుచున్నాము. ఎడమ హస్తము పరమాత్మ అనియు, కుడి హస్తము జీవాత్మ అనియు ఆరెండు హస్తములు జోడించడము జీవాత్మ పరమాత్మల ఐక్యము చేయడము అనియు తెలుసు కోవలయును. పూర్వము తెలిసినవారు నోటితో ఏమాట మాట్లాడక వారిలోయున్న భావనను టెంకాయద్వారా నమస్కారము ద్వారా బాహ్యార్థముగా దేవునికి తెలియజేయుచుండిరి. ఈ కాలములో నానావిధ కోర్కెలతో పవిత్రమయిన టెంకాయలను అపవిత్రముచేయుచున్నారు. రెండుచేతులు జోడించి చూపడములో జీవాత్మ పరమాత్మ ఐక్యార్థము యుందని తెలియక చేతులు జోడించి నిలబడి అనేకములయిన కోర్కెలు కోరదగినవి కోరరానివి కోరుచున్నారు. టెంకాయకు యున్న కన్నులలో ఒక కన్నుకు మాత్రము రంధ్రము పడును మిగతా వాటికి పడడములేదు. అనియు, దానిలోని నీళ్లను అందరు తీర్థముగా పుచ్చుకొనుచున్నారు. దాని ఫలితము ఏమి ఉండును? అనియు కొంతమందికి అనుమానము రావచ్చును. దానికి నా సమాధానము జీవుడు పరమాత్మను చేరవలయునంటే తన మధ్యనయున్న బ్రహ్మనాడియందే ఐక్యము కావలయును. కావున టెంకాయ కన్నులందు కూడ బ్రహ్మనాడి అనిపించుకొన్న

పెద్దభాగము పైన యున్న కన్నే రంధ్రముపడును. మిగతా నాడులయందు యున్నపుడు మరణించిన జీవుడు ఆత్మను చేరలేడు. కావున టెంకాయ మిగతా కన్నులు గట్టిగాయుండి రంధ్రములు పడవు. మనము చేసిన పూజయొక్క ఫలితము టెంకాయ యందలి నీటిని ఆవహించి యుండును. కావున దానిని తీర్థముగా పుచ్చుకొనుచున్నారు, ఎవరు ఎంతపూజచేసియుందురో అంతశక్తియే వారు తీసుకొన్న తీర్థమందు ఉండును. దీనివలన తీర్థము అనగా శక్తితో కూడుకొనిఉన్నది. అని తెలియుచున్నది. టెంకాయను కొట్టునపుడు జుట్టును క్రిందివైపుగా పట్టుకొని చాలామంది కొట్టుచున్నారు. అట్లు కొట్టుట సరి అయిన పద్ధతికాదు. టెంకాయను కొట్టునపుడు జుట్టును పైకి యుంచి పట్టుకొని కొట్టవలయును. ఈ విధముగా కొట్టగా కుడిచేతి యందు క్రింద చిప్ప మిగులును. జుట్టుయున్న చిప్ప ఎడమచేతియందు మిగులును. తిరిగి కుడి ఎడమచేతులు కలిపి చూపించడమే నన్ను నీలోనికి చేర్చుకొమ్మను భావన. ఇట్లు సరయిన భావనతో పూజచేసిన, ఆ పూజ యందు జ్ఞానశక్తి లభించును. ఇట్లు పూజలు చేస్తూయుండగ జ్ఞానము లభించును. జ్ఞానము వలన ముందుమార్గములను తెలుసుకొని యోగ సాధనలుచేసి దేవునియందు ఐక్యము కావచ్చును. అట్లుకాక భావనలేని పూజ వ్యర్థము. టెంకాయకు పెట్టిన డబ్బులు కూడ వ్యర్థమే. టెంకాయలోను, గంటలోను, నమస్కారములోను ఇంత అర్థము ఉన్నది. దానిని తెలుసుకోక ఇతరులు చేస్తూయుంటే మేము చేస్తున్నాము అని అంటే ఏమి ప్రయోజనము ఉండదు.

బ్రహ్మవిద్యయందు ప్రవేశమున్నవారు టెంకాయను గురించి చెప్పుచుండుట విన్నాము అందు వారు టెంకాయ మూడు భాగములను మూడు గుణములుగా భావించి చెప్పుచున్నారు. మూడు గుణములు జయించక ఇంకా కొద్దిగా గుణములు యున్నవారు టెంకాయకు కూడ జుట్టు కొద్దిగా పెట్టుచున్నారు, మరియు వారుకూడా తమ తలలమీద కొద్దిగా జుట్టు యుంచుకొనుచున్నారు. పూర్తి గుణములు జయించి గుణాతీతులై యున్నవారు జుట్టును ఏమాత్రము పెట్టుకోక తీసివేయుచున్నారు. వారు టెంకాయకుకూడ జుట్టు పెట్టకుండ అంతయు పెరికి కొట్టుచుందురు అని తెలిపి ఉన్నారు ఆ మార్గముగా టెంకాయను భావించిన ఆ భావనలో అనేక సంశయములు బయలుదేరును. ఎంతవెదకిన

ఆ సంశయములకు సమాధానములు దొరకడములేదు. కావున పరమాత్మయే ఊహకందించి తెలిపినదానిని నేను తెలుపుచున్నాను. ఈ మార్గమున పోయిన ఒక్క సంశయముకూడ బయలుదేరదు. ఒకవేళ బయలుదేరిన అందులకు సమాధానము వెంటనే లభించును.

పూర్వము భక్తులు దేవాలయములోనికి పోయి గంటనుకొట్టి టెంకాయను పగులకొట్టి, చేతులు జోడించి చూపించిన తర్వాత కర్పూరము వెలిగించి దేవునిముందర పెట్టుచుండిరి. దాని అర్థము ఏమనగా? రంగు, రూపు, గుణములుయున్న నన్ను జ్ఞానాగ్నిచేత కాల్చి నీలోనికి ఐక్యము చేసుకొనుము అనుదాని బాహ్యార్థముగా రంగు, రుచి, వాసన ఆకారముయున్న కర్పూరముకు అగ్గియుంచి దేవునికి చూపించుచుండిరి అట్లు చూచుండగానే అది అగ్నిచేత దహింపబడి శూన్యములో ఐక్యము అగుచున్నది. రంగు, రుచి, వాసన ఆకారముయున్న కర్పూరము శూన్యము నందు కలసిపోయిన తర్వాత దానిని ఫలానా చోట ఉన్నది అని చెప్పుటకు వీలుకాక పోవును. అట్లే జీవుడు కూడ తనలోయున్న కర్మలను జ్ఞానాగ్ని చేత కాల్చిన శూన్యమునందు కలసిపోవును. తర్వాత అతనిని ఇక్కడయున్నాడు అక్కడలేడు అని చెప్పుటకు వీలులేకపోవును. కర్పూరము వెలిగించి చూపించడములో కూడ ఇంత అర్థము ఉన్నదని తెలియనివారు పూజ ముగిసిన వెంటనే మంగళ హారతి ఇయ్యవలయునని కర్పూరము లేకపోతే దూదివత్తులు వెలిగించి హారతి పట్టుచున్నారు. అది సరయిన పద్ధతికాదు. జ్ఞానులు తమలోయున్న భావనను బయటికి చూపుటకు శూన్యములోనికి ఐక్యము అగు కర్పూరము వెలిగించి చూపించారు. మనము కర్పూరము లేకపోతే శూన్యములోనికి ఐక్యము కాని వత్తులను వెలిగించితే సరయిన పద్ధతి ఎట్లగును? కావున కర్పూరము లేకపోతే నమస్కారముతోనే పూజను ముగించవచ్చును. పూర్వము పూజలు అన్నివిషయములు తెలుసుకొని చేసెడివారు. దానివలన సార్థకత పొందెడివారు. ఈ కాలములో ఏమి తెలియకున్న తెలిసినవారు చెప్పెడి మాటలను పనికిరానివిగా భావించి పెడచెవిని పెట్టుచున్నారు, భూమిమీద మూర్ఖులకు తెలియజేయుటకు పరమాత్మయే రావలసిఉండును. అట్టుకాదేని మూర్ఖులు ఎవరిమాట వినరు.

ఈ కాలములో దేవాలయములకు పోవువారు కొందరు ఉన్నారు. వారియందు కొందరు ప్రతిరోజు గుడికి పోయి వచ్చుచుందురేకాని గుడిలోని ప్రతిమను దాని అర్థమును ఏమాత్రము తెలుసుకొని ఉండరు. దేవాలయములకు వస్తూ అజ్ఞానులు బాగుపడుదురని పెద్దలు దేవాలయములు నిర్మించియుంటే, కొందరు ఇంటికంటే గుడి భద్రముగాయుంటుంది అని అక్కడికిపోయి నిద్రపోవుచున్నారు. కాని గుడివిషయము తెలుసుకోవడములేదు. ఎంతో తెలివియున్న మానవాకారములోనికి వచ్చి కాలమును వృథాచేయుచున్నామేకాని కాలమును ఆత్మవిషయక జ్ఞానములు తెలుసుకొనుటకు వినియోగించడము లేదు. తిరుపతిలోయున్న శ్రీ వెంకటేశ్వర ఆలయమునకు దినముకు కొన్ని వేలమంది భక్తులు పోవుచుందురు. పోయినవారందరు ఆలయములోని వేంకటేశ్వరుని దర్శించి వచ్చుచుందురు. అక్కడికి పోయివచ్చువారిని ఏమయ్య నీవు తిరుపతికిపోయి గుండు కొరిగించున్నావు ఎందుకు? అని అడిగితే, అందరు కొరిగించుకొంటావుంటే నేను కొరిగించుకొంటిని అని అంటున్నారు. అట్లే నామము ఎందుకు పెట్టుకున్నావు? అని అడిగితే అందరు పెట్టుకుంటావుంటే నేను పెట్టుకున్నాను అని అందరు ఎందుకు పెట్టుకోవలయును? అని వారిని వారు విశదీకరించుకోలేదు. తిరుపతి క్షేత్రములో వెంకటేశ్వర ప్రతిమకు ముఖము మీద పెద్దగా మూడు నామాలుయున్నవి. చిన్నగయుండిన ఎవరయిన చూపుతక్కువవారు గమనించలేరేమోనని నామములు పెద్దగా అందరికి కనపడేటట్లు ఉంచినారు నామములు పెద్దగా యుండినా మనము వాటిని సాధారణముగా లెక్క పెట్టుకొని ఏమాత్రము వాటిని గురించి తెలుసుకోలేకపోయినాము. శ్రీ వెంకటేశ్వరస్వామికి నామములు అంతపెద్దగాయున్న ఒకరుకూడ ఇవి ఎందుకు ఇంతపెద్దగా పెట్టినారు? వీటి విశేషమేమి? అని ఆలోచించలేక పోతున్నారు. ప్రజలను జ్ఞానపరులుగా మార్చుటకు పెద్దలు తిరుపతిలో వెంకటేశ్వర దేవాలయమును ఎన్నో అర్థములలో నిర్మించినారు. కాని మనము ఎన్నోమార్లు తిరుపతికి పోయిన ఆ దేవాలయమును, అందులో యున్న వెంకటేశ్వర ప్రతిమ విశిష్టతను తెలుసుకోలేక తిరుపతిని దేవునితో వ్యాపారము చేయు కేంద్రముగా మార్చినాము. భక్తులకు జ్ఞాన మార్గముచూపు వేంకటేశ్వరుని మోక్షమియ్యమని అడుగక కోర్కెలు నెరవేర్చమని అడుగుచున్నారు. శ్రీ వెంకటేశ్వరులు ధరించిన నామమును గురించి తెలుసుకొందాము. ప్రతిజీవి శరీరములోని 3 లక్షల 50 వేల నాడులు ఉన్నవి. అందు ముఖ్యమయినవి పది

నాడులు. ఆ పది నాడుల కంటే ముఖ్యమయినవి మూడు. అవి ఏవనగా 1) సూర్యనాడి 2) చంద్రనాడి 3) బ్రహ్మనాడి. ఈ మూడునాడులలోను అతి ముఖ్యమయినది బ్రహ్మనాడి. బ్రహ్మనాడియందు అసలయిన పరమాత్మయున్నాడు. జీవుడు బ్రహ్మనాడిలోనికి చేరడమును యోగము అని అందురు. వెంకటేశ్వర ప్రతిమకు నొసట కుడిప్రక్కయున్న నామము సూర్యనాడి అనియు, ఎడమప్రక్క నామము చంద్రనాడి అనియు, మధ్యయున్న నామము బ్రహ్మనాడి అనియు తెలుసుకోవలయును. సూర్య చంద్ర నాడులకంటే బ్రహ్మనాడి ముఖ్యమయినది. కనుక ప్రక్కనయున్న రెండునామములు ఒకరంగు కలిగియున్నవి. మధ్యనయున్న నామము వేరొక రంగు కలిగి ప్రక్కనయుండు వాటికంటే నేను వేరు అని తెలియ పరచినట్లున్నది. ప్రక్కనయున్న రెండునామములు తెల్లనిరంగు గలిగి ఉన్నవి. మధ్యనయున్న ఒకనామము ఎఱ్రని రంగు కలిగియున్నది. ఈ విధముగాయున్న నామములనుచూచి మనము తెలుసుకోవలసినది ఏమనగా, ప్రక్కనయున్న రెండు తెల్లని నామములు ముక్కు మొదలు భాగమున (భూమధ్య స్థానమున) కలుసుకొన్నవి. అవి కలుసుకున్న స్థలముననే మధ్యనయున్న నామము ప్రారంభమయి చక్కగ పైకిపోయినది. మధ్యనయున్న నామము ప్రక్కనయున్న నామములకంటే పొడవుగా ఉన్నది. దీనివలన వెంకటేశ్వరులు ప్రక్కనయున్న సూర్యచంద్ర నాడులనుండి మధ్యనయున్న బ్రహ్మనాడినిచేరి యోగమందున్నట్లు తెలియుచున్నది. నేను ఈ విధముగాచేరి కపాలమునందుగల ఏడవ స్థానమున ఉన్నాను నా మాదిరే మీరుకూడ సూర్యచంద్ర నాడులను వీడి బ్రహ్మనాడిని చేరండి అని వెంకటేశ్వర్లు మనకు తెలియచేసినట్లున్నది వెంకటేశ్వర్లు నేను ఈ విధముగా యున్నాను అని నామము పెట్టుకొని చూపించినాడు మనము ఆయనుంటున్న విధానమును తెలుసుకొంటున్నామా? లేదు. మనముకూడ నామము పెట్టుకొనుచున్నాము. చూపాకారానికి పెట్టుకున్న ఏమిప్రయోజనము, యోగసాధన చేయువారు, అనగా మధ్యనయున్న నాడియందు కలియవలయును అని అనుకొని సాధనచేయువారు, నేను రెండునాడులను విడిచిపెట్టటానికి ప్రయత్నము చేయుచున్నాను అను బాహ్యార్థముతో పెట్టుకోవచ్చును. యోగులుకూడ పెట్టుకోవచ్చును. కాని మిగతావారు పెట్టుకొనడానికి అనర్హులు. పూర్వము

జ్ఞానులయినవారు మూడు నాడులను గుర్తించినవారు నామము పెట్టు కొనెడివారు ఇపుడు ఏమితెలియని అజ్ఞానులుకూడ పెట్టుకొనుచున్నారు. ఒకవేళ పెట్టుకొనినా దానిని తెలుసుకొనుటకయిన ప్రయత్నము చేయరు. నామము యొక్క రూపము పవిత్రమయినది. అందుకే పూర్వము విష్ణువు, రాముడు, కృష్ణుడు, ఆంజనేయుడు మొదలగువారు ధరించినారు ఈ నామము యొక్క అర్థము తిరుపతికిపోవువారు, నామము ధరించువారు ముఖ్యముగా తెలుసుకోవలయును. అట్లే ఇంకా కొన్నివిషయములు తెలుసుకోవలయును. వెంకటేశ్వర్లు నామము ధరించి మనకు చూపడమే కాక తనకున్న ఒకహస్తమునుకూడ మనకు చూపుచున్నాడు. ఆయనేకాక ప్రతి దేవాలయములోని ప్రతిమ ఒక హస్తమునుచూపుచునే ఉన్నది. దీనికి కొంతమంది అభయహస్తము అని అనుచున్నారు. అట్లు అనుట సరికాదు. ఈ హస్తమునకు ప్రత్యేకమయిన అర్థము కలదు. ప్రతిమలోయున్న ప్రతి అర్థము అజ్ఞానులును, జ్ఞానులుగా మార్చునిమిత్తమే ఉన్నది. మనశరీరములో అయిదు వాయువులు ఉన్నవి. వాటినే పంచప్రాణములు అని అనుచున్నాము. వాటిపేర్లు వ్యాన, సమాన, ఉదాన, ప్రాణ అపానవాయువులు ఈ అయిదు వాయువులు శరీరమునందు విచ్చల విడిగా ప్రయాణము చేయుచున్నవి. ఈ అయిదు వాయువులననుసరించి మనస్సు తిరుగుచున్నది. ఈ అయిదు వాయువులు నిలబడితే మనస్సు నిలబడును. కావున నీలోయున్న అయిదు వాయువులును ఒకటిగా కలిపి నిలిపివేయుము. అపుడు నీలోయున్న మనస్సుకూడ నిలిచిపోవును అని తెలుపువిషయమై వేంకటేశ్వరస్వామి తన చేతికియున్న అయిదు వ్రేల్లు కలిపి మనకు చూపించినాడు. ఆ హస్తమునుచూచి మనసు నిలుపు విషయమై ప్రయత్నము చేయవలయును కాని మనము అడిగినదానికి అభయమిస్తున్నాడు అని అనుకోకూడదు. మరియొక విషయము మనము తిరుపతికిపోయి దేవాలయములో ప్రవేశించు సమయమున వెంకటేశ్వర ప్రతిమ దగ్గరకు పోవుటకు ఆరు ద్వారములు దాటవలసిఉండును. ఆరు ద్వారముల తర్వాత ఏడవ ద్వారము అవతల గర్భగుడిలో వెంకటేశ్వర స్వామి ఉన్నాడు. వేంకటేశ్వరస్వామి ప్రతిమను ముట్టు కోవలయునంటే ఏడు ద్వారములు దాటిపోవలసినదే, అట్లే మనలోకూడ బ్రహ్మనాడి ఉన్నదికదా! దాని యందు ఏడుకేంద్రములు ఉన్నవి ఆ ఏడుకేంద్రములలో చివరనయున్న ఏడవ కేంద్రము పరమాత్మకు నెలవైఉన్నది. జీవుడు ఆత్మను చేరుటకు ఏడవ స్థానము చేరవలయును.

దానినే వేంకటేశ్వరుడు నేను ఏడవ గది యందు ఉన్నాను, నన్ను చేరుటకు ఏడుద్వారములు దాటి ఏడవ గదిలోనికి రావలయును, ఇక్కడ నాపైరూపు (ఆకారము) చూచుచున్నారు. మీలోయున్న ఏడు ద్వారములు దాటి నా యొద్దకు వచ్చినరోజు నా అసలు రూపు చూచుదురు అని తెలియజేసినట్లు ఉన్నది. కాని మనము ఏమి అర్థముచేసుకోక డబ్బు ఖర్చుపెట్టి ఏడుకొండలు ఎక్కుచున్నాము కాని, జ్ఞానము ఖర్చుపెట్టి మనలోయున్న ఏడుకొండలు ఎక్కవలయునని అనుకోలేదు.

ప్రతిదేవాలయము అజ్ఞానులను జ్ఞానులుగా మార్చునిమిత్తము నిర్మింపబడి ఉన్నది. దానినిచూచి మనము ఏమాత్రము జ్ఞానులుగా మారలేదంటే మన తెలివి సరయిన మార్గములో లేదని తెలియుచున్నది. పూర్వము ఒకజ్ఞాని తిరుపతికి పోయి తనలో ఏ తలంపులు లేవని బాహ్యార్థముగా తెలుపుటకు, తలంపులకు నెలవయిన తలమీద యుండు వెంట్రుకలన్నియు తీసివేసెను. దానిని చూచినప్రజలు దీనివలన ఏదో లాభముయున్నదనుకొని నాటినుండి నేటివరకు తిరుపతిలో తలలు కోరగించుకొనుచునే ఉన్నారు. తెలియక ఏ పనిచేసినా ప్రయోజనము ఉండదు. తెలిసిచేసిన మనస్సు అందు ఉండును. కావున ఆ పూజయందు ఫలితము తప్పక ఉండును. అందువలన ఈ కాలము భక్తులు ప్రతివిషయము తెలిసి ఆచరించవలయును. దేవాలయములలో ఇంకనూ అనేక అర్థములు కలవు. వాటినన్ని తెలుపుటకు గ్రంథవిస్తరణ అగునని వదలి వేయుచున్నాను. పరమాత్మను తెలుసుకొనుటకు మొదటిది భక్తియే కనుక మనకున్న భక్తి ఎటువంటిది? ఉండవలసిన భక్తి ఎటువంటిది? భక్తితో మనము పోవు దేవాలయములు ఎటువంటివి? దేవాలయములు ఏమి తెలుపుచున్నవి? అని అన్ని విషయములు తెలుసుకొంటే మనతెలివి సరయిన మార్గములో ఉపయోగపడినట్లే. అట్లుకాక మనతెలివి ప్రపంచమార్గములో ఉపయోగపడిన, మనతెలివి పెడమార్గము పట్టినట్లే. అందువలన ప్రతిఒక్కరు అర్థము తెలుసుకొని ఆచరించండి. అర్థము తెలియక ఆచరించిన అది గీతలో పరమాత్మ చెప్పినట్లు నామకార్థపు పూజ అగును.

__________(౦)_______

మోక్షము

ప్రతి మానవుడు మోక్షము అనగా ఏమి అని తెలుసుకోవలయును. మోక్షమును గురించి తెలుసుకోలేక పోయిన మానవుడు ఆత్మను తెలుసుకొనుటకు ఏమాత్రము ప్రయత్నించడు. ఎవరయిన చెప్పిన దానితో మనకేమి ప్రయోజనమున్నది? అని అంటాడు. మోక్షముయొక్క విలువ తెలుసుకోలేని మానవుని జీవితము ఒక జంతు జీవితముతో సమానము. మోక్షము యొక్క అర్థము తెలుసుకోలేని మానవుడు ఉన్ననూ ఊడినను ఒక్కటే మోక్షమును గురించి తెలుసుకోలేని వారి భక్తి గమ్యము తెలియని ప్రయాణములాగ ఉండును. మోక్షము చేరిన జన్మించనవసరములేదని తెలిపిన, దానివిలువ తెలియని అజ్ఞానులు అక్కడపోయి ఊరకనేయుంటే ప్రొద్దు ఏలాగ గడుచును? చచ్చి పుట్టుతాయుంటేకదా ప్రొద్దుపోయేది అని అంటున్నారు. మరియు ఊరకనేయుంటే ఏమి బాగుంటుంది భూలోకములో పుట్టి అన్నిసుఖములు పొందితేకదా బాగుండేది అని అంటున్నారు. ఇంకనూ మీకు తిక్కపట్టి మోక్షము మోక్షము అంటున్నారు అది మాకు కాబట్టదు అని జ్ఞానులనే అంటున్నారు. నిజము తెలుసుకుంటే తిక్క వారు ఎవరో? మోక్షము ఏమిటి అన్న విషయము తెలియని వారికి పరమాత్మను గురించి చెపితే గాలిలేని గదిలో (కనజములో) వేసి తలుపు మూసినట్లగును. కావున వారు వినకపోవడమే కాక, అక్కడనుంచి ఎప్పుడు బయట పడుదుమా అని అలోచించి తప్పుకుందురు. మోక్షమును గురించి తెలుసు కోలేనివారు ఎవరు పరమాత్మను తెలుసుకొనుటకు ఇష్టపడరు. మరియు పరమాత్మ విషయములయందుండు వారిని చూచి అసహ్యించుకొందురు. కావున ప్రతిమానవుడు మొదట మోక్షమును గురించి తెలుసుకోవలయును.

మోక్షము అనగా అజ్ఞానులు అనుకొను ఒక లోకముకాదు. మోక్షము ఎక్కడోయున్నదని కొందరను కొనుచుందురు. అది ఎక్కడో లేదు అంతటా ఉన్నది. మోక్షము పొందిన జీవుడు కాలముగానే మారిపోవు చున్నాడు. కాలమే తానైన తర్వాత ప్రొద్దుపోదు అను

సమస్య ఏలాగ ఉండును? మోక్షమును పొందిన జీవుడు అణువణువునా నిండుకొనిపోయి ప్రపంచములో యున్న కష్టములను పొందక అన్నిటికి సాక్షిగా ఉంటున్నాడు. కావున అక్కడపోయి ఏమి చేయవలెను అను సమస్య ఏమాత్రము ఉండదు. మోక్షమును పొందిన జీవుడు ప్రకృతిలోపల బయట ప్రపంచమంతట ఉన్నాడు, కావున ప్రకృతి ఏమియు చేయలేదు. మామూలు మానవులు ప్రకృతికి లోపలనే యుండుట వలన ప్రకృతి నాశనము చేయగలదు. మోక్షము పొందిన జీవుడు అగ్గికూడ తానే అయియున్న దానివలన అగ్గి కాలును అను సమస్య ఏమాత్రము ఉండదు. మోక్షము పొందని జీవుడు అగ్గి తాను కానిదానివలన అగ్గి కాలును. మోక్షము పొందినజీవుడు గుణములకు అతీతుడు, అవి వానిని ఏమిచేయజాలవు. మామూలు మానవుడు గుణము లలో కూడుకొని ఉండును. గుణములు మానవుని ముప్పతిప్పలు పెట్టు చున్నవి. మోక్షము పొందిన జీవుడు కంటికి కనపడక ఫలానా చోట ఉన్నాడు అని గుర్తించుటకు వీలులేక ఉన్నాడు. మామూలు మానవుని గుర్తించవచ్చును. మోక్షము పొందిన జీవుడు ప్రళయమున ప్రపంచమంతయు నాశనమయిపోయినను తాను నాశనముకాక ఉండును. మోక్షము పొందిన జీవుడు ప్రపంచములో అన్ని శరీరములకు లోపలబయట ఉండును. మోక్షము పొందని మానవులు శరీరము లోపలనే ఉందురు. మోక్షము పొందిన జీవుడు అన్ని స్థలములను చూచుచుండును. దానిని పొందనివాడు
అట్లుచూడలేడు. మోక్షము పొందినజీవుడు ఒక స్థలము నుండి వేరొక స్థలముకు పోనవసరములేక అంతటా ఉండును. దానిని పొందనివాడు వ్యయప్రయాసలతో ఒకచోటనుండి మరొకచోటకి పోవలసి ఉండును. మోక్షము పొందిన జీవుడు అగ్నికి కాలడు, నీటికి తడువడు, గాలికి కొట్టుకపోడు కావున భయపడడు. దానిని పొందని జీవుడు అగ్నికి, గాలికి, నీటికి నిత్యము భయపడవలసి ఉండును. మోక్షము పొందినజీవికి ఆహారము అవసరము లేదు. దానిని పొందనివానికి ఆహారము నిత్యము అవసరము. మోక్షము పొందినవాడు శాశ్వితముగా చెప్పరాని సుఖమును పొందుచు తృప్తిగా ఉండును. దానిని పొందనివాడు క్షణకాల సుఖమును అనుభవించుచు ఎల్లపుడు అసంతృప్తిగానే ఉండును. మోక్షము పొందినవాడు ఏమాత్రము బాధపడవలసి ఉండదు. దానినిపొందనివాడు అనేక బాధలు అనుభవించవలసి ఉండును. మోక్షము పొందిన వాని కంటే ఎవ్వరు పెద్దగా ఉండరు. దానిని పొందని మానవునికి దేవుడనువాడు ఒకడు పెద్ద

ఉన్నాడు. మోక్షము పొందినవాడు వాడు ఎల్లప్పుడు ఒకే రకముగా ఉంటున్నాడు. పొందనివాడు అనేక జన్మలయందు బాల్యము, యవ్వనము,వృద్ధాప్యము అను స్థితులను పొందుచున్నాడు. ఈవిధముగా చెప్పుచు పోయిన అనేకముగా మోక్షము యొక్క విలువ ఉన్నది. దానిని గురించి పూర్తి చెప్పుటకు ఎవ్వరికి చేతకాదు. ఇది అంతయు తెలుసుకున్న మనముయుండు స్థితి మంచిదా? లేక మోక్షస్థితి మంచిదా? మీరే ఆలోచించుకోండి.

మోక్షముయొక్క విలువ తెలియనివారు దానితో ఏమిపని అంటున్నారు. మోక్షము ముందర ఇపుడు మనము అనుభవించు స్థితి పర్వతము ముందర చిన్నరాయితో సమానమని వారికి తెలియదు. మోక్షము యొక్క విలువ తెలియనివారు పరమాత్మను గురించి తెలుసుకొనుటకు ప్రయత్నించరు. కావున మొదట ప్రతియొక్కరు మోక్షమును గురించి తెలుసుకోవలయును. మోక్షమును తెలుసుకున్న తర్వాత దానిని పొందుటకు మార్గము అన్వేషించవలయును. మోక్షమును పొందుటకు జ్ఞానమవసరము. జ్ఞానము పొందుటకు గురువు అవసరము. గురువు లభించిన తర్వాత వారిద్వారా మోక్షమును పొందుటకు వీలు ఉన్నది. బైబిలునందు యేసు (గురువు) “నేనే మార్గమును నా ద్వారానే పరలోకరాజ్యము చెందవలెను” అని అన్నాడు. బైబిలులో మోక్షమును పరలోకరాజ్యము అని చెప్పబడినది.

ఓ మానవులారా! మోక్షసామ్రాజ్యము పొందుటకు ద్వారము ఒక్క గురువే కావున గురువును ఆశ్రయించి ఆయనద్వారా జ్ఞానము, యోగము పొంది జన్మరహితమయిన మోక్షము సంపాదించుకోండి 60 లేక 70 సంవత్సర కాలము బ్రతుకు ఈ జన్మయందు 20 లేక 30 సంవత్సరములు చదివి, పెద్ద పెద్ద డిగ్రీలు సంపాదించుకొని, పెద్దవారము అని అనిపించుకొన్న ఆ విలువ అంతయు చచ్చునంతవరకే ఉండును. డాక్టర్లుగా, ఇంజనీర్లుగా పట్టాపొందిన దాని ప్రయోజనము కొంతకాలమే ఉండును. ఎంత డబ్బు సంపాదించిన మనము దానియొద్ద యుండునది కొంతకాలమే, ప్రపంచములో ఒక్కొక్కజన్మ కొంత కొంత కాలమే ఉండును. కావున ఈ జన్మకూడ కొంతకాలమే ఉండును. చీకటిలో తాడును పామని భ్రమించినట్లు అజ్ఞానముతో శాశ్వితము కానిదానిని

శాశ్వితము అనుకోని మనము ఎంతో పొరపాటు పడుచున్నాము. ఆ పొరపాటును తెలుసుకొని శాశ్వితముకాని ఈ జీవితమును నిర్లక్ష్యముచేసి శాశ్వితమయిన మోక్షముకోసము ప్రయత్నము చేయవలయును. మానవులమయిన మనకు ఎంతో తెలివి ఉన్నది. దానిని ఉపయోగించి ఇంతకుముందు మోక్షము కోసము ప్రయత్నించినవారిని గురించి ఆలోచించిన, మనకంటే ఎక్కువ తెలివియున్నవారే దానికి ప్రయత్నము చేసినట్లు తెలియును. మోక్షము అనుచు మోసముచేయు దొంగభక్తులు ప్రపంచములో ఉండవచ్చును. వారిని చూచి మోక్షము అనునది చెడ్డది, దానిని ప్రయత్నించువారు అందరు చెడ్డవారు అనుకోక, మోక్షము యొక్క సారాంశము మీదికి ఒకమారు మీ దృష్టితో పారచూడండి. మోక్షమును గురించి తెలుసుకోలేని జీవితము నిరర్థకము అనికూడ తెలుసుకోండి. మోక్షమును పొందలేకపోయిన, మోక్షమును గురించి తెలుసుకున్న జన్మ సార్థకమయినట్లేనని తెలుసుకోండి.

చర, అచర ప్రకృతి

ప్రకృతి అనగా కంటికి కనుపించునది అని అర్థము. స్థావరజంగమ రూపమైయున్నదంతయు ప్రకృతియే. ప్రకృతిని రెండుగా చెప్పవచ్చును. ఒకటి చర ప్రకృతి రెండు అచర ప్రకృతి. వీటినే చేతన అచేతన ప్రకృతులు అనికూడ అందురు. చేతన అచేతన ప్రకృతులు ఎట్లు తయారయినవి? అనగా చెప్పుటకు వ్రాయుటకు అందని పరాత్పరునినుంచి ఆకాశము, గాలి, అగ్ని,నీరు, భూమి అను అయిదు శక్తి నిర్ముక్తములయిన భాగములు బయల్పడినవి. బయల్పడిన తరువాత ఆకాశము రెండు భాగములాయెను అట్లే గాలి రెండు భాగములాయెను. అగ్ని రెండు భాగములాయెను. నీరు రెండు భాగములాయెను. భూమి రెండు భాగములాయెను. ఆకాశము రెండు భాగములయినది కదా! అందు మొదటి భాగము సగము మనకు అర్థగోళాకృతిలో పైన కన్పించుచునే ఉన్నది. గాలియు రెండు భాగములయినదికదా! అందు మొదటి భాగము సగము భూమి మొదలుకొని పైకి

కొంతవరకు వ్యాపించి ఉన్నది. అగ్నియు రెండు భాగములయినదికదా! అందు మొదటి సగభాగము సూర్యుని మొదలుకొని భూమివరకు వ్యాపించిఉన్నది. నీరు రెండు భాగములయినది కదా! అందు మొదటి సగభాగము భూభాగముమీద సముద్రరూపముతో యుండనే ఉన్నది. భూమి రెండు భాగములయందుకూడ మొదటి సగభాగము మీదనే మనము నివసించుచున్నాము. ఈ విధముగా ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి వలన ప్రపంచము ఏర్పడినది. దీనినే అచర ప్రకృతి అందురు. ఇక చర ప్రకృతి ఎట్లేర్పడినదనిన? ఆకాశము, గాలి, అగ్ని, నీరు, భూమి యొక్క రెండవభాగములయిన సగ సగ భాగములు ఉన్నవికదా! అవి ఒక్కొక్కటి అయిదు భాగములుగా చీలిపోయినవి. ఇట్లు చీలిపోయి మొత్తము ఇరువది ఐదు భాగములుగా చీలిపోయినవి. ఇట్లు చీలిపోయి మొత్తము ఇరువది ఐదు అయినవి.

రెండవ సగభాగమయిన ఆకాశం	**---------**	**5 భాగములు**
రెండవ సగభాగమయిన గాలి	**---------**	**5 భాగములు**
రెండవ సగభాగమయిన అగ్ని	**---------**	**5 భాగములు**
రెండవ సగభాగమయిన నీరు	**---------**	**5 భాగములు**
రెండవ సగభాగమయిన భూమి	**---------**	**5 భాగములు**

మొత్తము భాగములు 25. ఈ 25 భాగములు ఒకదానితో ఒకటి కలసి జీవశరీరములు ఏర్పడినవి. సగ ఆకాశము 5 భాగములయినది కదా! అందు మొదటిభాగము పరమాత్మ అంశలో కూడి ప్రాణమాయెను. దీనినే జ్ఞాత అనియు అందురు. గాలిలోని ఒకభాగముతో కలసి మనస్సు ఏర్పడినది. అగ్నిలోని ఒకభాగముతో కలసి బుద్ధి ఏర్పడినది. నీరులోని ఒకభాగముతో కలసి చిత్తము ఏర్పడినది. భూమిలోని భాగములలో ఒక దానితో కలసి అహంకారము ఏర్పడెను. ఇట్లు మొదటి ఆకాశ భాగము అయిదు ఇతర భాగములతో కూడి జీవుడు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము తయారాయెను. వీటినే ఆకాశతత్వములు అందురు. మరియు అంతఃకరణములు అనికూడ అందురు.

ఆకాశ మొదటిభాగము 1 + పరమాత్మ అంశము = జీవుడు
ఆకాశ మొదటిభాగము 1 + గాలిలోని 1వ భాగము = మనస్సు
ఆకాశ మొదటిభాగము 1 + అగ్నిలోని 1వ భాగము = బుద్ధి
ఆకాశ మొదటిభాగము 1 + నీరులోని 1వ భాగము = చిత్తము
ఆకాశ మొదటిభాగము 1 + భూమిలోని 1వ భాగము = అహంకారము

ఇవి ఆకాశము ద్వారా పుట్టినవి. వాయువుకూడ అయిదు భాగములయినదికదా! అందు మొదటిది ఆకాశతత్వముతో కూడుకొని మనస్సయినది. ఇక నాలుగు భాగములు మిగిలిఉన్నవికదా! అందు రెండవభాగము ఆత్మ అంశతో కూడుకొని మన శరీరములో యున్న వ్యాన వాయువాయెను. వాయువు రెండవభాగము ఆకాశములోని రెండవభాగముతో కలియుటచేత సమాన వాయువు ఏర్పడెను వాయువులోని రెండవభాగము అగ్నిలోని రెండవభాగముతో కలియుట చేత ఉదాన వాయువు ఏర్పడెను. గాలిలోని రెండవభాగము నీటిలోని రెండవభాగముతో కలియుటచేత ప్రాణవాయువు ఏర్పడెను. గాలిలోని రెండవభాగము భూమిలోని రెండవభాగముతో కలియుటచేత అపాన వాయువు ఏర్పడెను. వీటినే వాయుతత్వములు అందురు. మరియు పంచ ప్రాణములు అనికూడ అందురు.

గాలి రెండవభాగము + పరమాత్మ అంశము = వ్యానవాయువు
గాలి రెండవభాగము + ఆకాశ రెండవభాగము = సమానవాయువు
గాలి రెండవభాగము + అగ్ని రెండవభాగము = ఉదానవాయువు
గాలి రెండవభాగము + నీరు రెండవభాగము = ప్రాణవాయువు
గాలి రెండవభాగము + భూమి రెండవభాగము = అపానవాయువు

ఇవి గాలి ద్వారా పుట్టినవి. అగ్నియుకూడ అయిదు భాగములయినదికదా! అందు మొదటిది ఆకాశతత్వముతో కూడి బుద్ధిగా మారిపోయెను. రెండవది గాలితో కూడు కొని

ఉదానవాయువాయెను, ఇక అగ్నిలో మూడుభాగములు మిగిలినవి. అందు మూడవభాగము పరమాత్మ అంశతోకూడుకొని కన్నుగా తయారాయెను. ఆకాశములోని మూడవభాగముతో కలసి చెవిగా తయారాయెను. వాయువులోని మూడవభాగముతో కలసి చర్మముగా ఏర్పడెను. మరియు నీటిలోని మూడవభాగముతో కలిసి నాలుకగా ఏర్పడెను. అట్లే భూ భాగములోని మూడవభాగముతో కలసి ముక్కుగా ఏర్పడెను. ఈ విధముగానే తయారయిన వాటినే జ్ఞానేంద్రియములు అని అందురు. మరియు అగ్ని తత్వములు అనికూడ అందురు.

అగ్నిలోని మూడవభాగము + ఆత్మ అంశ = కన్నులు
అగ్నిలోని మూడవభాగము + ఆకాశ మూడవభాగము = చెవులు
అగ్నిలోని మూడవభాగము + గాలి మూడవభాగము = చర్మము
అగ్నిలోని మూడవభాగము + నీరు మూడవభాగము = నాలుక
అగ్నిలోని మూడవభాగము + భూమి మూడవభాగము = ముక్కు

ఇవి అగ్నివలన పుట్టినవి. నీరుకూడ అయిదు భాగములయినదికదా! అందు ఒక భాగము ఆకాశముతో కలసి చిత్తముగా, రెండవ భాగము గాలితో కలసి ప్రాణ వాయువుగా, మూడవభాగము అగ్నితో కలసి నాలుకగా ఏర్పడినదికదా! ఇక మిగిలిన నాల్గవభాగము ఆత్మ అంశముతోకూడుకొని రసముగా తయా రాయెను. ఆకాశములోని నాల్గవభాగముతో కూడుకొని శబ్దము గాలిలోని నాల్గవ భాగముతో కూడుకొని స్పర్శ, అగ్నిలోని నాల్గవభాగముతో కూడు కొని రూపము, భూమిలోని నాల్గవభాగముతో కూడుకొని గంధము తయారాయెను. వీటిని నీటి తత్వములు అని అందురు.

నీటిలోని నాల్గవభాగము + ఆత్మ అంశ = రసము
నీటిలోని నాల్గవభాగము + ఆకాశము నాల్గవభాగము = శబ్దము
నీటిలోని నాల్గవభాగము + గాలి నాల్గవభాగము = స్పర్శము
నీటిలోని నాల్గవభాగము + అగ్ని నాల్గవభాగము = రూపము

నీటిలోని నాల్గవభాగము + భూమి నాల్గవభాగము = గంధము

ఇవి నీటిలో తయారయినవి. భూమికూడ అయిదు భాగములయినదికదా! అందు ఒకభాగము ఆకాశములో కలసి అహంకారము, రెండవభాగము గాలితోకలిసి అపాన వాయువు, మూడవభాగము అగ్నితోకలిసి ముక్కు, నాల్గవభాగము నీటితో కలసి గంధము తయారయినవికదా! మిగిలిన అయిదవభాగము ఆత్మ అంశతో కలిసి గుదము, ఆకాశ అయిదవభాగముతో కలసి వాక్కు (నోరు), వాయువు అయిదవభాగముతో కలసి చేతులు, అగ్ని అయిదవ భాగముతో కలసి పాదములు, నీటి అయిదవభాగముతో కలసి గుహ్యాము తయారాయెను. వీటినే కర్మేంద్రియములు అని అందురు.

భూమి అయిదవభాగము + ఆత్మ అంశ = గుదము
భూమి అయిదవభాగము + ఆకాశ అయిదవభాగము = వాక్కు
భూమి అయిదవభాగము + వాయువు అయిదవభాగము = చేతులు
భూమి అయిదవభాగము + అగ్ని అయిదవభాగము = పాదములు
భూమి అయిదవభాగము + నీటి అయిదవభాగము = గుహ్యాము

ఇవి భూమిలో పుట్టినవి. ఈవిధముగా సగభాగములుగా మిగిలిపోయిన అయిదు శక్తులు మొత్తము 25 భాగములయి ఒకదానితోఒకటి కలసి ప్రపంచములో జీవరూప శరీరములై సంచరింపజొచ్చెను. దీనినే చర ప్రకృతి అనియు చేతన ప్రకృతి అనియు అందురు. ఇట్లు అచేతనమయిన ప్రపంచము చేతన మయిన జీవశరీరములు కలసి ప్రకృతి అని అనబడెను. అందువలన ప్రకృతిని విభజించి ఒకటి చేతన రెండవది అచేతన ప్రకృతి అని చెప్పవచ్చును. (1) చేతనము అనగా సర్వజీవరాసులు మొత్తము 84 లక్షల రకములు దీనినే చర అని అందురు. (2) అచేతనము అనగా ఆకాశము, గాలి, అగ్గి, నీరు, భూమి దీనినే అచర అనియు అందురు. అచేతనము యొక్క గాలి, ఆకాశము, అగ్గి, నీరు, భూమితో ప్రపంచము ఏర్పడినది. చేతనము యొక్క 84 లక్షల రకముల జీవరాసులు అచేతనముయొక్క

ప్రపంచములో నిండుకొనిపోయినవి అనగా ఇపుడు మానవశరీరము ధరించియున్న మనము కూడ ప్రకృతిలోని ఒక భాగమే.

భగవద్గీతయందు విజ్ఞానయోగములో పరమాత్మ ఏమి చెప్పుచున్నాడనగా "జీవరాసులయొక్క చావు పుట్టుకలను ఈ చేతనాచేతన ప్రకృతులు చేయించుచుండు నేను కారణభూతునిగా మాత్రము నిలిచి ఉందును" అని అన్నాడు. మరియు "ప్రతి గుణము ఈ ప్రకృతుల వలననే పుట్టుచున్నవని జ్ఞాని తెలుసుకొనుము. ప్రకృతి నాఆధీనముయందు ఉన్నది. జీవరాసులు పాపపుణ్యములను అనుసరించి నా ప్రకృతే వారికి కష్టసుఖములను, చావు పుట్టుకలను, లాభనష్టములను, కలుగచేయుచుండును. నేను మాత్రము అన్నిటికి సాక్షి మాత్రునిగా నిలచి చూచుచుందును. ఇటువంటి నన్ను తెలుసుకొనుట యోగులకు మాత్రమే సాధ్యము. నేను పైన ఆకాశము మొదలు భూమివరకు సర్వదిక్కుల వ్యాపించి అచేతన ప్రకృతియందు సూదిమోపను కూడ సందులేక నిండుకొని ఉన్నాను. అదేవిధముగా చేతన ప్రకృతి అయిన అన్ని శరీరములయందు పాదములు మొదలుకొని శిరస్సు వరకు వ్యాపించి ఉన్నాను. అందువలననే నాకు తెలియకుండ ఈ చర అచర ప్రపంచములో ఏమియు జరుగదు. ఈ చరాచర ప్రపంచమందు రాత్రిగాని, పగలుగాని, ఏ సమయమునందుగాని, ఏ స్థలమునందుగాని జరుగుచున్నది నాకు తెలియును. అందువలననే విజ్ఞానయోగములో, "తెలియునాకు భూత జాలములకు జగతిలో జరిగినట్టి, జరగబోవునట్టి వృత్తాంతములు. ఇట్టి నన్నెరుంగడెవడుగాని" అన్నాను, మరియు విజ్ఞానయోగములోనే "సర్వ భూతములకు జన్మ మీచేతనాచేతన ప్రకృతులు చేయించుచుండు నేను హేతువగుదు అఖిల జగముల పుట్టుకకు మరియు చావులకు" అన్నాను ఇపుడు నీకుకాని ఎవరికైనాకానీ అనుమానమురావచ్చు. చర అచర ప్రకృతి ఏవిధముగా ప్రళయసంభవములు చేయించుచున్నదని? దానినిగురించి విశదీకరించెద సావధానముగా వినుము.

నా అచేతన (అచర) ప్రకృతి ఐదు భాగములుగా ఉన్నది కదా ! అందు గాలిచెలరేగినంతమాత్రమున ఏ వస్తువుదానికి తట్టుకొనదు. పెద్ద కొండనయిన పైకిఎత్తి గిరగిర త్రిప్పి కొన్నిమైళ్ల దూరములో పారవేయగలదు. పెద్దచెట్లనుసహితము క్రూకటి

వ్రేళ్లతోసహా పెరికివేయగలదు. ఇంతటి బలమైన నాఆధీనములోయున్న గాలి ఇండ్లను, కొట్టములను, భూమిమీద వస్తువులను తారుమారుచేయగలదు. ప్రకృతి శక్తులలో ఒకటయిన గాలి విజృంభించినదా! ప్రపంచములో ఏ జీవరాసి మిగలదు. ఇక అగ్గి అందామా దానికి లొంగని వస్తువు అంటూ ఏదిలేదు. ప్రపంచములో రాళ్లను, ఇనుమును, చెట్లను, మనుష్యులను, సర్వజీవరాసులకాల్చి బూడిదచేస్తుంది. తర్వాత నీళ్లు అందామా ఇది విజృంభించిన సర్వప్రపంచమును ముంచివేయగలదు అన్నియు దానియందు లయించి పోవలసినదే. అదేవిధముగా భూమి, భూమికి కోపము వచ్చినదా పైది క్రిందికి క్రిందిది పైకిచేసి భూసమాది అన్నిటినిచేస్తుంది. ఈవిధముగా నా ప్రకృతి అయిన అయిదుశక్తులు ఒకేమారు చెలరేగినవా వేరేచెప్పనవసరములేదు. ఈ ప్రకృతిలోనే చేతనమయి నిలిచియున్న ఈ జీవరూప ప్రపంచమంత నా ప్రకృతికి ఆధీనమయియున్నది. కొంతమంది ఏమనుచున్నారనగా! రోగమువచ్చి చనిపోవుచున్న జీవులను ప్రకృతి బాధించలేదుకదా? జీవులచావును ప్రకృతియే చేయించుచున్నదన్నారే ఎట్లు? అని అంటున్నారు వారికి పరమాత్మ ఏమి చెప్పుచున్నాడనగా యోగమాయ కప్పియున్న నన్ను, నా మహత్యము తెలియక మీరు అలా అనుచున్నారేకాని వేరుకాదు. దాని రహస్యము తెలియచెప్పుచున్నాను సావధానముగా వినండి.

శరీరములు సర్వజీవరాసులవి పంచభూతములతోనేకదా నిర్మాణమైనవి. ఈ శరీరరూపమైయున్న దానినేకదా, చేతనా ప్రకృతి అనుచున్నాము. ఈ ప్రకృతియందు ఒక గాలి చెలరేగినదా దగ్గులు, తుమ్ములు బయలుదేరును. దీనినే పడిశముపట్టినది అంటాము దీనిగుండా జీవులు బాధపడడము లేదా? ఇంకా ఉబ్బసరోగము బయలుదేరుచున్నది దీనిద్వారా జీవులుబాధపడడములేదా? అపానవాయువు ఎక్కువ అయినదా కడుపు ఉబ్బరింపు నొప్పి బేదులు వస్తూయున్నవి. దీనిద్వారా బాధపడడములేదా? ఉపవాయువయిన ధనుంజయవాయువు వ్యతిరేకించినదా గర్భములోని బిడ్డ బయటికే రాకపోవును దానిద్వారా జీవులు బాధపడడములేదా? వ్యాన సమాన వాయువులు వ్యతిరేకించిన శరీర అవయవముల సరిసమాన బలమునే కోల్పోవును. ఒక గాలికి జీవుడు బాధలనుభవించి మరణించుస్థితి ఏర్పడుచున్నది అట్లే శరీరములోయున్న నీరు

వ్యతిరేకించిన శరీరమంతయు నీరునిండుకొని కాళ్లు చేతులు ఊదుకొనిపోవును. దానిద్వారా జీవుడు ఎంతో బాధ అనుభవించవలసివస్తుంది. మరియు మూత్రవ్యాధి సంభవించును. నోట చెమ్మ తగ్గిపోవును మెదడునందు తేమ తగ్గుటవలన నిద్రతక్కువగును కాళ్లుచేతులు బరువెక్కి తిమ్మిర్లువచ్చి స్పర్శ కోల్పోవును చూపు తగ్గును శబ్దము వినరాకపోవును. ముక్కులు వాసనను గ్రహించలేక పోవును. నాలుక రుచి తెలుసుకోలేకపోవును. ఇట్లు ఏదిలోపమయిన జీవుడు బాధపడవలసివచ్చును. మరియు మరణింపవలసివచ్చుచున్నది. చేతన ప్రకృతిలో ఒకభాగమైన భూమిచెలరేగి కంపించినదా, కాల్లు చేతులు చచ్చుపడుటో, నొప్పులువచ్చుటయో సంభవించును. మూలవ్యాధి బయలుదేరును. సుఖవ్యాధులు కలుగును. దంత బాధయు వచ్చును. మరియు మూర్ఛరోగము రావచ్చును. ఇట్లు భూమి బాధించి కడకు చంపుతూ ఉన్నది. చేతన ప్రకృతిలోయున్న ఆకాశము వ్యతిరేకించిన ముక్కుపుట రంధ్రములు మూసుకపోయి శ్వాస ఆడుటకు కష్టమగును. పూర్తి మూసుకున్న శ్వాస నిరోధించబడును. గొంతులోని కండరములు వాపుఎక్కి కంఠ రంధ్రము మూయబడి అ న్న ము తినుటకు నీల్లు త్రాగుటకుకూడ కష్టమగును. మూత్రనాళముకూడ మూసుకపోయి మూత్రము పోయుటకే కష్టమగును. మనస్సు స్థిమితములేక మనోరోగము ఏర్పడును. మరియు పిచ్చికూడ సంభవించవచ్చును. ఇట్లు అనేకమయిన శరీర సంబంధమైన రోగములు బయలుదేరి జీవుని బాధించి ఆఖరుకు దానివలననే చచ్చునట్లుకూడ చేయుచున్నవి. ఇంకనూ చేతనా ప్రకృతి అయిన అగ్ని చెలరేగిన ఎన్నియో రోగములు బయలుదేరి జీవుని చంపుచున్నవి. ఈవిధముగా చేతనాచేతన ప్రకృతులు జీవుని మృత్యుకూపమున వేయుచున్నవి. మరియు ప్రకృతియే ఒక భాగముతో ఒక భాగము కూడుకొని జీవులకు జన్మ ఇచ్చుచున్నది. కావున జీవుల ప్రళయ సంభవములకు నా ప్రకృతియే కారణమన్నాను.

“చేతనా అచేతన ప్రకృతులే సర్వ జీవరాసులకు చావు పుట్టుకలను పాప పుణ్యములను అనుసరించి ఇచ్చుచున్నవి. నేను ప్రకృతికి అధ్యక్షతవహించి ఉన్నాను. అందువలననే జగము చక్రమువలె తిరుగ గలుగునెపుడు నేను ఎవరి పుణ్యమునుకాని, ఎవరి

పాపమునుకాని తొలగించను. నాకు ప్రపంచములో అందరు సమానులే, కాని నా భక్తులు మాత్రము నాకు పరమ ప్రియులు. వారి పాప పుణ్యములు మాత్రము నాచే ఇవ్వబడునట్టి జ్ఞానము అను అగ్నిచేత కాలి బూడిదయి వారు అనుభవించుటకు ఏమాత్రము పనికిరాకుండ పోవుచున్నవి. ప్రపంచములో నా భక్తులయినవారు నాకు మిగుల ప్రియులు. నాకు నిత్యబంధువులు వారే కాబట్టి నేనే వారు వారే నేను అని తలంచుచున్నాను. వారికి నా నిమిత్తమైయున్న జ్ఞానము సంప్రాప్తమగునటుల చేయుచున్నాను. దానితో వారికర్మ అయిన పాప పుణ్యములు రెండునూ నిశ్శేషముగా నశించి నాలోనికి ఐక్యత అగుచున్నారు. అందువలననే నేను నా గీతా శాస్త్రమందు నన్ను మాత్రము నమ్ముకొను మర్జునా నిన్ను సర్వపాప నియచంబులోనుండి ముక్తునిచేతు అని అన్నాను. అర్జునుడే కాదు ఎవరయిన నేను చెప్పినట్లు నన్ను నమ్ముకొనిన వారిని నిస్సంశయముగా మాయ అను సముద్రమునుండి బయటికి వేతును. నేనే ప్రపంచము అంతటా నిండుకొనియున్నాను. నాకు తెలియక ఏది జరుగదు అన్నిటిని నడిపించునది నేనే. అన్ని జీవరాసుల ఆత్మను నేనేనని ఎవరు తెలిసి నన్నే మానసమున అనుక్షణము మరువకయున్నారో, అటువంటి భక్తునికి చాలా దగ్గర వాడనైయున్నాను. నాభక్తులు నాప్రకృతికి అతీతులు కాగలరు. నా భక్తులను నా ప్రకృతి ఏమియు చేయజాలదు. నా ప్రకృతిలోని అగ్ని కాల్చలేదు నా భక్తుడు కాలడు. నా ప్రకృతిలోని నీళ్ళు తడుపలేవు నా భక్తుడు తడువడు. అట్లే గాలికి కొట్టుకపోడు, భూమి నలుపలేదు. ఎండిపోడు, తడుపబడడు, కాలడు, తెగడు. అన్నిటికి అతీతుడైన నామాదిరే నాభక్తుడు మారిపోగలడు. వాడే నేనయి తాను నేనే వాడయితాను. ఇదే మోక్షము. ఇదే జీవబ్రహ్మ ఐక్యసంధానము".

ఓ జీవుడా నీవు నన్నుమాత్రము నమ్ముకొని సర్వవేళ సర్వావస్థలయందు నా నిరాకార స్వరూపమునే తలంచుచుండుము. అనగా యోగములో సక్రమముగా ఉండుము. కొంత కాలముకు నీవు నామాదిరే మారిపోగలవు. నీవు నేనైన తర్వాత ప్రకృతికే నిర్ముక్తధాతనయిన నన్ను ప్రకృతి ఏమిచేయదు. అపుడు నీవు నాయందు ఐక్యమై ఉన్నావు కాబట్టి ప్రకృతి నిన్ను ఏమిచేయలేదు అని భగవంతుడు తెలుపుచున్నాడు. కావున

సర్వజనులు ప్రకృతిలో చిక్కుకొని బాధపడకుండా తప్పించుకొనుటకు నేటినుండి జ్ఞానమను అగ్నిని సంపాదించుటకు ప్రయత్నము చేయండి.

యమలోకము – స్వర్గలోకము

జీవులు భూమిమీద పుట్టి నిత్యము కర్మముల చేయుచునే ఉన్నారు. జీవితములో పుట్టినది మొదలు చచ్చు వరకు కష్ట సుఖముల అనుభవించుచునే ఉన్నారు. జీవితకాలము స్వార్థముకోసము చేయదగినవి చేయరానివి చేసి పుణ్యము పాపము సంపాదించుకొనుచున్నారు. చేయు పనులయందు కంటికి కనపరాక వచ్చు పాపపుణ్యభీతి ఏమాత్రములేక ఉన్నారు. చేయు పనులయందు పాపము వచ్చునని తెలిసినను యమలోకమునకు పోయిన రోజుకదా నరకము అనుభవించునది, ఏనాడో వచ్చు నరకమునకు భయపడి ఈరోజు మనకు అనుకూలమయిన పనులు ఎందుకు మానుకోవలయును? అని నరకము వచ్చినరోజు చూస్తాములే అని అనుకుంటున్నారు. పాప పుణ్యములు ఉన్నాయి అని తెలుసు. దానిని తప్పక అనుభవించవలయునను నది తెలుసు. కాని ఏమాత్రము భయములేక చేయుచున్నామంటే దాని నిజస్థితి తెలుసుకోలేదని అర్థమవుచున్నది.

కర్మ కారణముచేత జీవుడు భూమిమీద పుట్టుచున్నాడు. కర్మ అనగా పాపము పుణ్యము. పాపము వలన నరకము పుణ్యమువలన సుఖములు సంభవించుచున్నవి. కొంతమందిని అడుగగా నరకము యమ లోకములో స్వర్గము దేవేంద్రలోకములో ఉన్నదని తెలుపుచున్నారు. మరియు పాపము చేసినవారిని యమలోకములో యముడు, యమకింకరులు అనేక బాధలు పెట్టుచున్నారు. అక్కడ బాధలు అన్నియు అనుభవించిన తర్వాత పుణ్యముయుంటే స్వర్గలోకమునకు పోయి సుఖాలు అనుభవించు చున్నారు, అని చెప్పుచున్నారు. గీతయందు సాంఖ్యయోగమున "జీవుడు శరీరమును వదిలిన వెంటనే తనకోసమే తయారైయుంచబడిన వేరొక తల్లి గర్భమున యున్న శరీరములో పోయి దూరుచున్నాడు. ఎట్లనగా పాత వస్త్రమును విడచి కొత్త వస్త్రమును ధరించినట్లు" అని

పరమాత్మ చెప్పియుండగా, మనము అజ్ఞానము వల్ల జీవుడు మరొక చోటయున్న యమలోకానికి పోవును అని అనుకొనుచున్నాము. అట్లు జరగడములేదు అని తెలిసినవారు చెప్పగా కొంతమంది వినక, జీవులు యమలోకానికి పోయి నరకమనుభవించకపోతే యమధర్మరాజు ఎక్కడ పోవును? యమ కింకర్లు ఎక్కడపోవుదురు? యమలోకము ఎందుకు? అని వాదించుచున్నారు. వీరి మార్గమునపోయిన గీతయందుచెప్పిన వాక్యము అబద్ధమగును సరే గీత ప్రకారముపోయిన వీరి వాదన అబద్ధమగును. రెండునూ గట్టి వాదనలేకాని పరమాత్మ యొక్క వాదన ఏనాటికి బద్ధము కాదు. మానవుల వాదన కూడ అబద్ధముకాదు కాని కొంత తెలుసుకోవలసి ఉన్నది.

మానవులు పుట్టినది మొదలు కష్టసుఖములు అనుభవించుచునే ఉన్నారు. కొంతమంది ఎక్కువ సుఖము అనుభవించుచున్నారు. కొంతమంది ఎక్కువ కష్టమనుభవించుచున్నారు. ఒకడు ఏపని చేయక ఊరక యున్న అష్టఐశ్వర్యములు అనుభవించుచున్నాడు. ఒకడు దినమంతయు ఎంతో శ్రమపడుచున్నా వానికి కడుపునిండా అన్నము దొరకడము లేదు, పరమాత్మ అంశ అందరియందు సమానమయిన కొంతమందికి కష్టము ఎందుకు సంభవించుచున్నదని ఎవరు ఆలోచించలేదు. డబ్బుయున్నవాడు సుఖపడుచున్నాడు, లేనివాడు బాధపడుచున్నాడు అని అనుకుంటున్నారు. కాని కష్టసుఖములకు మూలకారణమయిన పాపపుణ్యములను ఏమాత్రం గ్రహించక ఉన్నారు. తానూ కష్టపడుచు ఇతరులును కష్టపడడము చూస్తూయున్న ఇవి ఎక్కడివి అని ఆలోచించడము లేదు. మనము పూర్వజన్మమున సంపాదించుకున్న పాపపుణ్యఫలితము గదా! అని తెలుసుకోలేదు. ఒకవేళ తెలిసినవారు చెప్పినను నమ్మలేక ఉన్నాడు. నమ్మిన, నమ్మకపోయిన, పోయిన జన్మలో చేసిన పాప పుణ్యమే ఈజన్మయందు తనకు తెలియకనే మానవుడు అనుభవించుచున్నాడు. అది ఎట్లనగ ఒక ఉద్యోగి ఒక నెల అంతయు పనిచేసిన దానిఫలితముగా నెల ఆఖరున జీతము వచ్చును. ఆ జీతము అనగా ముందునెలచేసిన పని ఫలితము రెండవ నెలంతయు నిత్యావసర వస్తువులకై వినియోగించుచు అనుభవించును. అట్లే ఒక కూలివాడు దినమంతయు పొలములో పనిచేయగా దాని ఫలితము రెండవ దినమున అనుభవించుచున్నాడు. మరియు రైతు ఒక సంవత్సరము కష్టపడి సేద్యముచేసి పంట

పండించగా ఆ పంటను రెండవ సంవత్సరము అనుభవించుచున్నాడు. ఈ విధముగానే మానవుడు ఒక జన్మలో సంపాదించుకొన్న పాపము పుణ్యముయొక్క ఫలితము రెండవ జన్మయందు కష్టసుఖరూపములో అనుభవించుచున్నాడు. రెండవ జన్మలో సంపాదించుకున్న పాపపుణ్యములను మూడవ జన్మయందు అనుభవించుచున్నాడు. కావున కృష్ణ పరమాత్మ చెప్పినట్లు జీవుడు శరీరమును విడిచిన వెంటనే వేరే శరీరము ధరించుచున్నాడు. కాని యమలోకమునకు పోలేదు. అందువలననే జీవుడు ముందుజన్మలో చేసుకున్న పాపపుణ్యము ప్రకారము భూమిమీద కష్టసుఖములను అనుభవించుచున్నాడు. ఒక జీవి అన్నియు చెడ్డపనులు చేయడములేదు. అట్లే అన్ని మంచి పనులు చేయడము లేదు. మంచి పనులయందు పుణ్యము చెడ్డపనులయందు పాపము సంభవించుచున్నది. అందువలన ఏజీవి అయినా పాప పుణ్య మిశ్రయుతుడై ఉండును. జీవుడు తన జీవితకాలమున ఎక్కువ మంచికార్యములనే చేసి యుంటే పుణ్యము ఎక్కువ లభించియుండును. అట్లుకాక జీవితకాలమున ఎక్కువ చెడ్డపనులు చేసియుంటే పాపము ఎక్కువ సంభవించి ఉండును. కావుననే ఒక జీవి ఎక్కువ సుఖము అనుభవించడము ఒక జీవి ఎక్కువ కష్టము అనుభవించడము భూమిమీద జరుగుచున్నది.

యమధర్మరాజు ఎక్కడ? యమకింకర్లు ఎక్కడ? యమలోకము ఎక్కడ? అనుప్రశ్నలకు సమాధానము ఏమనగా! గీతాశాస్త్రమున "దండనాధికారులలో యముడు నేను" అని పరమాత్మ అన్నాడు. కావున యమధర్మరాజు అన్ని శరీరములందు నివసించు ఆత్మ అనియు, యమకింకర్లు ఆత్మవలన ప్రేరేపితమయి ఒక జీవుని బాధించు అన్ని రూపములు అనియు తెలియుచున్నది. అందువలన పెద్దలు "నానారూపేణ కాలకింకరః" అని అన్నారు. ఇక యమలోకమనిన జీవుడు కష్టపడు స్థలమేనన్న మాట. కావున భూలోకమే యమలోకమని తెలియుచున్నది. పాపకారణమయిన కష్టములను యమధర్మరాజా, లేక యమకింకరులా, భాదించుచున్నది అను అనుమానము కొందరికి రావచ్చును. దానికి సమాధానము, తన శరీరముతో వచ్చు బాధలన్నియు యమధర్మరాజు విధించునవియే. అట్లుకాక తనకంటే ఇతర రూపములగుండా వచ్చు ప్రతి బాధ యమకింకర్లు విధించునవి. మన శరీరమునందు యెల్లవేళల ఆత్మ యున్నదికదా! ఆత్మకు తెలియక ఏమియు

చేయజాలము కనుక సర్వ పనులకు ఆత్మ సాక్షిగా యుంటూ "చిత్రగుప్తుడు" అని పేరుగాంచినది, శరీరమునందున్న ఆత్మయే పాపపుణ్యములను గ్రహించి మరుజన్మమున అనుభవించునట్లు చేయుచున్నది.

మనము పాప పుణ్యములను అనుభవించుచూయున్నా వాటిని మాయచేత గ్రహించుకోలేక ఉన్నాము. మాయయే పాపపుణ్యముల యొక్క నిజస్థితిని తెలియకుండ చేయుచున్నది. గుడ్డివాడు ఏనుగుకాలు పట్టుకొని స్తంభమనుకొని ఏనుగును గుర్తించలేకపోయినట్లు, మాయ అను గుడ్డితనముచేత కనులు కనపడనివారు పాపపుణ్యములను అనుభవించుచూయున్నా, వాటిని తెలుసుకోలేక వేరొక విధముగా భ్రమించుచున్నారు. ఎట్లు భ్రమించుచున్నారనగా!

మన మూటను మనమే మోయుచున్నామనుకొనుము. ఎవ్వరు మోయించలేదుకదా! నామూటను నేనే మోయుచున్నాను కదా! అని అనుకోవడమే మాయ. మన మూటను మనము మోయుచున్న, మోయించు వాడు వేరొకడు ఉన్నాడు. వాడే ఆత్మ. మనయందు ఆత్మ ప్రేరేపణవలన మూటను వేరొక చోటికి తీసుకపోవలయునను సంకల్పము కలిగియున్న కదా మనము మోయుచున్నది. ప్రేరేపణకు కారణము ఆత్మ, కావున ఆపనికి మూలము ఆత్మ, చేయుచున్న పని మనదికాని, లేక ఇంకెవరిదైన కాని, బరువు మోయడమేకదా! మూట భారముయొక్క బాధ అనుభవించు చున్నది జీవుడే కదా! కావున బాధను [శిక్షను] అనుభవించువాడు జీవుడు. శిక్షను విధించువాడు కాలుడు [ఆత్మ]. అట్లే ఆత్మ ప్రేరేపణ వలన ఎన్నియో పనులు చేయుచు, అందు సంభవించు బాధలను అనుభవించు చునే ఉన్నాము. ఒక మానవుడు గుండు ఎత్తుకొని నా అవసరము కొఱకు నేను ఎత్తుకొని పోవుచున్నాను అని అనుకొనుచున్నాడు. అట్లు అనుకొను స్థితియంతయు మాయ. నిజముగా జరుగుచున్నది పాపము అనుభవించించడము అని తెలుసుకోలేక పోయినాడు. చనిపోయిన కుక్క శవమును లాగుచు పోవుచున్నవాడు, నాకు ఈ సమయములో యముడు కుక్క శవమును లాగు శిక్షను విధించినాడు కదా! అని తెలుసుకోలేక పోవుచున్నాడు. వంకాయల గంపను ఎత్తుకొని వ్యాపారము చేయుచున్నవాడు, నాకు ఈ సమయములో యముడు వంకాయల గంపను

తలపైకి ఎత్తి దానిని మోయుచు ఊరంతయు తిరుగునటుల చేయుచున్నాడుకదా! అని తెలుసుకోలేక పోవుచున్నాడు. జలుబు[పడిశము] పట్టిన ఒక రోగి వేరే బావినీరు త్రాగినందుకు జలుబు చేసినదని మాయచేత భ్రమించుచున్నాడు. జలుబుకు కారణము పాపము, ఆ పాపమును ఇపుడు అనుభవించు సమయము వచ్చినది, కావున యముడు ఆ పాప ఫలితముగా నాకు జలుబు చేసి నా తలను నొప్పించుచున్నాడు అని తెలుసుకోలేకపోవుచున్నాడు. కడుపునొప్పి యున్నవాడు తనకు నొప్పి ఎందుకు వచ్చినది? లోపల బాధను ఎవరు విధించుచున్నారు? అని తెలుసుకోలేక పోవుచున్నాడు. కాని జ్ఞాని అయినవాడు తప్పులేనిదే శిక్షయుండదు, కావున ప్రతిబాధను యముడు న్యాయముగా ఎంత విధించవలయునో అంతే విధించును, అని తలంచుచుండును. యముడు మనయందే నివాస ముండి మనలను ప్రేరేపించి బాధలను అనుభవింపజేయుచున్నాడు. ఒకనిని రైలుక్రిందపడునట్లు ప్రేరేపించి, వానిని రైలుక్రిందపడునట్లు చేసి వానికి ఎంత బాధ కలుగవలయునో అంతే బాధ పడునట్లు, ఎంతదెబ్బ తగులవలయునో అంతే తగులునట్లు చేయుచున్నాడు. ఈ విధముగా ఎన్నో కర్మములను మనము నిత్యము అనుభవించుచూయున్నను, మాయ చేత ఏమాత్రము తెలుసుకోలేక యముడు ఎక్కడో ఉన్నాడు, యమలోకము ఎక్కడో ఉన్నదని అనుకొనుచున్నాము. పామును చీమలు హింసించుచున్నవి, కాని పాము పాలిటికి ఆ సమయములో చీమలు యమకింకర్లు అని తెలుసుకోలేకపోవుచున్నాము. చీమలను తొండలు తింటున్నవి, కాని ఆ సమయములో చీమలకు తొండ యమకింకరుడని గ్రహించలేక పోవుచున్నాము. గొర్రెను మనుష్యులు చీల్చి వేయుచున్నారు. గొర్రెకు ఆ సమయములో యమకింకర్లు మనుష్యరూపముగా యున్నారని తెలుసుకోలేకపోవుచున్నాము. అడవిలో ఒక జంతువును పులి చీల్చి వేయుచున్నదనుకొనుము, ఆ సమయములో ఆ జంతువుకు పులి యమకింకరుడు అని తెలుసుకోలేకపోవుచున్నాము. రిక్షాలో ఒకడు కూర్చొని ఉన్నాడు, ఒకడు రిక్షాను కష్టపడి లాగుచున్నాడు. అక్కడ కూర్చున్న వాడు సుఖము, బండిని లాగువాడు కష్టము అనుభవించుచున్నారు. దానిని చూచిన మనము కూర్చున్నవాడు వాని పుణ్యమును అనుభవించుచున్నాడు, రిక్షాను లాగువాడు వానియొక్క పాపమును అనుభవించుచున్నాడు అని ఏమాత్రము మనము తెలుసుకోలేకపోవుచున్నాము. ఇట్లు ప్రపంచములో నిజముగా

ఏమి జరుచున్నదని మాయచేత తెలుసుకోలేకపోవుచున్నాము. నిజముగా జరుగుచున్నది ఒకటయితే మనము అనుకొనునది వేరొకటి ఉండును. మాయను విడచి నిజముగా జరుగుచున్నది ఏమిటి? చేయుచున్నవారు ఎవరు? అని తెలుసుకొనిన యమలోకము ఎక్కడ ఉన్నది, యమకింకర్లు ఎవరయినది, యముడు ఎవరయినది నిజముగా తెలియును.

కొంతమంది మంచివారు మేము చెడ్డపనులను చేయలేదుకదా! భగవంతుడు మమ్ములనే ఎక్కువ కష్టపెట్టుచున్నాడే, దుర్మార్గులు చెడ్డ కార్యములను చేయుచున్నా వారిని సుఖపెట్టుచున్నాడు. దేవుని దగ్గర న్యాయమున్నదా అని అనుచున్నారు. కొంతమంది మూర్ఖులు దైవభక్తులను చూచి భక్తులకుకూడ కష్టాలుంటాయా! దేవుడు మిమ్ములను కష్టపెట్టడు కావలయునే అని హేళన చేయుచున్నారు. దీనికి సమాధానము, ఎవని పాపమునయినా ఎవని పుణ్యమునయినా ఆత్మ తొలగించదు అని గీతయందు పరమాత్మ పలికినాడు. మరియు నాకు ఎవరి పాప పుణ్య సంబంధములేదు అనికూడ చెప్పినాడు. కావున ఈ జన్మలో మంచివారైనా ముందు జన్మ పాప ఫలితమువలన కష్టములు వచ్చుచుండును. అంత మాత్రమున దేవునిదగ్గర న్యాయమున్నదా అని మంచివారు అనకూడదు. దుర్మార్గులు ముందుజన్మలో చేసిన పుణ్య ఫలితమువల్ల సుఖములు ఈజన్మలో అనుభవించుచుందురు. ఈజన్మలో చేసిన దుర్మార్గ ఫలితము మరలవచ్చు జన్మయందు తప్పక అనుభవించుదురు. అట్లే ఈజన్మయందు మంచివారు చేసిన మంచి ఫలితము మరల వచ్చు జన్మయందు తప్పక అనుభవింతురు.

భక్తులుకూడ కష్టమనుభవించుటకు కారణము పోయిన జన్మలో చేసుకున్న పాపమే. పాపముచేసిన దాని ఫలితము అనుభవింపవలసినదేనా? లేక తప్పించుకోనుటకు వేరే మార్గము ఉన్నదా? అని కొందరికి అనుమానము రావచ్చును. దానికి సమాధానము తప్పనిసరిగ వేరే మార్గము ఉన్నది. దానినే గీతాశాస్త్రమున జ్ఞాన యోగములో "అఖిల పాపాత్ములందు నీవెంత అధమ పాపయుతుడవైనను కలుషజలధి ఓడచే దాటినట్లు జ్ఞానమను ఓడచే పాపమును దాటగలవు" అని పరమాత్మ అన్నాడు. కావున యెంతటి పాపాత్ముడయిన జ్ఞానముచే తప్పించుకొనవచ్చును. అగ్గికి కట్టెలనుకాల్చు గుణమున్నట్లు

జ్ఞానమునకు పాపమును నశింపజేయు గుణము ఉన్నది. కావున ఎవడయితే జ్ఞానమును ఆర్జించుకొనునో వాని పాపము జ్ఞానాగ్ని వలన దహింపబడి, అనుభవింపవలసిన దానినుండి తప్పించుకొనుటకు వీలగుచున్నది. జ్ఞానము కావలయునన్న పరమాత్మను ఆశ్రయించవలసినదే. కొంతమంది భక్తులు జ్ఞానమార్గమును అనుసరించి ప్రపంచములో వచ్చు కష్టములకు ఓర్చుకొనలేక మేము పరమాత్మ భక్తులముకదా, జ్ఞానమున్న వారముకదా, మాకే కష్టములు వచ్చుచున్నవే అని జ్ఞానమార్గమునే వదలివేయుచున్నారు. దీనితో దేవుని మాటనే అబద్ధమనునట్లు చేయుచున్నారు. పరమాత్ముడు పలికినమాట ఎప్పటికి అసత్యము కాదని తెలుసుకోలేకపోయినారు. అగ్నియందు ఎన్ని కట్టెలయిన కాలి పోవు విధమున జ్ఞానాగ్నియందు సర్వకర్మచయము భస్మమొనరింపబడును, పాప పుణ్యములు రెండును లేకుండ సమసిపోవుటకు ప్రారంభించి కొంత కాలమునకు రెండును లేకపోవుటచే జీవుడు ఆత్మయందు ఐక్యత చెందుచున్నాడు. పరమాత్మను కొంతకాలము నమ్మినంతమాత్రముననే కర్మ అంతయు పోవలయునంటే ఎట్లగును? ఒకమోపు కట్టెలను కాల్చుటకు గంట కాలము పట్టును. బండి కట్టెలను కాల్చుటకు ఒక దినముపట్టును. అట్లే నూరు బండ్ల కట్టెలను కాల్చుటకు కొన్నినెలలు పట్టును. కట్టెలు ఎక్కువయున్నకొద్ది కాల్చుకాలము ఎక్కువగును. అట్లే కర్మఅను కట్టెలు జ్ఞానాగ్ని చేత కాల్చబడుచునే ఉండును. కర్మ పూర్తి దహింపబడువరకు జీవుడు కర్మను అనుభవింపవలసి ఉండును. భక్తులు కర్మను ఒకప్రక్క అనుభవించుచూ వేరొకప్రక్క జ్ఞానాగ్నిచేత కాల్చుచుందురు అని తెలియుచున్నది.

యమధర్మరాజు, యమకింకర్లు, యమలోకము అంత ఇక్కడే ఉన్నారు. మనము అనుభవించు కష్టములే నరకములు అనియు, దేవతలు, దేవేంద్రుడు, దేవలోకము అంత ఇక్కడేయున్నదనియు; మనము అనుభవించు సుఖములే స్వర్గము సుఖములనియు, తెలియుచున్నది. కావున వాస్తవము తెలుసుకొని యమలోక, స్వర్గలోకములకు అందకయున్న పరమాత్మను అందుకోవలయునని కోరుచున్నాము.

మూడు శరీరములు – మూడవస్థలు

జీవుడు జన్మించుటకు కారణము కర్మ. కర్మ అనుభవించుటకు జీవుడు దేహమును ధరించుచున్నాడు. దేహము ప్రకృతి వలన తయారయినది. ప్రకృతి దేహములో 25 భాగములుగా ఉన్నది. ఇరువది ఐదు భాగములతో తయారైన దేహమును రెండుభాగములుగా విభజింపవచ్చును. అవి [1] స్థూల శరీరము [2] సూక్ష్మ శరీరము స్థూల సూక్ష్మములతోయుండిన దేహమునందే మనము ఉన్నాము. స్థూల సూక్ష్మములు ఎట్లున్నవనగా!

[1] స్థూల శరీరము:– ఇది ప్రకృతి వలన తయారయిన 25 భాగములలో పది భాగములుగా మాత్రము ఉన్నది. స్థూలశరీరము 5 జ్ఞానేంద్రియములు 5 కర్మేంద్రియములతో మాత్రము ఉన్నది. జ్ఞానేంద్రియములు [1] కన్ను [2] ముక్కు [3] చెవులు [4] నాలుక [5] చర్మము. కర్మేంద్రియములు [1] కాళ్లు [2] చేతులు [3] నోరు [4] లింగము [5] గుదము. ఇవి పది యున్న దానివలన స్థూలశరీరముకు ఒక ఆకారము ఏర్పడినది. జీవుడు చనిపోయిన తర్వాత మిగులునది స్థూల దేహము. జీవుడు బ్రతికియున్నపుడు ఈ శరీరము పాప పుణ్యములు అనుభవించుటకు సంపాదించుటకు పనికివచ్చును. ఇది ఆయుధములచే ఛేదింపబడును.

[2] సూక్ష్మ శరీరము:– ఇది ప్రకృతి వలన తయారయిన 25 భాగములలో 15 భాగములుగా మాత్రము ఉన్నది. అవి [1] ప్రాణము [2] మనస్సు [3] బుద్ధి [4] చిత్తము [5] అహంకారము [6] వ్యాన వాయువు [7] సమాన వాయువు [8] ఉదాన వాయువు [9] ప్రాణ వాయువు [10] అపాన వాయువు [11] శబ్దము [12] రూపము [13] రసము [14] వాసన [15] స్పర్శ. ఈ 15తో ఏర్పడిన దానివలన దీనికి ఒక రూపు ఏర్పడినది, కాని అది కంటికి కనుపించదు. జీవుడు మరణించిన తర్వాత సూక్ష్మదేహములో నివాసముచేయుట కొంతమందికి సంభవించును. కావున పరమాత్మ స్థూల సూక్ష్మదేహములను ప్రత్యేకముగా యుండునట్లు చేసినాడు. ఈ సూక్ష్మశరీరమును గురించి తెలుసుకొన్న అపారమైన జ్ఞానము లభించును. జీవునియొక్క జీవశరీరము

ప్రకృతియొక్క 25 భాగములతో తయారయినది అని తెలుసుకొన్నాముకదా! మరియు దానిలో 10 భాగములు స్థూలమని 15 భాగములు సూక్ష్మమనికూడ తెలుసుకున్నాము. కాని కొంతమంది సూక్ష్మశరీరము 17 తత్వములతో తయారయినది అని అంటున్నారు. ఇది చాలా పొరపాటు ఎట్లని విశదీకరించిన సమాధానము ఏమాత్రము లభించటము లేదు. సక్రమమయిన మార్గములో సూక్ష్మ శరీరము 15 తత్వములతో తయారయినదని తెలియుచున్నది.

స్థూల, సూక్ష్మ దేహములు రెండు కలసి ఒక జీవదేహము తయారగుచున్నది. అట్లుకాక స్థూలశరీరముఉండి, సూక్ష్మశరీరము లేకున్న అది మృతదేహము [పీనుగ] అని అనిపించుకొనును. [2] స్థూలశరీరము లేక సూక్ష్మశరీరముయున్న అది దయ్యము అని అనిపించుకొనును. [3] స్థూలదేహము సూక్ష్మదేహము రెండుయున్న అది జీవశరీరము అని అనిపించుకొనును. ఇపుడు మన మందరము జీవశరీరములోనే ఉన్నాము.

కొంతమంది స్థూల సూక్ష్మములనేకాక కారణశరీరముకూడయున్నదని అనుచున్నారు. దాని విషయమేమనగా! కారణశరీరమునకు ఆకారము లేదు. నిజముగా చెప్పవలయునంటే ఇది స్థూల సూక్ష్మముల మాదిరి శరీరమేకాదు. కాని ఫలానా ఒకటియున్నది అను నిమిత్తమై పెద్దలు ఒక పేరుయుంచినారు. కారణశరీరము అనునది ఏది అనిన? పాపము పుణ్యముయొక్క కూడలి అని తెలియుచున్నది. ఇది ఏతత్వములతో కూడుకొనిలేదు. పాప పుణ్యములే జీవునికి జన్మవచ్చుటకు కారణము కాబట్టి జీవుని పాప పుణ్యకూడలికి కారణ శరీరము అనిపేరు ఉంచబడినది. జీవుడు మరణించిన తర్వాత స్థూల సూక్షముల దేహములను కోల్పోవును. అపుడు జన్మకు కారణమయిన పాప పుణ్యములలో జీవుడు బంధింపబడి మరియొక శరీరము ధరించి జన్మ ఎత్తుచున్నాడు. స్థూల సూక్ష్మ శరీరముల యందు జీవుడు కొంతకాలము బంధింపబడి యుండి, మరణానంతరము కర్మ యందు బంధింపబడి తనకోసమే తయారయిన వేరే శరీరమువరకు పోవు చున్నాడు. కావున కర్మ అయిన పాపపుణ్యములను కారణ శరీరమనుటకు కొంత ఆస్కారము ఉన్నది. ఈ కారణ

శరీరము నుండి జీవుడు బయటపడిన తర్వాత జన్మ ఉండదు. జీవుడు దేవునియందు లయమగును.

జీవుడు స్థూల, సూక్ష్మములతో కూడుకొన్న జీవశరీరమునందు నివసించుచు మూడు అవస్థలందు తన జీవితకాలము గడుపుచున్నాడు. మూడవస్థలు ఏవనగా 1) జాగ్రత్త 2) నిద్ర 3) స్వప్నము. ఈ మూడవస్థల యందు జాగ్రత్త మరియు స్వప్నము జీవుడు పాపపుణ్యములు సంపాదించుటకును, అనుభవించుటకును ఉపయోగపడుచున్నవి. నిద్ర పాపపుణ్యములు సంపాదించుటకు అనుభవించుటకు పనికి రాక జీవుని ఏమి తెలియని స్థితిలో యుంచుచున్నది. ఈ మూడవస్థలు జీవుని అధీనముయందు ఏమాత్రము ఉండవు. నిద్ర, మెలుకువ, స్వప్నములు ఎవరికీ అధీనమగునో వారిని యోగులు అని అందురు. ఈ మూడవస్థలు మానవునియందు ఇష్టానుసారముగా వచ్చిపోవుచుండును. కావుననే ఎంతటి తెలివియున్న వాడయినను తను ఎపుడు నిద్రపోవుచున్నాడో చెప్పలేక ఉన్నాడు. ఈ విధముగా మనకు తెలియకనే వచ్చిపోవు ఈ అవస్థలనుగురించి ముఖ్యముగా తెలుసుకోవలసినదే.

[1] జాగ్రత్త :– ఇది సర్వ జీవరాసులు ఉంటున్న ఒక స్థితి. ఈ స్థితి యందు జీవుడు దాదాపు సగము జీవితకాలము గడుపుచున్నాడు. ఈ స్థితిలో స్థూల సూక్ష్మముల కలయిక అయిన జీవ శరీరము ద్వారా జీవుడు పాప పుణ్యములు అనుభవించును. మరియు సంపాదించును. ఈ జాగ్రత్తయందే అసలయిన పరమాత్మను తెలుసుకొనుటకు ఎంతో అవకాశము ఉన్నది. కాని కంటికి కనపడు ప్రకృతినే ఈ స్థితియందు నిజమని నమ్మి జీవుడు మోసపోవుచున్నాడు.

[2] నిద్ర:– ఈ స్థితి జీవుని పాప పుణ్యములకు సంబంధములేక ఉన్నది. అనగా కర్మ అనుభవించుటకుగాని, సంపాదించుటకుగాని, సంబంధములేక ఉన్నది. నిద్రయందు సర్వ అవయవములు తమ సామర్థ్యమును కోల్పోవుచున్నవి. యీ స్థితిలో మనస్సు సూర్యచంద్రుల నాడులు మీద ఏమాత్రము చలించక బ్రహ్మనాడియందు లీనమవుచున్నది. మనస్సు బ్రహ్మనాడిని చేరడమును యోగము అనికూడ అందురు. దీనిని బట్టి నిద్రలో మనస్సు బ్రహ్మనాడి చేరుచున్నది కదా! అపుడు యోగము చెందినట్లవునాయని కొందరికి సందేహము

రావచ్చును. యోగమునకు నిద్రకు ఎంతో భేదము ఉన్నది. యోగము అనగా జీవుడు ఎఱుకలోయుండి మనస్సును ప్రయత్నపూర్వకముగా బ్రహ్మనాడియందు ఐక్యము చేయడము. నిద్ర అనగా జీవుడు ఎఱుకలోలేక మనస్సును బ్రహ్మనాడియందు చేర్చవలయును అని అనుకోకనే అనగా జీవునికి తెలియకనే మనస్సు బ్రహ్మనాడినిచేరడము. నిద్రలో మనస్సు తనకు తెలియకనే బ్రహ్మనాడిని చేరుచున్నది. కనుక ఆ స్థితి ఎట్లుండునో జీవునికి ఏమాత్రము తెలియదు. కనుక యీ స్థితిలో స్థూల సూక్ష్మములు రెండును తమ సామర్థ్యములు కోల్పోయిఉండును. శరీరముమీద పాము ప్రాకిన తెలియక ఉండును.

[3] స్వప్నము :– ఇది జాగ్రత్త నిద్ర తర్వాత పొందుస్థితి. యీ స్థితిలో స్థూలశరీరము స్థంభించి ఉండును. సూక్ష్మ శరీరము మాత్రము పనిచేయుచుండును. అందువలననే స్వప్నావస్థయందు స్థూలశరీరము పరుండినచోటునే ఉండినా, సూక్ష్మశరీరము అనేక ప్రదేశములు తిరుగుచున్నది. అనేకమందితో మాట్లాడుచున్నది. మరియు ఇతరులతో వాదించుచున్నది. అనేకమయిన మంచి చెడ్డపనులు చేయుచున్నది. ఇదియంతయు మన స్వప్నములయందు జరుగుచునే ఉన్నది. సూక్ష్మ శరీరమునకు మనస్సు యున్నది కనుక స్వప్నములో జరిగినది తిరిగి జ్ఞప్తికి వచ్చునట్లు చేయుచున్నది. ఈ అవస్థయందు కూడ జీవుడు పాప పుణ్యములు అనుభవించును మరియు ఆర్జించును. యీ స్థితిలో జాగ్రత్తలో కనుపించునట్లే చరాచర ప్రకృతియంతయు కనిపించును. కాని యీ స్థితికి జాగ్రత్తకు చాలా బేధము ఉన్నది. జాగ్రత్తయందు వేరే వానితో మాట్లాడినవాడు తనతో మాట్లాడినట్లు ఒప్పుకొనును. కాని స్వప్నములో వేరే వానితో మాట్లాడి ఉండిన తిరిగి మెలుకువ వచ్చిన తర్వాత వానిని విచారించిన తనతో మాట్లాడలేదనును. అట్లే జాగ్రత్తయందు ఒక వ్యక్తిని కొట్టినవాడు పగ పూనియుండి ఏదో ఒకనాడు తిరిగి కొట్టును. స్వప్నములో ఒకనికొట్టిన మెలకువలో వాడు ఏమి అనుకోక ఉండును. జాగ్రత్తలో ఒకనితో బాకీ చేసినవాడు తిరిగి అడిగి ఇప్పించుకొనును. స్వప్నములో బాకిచేసియుండిన మెలుకవలో అడగరు. ఇట్లు స్వప్నములో చూచిన విషయములు నిజమా! అబద్ధమా! అనుటకు దిక్కుతోచకఉండును. నిజమందుమా స్వప్నములో మూటకట్టుకున్న డబ్బు మెలకువ వచ్చిన తర్వాత ఉండదు. దీనిద్వారా అబద్ధమందుమా స్వప్నములో ఒక స్త్రీతో రమించినట్లయిన తిరిగి మెలుకువ వచ్చిన తర్వాత

వీర్యము కూడ బయటికి వచ్చియున్నట్లు తెలియుచున్నది[కనపడుచున్నది]. అట్లే స్వప్నములో భయపడినపుడు వెంటనే మెలకువ వచ్చిన నిజముగా భయపడినట్లే గుండె వేగముగా కొట్టుచుండును, మరియు మనస్సు భయముతో ఉండును. ఇట్లు స్వప్నములో జరుగునది నిజమా అబద్ధమా అను అనుమానము ఎదురవుచున్నది.

మనస్సు జాగ్రత్తలో సూర్య చంద్రనాడులయందు ఉండును. నిద్రలో సుషుమ్నా (బ్రహ్మ) నాడియందు ఉండును. ఇక స్వప్నము అనిన నిద్రావస్థలోనే కదా స్వప్నము వచ్చుచున్నది. స్వప్నములో మనస్సు బ్రహ్మనాడియందే ఉండును. బ్రహ్మనాడియందే పరమాత్మ ఉన్నాడు. కనుక స్వప్నములో కనుపించు దృశ్యములు అన్నియు పరమాత్మయే. స్వప్నములో డబ్బు మూట కట్టుకున్నట్లయిన ఆ డబ్బును ఆ గుడ్డయును మొత్తము అన్ని దృశ్యములు పరమాత్మయే. స్వప్నములో వేరేవానితో మాట్లాడిన ఆ కనిపించినవాడు పరమాత్మయే కాని నిజముగా మనకు పరిచయమున్న వాడు కాదు. కావున ఉదయము లేచి వానిని అడిగిన నీవు నాతో మాట్లాడలేదు అనును. నిజముగా స్వప్నములో వానితోనే మాట్లాడినట్లు మనకు ఉండును, కాని వాడు ఒప్పుకోడు. ఇది జాగ్రత్తలో అబద్ధమనిపించిన స్వప్నములో మాత్రము నిజముగా జరిగి ఉండును. స్వప్నములో జరిగిన దంతయు పరమాత్మరూపములే. పరమాత్మయే ఆవిధముగా కనపడుచు జీవునికి రావలసిన కష్ట సుఖములను విధించుచున్నాడు. స్వప్నావస్థలో మనస్సు, బుద్ధి ఉన్నది. కావున జీవుడు ఒక విషయమును ఆలోచించుచున్నాడు మరియు చేయుదునా వద్దా అని అనుకొనుచున్నాడు. ఏదో ఒకటి చేయుచున్నాడు. కావున స్వప్నావస్థలో కూడ మంచిపనులు చెడ్డపనులు వున్నవి. ఆ పనుల వలన పాపము పుణ్యము లభించుచున్నది. మానవుడు కోరుకున్న కోర్కెలను పరమాత్మ ఈ స్వప్నావస్థ యందే అనుభవించునట్లు చేయుచున్నాడు. ఈ స్వప్నావస్థ జీవుడు ఎంతో బాగుపడుటకు వుపకరించుచున్నది. ఎందుకనగా స్వప్నావస్థ యందు జరిగిన విషయములు తిరిగి జాగ్రత్తయందు జ్ఞప్తికి వచ్చునట్లు పరమాత్మ చేయుచున్నాడు. జ్ఞప్తికి వచ్చిన దానిని గురించి ఆలోచించిన దానిలోయున్న తప్పును తెలుసుకొనుటకు వీలగుచున్నది. తెలివియున్నవారు తప్పులు సరిచేసుకోగలరు. అందుకు దృష్టాంతముగా కొన్ని స్వప్నములు వివరించెదను.

ప్రపంచములో సర్వ విషయములు తెలుసుకొని జ్ఞానిగామారి ఆత్మ చింతయందే కాలము గడుపుచున్న ఒకనికి ఒకనాడు స్వప్నము వచ్చెను. దానియందు ఆయన ఒక దారినపోవుచుండెను. తను చేరవలసిన గ్రామము కనుచూపుమేరలో ఉండెను. అంతలో ఆకాశమున మేఘములు భయంకరముగా నిండుతూ వచ్చెను. మేఘములను గమనించిన అతను తొందరగా ఊరు చేరవలయునను వుద్దేశ్యముతో వేగముగా నడువను ప్రారంభించెను. అంతలో ఉరుముల మెఋపులతో చినుకులు చిన్నగా రాలను మొదలు పెట్టెను. దానిని చూచి పరుగిడను మొదలుపెట్టెను. అంతలోనే మెలకువ వచ్చెను. కలలో జరిగినది అంతయు జ్ఞప్తికి యున్న ఆ జ్ఞాని ఇట్లు యోచించుచున్నాడు. "స్వప్నములో కనపడిన దృశ్యము లన్నియు పరమాత్మయే కదా! నేను శరీరమును రక్షించుకొనుటకు పరుగెత్తినానుకదా! దీనివలన నాకు ఇంకను శరీరము మీద కాంక్ష వున్నది అని తెలియుచున్నది. నాకు ఇది పరమాత్ముడు పెట్టిన పరీక్ష. యీ పరీక్ష యందు నేను ఏమాత్రము నెగ్గక సామాన్య మానవునివలె ప్రవర్తించినాను. ఇందువలన ఇంకనూ నాలో అజ్ఞానము వున్నది అని తెలియుచున్నది. నాలోన అణగియున్న శరీరకాంక్షను దేవుడు బయటికి లాగి నాకే చూపించినాడు. కావున నేటినుంచి నాలో యున్న ఈ కాంక్షను విడిచిపెట్టుదును" అని అనెను. యీ విధముగా తన తప్పును తెలుసుకున్న ఆ జ్ఞాని ఆనాటినుంచి తన తప్పును వదలివేసెను. అట్లే మరియొక స్వప్నమును దృష్టాంతముగా తీసుకొందుము.

ఒకడు జీవునికి శత్రువులయిన అరుగుణములు వదలివేసి వాటిని పూర్తిగా జయించినాను అని అనుకొని ఉండెను. ఆయనకు ఒకనాడు స్వప్నముయందు ఇట్లు జరిగెను. అతను ఒక అరణ్యమార్గమున పోవు చుండెను. అతనికి ముందు ఒక ముసలివాడు పోవుచుండెను. ఆ ముసలివాని భుజమున ఒక మూట ఉండెను. ఆ మూటయందు ధనము బంగారు చాయగా బయటికి కనుపించుచుండెను. అపుడు వెనుక పోవుచున్న యితడు ఆ సొమ్ముకు ఆశపడి ముసలివానిని చంపి ధనము తీసుకపోయెను. తర్వాత మేల్కొంచి ఆయన జరిగినదంతయు తలంచి ఇట్లనుకొనెను. "స్వప్నమునందు ధనముకు ఆశపడి ముసలివానిని చంపితినిగాదా! దీనివలన నాయందు ఇంకనూ చెడ్డగుణములు యున్నవని నాకే

తెలియుచున్నది. కావున ఈనాటి నుంచి నాలో వాటిని ఏమాత్రము లేకుండ చేసుకొందును" అని నాటి నుండి గుణముల యెడల కడు జాగ్రత్తగా మెలగజొచ్చెను, చూచితిరా మనలో లేవనుకున్న వాటిని పరమాత్మ బయటికి లాగి స్వప్నములో ఏవిధముగా చూపించుచున్నాడో! పూర్తిగా లేనివాడు స్వప్నమునందు దేవుడు ఏవిధమైన పరీక్ష పెట్టినా దానియందు కూడ నెగ్గును. కొంచెముయున్నా దానియందు ఓడిపోవును. కావున స్వప్నము ఒక విధమయిన పరీక్షగా కూడ తలంచబడుచూ ఉన్నది.

జీవుడు దేవుని కొన్ని కోరరాని కోర్కెలు కోరును. అటువంటి కోర్కెలు దేవుడు జాగ్రత్త యందు తీర్చక స్వప్నముయందు తీర్చును. వాటిని గూర్చి వివరింతును వినుము; ఒక భక్తుడు వెనుకటి జన్మయందు విష్ణుదేవుని పటము చూచి నేను అట్లు నాల్గు భుజములు కల్గి గద, చక్రము గల్గియుండిన ఎట్లుంయుండునో అని తలంచెను. సర్వాంతర్యామి అయిన దేవుడు వాని ఆశను గ్రహించి వానికి ఈ జన్మయందు స్వప్నావస్థలో వాని కోర్కెను నెరవేర్చెను. విష్ణురూపము ధరించవలయునని కోరుకున్న ఆ భక్తునికి ఒకనాడు(స్వప్నము) వచ్చెను. దానియందు తాను విష్ణువు ఆకారములో ఎంతో ఎత్తుగానున్నట్లు తోచెను. మరియు జనసమూహము తనచుట్టుయున్నట్లు కనుపించెను. తనను పెద్ద రథములమీద పెట్టి ఆ జన మంతయు ఊరేగించినట్లు జరిగెను. ఉదయము మెలకువ వచ్చిన తర్వాత అది అంతయు మతికి వచ్చిన ఆ భక్తునికి ఏమి అర్థముకాక ఏమిటిదోలే అని అనుకొనెను. కాని తను కోరుకున్న కోరిక యుండవచ్చును. దానికి స్వప్నమునందు పరమాత్మ నెరవేర్చెను అని ఏమాత్రము గుర్తించలేక పోయెను. ఈ విధముగానే కొంతమందికి గాలిలో ఎగిరినట్లు, దేవతలతో మాట్లాడినట్లు అనేక రకములుగా స్వప్నములు వచ్చుచుండును. ఇవి అన్నియు కోర్కెల ఫలితములు. దీనిని బట్టి కొన్ని కోర్కెలు స్వప్నములో నెరవేర్చబడుచున్నవి అని తెలియుచున్నది. జ్ఞానదృష్టి లేనివారు ఏ స్వప్నము ఎందుకు వచ్చిఉండును? అని తెలుసుకోలేక వేరే విధముగా భావించుచున్నారు. లేక వాటిని ఆలోచించకయే విడిచిపెట్టుచున్నారు.

ప్రతి స్వప్నమునకు ఒక కారణము యుండి ఉంటుంది. అది మనలోయున్న తప్పును చూపించు నిమిత్తమో! పాప పుణ్యములు అనుభవించు నిమిత్తమో, మరియు మనము కోరుకున్న కొన్ని కోర్కెలు నెరవేర్చు నిమిత్తమో యుంటుంది. కావున స్వప్నావస్థ కొంచెమయినను విశేష అర్థము కలిగిఉన్నది. ఎవడయితే స్వప్నములో జరుగు పనులయందు ఎఱుక గల్గి ఇది స్వప్నావస్థకదా దీనియందు నేను మోసపోను అని చలించక యుండునో వానినే యోగి అందురు. వానికి స్వప్నావస్థ పెట్టవలసినపని పరమాత్మకు ఉండదు. కనుక యో గు ల కు సామాన్యముగా స్వప్నములు రావు. మరియు స్వప్నము, నిద్ర, మెలుకవ యోగి ఆధీనమందు యుండును అని తెలియుచున్నది.

ఓ జీవులారా! మనయందు వాటి ఇష్టానుసారము వచ్చిపోవు స్వప్నము, నిద్ర, మెలుకువమీద ఒక దృష్టియుంచి ఆలోచించండి. పరమాత్మ మనయందే ఉన్నాడు, కావున మనయందు జరుగు ప్రతిదానిని విశదీకరించి తెలుసుకున్న ఆత్మకూడ అతి సులభముగా తెలియును. అందువలన నేటినుంచి మనలో జరుగు మూడవస్థలగురించి, మనము ధరించియున్న మూడు శరీరములగురించి తెలుసుకొని బ్రహ్మ విద్యయందు ముందడుగు వేయవలయునని కోరుచున్నాను.

మాయ అనెడి అద్దము

ప్రపంచములో సర్వజీవరాసులు జననకాలంబు మొదలుగా మాయలో మునిగి పోతున్నవి. ప్రతి జీవిని బంధనముచేయు మాయను తెలుసుకొనిన దానిని సులభముగా దాటుటకు వీలుకలుగును. కావున మాయను విశదీకరించి తెలుసుకొనిన మాయ అనునదియే భ్రమ. ఎక్కడయితే మనము భ్రమపడుచున్నామో అక్కడ మాయలో అడుగు వేశామన్నమాట. భ్రమ అనగా ఒక విషయముయొక్క నిజస్థితి తెలుసు కోలేక వేరేగా భావించడము. చీకటియందు తాడునుచూచి పామనుకొన్నట్లు. నిజమయినది తాడు,

మనమనుకున్నది పాము, మనము అనుకున్నదియే మాయ. అట్లే నిజమయినది పరమాత్మ అబద్ధమయినది ప్రపంచము. కానీ మనము నిజమయినదియే ప్రపంచము అబద్ధమయినది ఆత్మ అని అనుకొనుచున్నాము. ఇట్లు భ్రమించడమే మాయ. ఈపద్ధతిలోనే మనుష్యులు అందరు కనుపించునదే నిజమయినది, కనుపించనిది ఎట్లు నిజమని వాదించుచున్నారు. కనుపించునది మాయ కనుపించనిది యదార్థము అని వారికి తెలియదు. ఎందుకనగా చీకటిలో తాడు నిజమయిన పాముగానే కనుపించుచున్న తాడని ఎట్లు అందరు. ఆ చీకటిని విచ్ఛిన్నముచేయు దీపము వారిదగ్గరయున్న వారు ఆవిధముగా పాము అని అనుకోక దీపకాంతితో దానినిచూచి తాడు అని అనుకున్నట్లు ఈనాడు అజ్ఞానాంధకారములో ఎదుటనున్నది ఏదయినది నిజము తెలియక తమ కంటికి కనుపించునదియే నిజమని నమ్మువారికి జ్ఞానము అను దీపము ఉండిన ఎదుటనున్న పరిస్థితుల నిజమను జ్ఞాన దీపకాంతిలో తెలుసుకొని మోసపోక ఉందురు. కాబట్టి ప్రతి జీవుడు జ్ఞానదీపమును సంపాదించుకొని దాని సాన్నిధ్యమున ప్రతి దానిని తిలకించుచు వాస్తవము యెరింగి ప్రవర్తించవలయును. అట్లు కానియెడల కంటికి కనుపించు ప్రకృతియే నిజమయినది, కనుపించని పరమాత్మ లేడనుభ్రమ మనలో కలుగును. భ్రమయే కర్మమునకు మూలకారణమవుచున్నది. కర్మయే జీవునిపుట్టుకకు కారణమవుచున్నది. పుట్టి జీవుడు మాయలో చిక్కుకుంటు ఉన్నాడు. మాయలో చిక్కుకున్న జీవులు అసలయిన దేవుని తెలుసుకొనుటకు వీలు లేక ఉన్నది. నిజమయిన దానిని అబద్ధమనుకొనునట్లు, అబద్ధమయినదానిని నిజమనుకొనునట్లు, [భ్రమయే] మాయయే చేయుచున్నది. అది ఎట్లనగా? ఉదాహరణకు ఒక విషయమును తెలిపెదను శ్రద్ధగా వినుము.

ఒక అద్దము ముందుకు పిల్లిపోయినది. పిల్లిచూపు అద్దముమీద పారినది అపుడు దానికంటికి అద్దములో తన ఆకారమే కనుపించినది. కాని ఆపిల్లి యెదుట కనుపించునది వేరొక పిల్లియని భ్రమించినది. తన ఆకారమే అద్దముయందు కనుపించుచున్నదని తెలియకపోయినది. అపుడు కనుపడు పిల్లిమీదికి తన గోర్లతో కొట్టగా, యెదుటయున్న పిల్లికూడ గోర్లతో కొట్టినట్లాయెను. ఇది కోపముతో నోరు తెరువగా అద్దములోకూడ

కోపముతో నోరు తెరుస్తు కనుపించెను. ఇట్లు బయటిపిల్లి నిజముగా వేరొక పిల్లిని చూచినట్లే ప్రవర్తించెను. అద్దమునందలి పిల్లికూడ అట్లే ప్రవర్తించెను నిజమయిన పిల్లి అబద్దమయిన పిల్లిని ఎట్లు నమ్మినదో అట్లే నిజమయిన జీవుడు అబద్దమయిన ప్రకృతిని నమ్ముచున్నాడు.

పిల్లి అద్దము ఇటువంటిదికదా అని తెలుసుకోలేక పోయినది. కావున దానియందు కనుపించునది నిజమేనని నమ్మినది. పిల్లికి యెదుట అద్దముండినట్లు మానవులకు మాయ ఎదుట ఉన్నది. దానియందు కనుపించుదానిని నిజమని నమ్ముచున్నారు. పిల్లికి తన ఆకారమే అద్దమునందు ఎదుట కనుపించుచున్న వేరే అని ఎట్లు నమ్మినదో అట్లే జీవాత్మకు మాయ అను అద్దముయందు కనుపించు ప్రకృతియంతయు తనలో ఉన్నదని తెలియదు. తెలియక తను వేరు, కనుపించునది వేరు అని భ్రమించి తన్ను తను మోసగించుకొనుచున్నాడు. పిల్లి అద్దమునందలి పిల్లిమీద ఏవిధముగా ద్వేషముపూనినదో ఆవిధముగానే జీవునకు మాయ అను అద్దములో కనుపించుదానిమీద ద్వేషము పూనుచున్నాడు.

జీవుని దేహమునందు బ్రహ్మనాడి కలదు. దానియందే సర్వ ప్రపంచాత్మక పరంజ్యోతి స్వరూపుడు వెలుగుచున్నాడు. ఆ బ్రహ్మనాడియందే పర్వతములు, సముద్రములు, వృక్షములు, సకల జీవరాసులు, వేదములు మొత్తము ప్రపంచమే ఇమిడి ఉన్నది. జీవునిలో ఇమిడియున్న బ్రహ్మనాడి సారాంశమే మన ఎదుట భ్రమ [మాయ] అను అద్దములో కనుపించుచున్నది. కాని కనుపించునది తనలో యున్నదని, తన అంశయే అని జీవుడు ఏమాత్రము తెలుసుకోలేక, పిల్లి అద్దము ముందు కనుపించుచున్నది. కాని కనుపించునది తనలో యున్నదని, తన అంశయే అని జీవుడు ఏమాత్రము తెలుసుకోలేక, పిల్లి అద్దము ముందు పడిన అగసాట్లు పడుచున్నాడు.

దీపముయుండిన దాని వెలుగులో కనుపించునది తాడు అని తెలుసుకున్నట్లు, జ్ఞాన దీపముయున్న మనకు కనుపించునది ఆత్మయొక్క అంశయేనని తప్పక తెలియును.

మరియు అంతయు ఆత్మయేనని తెలియును. పిల్లికి అద్దమునందు తనరూపే తనకు కనుపించునట్లు జీవాత్మకు మాయ అద్దమున తన ఆత్మరూపే తనకు కనుపించుచున్నది. జ్ఞానమువల్ల నిజము తెలుసుకున్న జీవుడు తనరూపు సూర్య చంద్ర పరమేశ్వరులుగాను, పృధివి మొదలుకొని పంచభూతములుగాను, ప్రాగాది దశ దిక్కులుగాను, కాశి మొదలగు ధర్మక్షేత్రములుగను, సప్త సముద్రములుగను, మేరువు మొదలగు పర్వతములుగను, రత్నము మొదలగు రాళ్లుగను, సప్తద్వీపములుగను, గంగానది మొదలగు నదులుగను, నాల్గువేదములుగను, సకల శాస్త్రములుగను, 64 విద్యలుగను, బ్రాహ్మణ మొదలగు జాతులుగను సప్తస్వరములుగను, సప్తకోటి మహామంత్రములుగను, సకల పురాణములుగను, సత్వరజస్తమో గుణములుగను, జీవునిగను, క్షేత్రజ్ఞునిగను, ప్రాణవాయు మొదలయిన దశవాయువులుగను, సమస్త ప్రపంచముగను యున్నదని తెలుసుకొని ఎల్లవేళల తనయందు అన్నిటిని చూచుచుండును. అన్నిటియందును తనను చూచుచుండును. ఇటువంటివాడే ఆత్మయందు ఐక్యతచెంది తిరిగి జన్మించడు. అందువలన గీతాశాస్త్రమున జ్ఞాన యోగమందు భగవంతుడు " తత్వవేత్తలు విజ్ఞానమనెడి ధనము కల్గియున్నవారి దగ్గరకుపోయి సాష్టాంగ దండప్రణామములుచేసి, సేవలుచేసి, జ్ఞానమును అడుగుకొనగా, వారు జ్ఞానమనుదానిని మీకు తప్పక చూపగలరు. అటువంటి జ్ఞానము వెలుగున భ్రమ [మాయ] ఉద్భవింపదు. జ్ఞానము వెలుగులోనే అఖిల జగమును, సర్వజీవులను ఆత్మయందే చూచుదువు. మరియు ఆత్మ అన్నిటి యందుయున్నట్లు చూచుదువు" అని అన్నాడు. కావున జ్ఞానము లేనిది మాయను విమర్శించి కనుపించు యదార్థమును తెలుసుకొనలేరు.

జీవులారా! మనకు కనుపించునది సర్వము పరమాత్మ అంశయే. దానిని అజ్ఞాన అంధకారమును తనకంటె వేరయినదని భావించి మాయకు బద్ధుడయి జీవుడు జనన మరణ చక్రములో సులభముగా చిక్కుకుంటున్నాడు. కావున ఓ జీవుడా నిన్నే హెచ్చరించుచున్నాను. అతి తొందరగా జ్ఞానమను అగ్గిని సంపాదించుకొని దాని వెలుగులో నిత్యమయిన ఆత్మను చూచి అనిత్యమయిన ప్రకృతిని వదలి పరమాత్మను చేరుము. అట్లుకాకున్న నీకు వేరొక మార్గము లేదు. మరియు ఉండబోదు.

యోగ దండము యొక్క ఆవశ్యకత

సర్వప్రపంచాత్మక పరబ్రహ్మము సర్వజీవరాసుల శరీరములయందు నివాసము చేయుచున్నాడు. కనుక జీవరాసుల శరీరముల నిర్మాణములను గురించి తెలుసుకొనుట బ్రహ్మవిద్యయందు ముఖ్యమయిన విషయము. శరీరములు వేరయినా ఆత్మయొక్క అంశము ఒక్కటే. ఒక్క అంశతో చలనమవుతున్న జీవరాసుల శరీరములును విభజనచేయగా ప్రతిశరీరము రెండు భాగములుగా విభజింపబడుచున్నది. అవియే కుడి ఎడమ. కుడిప్రక్క ఏఅవయవములుయున్నవో అవియే ఎడమప్రక్కనకూడ ఉన్నవి. ఇది ప్రతి జీవరాసియందును గమనింపవచ్చును. చీమ మొదలుకొని ఏనుగు వరకు నిర్మాణము ఒకేరకముగా ఉండును.

మానవ శరీరమును పరిశీలించిన ఒక భాగమున ఏవియున్నవో, రెండవ భాగమున అవియే ఉన్నవి. కుడిప్రక్క ఒక చెవి ఉన్నది. దానికి వ్యతిరిక్తముగా మరొక చెవి ఉన్నది. కుడిప్రక్క కన్ను ఉన్నది. దానికి వ్యతిరిక్తముగా ఎడమ ప్రక్కన వేరొక కన్ను ఉన్నది. కుడి ప్రక్కన ముక్కు రంధ్రము ఉన్నది. దానికి వ్యతిరిక్తముగా ఎడమ ప్రక్కన వేరొక ముక్కు రంధ్రము ఉన్నది. వ్యతిరిక్తము అనగా కుడిప్రక్కయొక్క కండ్లు కనుబొమలు చెవులు మొదలగు అవయవములయొక్క కొనలు, మొదలు ఏదిశకుయున్న దానికి వ్యతిరేకముగా అవేఅవయవములు కొనలు మొదల్లు వేరొక దిశకు ఉండును. నోటి యందున దంతముల సంఖ్య 32 యున్న వాటియందు 16 ఒకవైపు, మిగతా 16 వేరొక వైపు ఉండును. వాటియందు సమపాళ్లుగా విభజింపబడి ఉండును. పైదంతముల వరుసనందు ముందర వెడల్పయిన దంతములు రెండు ఉండును. వాటియందు ఒకటి కుడిప్రక్క ఒకటి ఎడమ ప్రక్క ఉండును. వాటి నుండి చూచిన కుడి ప్రక్క ఒక కోర యుండిన ఎడమప్రక్క ఒకకోర ఉండును. అట్లే కుడిప్రక్క ఎన్ని దవుడ దంతములు యున్న ఎడమ ప్రక్కకూడ అన్నియే ఉండును. అదే విధముగా కుడిప్రక్క ఒక హస్తము దానికి వ్యతిరిక్తదిశలో వేరొక హస్తము

ఉండును. అట్లే శరీరమంతయు రెండుగా కనుపించును. లోపలయున్న అవయవములుకూడ రెండుగా విభజింపబడి ఉన్నవి. శరీరము రెండు భాగములయినదికదా ఆరెండు భాగములు కలియుచోట పైనుంచి క్రింది వరకు ఒక రేఖఏర్పడి ఉన్నది. ఈరేఖ కుడి ఎడమ భాగములను విభజించుచు శరీర పైభాగమున ప్రత్యక్షముగా కనుపించుచూ ఉన్నది. ఇది శరీరముపై ముక్కు క్రింది భాగమున పైపెదవిమీద బాణముకొన కనుపించునట్లు కనుపించుచూ ఉన్నది. కొంతమందికి గడ్డముమీద కూడ మధ్యలో తగ్గు కనుపించుతూ రేఖ ఏర్పడినట్లు కనుపించుచూ ఉన్నది. మరియు హృదయము మొదలుకొని లింగస్థానమువరకు వెంట్రుకలు మధ్యనున్న రేఖదగ్గర కలుస్తూ రేఖను ఏర్పరచినట్లున్నది. ముఖ్యముగా పురుషులకు లింగము క్రింద వీర్యగ్రంధుల మధ్యనుంచి గుదస్థాన రంధ్రము వరకు వీణతీగ లావులో ప్రత్యేకముగా రేఖ కనుపించుచూ ఉన్నది. దీనికి మధ్యరేఖ, బ్రహ్మరేఖ, సుషమ్నా రేఖ మరియు వృక్షరేఖ అని ఎన్నియో పేర్లు కలవు. ఈవిధముగ శరీరము రెండు భాగము [కుడి, ఎడమ]లుగా కనుపించుచూ ఉన్నది.

గడచిన కాలమున అర్ధనారీశ్వరుడు అనుపేరు వున్నది. ఈవాక్యమును విశదీకరించగా సగము శరీరము ఆడ, సగము శరీరము మగరూపు కలిగిన దానివలన అర్ధనారీశ్వరుడు అని కొందరు అనుచున్నారు. అని, మరి కొంతమంది గంగను యుంచుకొంటాడు అన్న భయముతో పార్వతీదేవి ఈశ్వరుని సగము శరీరము ఆవహించివున్నది. అందువలన ఆయనకు అర్ధనారీశ్వరుడు అన్న నామము గలిగినది అని అనుచున్నారు, ఇట్లు ఒక్కొక్కరు ఒక్కొక్క రకముగా భావించుచున్నారు. కాని నిజస్థితి తెలుసుకోలేక పోయినారు.

అర్ధనారీశ్వరుడు ప్రపంచమంతయు నిండివున్నాడు. ఏవిధముగా అనగా ప్రతిజీవరాసి శరీరములోను కూడుకొనివున్నాడు. అర్ధ అనగా సగము, నారీ అనగా అబల లేక స్త్రీ. ఈశ్వర అనగా బల లేక పురుషుడు. ప్రతి శరీరమును పరిశోధించగా స్త్రీ తత్వము పురుషతత్వము కనుపించుచునే వున్నది, ఎక్కడ పురుషతత్వము యున్నదో, అక్కడ వ్యతిరిక్తమై స్త్రీ తత్వము వున్నది. అందువలననే శరీరము రెండు భాగములుగా విభిజింపబడివున్నది. ఒక భాగమున

పురుషతత్వము వున్నది వేరొక ప్రక్క భాగమున స్త్రీ తత్వమున్నది. ఒక భాగమున బలతత్వము, వేరొక ప్రక్క అబల తత్వమున్నది. అందువలననే శరీరము ఒకప్రక్క బలముగా యుండగా వేరొకప్రక్క బలమునందు వ్యత్యాసము కలిగివున్నది. శరీరమున ఒక ప్రక్క అవయవములు ఒకసైజు యుండగా వేరొకప్రక్క అవయవములు సైజునందు భేదము వున్నది. అట్లే చూపు నందును, వినికిడి యందును ప్రతిఒక్క దానియందును భేదమువున్నది. కుడి చేతితో రాయి విసరినట్లు ఎడమ చేతితో విసరలేము. ఒక చేతితో ఎత్తిన బరువును వేరొక చేతితో ఎత్తలేము. ఏవిధముగా పరమాత్మ అర్ధనారీశ్వర ఆకారముతో ప్రపంచమునందు ప్రత్యక్షముగా కనుపించుచుండగా తెలియక, వేరు వేరుగా యున్న పార్వతిని, శివుని కలిపి పురాణములు సృష్టించి అర్ధనారీశ్వరుడు కైలాసమునందున్నాడు అన్నారు కొందరు. అర్ధనారీశ్వరుడు కనిపించడు కాని నేను చెప్పు అర్ధనారీశ్వరుడు అడుగడుగున కనుపించుతునే వుండును యోచించుకుంటే నీవే అర్ధనారీశ్వర ఆకారమునయున్నావు. నీవేకాక నీచుట్టూయున్న ప్రతిజీవి అర్ధనారీశ్వర ఆకారము కలిగి వున్నది.

సృష్టి ఆది యందునే ఈ విభజన చేసి పరమాత్మ 84 లక్షల రకముల జీవరాసులను సృష్టించెను. ఇక్కడ కొందరికి, శరీరమును రెండుభాగములనే ఎందుకు చేయవలయును? సగము బలముగా సగము అబలముగా ఎందుకు నిర్ణయించవలయును? అను సంశయము బయలుదేరవచ్చును. దానికి సమాధానము ఏమనగా! జీవుడు కర్మచేత భూమియందు జన్మించి మరణించుచున్నాడు. కర్మ అనగా పాపము మరియు పుణ్యము. జీవుడు కర్మ అనుభవించుటకు శరీరము ధరించుచున్నాడు. శరీరము ధరించుటకు రెండే కారణములు ఒకటి పాపము రెండవది పుణ్యము. కావున శరీరము కూడ రెండుగా విభజింపబడి ఉన్నది, శరీరము లేక కర్మలేదు, కర్మలేక శరీరములేదు. ఈ రెంటికి యున్నంత దగ్గర సంబంధము ప్రపంచములో ఏమిటికి లేదు. కాబట్టి కర్మ రెండుభాగములే శరీరము రెండుభాగములే శరీరము రెండు భాగములుగా విభజింపబడుటకు మరియొక కారణము కలదు దానిని వివరింతును.

కర్మరూపమై నిలచిన ప్రపంచమును పాలించుటకు పరమాత్మ అంశ కొన్ని రూపముల గుంపై నిలచింది. ఆ రూపములు ప్రత్యేకమయిన శక్తులు కల్గి ఉన్నవి. ప్రపంచము కర్మరూపము కాబట్టి పాపము పుణ్యమును ధర్మము తప్పక జీవరాసుల మీదికి విధించుటకు ఆత్మ అంశయే యమధర్మరాజుగా రూపొందినది. అందువలననే గీతాశాస్త్రమందు "దండనాధికారులయందు యముడ నేను అని అన్నాడు. యమధర్మరాజు కాలచక్రమునకే అధినేతగా ఉన్నాడు. యముడే కాలము, కాలమే యముడు కాలమునందు పాపపుణ్యములు సూక్ష్మాతి సూక్ష్మముగా జీవుల మీదికి ప్రసరింపజేయుటకు కాలుని ఆధీనము నందు ప్రత్యేకమయిన శక్తులు ఏడు తయారయినవి అవి ఏవనగా [1] సూర్యుడు [2] చంద్రుడు [3] అంగారకుడు [4] బుధుడు [5] శుక్రుడు [6] గురుడు [7] శని వీరు సృష్టి ఆదియందు నిర్మింపబడి ఉన్నారు. వీరు కర్మచక్రమునకు అధినేతలు, గమనింపవలసిన విషయము కాలుడు [యముడు] ను అనుసరించి కాల చక్రము ఆదిత్యాది సప్తగ్రహములను అనుసరించి కర్మచక్రము తిరుగుచున్నది కాలచక్ర ఆధీనమందు కర్మచక్రము ఉన్నది. కాలము జరుగుకొద్ది కర్మ జరుగుచుండెను. కాలము, కర్మ, బ్రహ్మ ఆధీనమునందుండును. వీటిని గురించి తర్వాత తెలియజేయుదును. ఇపుడు చెప్పునది ఏమనగా!

సూర్యుడు మొదలుకొని శని వరకు మొత్తము ఏడుగురు కదా! ఈ ఏడుగురుకు ఒక్కొక్క దినము ఒక్కొక్కరికి ప్రపంచ పాలనయందు రాజసింహాసనము అధిష్ఠించు అధికారమున్నది, కాబట్టి మొదటిదినము సూర్యుడు ప్రపంచ సింహాసనము అధిష్ఠించెను. అందువలన ఆ దినమునకు ఆదివారము అని పేరు యుంచబడినది. రెండవదినము చంద్రుడు ప్రపంచ సింహాసనము అధిష్ఠించెను. కాన ఆ దినమునకు సోమవారము అని పేరు యుంచబడినది. మూడవదినము అంగారకుడు ప్రపంచ సింహాసనము అధిష్ఠించెను కాన ఆ దినమునకు మంగళవారము అని పేరు గల్గెను. అట్లే బుధుడు, తర్వాత గురువు ఆ తర్వాత శుక్రుడు అటుపిమ్మట శని వరుసగ ప్రపంచ సింహాసనము అధిష్ఠించిన దానివలన ఆయా దినములకు వారి పేర్లు పెట్టబడెను. సృష్టి ఆదిలో మొదటిదయిన ఆదివారముతోనే మొదలు పెట్టబడెను. నాటినుండి ఆఏడుగురు క్రమము తప్పక ప్రపంచపాలన చేయు చుండిరి. ఇప్పటికి కూడ ఆ ఏడు దినములనే వారముగా మనము లెక్కించు కొనుచున్నాము.

మొదటయున్నవి సప్తగ్రహములు తర్వాత యున్నవి నవగ్రహములు. రెండు ఎక్కువగా ఎందుకు వచ్చినవి అనగా!

జరిగిన కాలమున దేవతలకు రాక్షసులకు వైరమురాగ వారు పంతముపూని దేవతలు ఒక వైపు రాక్షసులు ఒకవైపు నిలచి సముద్రమును చిలికిన దినమున, సముద్రమునందు అమృతము ఉద్భవించినది కదా! ఆ అమృతమును పంచుకొనుటకు రెండు పక్షములవారు వాదించుచుండగా మహావిష్ణువు మోహినీ అవతారము ధరించివచ్చి, అమృతము పంచుచున్న సమయమున, రాక్షస పక్షమందు యుండిన ఒకడు దేవతల పక్షములో సూర్యచంద్రుల మధ్య యుండుటయు, దానిని గమనించిన విష్ణువు చక్రాయుధముతో వాని తలను నరుకుటయు, సంభవించెను. అంతలో వానికి అమృతము కంఠమధ్య భాగమునకు పోయియున్నందువలన వాడు మృత్యుంజయుడయ్యెను. తెగిన రెండు భాగములయందు అమృతము యుండుటవలన రెండు భాగములు సజీవములయి నిలిచెను. రెండుగా తయారయిన తల మొండెము రాక్షసుల ప్రక్కకుపోగా, వారు వారి పక్షమున చేర్చుకొనక దూషించిరి. దేవతల పక్షమునకు రాగ వీరును చేర్చు కొనక దూషించిరి. వీరి సమస్య పెద్ద సమస్యగా మారెను పరమాత్మ ప్రేరేపితమయిన శ్రీ మహావిష్ణువు వినాయకునికి ఏనుగునువధించి ఏనుగుతల అతికించినట్లు ఒక ఘట సర్పమును వధించి దాని మొండెమును ఆ రాక్షసుని శిరస్సుకు అతికించెను. తర్వాత సర్పముతలను రాక్షసుని మొండెముకు అతికించెను. తల మామూలుగా యుండి సర్పము మొండెము గలిగిన శరీరమునకు రాహువు అని పేరు పెట్టబడెను, తలపాముది మొండెము మామూలుగాయున్న శరీరమునకు కేతువు అని పేరుపెట్టబడెను. వీరు ఏపక్షమున చేర్చుకొనబడక పోయిన దానివలన, శ్రీ విష్ణువు సంహరించిన దానివలన, విష్ణువే సప్తగ్రహములను పిలిచి గ్రహకుండలి యందు వీరిని చేర్చుకొని వీరికి మీతోపాటి ఒక దినము పరిపాలన హక్కు ఇమ్మని చెప్పగా దానికి సప్తగ్రహములు వారిలో చేర్చుకొనుటకు ఒప్పుకొనిరి కాని ప్రత్యేకమయిన దినపరిపాలన ఇచ్చుటకు ఒప్పుకోకపోయిరి అట్లు ఇచ్చిన మొదటినుండియు నిర్మిపబడిన కాల, కర్మ చక్రములు అన్నియు తారుమారు అగునని తెలియపరచిరి దానిని గమనించిన విష్ణువు సరి అయిన పద్ధతిని యోచించి కాల కర్మ చక్రముల గమనములు మార

నట్లుగా వీరికి ప్రత్యేక దినములు లేకుండ చేసెను. కాని గ్రహకూటమిలో నవగ్రహములుగా పేరు వచ్చి వీరి అధికారము ప్రత్యేకముగాయుండి ఒక దినము వీరిది అనిపించుకోకపోయిన ప్రతిదినము వీరికి ముక్కాలు గడియ కాలము [1 1 / 2 గంట] ప్రపంచపాలన సింహాసనము అధిష్టించునట్లుగా విష్ణువు చేసెను. సూర్యుడు మొదలుకొని శని వరకు వారి దినములయందు గంటన్నర కాలము ప్రపంచ సింహాసనమును రాహువు కేతువుకు అర్పించు చుండిరి నాటినుండి అట్లే జరుగుట వలన వారములు ఏడే ఆయెను. కాని ఏ వారమయిన రాహుకాలము 1 1 / 2 గంటకాలము తప్పక ఉండును. ఇది పరమాత్మ నిర్మాణము, అట్లే జరుగుచున్నది. ప్రపంచమున సప్త గ్రహములేయున్నరోజు సూర్య చంద్రులకు గ్రహణములు లేవు. రాహు కేతు శరీరము అమృతము పంచు దినమున సూర్య చంద్రుల మధ్యయుండిన దానివలన, వీరే విష్ణువుకు చెప్పిరి అని అనుమానము యున్నందువలన ప్రపంచ పాలక హక్కు ఒకరోజు ఇయ్యము అని సూర్య చంద్రులే గట్టిగా చెప్పిన దానివల్ల, వీరు[రాహువు కేతువు] ఆనాడే మిమ్ములను కాలానుగుణ్యముగా హింసించుతాము అని ప్రతిజ్ఞ చేసినారు. కావున నేటికిని కాలానుగుణ్యముగా సూర్య చంద్రులకు వారి బాధలు తప్పలేదు.

ముఖ్యముగా గ్రహాల స్థితులు ఎట్లున్నవనగా! గ్రహములు మొత్తము ఏడు యున్నప్పుడు అనగా సృష్టి మొదటిలో గ్రహములు రెండు భాగములుగా విభజింపబడెను. ఎందుకనగా గ్రహములును ప్రపంచములో పాప పుణ్యములను పాలించుటకుకదా! నిర్మించినది. కాబట్టి పాపమును పాలించువారు కొందరు, పుణ్యము పాలించువారు కొందరుగా రూపొందిరి. [1] సూర్యుడు [2] చంద్రుడు [3] అంగారకుడు [4] గురువు ఒక గుంపుగా, [1] బుధుడు [2] శుక్రుడు [3] శని ఒక గుంపుగా నిలిచిరి. ఈ విధముగా సప్తగ్రహములు రెండు భాగములయ్యెను. రెండు పార్టీలుగా తయారయిన వీరు, ఒక పక్షముకు మరోపక్షము వారు బద్ధ విరోధులుగా నిల్చిరి. పాప పుణ్యమునకు ఎంత దూరమో అట్లే వీరి అన్యోన్యత అంత దూరము. అంటే పార్టీని బట్టి పరమ శత్రువులు. వీరు ప్రపంచములోని జీవరాసులమీదనే కదా అధికారము చలాయించవలసినది. కాబట్టి జీవుల శరీరములు కూడ వీరికోసమయి రెండుభాగములుగా విభజింపబడినవి. అవియే కుడి, ఎడమ. ముఖ్యముగా గమనించండి

మనలోయున్న శ్వాస కూడ కొద్దిసేపు కుడి కొద్దిసేపు ఎడమ ముక్కులలో ఆడుచుండును. ఆలాగా ఆడుటకు కారణము సప్తగ్రహములు రెండు భాగములయిన దానివలననే.

పార్టీల చివరగా యున్నవారే గురువు, శని వీరు ఇరువులు తమ తమ పార్టీలలో ముఖ్యులు కావున గురువు పార్టి శనిపార్టి అని చెప్పబడుచున్నది. గురువు పార్టిలో సూర్య, చంద్ర, కుజులు ముగ్గురు శని పార్టిలో బుధ, శుక్రులు ఇద్దరు యుండడము వల్ల గురువు పార్టిలో ఒకరు ఆధిక్యత అయినారు. కావున అటువంటి ఆధిక్యత లేక రెండు పార్టీలు సమానముగా యుండుటకు, పరమాత్మ ప్రేరేపితుడయిన యముడు [కాలుడు] చంద్రుని నిర్ణీతకాలమునందు గురువు పార్టీయందును, దానికి సమానమయిన కాలమునందు శని పార్టీయందును, దానికి సమానమయిన కాలమునందు శని పార్టీయందును యుండునట్లు నియమించెను. అందువలన చంద్రుడు కాలానుగుణ్యముగా కొంతకాలము ఒక పక్షము వారి యందును, మరి కొంతకాలము వేరొక పక్షము వారి యందును చేరుచుండును, మరియు మనలో ఆడుశ్వాస కూడా కొంతకాలము కుడి కొంతకాలము ఎడమగా ప్రతిరోజు ఆడుచున్నది. చంద్రుడు గురు పక్షమున యుండిన దినములలో అభివృద్ధియగుచుపోయి పున్నమి గా ఏర్పడుచున్నది. వ్యతిరేకపక్షము అయిన శని పక్షములో చంద్రుడు చేరి యున్న దినములలో చంద్రుడు దిన దినము సన్న గిల్లుచూపోయి ఆఖరుకు అమావాస్యగా ఏర్పడుచున్నది, ఇది అందరకు ప్రత్యక్షముగా కనుపించుచు ఉన్నది. ఇది అంతయు గమనించిన శరీర నిర్మాణమునందే తెలియుచున్నది. శరీరము ఎందుకు రెండుభాగములుగా విభజింపబడినది అంటే, పాపము పుణ్యము అను రెండిటికే శరీరము అవసరము కావున రెండుభాగములు గానే తయారయినది. మరియు గ్రహములు పాప పుణ్యముల అనుసరించి రెండు పక్షములుగానే తయారయినవి. కాబట్టి శరీరముకూడ రెండు పక్షములుగానే తయారయినది. దీనివలననే ఈ శరీరమునకు అర్ధనారీశ్వరుడు అన్న పేరు వచ్చినది. లోపల సూర్య చంద్రనాడి విభజనగా, బయట కుడి ఎడమ విభజనగా రూపొందిన శరీరముల గురించి తెలుసు కొనిన పరమాత్మ ఎటువంటివాడో తెలుసుకొనుటకు కొంతమార్గము ఏర్పడును. భగవద్గీత యందు శరీరము క్షేత్రము నేను క్షేత్రవేత్తను అని పరమాత్మ అన్నాడు.

శరీరము అనెడి క్షేత్రమును తెలుసుకొననిదే క్షేత్రవేత్తను తెలుసుకొనుటకు వీలు ఉండదు. కావున బ్రహ్మవిద్యయందు శరీరమును తెలుసుకొనుట ముఖ్య అంశము.

రెండుభాగములు కలసి ఏర్పడిన శరీరములోనే కదా మానవుడు భక్తి, ధ్యానయోగము లాచరించి భగవంతుని తెలుసుకోవలసినది. కాబట్టి యోగములాచరించు ప్రతివారును గురు, శని పక్షములను తప్పక తెలుసుకొని యోగము లాచరించవలయును అట్లు కానియెడల వారి యోగము నిష్ప్రయోజనము. గురు పక్షదినములలో కుడి ప్రక్క శరీరము బ్రహ్మ శక్తిని గ్రహించునదియై ఉండును. శని పక్షదినములలో ఎడమ ప్రక్క శరీరము బ్రహ్మ శక్తిని గ్రహించునదియై ఉండును. దీనిని ఏనాడో మన పెద్దలు వశిష్ట విశ్వామిత్ర మొదలగువారు గ్రహించి దానిప్రకారమే వారు యోగము లాచరించుటకు యోగదండమును ఉపయోగించుచుండిరి. కాలక్రమేణ విపరీత భక్తులు ఉద్భవించి ఒక్క విషయమును కూడ తెలుసుకోలేకపోయినను పెద్దలు తెలిపి ఆచరించిన వాటినే వ్యర్థము అన్నారు. కాని వ్యర్థమన్నవారు పలుకు పలుకులు, వారు ఆచరించు పద్ధతులు వ్యర్థమని నిజముగా వారికి తెలియదు. పవిత్రమయిన మహర్షులు నడచిచూపించిన మార్గములనే సరికాదంటున్నారు. సూత్రము తెలియని ఈ కాలము భక్తులు యోగదండముతో పని ఏమున్నది అనుచున్నారు.

యోగము అనగా ఆత్మతో కలియడము అని అర్థముకదా! యోగదండము అనగా ఇదిఏదో ఆత్మ సంబంధమునకై వినియోగించునది అని సులభముగా తెలియుచున్నది, ఈ కాలము మనుష్యులు దానిని సులభముగా తీసివేయుచున్నారు. ఆ కాలమున విశ్వామిత్ర వశిష్టాది మునులు మనకంటే తెలివి తక్కువవారా! లేక విధానములు తెలియనివారా! ఎంతో గొప్ప యోగవిద్యా సంపన్నులయినవారై యోగదండమును ఉపయోగించి యోగమును సాధించియుంటే, వారికంటే తక్కువవారయిన మనము యోగదండము లేకనే యోగము సాధించగలుగుతామా! యోగదండము లేక యోగము సాధించుతాము అన్నది కలలోని మాట. అందులకే ఈనాడు పెద్దస్వాములు అన్న పేరుకాంచినవారు కూడ భగవంతుడు గీతాశాస్త్రమున అక్షరపరబ్రహ్మ యోగమున చెప్పినట్లు అంత్యకాలములో రాత్రిపూటనో, దక్షణాయనమునో, కృష్ణపక్షముయందునో మరణించుచున్నారు. దానితో వారికి తిరిగి

జన్మయుంది అని ప్రత్యక్షముగా తెలియుచున్నది. దేశానికి మొదటి భక్తులనిపించుకొన్న వారుకూడ పగలుకాక శుక్లపక్షముకాక, ఉత్తరాయణము కాకయున్న సమయమున మరణించు చున్నారంటే వారు ఇంకా తెలుసుకోవలసినది ఉన్నది, ఆచరించవలసినది యున్నది అని తెలియుచున్నది. గీతాశాస్త్రమందు శుక్ల, కృష్ణ పక్షములను తెలిసినవాడు, వేదములను, యజ్ఞములను, తపస్సులను, దానముల వలన లభించెడు పుణ్యఫలములను అతిక్రమించువాడు అని భగవంతుడు తెలిపి ఉన్నాడు. గీతాశాస్త్రమును బోధించు బోధకులకే పక్షము అంటే ఏమిటో తెలియకపోతే, శుక్ల కృష్ణ పక్షములగురించి ఏమి తెలియును? గీతా శాస్త్రములో భగవంతుడు విషయము విపులముగా తెలిసియుంటే, ఈ కాలములో కథలను ఉపమానములుగా చెప్పుచు భగవంతుని భావన విడిచి వేరే భావనలోనికి పడుచున్నారు. దినములో పగలు రాత్రి, నెలలో కృష్ణ శుక్ల పక్షములు, సంవత్సరములో ఉత్తర దక్షణాయణములు ఎందుకు ఉన్నాయి, అని ఎప్పుడయితే విశదీకరించి గురువు దగ్గర తెలుసుకుంటాడో వాడే ధన్యుడు, వాడే సర్వజ్ఞుడు. పరమాత్మ ప్రపంచమంతట నిండి యున్నాడు అని తెలుసు అంటున్నారు. కాని ఎవరో చెప్పుతూయుంటే వీరు అనుచున్నారు, నిజముగా ఎట్లు నిండియున్నాడు. అన్నది విశదీకరించు కోలేదు. శుక్ల, కృష్ణపక్షములు మనకు కనబడుచున్నవికదా అని అనుకొనుచున్నారు, కాని ఎందుకు? ఎట్లు ? జరుగుచున్నవని విశదీకరించుకోలేదు. గుళ్లో దేవుడు పయినిండి మాట్లాడుట చూచుచున్నారు, దయ్యములు ఆవహించి మాట్లాడుటకూడ చూస్తున్నారు, కాని ఎందుకు ఇట్లు జరుగుచున్నది? దీని నిజస్థితి ఏమిటి? అను విషయము ఏమాత్రము మానవుల దగ్గరలేదు. ఉన్నదంతా స్వార్థము. మొదటినుండి ఈ భూమియే ఉన్నది. దీనిమీదనే ఎంతో తాపత్రయపడి ఏమియు తీసుకపోయినవారు లేరు అని అందరికి తెలుసు. కాని తమ నిజస్థితులను తెలుసుకోక ఒకప్పుడు వదలిపోవు వాటికయి మానవుడు కాలమును వినియోగించుకొనుచున్నాడు.

సప్తగ్రహములు నవగ్రహములుకాక మునుపే ఉండిన విధానమేమనగా! సప్తగ్రహములకు సప్తదినములు నిర్దేశింపబడినవికదా! గ్రహములు రెండుభాగములుగా విభజింపబడినవికదా! వాటిననుసరించి దినములుకూడ రెండు పక్షములుగా

[భాగములుగా] విభజింపబడినవి. ఆదివారము, సోమవారము, మంగళవారము, గురువారములు ఒకటిగా బుధవారము, శుక్రవారము, శనివారము ఒకటిగా నిర్ణయింపబడినవి. రెండుభాగములు సమత్వమందు యుండుటకు చంద్రుడు 15 దినములు ఒక ప్రక్క మిగత 15 దినములు వేరొకప్రక్క మారుచుండును. ఈ విధముగా మారుటనే ఒక నెల [మాసము] అందురు. ఈ విధముగా చంద్రుడు మారుట వలన రెండు పక్షముల గ్రహములకు సమత్వబలము ఏర్పడుచున్నది. చంద్రుడు గురుపక్షమున చేరినపుడు శుక్లపక్షము అనియు, శనిపక్షమున చేరినపుడు కృష్ణపక్షము అనియు తెలియుచున్నది. శుక్లపక్షములో ఆదివారము, సోమవారము, మంగళవారము, గురువారములు ఒకటి, కృష్ణ పక్షములో బుధ, శుక్ర, శని, సోమవారములు ఒకటిగా ఉన్నవి. శుక్లపక్ష ఆది, సోమ, మంగళ, గురువారములలో శరీరమునందు కుడి ప్రక్క భాగమున మాత్రమే బ్రహ్మశక్తిని గ్రహించుకొను బలము గలిగి ఉండును. ఆ దినములలో శరీర ఎడమ భాగము బ్రహ్మశక్తిని ఏమాత్రము గ్రహించుకోలేదు. కృష్ణపక్ష బుధ, శుక్ర, శని, సోమవారములలో ఎడమప్రక్క శరీరము మాత్రము బ్రహ్మశక్తిని గ్రహించుకొను సామర్థ్యము కలిగి ఉండును. ఈ దినములలో శరీర కుడి భాగము ఏమాత్రము బ్రహ్మశక్తిని గ్రహించుకోలేదు. కాబట్టి యోగము ఆచరించు వేళలలో, ఏదినము మనము యోగము చేయుచున్నామో ఆదినము శరీరములో ఏభాగమునకు చెందియున్నదో తెలుసుకొని ఆభాగములోనే మనలో ఆడుచున్న శ్వాసను నడుపుచుండవలయును. శ్వాస ఏభాగములో ఎక్కువగా నడచిన ఆ భాగములో అధికులయిన గ్రహములు బ్రహ్మశక్తిని శరీరములోనికి వచ్చునట్లు ప్రసరింపజేయుదురు. అట్లుకాక వ్యతిరిక్తదిశన శ్వాస ఆడుచుండిన బ్రహ్మశక్తిని గ్రహించు సామర్థ్యము ఆ దిశ కోల్పోవును. ఇందుకు దృష్టాంతముగా తెలుపుచున్నది ఏమనగా!

ఒక యోగి మంగళవారము యోగము ఆచరించుచున్నాడను కొనుము. మంగళవారము గురుపక్షమున చేరినది కాబట్టి, గురు పక్షము శరీరమున కుడి పార్శ్వమందు అధికారము కలిగియున్నది కాబట్టి, ఆయోగి శ్వాసను కుడిప్రక్క ముక్కు రంధ్రములోనే ఆడునట్లు చేసుకోవలయును. శ్వాస కుడి ముక్కు రంధ్రములో ఆడునంతవరకు, యోగము చేసినంత సేపు యోగశక్తి కుడిప్రక్క శరీర సూక్ష్మ రంధ్రములద్వారా లోపలికి

ప్రవేశించుచుండును. అట్లుకాక శ్వాస ఎడమ ముక్కురంధ్రమున ఆడుచుండిన యోగి ఎంతసేపు యోగముయందు యున్నను బ్రహ్మశక్తి అతనియందు ప్రవేశించలేదు, ఎందుకనగా కుడిప్రక్క శరీర భాగములోని సూక్ష్మ రంధ్రముల ద్వారములు మూయబడి ఉండును. అందువలన శక్తి లోపలికి ప్రవేశించలేదు. శ్వాస ఎడమప్రక్కకు మారినదానివల్ల ఎడమప్రక్క శరీరమున సూక్ష్మ రంధ్రముల ద్వారములు తెరుచుకొని ఉండును. ఆదినము గురుపక్షదినము అయినది కాబట్టి బ్రహ్మశక్తి ఎడమప్రక్కన ప్రవేశించదు. ఎందుకనగా ఎడమప్రక్కయున్న గ్రహముల దినముకాదు. దీనినిబట్టి ఏమి తెలియుచున్నదనగా శ్వాస ఏప్రక్క ఆడుచున్నదో ఆప్రక్క శరీరభాగము మాత్రమే శక్తిని గ్రహించుకొనును. దినములు ఏ పక్షములో ఆ పక్ష భాగముననే బ్రహ్మశక్తి ఉండును. అందువలన బ్రహ్మశక్తి సంపాదించు యోగులు పూర్వము ఏపక్షదినమున ఆ పక్షముననే శ్వాస నడుపుచుండెడి వారు.

గురు శని పార్టీదినములు కాలక్రమమున నిర్ణీతముగా మారుచుండును. కాని మనలోయున్న శ్వాస నిర్ణీతముగా మారదు. శ్వాస దానికి ఇష్టమువచ్చినట్లు ఏప్రక్కకంటే ఆ పక్కకు మారుచుండును. అటువంటి శ్వాసను ఒకే ప్రక్క నిలిపి యోగమును సార్థకము చేసుకొనుటకు ఉపయోగింపబడు దండమునే యోగదండము అని అందురు. యోగ దండమును వినియోగించుకున్న అది ఎట్లుండునో అందరకు ఇప్పటికి తెలిసి ఉండును.

మనలోయున్న శ్వాసను ఒకేప్రక్క ఎక్కువగా ఆడునట్లు చేయవలయునంటే దానికి వ్యతిరిక్త శరీరభాగములో యోగదండమును వినియోగించవలయును. భుజమునకు క్రింద మోచేతికి పైన, క్రిందిభాగమున యోగదండముయొక్క పంగ ఆనించి దానికొనను భూమిమీద పెట్టి యుంచవలయును. అట్లు యుంచుటవలన ఆచేతి నరమునకు దండము యొక్క వత్తిడి తగులుట వలన శ్వాస దానికి వ్యతిరిక్త దిశలోనికి మారును. ఉదాహరణకు బుధవారము దినమున యోగము సలుపువేళ ఎడమ ప్రక్క శ్వాస ఆడవలయును కాబట్టి కుడి చేతిక్రింద యోగదండమును యుంచుకోవలయును. కుడిప్రక్క దండము యుంచుకోవడమువల్ల దానంత కదే ఎడమప్రక్క నడుయుచున్నది. కుడి ముక్కు రంధ్రములో ఎక్కువగా గాలి వచ్చుచుండిన దానిని సూర్యనాడి అనియు, ఎడమ ముక్కు రంధ్రములో

ఎక్కువగా గాలి వచ్చుచుండిన దానిని చంద్రనాడి అనియు పెద్దలు చెప్పుచుందురు. సూర్య చంద్రనాడులు మనకు స్వాధీనమునయుండి నడుచుటకు యోగదండము తప్పక ఉండవలయును. దీనిని విపులముగా తెలిసిన వశిష్టాది మహామునులు సహితము యోగదండమును వదలక తమయొద్దనే అన్నివేళల యుంచుకొని యుండిరి. మరియు వారు చర్మమును ఎక్కడికి పోయినను వదలక తీసుకొని పోయెడివారు. కాని ఈ కాలమున చర్మము లేకపోతే దేవుడు ఒప్పుకోడా అనువారు తయారయినారు, ఆ కాలమున తెలిసిన పెద్దలు కష్టాలనుకూడ లెక్క చేయక వారు ఎక్కడికి పోయి యోగమాచరించవలెనన్న అక్కడికి చర్మమును యోగదండమును తీసుకపోయి యోగమాచరించెడివారు. కాని ఈ కాలమున మనము వాటిని విసర్జించినదేకాక, వాటిని ఉపయోగించినవారిని మరియు ఉపయోగించువారిని హేళన చేయుచున్నాము.

చంద్రుడు రెండుప్రక్కల మారుచుండును కాబట్టి ఈ విషయమును బాగుగా అర్థము చేసుకోవలయును. యోగము సలుపు యోగులు అందరు ఈ విధానము అనుసరించిన శక్తి తప్పక మిమ్ములచేరును. అట్లు కానియెడల శక్తిని నష్టపోయినవారగుదురు.

[1] ఆదివారము సూర్యునిది; సూర్యుడు గురుపార్టీవాడు. గురుపార్టీకి శరీరమున కుడిప్రక్క అధికారముకల్గి ఉన్నది. కావున ఆ దినమున బ్రహ్మశక్తి కుడిప్రక్కనే వచ్చుటకు హక్కు కలిగి ఉండును. శక్తి శరీరంలోనికి ప్రవేశించుటకు కుడిప్రక్క సూక్షరంధ్రముల ద్వారములు తెరువబడి ఉండవలయును. సూక్ష్మ రంధ్రముల కవాటములు తెరుచుకొనుటకు శ్వాస కుడిప్రక్కనే ఆడవలయును. అనగా సూర్యనాడియందు ఆడవలయును. అందువలన యోగదండము ఎడమ చేతిక్రింద యుంచుకోవలయును.

[2]సోమవారము చంద్రునిది; శుక్ల పక్ష సోమవారమయిన గురు పార్టీయందుండును కాబట్టి శ్వాస కుడి ముక్కు రంధ్రములో [సూర్యనాడిలో] ఆడవలయును. కృష్ణపక్ష సోమవారమయిన శని పక్షాన చేరి ఉండును కాబట్టి శ్వాస ఎడమ ముక్కు రంధ్రములో [చంద్రనాడిలో] ఆడవలయును. శుక్ల పక్షములో వచ్చు సోమవారమున యోగదండము ఎడమ ప్రక్కన

యుంచుకోవలయును. కృష్ణపక్షములో వచ్చు సోమవారమున యోగదండము కుడిప్రక్క యుంచుకోవలయును.

[3] మంగళవారము అంగారకుని దినము; కాబట్టి గురుపక్షమున కలది. అందువలన శ్వాస కుడిప్రక్క [సూర్యనాడిలో] ఆడవలయును. యోగదండము ఎడమప్రక్క యుంచుకోవలయును.

[4] బుధవారము బుధుని దినము; కాబట్టి శని పక్షమున కలదు అందువలన శ్వాస ఎడమప్రక్క [చంద్రనాడిలో] ఆడవలయును. యోగదండము కుడిచేతిక్రింద యుంచుకోవలయును.

[5] గురువారము గురువు దినము; కాబట్టి గురుపక్షమున చేరి ఉన్నది శ్వాస కుడిప్రక్క [సూర్యనాడిలో] ఆడవలయును యోగదండము ఎడమచేతిక్రింద ఉంచుకోవలయును.

[6] శుక్రవారము శుక్రునిది; కాబట్టి శని పార్టీలో చేరి ఉన్నది శ్వాస ఎడమ ప్రక్క [చంద్రనాడిలో] ఆడవలయును యోగదండము కుడి ప్రక్క ఉంచుకోవలయును.

[7] శనివారము శనిదినము; కాబట్టి శని పార్టీలో చేరి ఉన్నది శ్వాస ఎడమ ప్రక్క [చంద్రనాడిలో] ఆడవలయును యోగదండము కుడి ప్రక్క ఉంచుకోవలయును.

విజ్ఞప్తి:- సాధన చేయువారికి ఒక ముఖ్య గమనిక. శ్వాస కుడి ఎడమ రెండు ప్రక్కల ఆడుచుంచునన్నాము కదా! గురు పక్ష దినములలో యోగము చేయు వేళ క్రుడి ప్రక్కన, శని పక్షదినములలో యోగము చేయు వేళ ఎడమ ప్రక్కన, శ్వాస ఆడించుకోవలయును, అందుకోసరము యోగదండమును వ్యతిరిక్త దిశలో వుపయోగించవలయునని తెలిపియున్నాము కాని ఆవిధముగ సాధన చేయువారికి అందరికికాక కొందరికి మాత్రమే శ్వాస మేము చెప్పిన విధముగ మారదు. అట్లు మారకుండినా, ఏమిమాకు శ్వాస

యోగదండమును వినియోగించినా మారలేదే అని ఎవరు చింతించవలసిన పనిలేదు. మేము ఏవిధముగా చెప్పియున్నామో ఆవిధముగానే యోగదండమును వినియోగించి సాధన చేయవలయును.

ఈ విషయమును గురించి ఇంకా విపులముగా తెలుపునది ఏమనగా! శరీరములో కుడిభాగములో పెద్దగా సూర్యనాడి కలదు. అట్లే ఎడమ భాగమున పెద్దగా చంద్రనాడి కలదు. మన శరీరములో అంతఃకరణములలో రెండవది మరియు ముఖ్యమయినది అయిన మనస్సు ఈ సూర్యచంద్ర నాడుల మీదనే యుండును. ఒకదినములో సూర్యనాడి మీద కొంత కాలము, చంద్రనాడిమీద కొంతకాలము మనస్సు నివాసము చేయుచుండును. మనస్సు కుడిప్రక్క సూర్యనాడిమీద యున్నప్పుడు శ్వాస కుడి ముక్కు రంధ్రములోను, ఎడమప్రక్క చంద్రనాడిమీద యున్నప్పుడు శ్వాస ఎడమప్రక్క ముక్కురంధ్రములోను ఎక్కువగా వచ్చుచుండును. పైన ఆడు శ్వాస లోపలయున్న మనస్సు మీద ఆధారపడియుండును. లోపల మనస్సు ఏవైపునకు పోయిన ఆవైపు పైన శ్వాస ఆడుచుండును. మనస్సును ఒక నాడిమీదయుంచు నిమిత్తము యోగదండమును ఉపయోగించవలయునని తెలిపియున్నాము. యోగదండము వినియోగించిన ప్రక్క మనస్సు యుండక దానికి వ్యతిరిక్త దిశలో యుండును. కావున శ్వాస కూడ యోగదండము వినియోగించిన ప్రక్క కాక దానికి వ్యతిరిక్త దిశలో ఆడుచుండును. కాని కొందరికి సాధన చేయువేళ యోగదండము వినియోగించిన శ్వాస మారక యోగదండము వినియోగించిన వైపే యుండును. కాని లోపల మనస్సు అట్లుయుండక వ్యతిరిక్త దిశకు మారియుండును. యోగముకు మనస్సు ముఖ్యము కాని శ్వాస ముఖ్యముకాదు. అందువలన మారని శ్వాస కోసరము ఎవరు దిగులు చేయకూడదు.

యోగదండమును వినియోగించిన వెంటనే పైన శ్వాస మారకుండినా లోపల మనస్సు మారియుండును. కావున యోగశక్తి కూడ మనస్సు యున్న వైపు శరీరములో ప్రవేశించుచునే యుండును. యోగ దండము వినియోగించిన శ్వాస మారనివారు కూడ యోగశక్తిని నష్టపోక పొందుచుందురనియే తెలుపుచున్నాము. ముఖ్యముగా లోపల మనస్సు కుడి ఎడమలుగా

మార్చు నిమిత్తము యోగదండము వినియోగించుచున్నామని ప్రతి ఒక్కరు తెలుసుకోవలయును. అందువలన మేము చెప్పినట్లు యోగదండమును వినియోగించి యోగము చేయవలయునని కోరుచున్నాను. పూర్వము మనస్సు గురు, శనిపక్షములలో సూర్య చంద్రనాడుల మీద మార్చుకొనుటకై శంకరుడు యోగదండము వినియోగించినాడని, విష్ణువు తన తలక్రింద కుడి ఎడమ చేతులను పెట్టుకొని పండుకొనుచు యోగము చేసినారనుటకూడ మరువకూడదని తెలుపుచున్నాను విష్ణువు, ఈశ్వరుడే ఆచరించియుండగా, మనము ఆచరించకపోతే గొప్పలోపము అందువలన అందరు గ్రంధములో చెప్పినట్లు చేయవలయునని తెలుపుచున్నాను.

చర్మముల యొక్క ఆవశ్యకత

పూర్వము మహర్షులు సహితము యోగదండము జింక చర్మము చేత ధరించి తిరిగినారని అందరకు తెలుసు. యోగదండము లేనిది యోగమాచరించుట కష్టమని తెలుసుకున్నాము ఇక మహర్షులు చర్మములు ఎందుకు ఉపయోగించుచుండిరి అను విషయమును తెలుసుకొందము.

యోగము ఆచరించువేళ బ్రహ్మశక్తి లేక యోగశక్తి శరీరమునందు ప్రవేశించుచుండును. ఈవిధముగా ప్రవేశించు శక్తి శరీరమున బ్రహ్మ నాడిని చేరి సప్తస్థానమయిన సహస్త్రారచక్రమున గుంపుగా కూడుకొనుచుండును. సహస్త్రారమున గుంపుగా చేరిన శక్తినే విష్ణు, ఈశ్వరపటములయందు వారి తల వెనుకభాగమున వెలుగురూపమున చిత్రీకరించడము జరుగుచున్నది. తల వెనుక భాగమున వెలుగు చిత్రీకరించిన అది వారి యొక్క జ్ఞానశక్తి అని తెలియడమగుచున్నది. ఈప్రకాశ శక్తిని దేవతలు పద్ధతి ప్రకారము యోగము ఆచరించి సంపాదించుకొన్నారు. పద్ధతియనగా యోగదండము ఉపయోగించి, చర్మము ఉపయోగించి చేయడము. చర్మము ఉపయోగించు రహస్యమేమనగా? వివరింతును వినుము.

యోగి యోగము ఆచరించువేళ జ్ఞానశక్తి అతనియందు ప్రవేశించుచుండును. శరీరమున ప్రవేశించిన శక్తి బ్రహ్మనాడిని చేరి ఊర్ధ్వముగా ప్రయాణించి తలయందుకల ఏడవ చక్రమున చేరుచుండును. అట్లు చేరువేళ క్రింద భూమ్యాకర్షణశక్తి వలన కొంత యోగశక్తి బ్రహ్మనాడిద్వారా క్రిందికి ఆకర్షింపబడి గుదస్థానమునందుకల ఆధార కమలమునుండి భూమిని చేరుచుండును. కాని యోగి యోగము చేయు శక్తినంతయు భూమి ఆకర్షించుకొనదు. అర్ధభాగము మాత్రము భూమి ఆకర్షించుకొనును. మిగతా అర్ధభాగము యోగియందే నిలుచును. భూమియందు ప్రవేశించిన శక్తి తిరిగి శూన్యమున మిళితమగుచుండును. భూమికి ఇటువంటి శక్తి యున్నదని మన పెద్దలు ఏనాడో తెలుసుకొని, వారు యోగమున చర్మములను ఉపయోగించుచుండిరి. చర్మమును భూమిమీద పరచి దానిమీద యోగి కూర్చున్న యోగి శరీరమునందు ప్రవేశించు శక్తిని భూమి లాగుకొనలేదు. గోడను దాటి సూర్యకిరణములు ఏలా పోలేవో అట్లే చర్మమును దాటి శక్తి పోలేదు. శక్తికి చర్మము నిరోధము. దేశములో చర్మముతప్ప ఏవస్తువులు శక్తిని నిరోధించలేవు. చాపమీద కూర్చున్న, మంచముమీద కూ ర్చు న్న, ఎక్కడ కూర్చున్న శక్తి తప్పక నష్టమగును. చర్మముమీద కూర్చున్న యోగశక్తి ఏమాత్రము నష్టపడదు.

భూమి పంచభూతములయందు ఒకటి కావున దీనికి విచిత్రమయిన ఆకర్షణశక్తి ఉన్నది. పైకెగిరిన వస్తువును మాత్రము భూమి తన వైపు ఆకర్షణవల్ల లాగుకొన్నట్లు యోగి యోగము చేయువేళ అనగా యోగశక్తి శరీరములో ప్రవేశించువేళ మాత్రమే శక్తిని తనవైపు లాగుకొనును. భూమి తన మీదనున్న వస్తువును కదల్చలేనట్లు సహస్త్రార చక్రమున చేరిన శక్తిని ఏమాత్రము ఆకర్షించుకోలేదు. దీనినిబట్టి యోగి యోగము చేయువేళ మాత్రమే శక్తి నష్టిపోవుటకు వీలున్నది. మిగత సమయములందు నష్టపోవుటకు వీలులేదు అని తెలియుచున్నది.

యోగి యోగించు సమయమున అర్ధభాగము శక్తియే ఎందుకు నష్టపోవును. నష్టపోవుశక్తి సగమున కంటే ఎక్కువో! లేక తక్కువో! ఎట్లు చెప్పనగును? అన్న సంశయము కొందరికి రావచ్చును దానికి సమాధానము శక్తి శరీరమునందు ప్రవేశించి

బ్రహ్మనాడిని చేరుచుండునుకదా! బ్రహ్మనాడిలో నాభి స్థానమును మొదలుకొని క్రిందిప్రక్క ప్రవేశించు శక్తిని అంతయు భూమి లాగుకొనును నాభిస్థానము మొదలుకొని పైన ప్రవేశించు శక్తిని భూమి లాగుకొనలేదు. నాభికంటే పైన ప్రవేశించు శక్తిని లాగుకొనుటకు భూమికి ఆకర్షణ బలము తక్కువ వచ్చును. కావున ఆరు చక్రములలో మూడు చక్రములవరకే భూమ్యాకర్షణశక్తి పారును. కాబట్టి యోగి సగభాగము శక్తిని మాత్రము నష్టపోవుటకు వీలు ఉన్నది. చర్మమును ఉపయోగించిన యోగశక్తి చర్మమును దాటిపోలేదు. భూమి ఆకర్షణ చర్మమును దాటిలాగలేదు. విద్యుచ్ఛక్తిని రబ్బరు ఎట్లు నిరోధించుచున్నదో అట్లే భూమ్యాకర్షణశక్తిని చర్మము నిరోధించుచున్నది.

పూర్వకాలమున యోగులు అందరు చర్మము ఉపయోగించి శక్తిని ఏమాత్రము నష్టపోక గొప్ప శక్తిపరులయినారు. ఈ కాలమున చర్మము యొక్క ప్రత్యేకత తెలియని మూఢ మానవులు చర్మములతో అవసరము ఏమున్నది? అని వాదించుచున్నారు. అవసరములేనిది గీత యందు ఆత్మ సంయమ యోగములో పరమాత్మ యోగి జింక చర్మముమీద కూర్చోవలయునని ఎందుకు చెప్పినాడు? ఈకాలములో యోగదండాలు జింక చర్మాలు నాగరికతలేని పాతకాలము పద్ధతులు అని అనువారు కూడ ఉన్నారు. పాతకాల పద్ధతులతో పాతకాలమువారు పలికిన పలుకులకు ప్రకృతియే తల్లక్రిందులు అయ్యేంతపని జరిగేది. కాని కొత్త కాలములో కొత్త పద్ధతులద్వారా వీరు ఏమి సాధించినారో తెలియకున్నది. ఈశ్వరుడు చర్మమును ఎల్లప్పుడు తన నడుముకు చుట్టుకొనెడివాడు. వశిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలగు మహామునులు చర్మమును యోగ దండమును ఎంతో భద్రముగా చూచుకొనెడివారు. కానీ ఈకాలములో అంత పవిత్రమయిన వస్తువులు ఏమాత్రము మానవులయందు విలువ లేకుండ పోయినాయంటే మానవుడు దిగజారి పోతున్నాడన్నమాట.

యోగశక్తిని నిరోధించుటకు ఒక జింక చర్మమేనా పనికి వచ్చునది అను ప్రశ్న కొందరికి కలుగవచ్చును. అందులకు సమాధానము ఏమనగా? యోగి శరీరమునకు ఇతరముగాయున్న ఏ జీవరాసి శరీర చర్మమయిన శక్తిని నిరోధించు బలము కలిగి

ఉండును. ఆ చర్మము సజీవముగానయిన ఉండవచ్చును లేక నిర్జీవముగానైన ఉండవచ్చును. అందువలననే పూర్వము ఈశ్వరుడు ఒక్కొక్కపుడు ఏనుగు చర్మము ధరించెడివాడు, మరియు పులి చర్మమును కూడ ధరించెడివాడు ఇంకనూ జింక చర్మముకూడ ధరించెడివాడు దీనినిబట్టి ఏ జీవరాసి చర్మమయిన ఒక్కటే అనుమాట తెలియుచున్నది. క్రైస్తవ మతకర్త అయిన ఏసు ప్రభువుయొక్క గురువుగారయిన యెహోవా ఒంటె చర్మము ధరించెడివాడు. శ్రీ మహా విష్ణువు పామమీద ఎడమచేతి మీదుగా మరియు కుడిచేతిమీదుగా పవళించుచు సూర్య చంద్రనాడులును మార్చుచు యోగము చేసినట్లు తెలియుచున్నది. పాముమీద పవళించినాడు కావున పాము చర్మము శక్తిని నిరోధించుచున్నది. ఇట్లు పరిశీలించిన సజీవములయినా సరే లేక నిర్జీవములయినా సరే చర్మము తప్పనిసరిగా ఉండవలయును అని తెలియుచున్నది. కాని ఈ కాలమున మనము అహంకారసంభూతులమై అంతయు తెలియుననుచు, ఎవరయిన చెప్పినను దానిని కించపరుస్తూ అధోగతిపాలగుచున్నాము. విష్ణు ఈశ్వర, యెహోవా మహర్షులకంటే మనము పెద్దవారమా! చూపులేని గ్రుడ్డివాడుపోయి గుంతలో పడినట్లు జ్ఞానదృష్టిలేని మానవులు మాయ అను గుంతలో పడి దానిలో మునిగి తేలి, మునిగి తేలి ప్రతి దినము ప్రతివాడు చేయు పనులనే చేయుచు ఏమాత్రము పరమాత్మ మార్గము గుర్తించక ఉన్నారు. తెలియని దానిని తెలిపినవాడు, కనుపించని దానిని చూపించినవాడు, అజ్ఞానములో జ్ఞానమిచ్చినవాడు, చీకటిలో దీపమయి వచ్చినవాడు “గురువు” అనినమ్మి గురుసేవయందు జీవితమును సార్ధకత చేసుకొని, జ్ఞాన దృష్టిని సంపాదించుకొని సర్వజ్ఞుడవు
కావలయునని కోరుచున్నాను.

యోగ శక్తి

జీవుడు చర్మమును ఉపయోగించి, యోగదండమును ఉపయోగించి సరయిన యోగమునందు నిలచియుండిన సమయమున యోగశక్తి జీవుని శరీరమునందు ప్రవేశించును అని తెలుసుకున్నాము. ఇక్కడ కొందరికి యోగశక్తి అనగానేమి? అది

ఎట్లుయుండును? దాని ప్రయోజనము మానవునకు [జీవునకు] ఏమియుండును? అను సంశయము బయలుదేర వచ్చును దానికి నాసమాధానము వినుము.

యోగశక్తి అనగా దానికి ఎన్నో పేర్లు ఉన్నవి. జ్ఞానశక్తి, పరమాత్మశక్తి, ఆత్మశక్తి, జ్ఞానాగ్ని అని యోగశక్తినే అందురు. ఎన్ని పేర్లుయున్నా శక్తిమటుకు ఒక్కటియే. అది ఎట్లుండును అంటే దానికి ఆకారము లేదు, రంగులేదు, రుచిలేదు, వాసనలేదు, కావున స్థూల దృష్టికి అది కనిపించదు. జ్ఞాన దృష్టికి మాత్రము కనిపించును. కావున దానిని గురించి చెప్పుటకు వీలగును. ప్రపంచములో జీవులకు దాని ప్రయోజనము నోటితో చెప్పలేనంత ఉన్నది. జ్ఞాన [యోగ] శక్తి లేని జీవితము నిరర్థకము. పవిత్రమయిన మానవ జన్మనుపొంది ఆత్మ విషయములయందు ముఖ్యమయిన జ్ఞానశక్తిని తెలుసుకోలేనియెడల మానవజన్మకే అర్థము లేకపోవును. యోగశక్తిని గురించి చెప్పుచున్నాను. జాగ్రత్తగలిగి వినుము.

యోగశక్తికి రూపములేదు అయినా నీకు అర్థమగుటకు ఒక రూపముగా భావించి చెప్పుచున్నాను. యోగశక్తి ఒక విధమయిన పొగరూపముగ యున్నదనుకొనుము. అది భూమి మొదలుకొని ఆకాశము వరకును వ్యాపించి ఉన్నది. అనగా ప్రకృతి స్వరూపములయిన పంచభూతములయందు అన్నిట నిండుకొని ఉన్నది. కావున యోగి యెందు యుండిననుసరే యోగశక్తి అక్కడనే తనకు చుట్టు ఉన్నది. సముద్రమున జీవరాసులు ఎక్కడయున్న నీటియందే యుండినట్లు సకల జీవరాసులు యోగ [ఆత్మ] శక్తి యందే ఉన్నవి. నీకు నాకు మధ్యన కంటికి కనుపించక ఉండునది అంతయు యోగశక్తియే. ఆత్మశక్తిలో లేని జీవరాసంటూ ప్రపంచమున లేదు. అణువణువున అదియే వ్యాపించి ఉన్నది దీనినే పరమాత్మశక్తి పరమాత్మ అనికూడ అనుచున్నారు. ఈ శక్తిలోనే నవగ్రహముల స్థూల దేహములయిన సూర్యగోళము, చంద్రగోళము మొదలగునవి మరియు నక్షత్రగోళములు బంధింపబడి శూన్యమున తేలుచున్నట్లు ఈ కాల ఖగోళశాస్త్రజ్ఞులకు అగుపించుచున్నవి. ఈ యోగశక్తిని [జ్ఞానశక్తిని] ఆమూలాగ్రముగ తెలుసుకొన్న జీవునికి తిరిగి జన్మలేదు.

యోగశక్తి యోగియందు ప్రవేశించుచుండును అన్నాను కదా! అంతకుముందు మానవునియందు శక్తి ఏమాత్రము ఉండదా అను సంశయము కొందరికి రావచ్చును. దానికి సమాధానము, ఒక్క మానవునియందేకాక సర్వజీవరాసులయందును సమముగా ఉండును. కాని యోగి యోగించుకొలది అతనియందు బయట యున్నదికూడ ప్రవేశించి ఎక్కువగుచున్నది. దీనికే గీతయందు పరమాత్మ "నన్ను పూజించు మనుజులు నాల్గు రకములుగా ఉన్నారు. అందు జ్ఞాని శ్రేష్ఠుడు, వాని యందు నేను నాయందు వాడుండును" అని అన్నాడు. ఆత్మశక్తి యోగి శరీరమున ప్రవేశించి సప్త స్థానమున నిలుచుచుండును. ఇట్లు ప్రవేశించు శక్తి ఒక నిర్ణయమయిన సంపూర్ణ స్థితిని అందుకోగానే ఆ యోగికి మోక్షము ప్రాప్తించును. యోగము ఆచరించు యోగులు అందరు సమానముకాదు. ఎందుకనగా యోగశక్తి ఒకరియందు ఎక్కువ ఒకరియందు తక్కువ ఉండును. కావున ఆ శక్తినిబట్టి యోగులయందు కూడచిన్న పెద్ద భేదములు యున్నవని చెప్పవచ్చును. యోగశక్తిని పొగ రూపముగా భావించుకున్నాముకదా! యోగి యోగించు సమయమున యోగి శరీరములోని సూక్ష్మరంధ్రములద్వారా యోగశక్తి లోపలికి ప్రవేశించుచుండును. ఎట్లనగ ఇంటిలోని పొగయంతయు పై కప్పుకుయున్న గవాచియందు ప్రవేశించినట్లు అనంతముగాయున్న శక్తి యోగి శరీరమున ప్రవేశించుచుండును. ఇక్కడ బయటయున్న శక్తి లోనికి ప్రవేశించి శరీరములో దాని సాంద్రత పెరిగిన బయట ఖాళీపడునుకదా అను అనుమానము కొందరికి రావచ్చును. దానికి సమాధానము ఇంటినిండా దట్టముగా నిండుకొనియున్న పొగ కొద్ది మాత్రము కిటికీగుండా బయటికి పోయిన ఇంటియందు ఖాళీ స్థలము ఏర్పడదు. కాని పొగయొక్క సాంద్రత తగ్గును. అటులనే పరమాత్మ శక్తి అపారమైనది దానియందు అణుమాత్రము యోగియందు ప్రవేశించిన ఖాళీ ఏర్పడునా, సాంద్రత కూడ తగ్గినది అని చెప్పుటకు వీలుకాక ఉండును. యోగి సంపూర్ణ స్థితి చెంది తిరిగి ప్రపంచమంతట నిండియున్న శక్తిలోనే కలసి జన్మమెత్తక పోవుటచే యోగియందు చేరిన శక్తి తిరిగి శూన్యముననే చేరుచున్నది. కావున శక్తి ఎక్కడ ఖాళీపడక ఎప్పటియట్లే ఎల్లవేళల ఉంటున్నది. దీనిని బట్టి జీవరూపము దైవరూపముగా మారుటకు శక్తి ఆధారముగా ఉన్నది అని తెలియుచున్నది. శక్తియే దైవము, దైవమే శక్తి. రంగు, రూపము,

రుచి, వాసనయున్న కర్పూరము శూన్యమున కలియుటకు అగ్ని అవసరమయినట్లు రంగు, ఆకారము, గుణములు కలిగిన జీవుడు శూన్యమున [పరమాత్మలో] కలియుటకు శక్తి అవసరము. యోగులు శక్తి సంపాదించనిది పరమాత్మలో కలియలేరు. కావున ప్రతి యోగి కష్టములకోర్చి సాధన జరుపుకొనవలయును. అట్లులేకున్న దైవమునందు కలియుటకు ఎట్లు వీలగును?

అనంతశక్తి [పరమాత్మ] నుండి సంచలనమై యుద్భవించిన జీవరాసులు తిరిగి ఆశక్తియందే లీనము కావలయును. అట్లు లీనము అగుటకు శక్తిని గురించి తెలుసుకొనవలయును. ఈశక్తిని తెలుసుకున్న తర్వాత తన నిజస్థలమేదయినది తన నిజమయిన పేరేదయినది నిజానికి తను ఎవరు అన్నది తెలుసుకోగలడు. శక్తిని తెలుసుకోలేనంతవరకు తన నిజస్థితి ఏమాత్రము తెలియక తన పేరడిగిన పుట్టిన తర్వాత పెట్టబడిన పేరు అదియు తనకు ప్రపంచతెలివి వచ్చిన తర్వాత ఇతరులు పేరుతో పిలుస్తూయుండగా అదియే నాపేరు అని అనుకొని దానిని చెప్పుచున్నాడు. కాని నిజానికి నీపేరు ఏమంటే చెప్పలేడు. నీవెవరని ప్రశ్నించిన ఫలాన వారి కొడుకును అని అనుచున్నాడు, అదియు వారికే పుట్టాడు అని అందరూ అంటూయుంటే తను అంటున్నాడు కాని తను ప్రపంచములో కూడ ఎవరికి పుట్టాను అన్నది తెలియదు. ఇతరులు మొదట వీరు మీ తల్లితండ్రి అని చెప్పితే వారినే జీవితాంతము తల్లి తండ్రులుగా చెప్పుచున్నాడు, శక్తిని తెలుసుకున్న తర్వాత నిజమయిన తల్లి తండ్రిని జన్మల అన్నిటియందు మారకయున్న తల్లి తండ్రిని తెలుసుకుంటూ ఉన్నాడు. శక్తిని తెలుసుకున్న తర్వాత నిజముగా నీతల్లి తండ్రి ఎవరని ప్రశ్నించిన ప్రపంచములో శరీర సంబంధమయిన తల్లి తండ్రుల పేర్లు చెప్పక పరమాత్మయే నాతల్లి తండ్రి అని నిజమయిన సమాధానము చెప్పగలడు. అంతవరకు చీకటిలో తాడును పామనుకొన్నట్లు అజ్ఞానములో ప్రకృతిని తల్లిదండ్రులనుకొనుచున్నాడు.

ఆత్మశక్తిని సంపాదించుకొన్న వానినే పెద్దలు యోగి అని అనుచున్నారు. శరీరమున ప్రవేశించిన ఆత్మశక్తి అట్లే యుండునా అంటే ఉండదు. ఎందుకుయుండదనగా మామూలు అగ్నికి ప్రపంచములో సర్వ వస్తువులను కాల్చేగుణము ఉన్నది. అట్లే యోగియందు యున్న

జ్ఞానశక్తికి [యోగశక్తి]కి సర్వ కర్మలను కాల్చే గుణము ఉన్నది. కావున యోగియొక్క కర్మలను కాల్చి బూడిద చేయుటకు శక్తి ఖర్చవుచూ ఉన్నది. యోగి శక్తిని సంపాదించుకొలది ఆశక్తి కొంత కర్మనుకాల్చుటకు ఉపయోగపడుచుండును, కొంత మిగులుచుండును. కర్మలు సంపూర్ణముగా కాలినరోజు జీవునితో కూడబడియుండిన శక్తి జీవుని తనయందే లీనము చేసుకొని జన్మ లేకుండా చేయును. జన్మ రావలయునన్న కర్మయుండవలయునుకదా! మోక్షము రావలయునన్న జ్ఞానశక్తి యుండవలయునుకదా! కావున కర్మలేనిది జన్మలేదు, జ్ఞానములేనిది మోక్షము లేదు.

జ్ఞానశక్తికి కర్మను కాల్చు శక్తి ఉన్నది. కావున గీత యందు పరమాత్మ జ్ఞానయోగములో "[యథైధాంసి సమిద్ధోగ్నిర్భస్మసాత్కురుతేర్జున, జ్ఞానాగ్ని సర్వ కర్మాణి భస్మసాత్కురుతే తథా] అగ్నియందెన్ని కట్టెలయినగాని భస్మమై నాశనమొందెదురీతి జ్ఞానమను అగ్నిచే సర్వకర్మచయము భస్మమొనరింపబడుచుండును" అని అన్నాడు. దీనినిబట్టి కర్మ జ్ఞానశక్తి వలన నిశ్శేషముగా కాలిపోవుటకు వీలుఉన్నది అని తెలియుచున్నది. మరియు యోగశక్తిచేత యోగి తన కర్మనేకాక ఇతరుల కర్మనుకూడ కాల్చవచ్చును. అగ్ని ఏకట్టెనయినా కాల్చినట్లు యోగశక్తి [జ్ఞానాగ్ని] ఎవరి కర్మనయినా కాల్చగలదు. అది ఎట్లనిన వినుము.

శరీరమునందు ప్రవేశించిన యోగశక్తిని యోగి సంకల్ప పూర్వకముగా ఇతరులయందు ప్రవేశింపజేయవచ్చును. అట్లు శక్తిని యోగి శరీరమునుండి బయటికి పంపుటకు నాలుగు మార్గములు కలవు. ఒకటి అరచేయి, రెండు పాదము, మూడు చూపు [కండ్లు] నాలుగు నోరు. ఈ నాలుగు యోగశక్తిని బయటికి పంపుటకు యోగి శరీరమున ద్వారములుగా ఉన్నవి. అందువలననే విశేషశక్తి కూడలి అయిన శ్రీరాముడు పాపముచేత శిలగా మారియున్న అహల్యమీద తన అరికాలు మోపగానే శక్తి అందు ప్రవేశించి కర్మను భస్మము చేయుటచేత రాయి మనిషి అయినది. శ్రీ పోతులూరి వీరబ్రహ్మముగారు అచ్చమ్మ కుమారుని కన్నుల మీద హస్తము యుంచుటచేత అరచేతిద్వారా శక్తి ఆ కర్మజీవియందు

ప్రవేశించి అంధత్వకారణమయిన పాపమును కాల్చివేసెను. కావున అచ్చమ్మ కుమారునికి చూపువచ్చెను. అట్లే యేసు ప్రభువు గుడ్డివాని కళ్ళకు మట్టిపూసి చూపు తెప్పించెను. అరచేతితో తాకి కుష్ఠురోగులను సహితము బాగుచేసెను. మరియు ఆయన నోటితో చెప్పినంతమాత్రమున దయ్యములు పారిపోయెను. శ్రీ కృష్ణుడు కండ్లనుండి చూచినంత మాత్రముననే కొంతమంది బాధలు నివారణమాయెను. ఈవిధముగా ఎందరో మహానుభావులయిన యోగులు తమలోయున్న యోగశక్తిని [జ్ఞానాగ్నిని] ఇతరులకు చూపు, నోరు, అరచేయి, అరికాలుద్వారా సంకల్పహితముగా ప్రసారింపచేసి వారిలోనున్న కర్మలను కాల్చిరి. కావున యోగశక్తి వీలుపడితే ఎవరి కర్మనయిన కాల్చును అని తెలియుచున్నది. జీవుని జన్మకు కర్మే కారణము. కర్మను కాల్చు బలము ఒక్క పరమాత్మశక్తికే ఉన్నది. పరమాత్మను నమ్మినవారికే ఆ శక్తి లభించును. అది లభించిన జన్మంబులంతమొందు జన్మలేకున్న జీవుడు అనంతశక్తి అయిన పరమాత్మయందు లీనమైపోవును. ఆత్మయందు లీనమయిన జీవుడు జగతియొక్క ప్రళయములకు ప్రభావములకు సంబంధములేక నిత్యానందములో నిండిపోవును. కావున శాశ్విత ఆనందపదవి కావలయునన్న నిత్యము యోగమాచరించి యోగశక్తి సంపాదించవలయునని నిన్ను హెచ్చరించుచున్నాను.

-)-(o)-(-

గురుబోధ యొక్క ఆవశ్యకత

గురు అనుపదమే అపారమైనది. మరియు అనంత శక్తిమయమైనది. గురుపదము ప్రపంచములో ఏ మానవునిమీద వాలినదో ఆయనే సాకార గురువు. గురువు తనరూపమునే బోధించును. తననే అనుసరించమనును, తనలోనికే చేర్చుకొనును.

గురువును గురించి తెలుపుటకు సాధ్యముకాదు. ఆయన ఊహకే అందనివాడు. అటువంటి గురువుయొక్క సాకారమునుండి ఏనాడయితే జీవుడు శక్తిని పొందగలుగుతాడో ఆ సమయమునుండియే నిరాకారమునుండి శక్తి తనలోనికి ప్రవహించుటకు మొదలుపెట్టును. అట్లు సాకారమునుండి బోధ [ఉపదేశము] లేక బాప్తిస్మము లేనిదే నిరాకారమునుండి శక్తి జీవునిలోనికిరాదు. ఎందుకనగా సాకారమే నిరాకారము, నిరాకారమే సాకారము. జీవుడు సాకారములో వున్నాడు. కాబట్టి నిరాకారుడయిన సాకార గురువును ఆశ్రయించవలసినదే గురువును ఆశ్రయించి నాల్గురకముల సేవలు చేయుచు గురువును సంతోషపరచు వాడై మెలంగుచుండిన ఎప్పుడో ఒకప్పుడు గురువుకు శిష్యునిమీద దయగలిగి తన జ్ఞానదృష్టిని ప్రసారింపజేయును. దానితో శిష్యుని హృదయమున జ్ఞాన బీజము ఏర్పడి అది పెరిగి మోక్షము అను ఫలమును ఇచ్చును.

సంపూర్ణమయిన విశ్వాసముంచి శిష్యుడు గురువును సేవించు చుండిన సర్వము యెరింగిన గురువు శిష్యుని నమ్మికను గుర్తించి వీనికి ఉపదేశము ఇచ్చిన దానిని సరయిన పద్ధతిలో సాధించగలడా లేడా అని తెలుసుకొని వాడు అర్హత కలిగిన వాడయితే వెంటనే ఉపదేశమిచ్చును. ఆ ఉపదేశ సమయమున కంటిచూపుకు కనపడకుండ ఏమి జరుగుచున్నదనగా! గురువు సంపూర్ణ శక్తి కేంద్రము. ఉపదేశ సమయమున గురువు నుండి జ్ఞానశక్తి బయలుదేరి శిష్యునియందు ప్రవేశించును. అంతవరకు అతనియందు ప్రవేశించక బయటిశక్తి గురూపదేశములో వెంటనే లోపలికి ప్రవేశించును. అపుడు మొదలుకొని శిష్యుడు యోగము ఆచరించువేళలయందు అతనియందు శక్తి ప్రవేశించుచునే ఉండును. శిష్యుడు యోగము ఆచరించుకొలది అతనియందు యోగశక్తి వృద్ధిచెందును. అట్లుకాక గురువును ఆశ్రయించక, శాస్త్రములవలన విషయములు తెలుసుకొని, అన్ని తెలిసినవి ఇక గురువేల అనుచు, తెలియనివారికే నేను తెలుపుదును అనుచు ఎవడయితే గురూపదేశము లేకుండ యోగము చేయునో వానియందు యోగశక్తి అణుమాత్రముకూడ ప్రవేశింపదు. యోగశక్తిని మొదట తనయందు ప్రవేశింపజేయుటకు మొదట తప్పనిసరిగ గురువు అవసరము. నిప్పులేని పొయ్యిలో ఎంత ఊదినను కట్టెలు చిన్నవి కాని లేక పెద్దవికాని మండవు. మొదట ఇతరుల దగ్గరనుంచి నిప్పును సంపాదించి తన పొయ్యిలో వేసుకున్న, ఆ నిప్పునే

ఊదుచుండిన అది పెద్దదయి ప్రజ్వరిల్లి ఎంతపెద్ద మొద్దులయినా కాల్చుటకు సమర్థత కలుగును. కనుక జ్ఞానాగ్ని నీవు గురువుల దగ్గరనుంచియే పొందవలయును. అటు పిమ్మట నీవు సాధన చేయుచుండిన జ్ఞానాగ్ని నీయందు ఎక్కువగా ప్రవేశించి ఎంతపెద్ద కర్మలనయిన కాల్చుటకు వీలగును. కొంతమంది గురూపదేశము సంపాదించుకొని ఇక చాలు మేము ధన్యులము అని సాధన ఏమాత్రము చేయకయున్నారు వారి విషయము ఎట్లనగ ప్రక్కవారి దగ్గరనుంచి నిప్పుతెచ్చుకొని మనపొయ్యిలో వేసుకొన్న తర్వాత దానిని ఊదకయుండిన కొద్దిసేపటికి వున్న అగ్ని కూడ ఆరిపోవును. అట్లే గురుబోధ సంపాదించి సాధన చేయక యున్న గురువు ఇచ్చిన జ్ఞానమను అగ్ని కొంతకాలమునకు వారియందు ఏమాత్రము లేకుండ పోవును. మొదట గురుబోధ తప్పనిసరి అవసరము ఆ తర్వాత యోగసాధనకూడ అవసరము.

చెరువులోని నీరు చేనులోకి పోవలయునంటే చెరువుకుయున్న తూము ద్వారానే పోవలయును. కాని వేరు మార్గము ఉండదు. అట్లే జ్ఞాన కేంద్రమయిన గురువులోని జ్ఞానశక్తి శిష్యునిలోనికి పోవలయునంటే గురుబోధద్వారానే పోవలయును కాని వేరు మార్గములేదు. చెరువులోని నీరు చేనులోకి వస్తేనే నీ పైరు పెరుగును. అట్లే గురువులోని జ్ఞానశక్తి నీలోకి వస్తేనే సాధన ఫలించును. అట్లుకాక యున్న నీరులేని చేనులో కష్టపడినను ఫలము లేనియట్లు గురుబోధలేని శరీరములో యోగశక్తి అభివృద్ధికాదు. అందువలన ప్రపంచములో ప్రతి జీవికి గురుబోధ ఆవశ్యకత ఎంతో ఉన్నది. వాస్తవము తెలుసుకొని మదిలోని అహంకారము విడిచిపెట్టి, గురువును ఆశ్రయించి, జ్ఞానశక్తి పొంది, సరి అయిన సాధన చేసి, మీరుకూడ కడతేర వలయును అని కోరుచున్నాను.

గురువులు ఎవరు

దేశమున గురువులు ఎందరో కలరు. గురు పదము సమానమైనా గురువుల జ్ఞానములో హెచ్చు తగ్గులు ఉండును. ఒకరు సర్వము నెరిగినవారై సంపూర్ణ జ్ఞానశక్తి

పరుడై ఉందురు. మరియొకరు సంపూర్ణ జ్ఞానశక్తి పరుడుకాక కొద్దిగా తక్కువగలవారై ఉందురు. ఇట్లే మరి కొంతమందివద్ద జ్ఞానము ఉండును కాని పూర్తిగాలేక ఒకరికొకరు భేదముకలిగి ఉండును. జ్ఞానమునందున్న భేదమువలన కొంతమంది గురువులు ఒకరిమాట ఇంకోకరికి సరిపోక బేధాభిప్రాయపడుచుందురు. సరిసమాన జ్ఞానమున్న గురువులు ఒకరికొకరు బేధము పెట్టుకొనరు. ఈవిధముగా అనేక స్థాయిల జ్ఞానశక్తియున్న గురువులు దేశములోయున్నారు. ఒకే గురు పదములో అనేకస్థాయిల జ్ఞానమున్న వారిని పరమాత్మ ఎందుకు సృష్టించాడనగా! ప్రపంచములో బుద్ధియందు బేధములుగల మానవులు ఉన్నారు. బుద్ధియందునేకాక రూపమునందును ప్రతి ఒక్కరికి బేధము ఉండనేయున్నది. బుద్ధికాని రూపముకాని మానవునికి కర్మ ఫలితమువలననే వచ్చును. పైన కనుపించు రూపము లోనవున్న బుద్ధి అందరికి ఒకే విధముగాలేక అనేక విధములై ఉన్నది. కావున వారి పాపపుణ్యములు కూడ అందరికి ఒకే స్థాయిలోలేక వేరు వేరు స్థాయిలలో వున్నవని తెలియుచున్నది. ఇటువంటి మానవులయందు కొంతమందికి పరమాత్మను తెలుసుకోవలయును అను అభిప్రాయము కలుగును. అట్లు తెలుసుకోవలయుననుకొన్న వారియందు కొంతమంది మాత్రము గట్టి ప్రయత్నము చేయుదురు. అట్లు ప్రయత్నము చేయువారియందు ఎవడో ఒక్కడు పరమాత్మను తెలుసుకొనును. పరమాత్మను తెలుసుకోవలయునని అందరు ఎందుకు అభిప్రాయపడలేదు? తెలుసుకోవలయునని అభిప్రాయపడిన వారందరు ఎందుకు ప్రయత్నించలేదు? ప్రయత్నించిన వారందరు ఎందుకు పరమాత్మను తెలుసుకోలేదు? అనగా వారికర్మఅనేక విధములుగా ఉన్నది, కావునవారు కూడ అనేక విధములుగానే నిలిచిపోయినారు.

జ్ఞానము లభించవలెనన్న గురువు తప్పక కావలయునుకదా! అందరికి ఒకే గురువుఉన్నా లేక అందరికి ఒకే జ్ఞానశక్తి ఉన్నా గురువు లభించిన అందరు ఒకే మాదిరి మారిపోవచ్చును. మానవుల కర్మ అనేక రకములుగా ఉన్న, ఒకేరకమయిన గురువు ఎట్లు లభించును? మానవుల కర్మ అనేకరకములుగా ఉన్నది కాబట్టి గురువులుకూడ వారి కర్మానుసారము అనేకములుగా ఉన్నారు. ప్రపంచములో "గురు" అను పదము ఒకటే అయినా ఆ పదము లభించినవారు అనేకము ఉన్నారు. "గురు" పదము స్వీకరించినవారు

ఎవరయినా "గురువే" గురు అను శబ్దము ఎవరి మీద వాలినదో వాడు ఎవడైన, ఎటువంటివాడయినా, ముసలివాడైనా, బాలుడయినా కురూపియైనా, అందగాడైన, స్త్రీ అయినా, పురుషుడయినా "గురువే" ప్రపంచములో మానవులు అనేక రక కర్మయుతులై ఉన్నారు కావున గురు పదముకూడ అనేక రకముల జ్ఞానశక్తి యున్నవారిమీద వాలి వారిని గురువులుగాచేసి వారివలన ఎవరి కర్మకు తగిన జ్ఞానమును వారికి బోధించుచున్నది. కావున పూర్ణబోధకొరకు పురుషుండు బహుజన్మ పుణ్యవశముచేత పుట్టవలయునని పెద్దలు అన్నారు. ఎంతో పుణ్యము యున్ననే పూర్ణబోధ లభించును. అట్లు కాకపోయిన ఎంత ఎంత పుణ్యముయుండునో అంత అంత జ్ఞాన గురువులే లభించి అంత అంతయే బోధించుదురు. మానవులందరు ఒకే రక భక్తికల్గినవారు కారు. అట్లే గురువులందరు ఒకే జ్ఞానపరులు కారు. జ్ఞానముయందు బేధము ఉన్ననూ "గురువు" గురువే కాని వేరు కారు. పరమాత్మయే ప్రజలకోసము అనేక విధ జ్ఞానమున్నవారిలో దూరి అనేక రక గురువులుగా ఉన్నాడు, కాని వేరు కాదు ప్రపంచములో ప్రజలు తెలియక ఏ గురువును దూషించినా అది పరమాత్మనే దూషించినదానితో సమానమగును. కొంతమంది మానవులకు గురువులుగా యున్నవారు తటస్థమగుట జరుగును. తటస్థపడిన వారందరు ఒకే రకముగా యుండక వివిధ మార్గోపదేశకులయి ఉందురు. శిష్యుడు కావలయుననుకొన్నవాడు వాని కర్మానుసారము ఒక గురువును నమ్మును. ఆ గురువుతోనే ఉపదేశము పొందును. పుణ్యఫలము తక్కువ యున్నవానికి పరిపూర్ణమయిన గురువు తటస్థించినను అతనిని నమ్మడు. పరిపూర్ణబోధ పుణ్యఫలము తక్కువయున్న వానికి సరిపడదు. కావున అసలు జ్ఞాని అయిన గురువును కొంతమంది మాత్రమే నమ్ముదురు. అట్లు నమ్మినవారియందుకూడ కర్మఫలము కొద్దిగ తేడా ఉండును. కాబట్టి అందరు కడతేరక ఎవడో ఒకడు ఆఖరుకు కడతేరుచున్నాడు. ఒకనాడు ప్రపంచ గురువులలో అధికుడయిన శ్రీ వీరబ్రహ్మముగారు ఎంతమందికి తటస్థించలేదు. చూచినవారందరు ఆయనను గురువని నమ్మినారా! నమ్మకపోగా హేళనకూడ చేసినారు. వారి పుణ్య కర్మఫలము తక్కువ ఉన్నది, కావున వారికి బ్రహ్మముగారు గురువుగా కనుపించకపోయి యుండును. కాని ఆయన పరిపూర్ణ గురువే పుణ్యకర్మ ఫలముయున్న వారందరు ఆయనను గురువు అని గుర్తించి నమ్మి ఉపదేశము పొందినారు. అట్లు ఉపదేశము పొందియున్న వారియందుకూడ కర్మఫలము

కొద్దిగా హెచ్చు తగ్గులుగా ఉన్నది, కాబట్టి అందరూ పరిపూర్ణులే కాలేకపోయినారు. అందువలననే భగవద్గీతయందు విజ్ఞాన యోగమున "అర్జునా నరులలో సిద్ధికై ప్రయత్నించువాడు వేయింటికొకడు కన్పట్టుట అరుదు. అట్లు యత్నించువారలయందు సహితమెవ్వడో ఒక్కండు నన్నెరుగువాడు" అని పరమాత్మ తెలిపి ఉన్నాడు. దేశమున మానవులు అనేక రకముల కర్మలతో కూడుకొని ఉన్నారు. గురువులు ఎవరయిన "గురువు" అను పదము ఒక్కటియే. గురువులు ఏమార్గమును బోధించిన అది చేరు గమ్యము పరమాత్మయే. గురువుల వ్యత్యాసములబట్టి పరమాత్మను చేరుకాలముకూడ తారతమ్యములుగానే ఉండును. ఒక గురువు వలన ఒకడు ఆ జన్మలోనే మోక్షము పొందుచున్నాడు. ఇంకొకడు గురువు వలన అనేక జన్మముల తర్వాత మోక్షము పొందుచున్నాడు. ఎప్పటికి పోయిన మోక్షమునకేగాని వేరే చోటికిపోడు.

ప్రపంచములో కొంతమంది గురువులు ఉన్నారు. వారియొద్ద ఉపదేశమును పొందిన ఏనాటికయినా మోక్షము లభించును. అట్లుకాక గురువులుకానివారిని గురువులని నమ్ముకొన్న ఏమి ప్రయోజనము లేదు. గురు పదమును అలంకరించి గురువులుగా కాకనే మేము గురువులము అని చలామణి అవుతున్న వారు దేశములో అనేకముగా ఉన్నారు. అటువంటి వారివలన అనేక సంశయములు కల్గి అజ్ఞానము వృద్ధి యగునేకాని, జ్ఞానము ఏనాటికి వృద్ధికాదు. పైన గురువులనిపించుకున్న అంతరంగమున శిష్యులకు జ్ఞానశక్తిని దానము చేయుటకు ఏ మాత్రము వీలు ఉండదు. ఒకవేళ వారు జ్ఞానము కలిగియున్న వారయినప్పటికిని ఇతరులను కడతేర్చలేరు. గురువులు ప్రపంచములో ఎట్లు తయారగుచున్నారో తెలుపుచున్నాను వినండి.

ఆదియందు ప్రజలను జ్ఞానపరులుగా చేయుటకై పరమాత్మయే తన్ను తాను సృజించుకొని ఒక మానవ గురువుగా బయల్పడెను. మరియు ఆయనే రెండవ వాడయిన శిష్యునిగా కూడ రూపొందెను. శిష్యుని ఆధారము చేసుకొని గురువు జ్ఞానబోధ బోధించసాగెను. ఆ బోధయందు సర్వము ఇమిడి ఉన్నది. ఆ బోధయందు ప్రపంచములో తెలియనిది లేదు. ఆ బోధయందు అజ్ఞానము భస్మమై జ్ఞానము దేదీప్యమానముగా

ప్రకాశించుచున్నది. ఆ బోధయందే జీవుడు ఎవడయినది తెలియుచున్నది. ఆ బోధయే ప్రపంచమునకు మొట్ట మొదటిది మరియు చిట్ట చివరిదై ఉన్నది. ఆ బోధను తెలుసుకున్న శిష్యుడు పరిపూర్ణుడు కాజొచ్చెను. పరిపూర్ణుడయిన శిష్యుని చూచి ఒకనాడు గురువు యిలా అనెను "మదీయ మానస పుత్రా నీవు నేటికి పరిపూర్ణజ్ఞానుడవయితివి. ఇక నేను ఈ రూపముతో ఉండుటకు అవసరము లేదు. కావున శరీరమును వదలివేయుచున్నాను. నేటినుంచి నన్ను గురించి జ్ఞానమును గురించి ప్రజలకు బోధించు అధికారము నీకు ఇచ్చుచున్నాను. నా అధికారములోయున్న నీవు ప్రజలలో జ్ఞాన దీపము వెలిగించు శక్తి కలవాడవు అగుదువు. అందువలన నిర్భయముగా నన్ను గురించి ప్రబోధించగలవు. నీ వలన నాబోధ విని నన్ను తెలుసుకొన్న ప్రవీణులకు నీవును నన్ను గురించి బోధించు అధికారము వారికి వప్పచెప్పి శరీరము వదలివేయుము. అట్లే వారును వారి శిష్యుల యందు ప్రవీణులైన వారికి నన్ను గురించి బోధించు అధికారము ఇచ్చునట్లు చెప్పుము. ఈవిధముగా నేడు నీకిచ్చు నన్ను బోధించు అధికారము, ప్రపంచము అంత్యమువరకు పోవలయును. ఈ నా అధికారము పొందినవాడే దేశములో గురువు. నా అధికారము పొందనివాడు ఎంత జ్ఞాని అయినా నా శక్తిని ఇతరులకు దానము చేయుటకు వీలు ఉండదు. నా అధికారము పొందనివాడు ప్రజలలో గురువు అని అనిపించుకోలేడు" అని తెలియజేసెను. ఆనాడు పరమాత్మ ఈవిధముగా చెప్పిన దానివలననే యేసు ప్రభువు ఎంతటి జ్ఞాని అయినను యెహోవా దగ్గర తనుకూడ ఉపదేశము [బాప్తిస్మము] తీసుకొని ప్రజలను రక్షించు అధికారము తీసుకొనిపోయెను. యెహోవా ఎంతో మందికి బాప్తిస్మము [ఉపదేశము] ఇచ్చెను. కాని అందరికి ప్రపంచమునకే తండ్రి అయిన పరమాత్మను గురించి బోధించు అధికారము ఇవ్వలేదు. అధికారమునుపొంది ప్రజలకు బోధించిన యేసు ప్రభువు తన పన్నెండు మంది శిష్యులను పిలచి " అపవిత్రాత్ములను వెళ్లగొట్టి పవిత్రాత్ములను నెలకొల్పుటకు, ప్రతి విధమయిన వ్యాధిని స్వస్థపరచుటకు, తండ్రియైన యెహోవాను గురించి బోధించుటకు వారికి అధికారమిచ్చెను. [బైబిలులో మత్తయి సువార్త 10వ అధ్యాయములో 1వ వాక్యము] అట్లే బ్రహ్మముగారు శిద్దయ్యకు అధికారము ఇచ్చెను. మరియు గొప్ప గురువయిన మశ్చీంద్రుడు తనకున్న శిష్యులందరికి అధికారమియ్యక తన్ను బాగాతెలుసుకున్న గోరా కుమారునకు అధికారమిచ్చి తనపీఠమునకు అధికారిగా చేసెను.

ఈవిధముగా ఒక గురువు శిష్యునికి అధికారము ఇచ్చిననాడే శిష్యుడుకూడ గురువు అనిపించుకొనుటకు వీలగును. అట్లు కాదేని గురువుగా ఎవరు మారుటకు వీలులేదు. గురువు చెప్పనిదే గురువులుగా మారినా కంటికి కనుపించకయున్న జ్ఞానశక్తి [యోగశక్తి] శిష్యులయందు ఏమాత్రము ప్రవేశించదు. గురువు దగ్గర గురువుగా అగుటకు అర్హత పొందినవారే గురువులు. వారినుండియే శక్తి శిష్యులందు ప్రవేశించును కాని దేశములో ఎవరివలన ప్రవేశించదు.

ఈకాలములో కొంతమంది గురువుల దగ్గర పీఠాధికారము పొందకనే గురువులము అని అనిపించుకుంటున్నారు. మరియు కొంతమంది గ్రంథములు చదివి అంతా తెలియునని గురువులగుచున్నారు. వీరందరు ప్రజల దృష్టిలో గురువులయిన పరమాత్మ దృష్టిలో గురువులు కారు. మరి కొంతమంది గురువుల దగ్గర ఉపదేశముపొందకనే సాధన చేయుచు యోగులమనుచున్నారు. అట్లు ఎంత యోగము చేసిన అగ్గిలేని పొయ్యిలో కట్టెలుపెట్టి ఊదినట్లుండును. కాన నిష్ప్రయోజనము వారి శ్రమ నిష్ఫలితమగును. ఇంకనూ కొంతమంది గురూపదేశము కావలయుననుకొని, గురువు తననే వెదకవచ్చును అని అనుకొనుచున్నారా. ఇది ఎట్లున్నదంటే ఆకలిగొన్నవాడు అన్నమే తన దగ్గరకు వస్తుంది అనుకున్నాడట. ఆకలిగొన్నవాడు ఇతరుల దగ్గరకుపోయి యాచించవలయును కాని, యాచించకనే అన్నము ఎవరు పెట్టుదురు. జ్ఞానము కావలయునని అనుకొన్నవాడు గురువుయొద్దకుపోయి ఎంతో వినయ విధేయతలతో మెలగి జ్ఞానమును అర్థించవలయునుకాని గురువులే వారియొద్దకు వస్తారు అనుకోవడము పొరపాటు. తేనెటీగ పుష్పము ఎంత దూరము యున్నను పోయి తేనెను తాగి వస్తున్నది. కాని పుష్పమే తేనెటీగయొద్దకు రాలేదుకదా! అట్లే గురుబోధ కావలయుననుకొన్న వారు గురువును అన్వేషించక గురువే వెదకుచువస్తాడు అని అనుకొని కాలము వ్యర్థము చేసుకోవడము పొరపాటు.

పూర్వము గురువులు శిష్యులను కొట్టి తిట్టి అనేకముగా బ్రహ్మవిద్యను నేర్పించుచుండెడివారు. శిష్యులు పరిపక్వు లయిననాడు, తను ఇచ్చిన ఉపదేశమును

సక్రమముగా ఆచరించునని తెలిసిననాడు గురువులు ప్రజలకు ఉపదేశమిచ్చి శిష్యులుగా చేసెడివారు. ఈ కాలములో అట్లుకాక అడిగిన వారందరికి గురువులు ఉపదేశము ఇచ్చి వేయుచున్నారు. ఉల్లిగడ్డకు పొరలుయున్నట్లు అనేక సంశయములు, గుణములు యున్న వారికి ఉపదేశమిచ్చుచున్నారు. అందువలననే వీరబ్రహ్మముగారు ఉల్లిగడ్డలకు ఉపదేశ మిచ్చు కల్ల గురువులు వచ్చేరు అన్నాడు. దేశములో ఎక్కువమంది శిష్యులుయున్న చాలు అని అనుకొను గురువులు కొంతమంది ఉన్నారు. బ్రహ్మవిద్యను వ్యాపార వస్తువుగా మార్చివేసినవారు కూడ ఉన్నారు. మరి శిష్యులందుమా! ఉపదేశము ఎందుకు అన్న అర్థము తెలియకున్న పోయిన వెంటనే ఉపదేశమిచ్చు గురువుల దగ్గర గురుబోధ తీసుకొనివచ్చి నేను గురుపుత్రుడను అనుకుంటూ ఏమియు ఆచరించక పరమాత్మను ఏమాత్రము తెలుసుకోలేకపోవుచున్నారు. ఇంకనూ కొంతమంది గురూపదేశము తీసుకొన్న మాత్రముననే మోక్షమును చేరగలము అని సులభముగా దొరకుచోట ఉపదేశము తీసుకొని తర్వాత అజ్ఞాని కంటెనూ ఇంకా అజ్ఞానులుగా ప్రవర్తించుచున్నారు. పిల్లలు తప్పుచేసిన తండ్రి బాధ్యుడయినట్లు శిష్యుడు తప్పుచేసిన గురువు బాధ్యుడగును. తండ్రి మంచివాడయిన పిల్లలను మంచిగానే నడుపగలడు అట్లే గురువు గట్టివాడయిన శిష్యులను బాగుగానే నడిపించును. ఏమి తెలియని ప్రజలు వచ్చిన వెంటనే వారికి ఉపదేశము యొక్క విలువకూడ తెలియకనే, గురుబోధ ఇచ్చి పంపి, వారు ఏమి చేయుచున్నారు అని గ్రహించకయుండే గురువులు కూడ చాలామంది ఉన్నారు. ఈ విధముగా యుండుట మంచిది కాదేమోనని నా అభిప్రాయము.

ఓ జీవులారా దేశమున గురువులను అన్వేషించి అతని కరుణా కటాక్షము సంపాదించి, ఆ తర్వాత ఉపదేశమును పొంది గురువు చెప్పినట్లు సాధనచేసి సాధనవల్ల యోగశక్తి సంపాదించి పరమాత్మయందు ఐక్యము పొందవలయునని కోరుచున్నాను.

ఆశ్రమములు

ఇపుడు ఆశ్రమముల గురించి తెలుపుచున్నాను. ఇందు తెలుపు విషయములు అందరికి కాక కొంతమంది ఆశ్రమవాసులకు విరుద్ధముగా కనుపించవచ్చును. వారికి నామీదకూడ ఆగ్రహము రావచ్చును. ఇందు నా తప్పు ఏమున్నది? దీని విషయమై నేను ఏమాత్రము బాధ్యుడనుకాను. నాకు ఏమియు తెలియదు. ఈ గ్రంథమంతయు పరమాత్మ ప్రేరేపితమున వ్రాయబడుచున్నది కాని వ్రాయునది నేను ఎంతమాత్రము కాదు. కావున నన్ను దూషించినను, పొగడినను మరియు దీనివల్ల వచ్చు కీర్తి అపకీర్తిలన్నియు నా తండ్రి అయిన పరమాత్మకే చేరును.

ఈ కాలములో భూమి మీద కొంతమంది భక్తాగ్రగణ్యులు ఆశ్రమములను సృష్టించుకొని ఉన్నారు. అందు కొన్ని ఆశ్రమములు బయటి ప్రపంచములో పేరు ప్రఖ్యాతులు లేకున్న ఎంతో పవిత్రత కలిగి ఉన్నవి. మరికొన్ని ప్రపంచములో పేరు ప్రఖ్యాతులు సంపాదించుకొన్న పవిత్రత ఏమాత్రము లేక ఉన్నవి. ఇంకనూ కొన్ని ఆశ్రమములు విగ్రహ ప్రతిష్టలతో నిండుకొని ఇది దేవాలయమా లేక ఆశ్రమమా అను అనుమానము కల్గించుచున్నవి. ఇంకనూ కొన్ని ఆశ్రమములు ఇది గుడియా బడియా లేక ఆశ్రమమా అను అనుమానము కూడ కల్గించుచున్నవి. ఇవి అన్నియు గ్రహించుతూ పొతే ఇంకా కొంతకాలమునకు ఆశ్రమముల స్థితి ఎట్లు మారిపోతుందో అర్థము కాలేదు.

పూర్వకాలములో భక్తులు కొంతమంది భూమిమీద ఆశ్రమములు సృష్టించుకొని ఉండిరి. వారు పరమ పవిత్రులుగాయుండి తాము నివసించు స్థలము కూడ పవిత్రస్థలము అను పేరు వచ్చునట్లు చేసిరి. అటువంటి ఆశ్రమములను విశదీకరించిచూచిన అందు వారు యోగ సాధనకై వినియోగించబడు వస్తువులయిన చర్మములను, యోగదండములను ఎంతో భద్రముగా పెట్టుకొనెడివారు. ఈ కాలములో చూస్తే ఆశ్రమములలో అవి ఎక్కడ కనుపించవు. ఒకవేళ కనుపించిన చూపాకారానికి వాటిని ఆశ్రమములలో పెట్టుకొని ఉందురేకాని ఏమాత్రము ఉపయోగించరు. పూర్వకాలము ఆశ్రమములలో దేవతా ప్రతిష్టలు

కాని దేవతా పటములు గాని ఎక్కడ కనుపించెడివికావు. ఈ కాలములో దేవతా ప్రతిమలను ఆశ్రమములతో ప్రతిష్టించారు. మరియు దేవతా పటములు అనేకము ఆశ్రమములలో కనిపించును. పూర్వకాలము బ్రహ్మవిద్యను నేర్చి దాని ద్వారా సాధనచేసి బ్రహ్మను తెలుసుకున్న వారు యుంటే ఈ కాలములో ప్రాపంచిక విద్య అయినా సంస్కృతమును బాగా నేర్చి పదములకు అర్థములు చెప్పేది తెలుసుకున్నారు. బ్రహ్మను తెలుసుకోలేకున్న సంస్కృతము తెలుసుకుంటే చాలు ఆశ్రమములలో స్వాములైపోతున్నారు.

ఆశ్రమములు ఏవిధముగా ఉండవలయునంటే; ఆశ్రమములందు బ్రహ్మవిద్యను అభ్యసించువారు కాని అభ్యసించిన యోగులు కాని ఉండవలయును. యోగదండము, చర్మము యోగమునకు అవసరమయిన వస్తువులు కాబట్టి అవి తప్పక ఉండవలయును. దేవతలను కొలుచువారు కాని దేవతలను గురించి బోధించువారు కాని యుండకూడదు. పరమాత్మను తలంచుచుండువారు కాని పరమాత్మను తెలుసుకొని బోధించుచుండువారు కాని ఆశ్రమములయందు ఉండవలయును. దేవతా ప్రతిమలను కాని దేవతా పటములను కాని ఆశ్రమములయందు ఏమాత్రము యుంచకూడదు. నిరాకారుడే సాకారునిగాయున్న శ్రీగురుదేవుని చిత్రమును ఉంచవచ్చును. గురువు ఆకారచిత్రము తప్ప ఇతర ఏ దేవతా చిత్రమును ఆశ్రమములయందు యుండుటకు అనర్హాములు. గీతాశాస్త్రమున విజ్ఞాన యోగమందు " ప్రకృతి సంబంధములగు పాపములచేత కోర్కెలుగలవారై అజ్ఞానులగుచు అన్యదేవతారాధన చేయుచున్నారు దానివలన కామ్యార్థసిద్ధి లభించునుకానీ మోక్షసిద్ధి ఏమాత్రము లభించదు. అల్పబుద్ధులయినవారు పొందు ఫలితము కూడ అంత అంతయే యుండును. దేవతా భక్తులెల్లరు దేవతలను చెందుదురు. నా భక్తులు నన్ను చేరగలరు" అని పరమాత్మ తెలిపి ఉన్నాడు. కావున దేవతలను పూజించిన మోక్షము ఏనాటికి లభించదు. పరమాత్మను ఆరాధించిన వారికే మోక్షము ప్రాప్తించును. ఆశ్రమమున మోక్షకాములు యుండవలయును కాని కార్యకాములు యుండకూడదు. ఆశ్రమములు నిశ్చల పరబ్రహ్మ నిలయమున్నట్లు యుండవలయును. కాని దేవాలయములు యున్నట్లు యుండకూడదు. ఆశ్రమములయందుండువారు ఇతరులకు దేవదేవుడయిన ఆత్మను గురించియే చెప్పవలయును. విష్ణు, ఈశ్వరులు కూడ సూర్య చంద్రనాడులు నడుపుచు అసలయిన

పరమాత్మను గురించి ఎల్ల వేళల యోగము చేయచుండ మనము దేవతా పూజలు ఆశ్రమములలో చేయుచుంటే ఏమి బాగుండును. మోక్షము నొసంగుటకు పరమాత్మయే దిక్కని మేము ఎల్లవేళల కష్టపడి యోగము చేయచుండ, మమ్ములను మోక్షమడుగు వారు బుద్ధిహీనులు అని ఈశ్వరుడు అన్నాడు. పూర్వకాలము మోక్షమును కోరువారు అందు సరయిన ఆచరణ గల్గియుండి ఆఖరకు మోక్షమును పొందిరి అది సరయిన పద్ధతి. అట్లుకాక ఈ కాలములో ఆశ్రమముల సృష్టించుకొని దేవతా ప్రతిమలను అందు ప్రతిష్టించుకొని అనుదినము పూజలు చేయుచు మోక్షము కావలయునన్న అడుక్కుతిను వారి దగ్గరకు పోయి అడుక్కున్నట్లు ఉంటుంది. దేవతలే మోక్షము కొరకు ప్రాకులాడుచుండ నీకెక్కడి నుండి ఇవ్వగలరు. అజ్ఞాన ప్రజలు దేవతలను పూజింపవచ్చును కాని ఆశ్రమవాసులుకూడ దేవతలనే పూజించుచూ యుంటే అజ్ఞానులకు ఆశ్రమవాసులకు ఏమి తేడాయుంటుంది? కావున ఆశ్రమవాసులు దేవతలను పూజించకుండా దేవతలయందు చైతన్యమైన పరమాత్మనే నమ్మవలయును.

జీవుడు మాయ అను సముద్రములో విషయములు అను మొసళ్ల చేత, భార్యాబిడ్డలను చేపలచేత, ఆస్తి పాస్తులు అను అలల చేత బాధపడుచు, సముద్రమును ఈదలేక మునిగిపోవు సమయమున, నన్ను ఎవ్వరు ఈ మాయ సముద్రమునుండి రక్షించువారు లేరే అని దుఃఖించు సమయమున ఓడవలె కనిపించి, వానిని మాయ సముద్రమునుండి కాపాడి ఆశ్రయమిచ్చుచున్నది ఆశ్రమము.

అజ్ఞానమనెడి చీకటిలో దారి తెలియక అవస్థలుపడుచు కాలమనెడి సర్పముచేత చిక్కి నిమిష నిమిషమున దాని బాధకోర్వలేక తల్లడిల్లు వానికి ఆశ్రయమిచ్చునది ఆశ్రమము, అజ్ఞానాంధకారమును పటాపంచలుచేసి కాల సర్పమునుండి విడిపించువారు ఆశ్రమవాసులు.

శరీర రోగములను బాగుచేయుటకు వైద్యశాలలు, ఆ వైద్య శాలలందు డాక్టట్లు వున్నట్లు పాపపుణ్యములను భవరోగములను బాగుచేయు నిమిత్తము ఆశ్రమములు ఆ

ఆశ్రమములందు ఆశ్రమవాసులు ఉందురు. ప్రాపంచిక విద్య నేర్పించుటకై పాఠశాలలు, అందు ఉపాధ్యాయులు వున్నట్లు, పరమాత్మ [బ్రహ్మ] విద్యను నేర్పించు నిమిత్తము నెలకొల్పబడినవై ఆశ్రమములు ఉండవలయును. మరియు ఆశ్రమవాసులు బ్రహ్మవిద్యను సరిగ నేర్పించువారై యుండవలయును.

బ్రహ్మవిద్యకు ప్రాణవాయువు ఆశ్రమములు, ఆశ్రమవాసులే కావున ఇంతగా తెలుపడమైనది. దీనిని గురించి ఎవరు తప్పుగా భావించకూడదని కోరుచున్నాను.

సాంఖ్య, తారక, అమనస్క యోగములు

దేహములో యున్న ఆత్మను పొందుటకు మూడు పద్ధతులు ఉన్నవి. అవి [1] సాంఖ్యము [2] తారకము [3] అమనస్కము. ఈ మూడింటియందు ఏ పద్ధతి అనుసరించి అయినా ఆత్మను పొందవచ్చును.

సాంఖ్యము ద్వారాకాని, తారకము ద్వారాకాని, అమనస్కముతో కాని చెందు దానినే అచలము అని అనుచున్నారు. సాంఖ్య తారక అమనస్క సాఫల్యమే అచలము. జీవుడు ఏ పద్ధతిద్వారా అయినా అచలమును పొందవలసినదే. సాధనలు మూడు అయినా సాఫల్యము ఒక్కటియే.

కొంతమంది గురుబోధ తీసుకున్నవారు మాది అమనస్కము మాది తారకము, మాది సాంఖ్యము మా పద్ధతి వేరు మీ పద్ధతి వేరు అని వాదించుచున్నారు. మరియు మాది అచల పద్ధతి అని చెప్పువారు కూడ ఉన్నారు. ఇంతకంటే అజ్ఞానులు ఎవ్వరు యుండరని చెప్పవచ్చును. గురు బోధ తీసుకొని సాంఖ్య, తారక, అమనస్కములు తెలియక, అవినాభావ సంబంధమున్న వాటికి బేధములు పెట్టి వాదించుచున్నారంటే ఏమి చెప్పాలో అర్థము కాలేదు. పైగా అచలము అనగా ఏమిటో తెలియనివారు మాది అచలము అనుచున్నారు. అచలము

అన్నదానిని ఒక పార్టిగా భావించినారు. ఇది మహా పాపము జ్ఞానముద్వారా చేరబడు స్థలమే అచలము [జ్ఞేయము] అటువంటి అచలమును వేరే రకముగా చెప్పు చున్నారంటే బ్రహ్మవిద్య దీనావస్థలో ఉన్నదన్నమాట. అచలము కంటే మా తారకము గొప్ప అనువారు ఉన్నారు. వారిని చూచి నవ్వాలో ఏడ్వాలో, ఏమనాలో నాకే అర్థము కాలేదు. నీది తారకమా, అచలమా, అమనస్కమా సాంఖ్యమా అని నన్నే ప్రశ్నించిన వారిని చూచి ఏమి మాట్లాడకపోయే సరికి ఏమి తెలియదు అని నన్నే ఎగతాళి చేసినవారు ఉన్నారు. బ్రహ్మవిద్య ప్రజల చేతిలో పడరాని పాట్లు పడుచు విలపించుచున్నట్లు కనుపించుచున్నది. దానికి నాబోధ కొంచెము చేయూత నిచ్చి ప్రజలలో సరయిన స్థితిలో నిలుపగలదని గురు కరుణా ప్రసాదములో వ్రాయుచున్నాను.

సాంఖ్యము :– పరమాత్మను తెలుసుకొనుటకు ఇదియొక మార్గము. సాంఖ్యము అనగా ఆత్మను శరీరమును విడదీసి తెలుసుకోవడము. ఆత్మవేరు శరీరము వేరు. ఒకే ఆత్మ ఎన్నియో శరీరములను కర్మానుసారముగా ధరించుచున్నది. ఆత్మ ఎన్ని శరీరములు ధరించుతూపోయిన దానియందు బాల్యము, యౌవ్వనము, వృద్ధాప్యము అనునవి ఏమాత్రము కలుగక ఒకే స్థితి గలిగి ఉండును. ఆత్మ ధరించిన శరీరము మాత్రము శీతోష్ణములకు మార్పుచెందుచు, బాల్య, యౌవన, కౌమార, వృద్ధాప్యములు పొందుచూ ఆఖరుకు నాశనము చెందుచున్నది. ఆత్మ అగ్నికి కాలదు. నీటికి తడువదు. కత్తికి తెగదు, గాలికి త్రోయబడదు. కాని శరీరము అగ్నికి కాలును నీటికి తడువును. కత్తికి తెగును, గాలికి త్రోయబడును. దీనివలన ఆత్మ నాశనము లేనిది శరీరము నాశనమవునది అని తెలియుచున్నది. ఆత్మ శరీరములను కర్మానుసారముగా మార్చుతు పోవును. కాని ఆత్మ చావదు. చచ్చునది శరీరమే కావున మనమందరము ప్రపంచము పుట్టినప్పటినుంచి ఉన్నాము అని సాంఖ్యము ద్వారా తెలియుచున్నది.

సాంఖ్య యోగమాచరించిన శరీరముద్వారా ఆత్మను తెలుసుకోవచ్చును. కావున శరీరము ఎట్లు పుట్టుచున్నది? దాని ఇంద్రియములు ఎట్లు పుట్టుచున్నవి? ఇంద్రియములు ఏమి పనులు చేయును? ఇంద్రియములకు ఆధారము ఏమి? ఇంద్రియములు చేయుపనులకు పెద్ద ఎవరు? అను విషయములు సాంఖ్యమున ముఖ్యమయినవి. ఈ విశదీకరణ ఎవడయితే

చేసి దానివలన ఆత్మను తెలుసుకొనుటకు ప్రయత్నించుచున్నాడో వానిని సాంఖ్యయోగి అని జ్ఞానులు అందురు. సాంఖ్య యోగము ద్వారా ఆత్మను తెలుసుకున్న తర్వాత ఆ స్థితిని అచలము అని అందురు.

తారకము:- ఆత్మను తెలుసుకొని పొందుటకు ఇదియొక మార్గము. శరీరములో యుండు శ్వాసద్వారా ఆత్మను తెలుసుకోవడమును తారకము అని అందురు. తారకమునందు శ్వాస అనగా ఏమి? అది పైకి క్రిందికి ఆడవలసిన అవసరము ఎందుకు వచ్చినది? శ్వాస ఏ ఆధారముతో పైకి క్రిందకు ఆడుచున్నది? ఆ ఆధారము ఎక్కడ యున్నది? శ్వాసకు పెద్ద ఎవరు? అని ముఖ్యముగా తెలుసుకొని ఈ విషయములద్వారా ఆత్మను పొందవలయును. ఈ విధముగా తారకము ద్వారా ఆత్మను తెలుసుకొన్న ఆ స్థితినినే అచలము అని అందురు.

అమనస్కము:- పరమాత్మను తెలుసుకొనుటకు ఇదియొక మార్గము. శరీరములోయుండు మనస్సుద్వారా ఆత్మను తెలుసుకొనుటను అమనస్కము అని అందురు. అమనస్కమందు, మనస్సు అనగా ఏమి? మనస్సు ఆధారములు ఏమి? అది ఎప్పుడు ఎట్లు పని చేయుచుండును? జీవునకు మనస్సు ద్వారా లాభమా? నష్టమా? అనునది ముఖ్యముగా తెలుసుకోవలయును. ఈ విధముగా మనస్సును విశదీకరించుకొని, మరియు వశము చేసుకొని దానిద్వారా ఆత్మను తెలుసుకోవడమును అమనస్కము అందురు. అమనస్కముద్వారా ఆత్మను పొందిన దానినే అచలము అని అందురు.

పెద్దలు సాంఖ్య తారక అమనస్కములను తెలుసుకోమన్నారు. సాంఖ్యమున అవయవములను విశదీకరించుతూపోగా మనస్సు తెలియునున్నది. కావున సాంఖ్యమునకు అమనస్కమునకు సంబంధము ఉన్నది. సాంఖ్యము తెలిసిన అమనస్కము తెలుసును. అమనస్కమును విశదీకరించుతూపోగా తారకమును తెలియుచున్నది, కావున తారకమునకు అమనస్కమునకు సంబంధమున్నది. తారకము తెలిసిన అమనస్కము తెలుసును. అమనస్కమును విశదీకరించి తారకము దానిద్వారా సాంఖ్యము తెలియుచున్నది. ఇట్లు సాంఖ్య, తారక అమనస్కములు ఒకదానికి ఒకటి సంబంధముకల్గి ఉన్నవి. ఒక దానిని

తెలుసుకున్న మిగత రెండు తెలియును దేనిద్వారా ముందుకు సాగి ఆత్మను తెలుసుకున్న అచలమగును. కావున అమనస్కము వేరు, తారకము వేరు, సాంఖ్యము వేరు అని వాదించువారు అవివేకులు. మూడుయందు ఏ దానిని ఆచరించక మాది అచల పద్ధతి అను వారు శుద్ధ అవివేకులు. అచలమనునది సాంఖ్య తారక అమనస్కముల మాదిరి ఒక పద్ధతియే కాదు.

మాది అచలము మేము ఎట్లు యుండిన చెల్లును అని అనుకోక ఏదో ఒక పద్ధతి అనుసరించి దానిద్వారా పరమాత్మను పొంది అచలుడయి ఆనందము పొందిన మేలు యుండును.

స్థూల దృష్టి, జ్ఞాన దృష్టి, యోగ దృష్టి

దృష్టి అనగా చూపు. చూపు అనగా ఒక దృశ్యముయొక్క స్థితి తెలుసుకోవడము. ఇంకనూ నిగూఢముగా చెప్పవలయునంటే జీవుడు తనకు అన్యథా [వేరయి] యున్న దానిని తెలుసుకోవడము. దృష్టిని సర్వజీవరాసులకు వాని కర్మననుసరించి పరమాత్మ ప్రసాదించినాడు.

ముఖ్యముగా దృష్టి మూడు రకములుగా విభజింపబడి ఉన్నది. అవి [1] స్థూల దృష్టి [2] జ్ఞాన దృష్టి [3] యోగ దృష్టి. మొదటిదైన స్థూల దృష్టి మానవులకు అందరికి యుండనే యున్నది. ఇది మాంసపుకన్నులతో చూడదగినది. కన్నులు యున్న ప్రతివారు చూచునది. దీనికి కనుపించునది ప్రత్యక్ష ప్రకృతి. ఈ దృష్టి జీవులకు ఎదురుగా యున్న దానిని మాత్రము చూపగలదు దీని శక్తి ఇంతే. ఈ దృష్టికి వెలుగు సూర్యుడు చంద్రుడు మొదలగు దీపములు. వెలుగులేనిది ఈ దృష్టి ఏమాత్రము కనుపించక పోవును కావున చూపుయున్నను ఇతర వెలుగులమీద ఆధార పడవలసి యుండును.

[2] జ్ఞాన దృష్టి:- ఇది జీవునకు ప్రత్యక్షముగా యున్న దానిని కాక, ఎదురుగా లేనిదంతయు తెలియజేయును. దీనికి మాంసపు కన్నులు పనికిరావు. ఈ కన్నులతో చూచునదికాదు. ఈ దృష్టికి ప్రత్యేకమైన కన్నులు లేవు. కన్నులు లేకున్న దృష్టి అను పేరు ఎట్లు వచ్చినది? అని కొందరు అనుకుందురేమోయని మూడవ కన్ను ఉన్నదని పెద్దలు తెలిపినారు. మూడవకన్ను అనగా ఈశ్వరునికి ఒక్కనికే ఉన్నదని కొందరు అజ్ఞానము చేత అనుకొందురు. త్రినేత్రము ప్రతి జీవునకు అనగా పశు పక్షి మృగాదులకు కూడ దేవుడు ప్రసాదించినాడు. కాని ఆ చూపు అందరికి అంతయు లేదు. ఎట్లనగా సాధారణ కన్నులుయున్న ప్రతి జీవికి చూపు బాగాయున్నది అని చెప్పలేము కదా! కొంతమందికి చూపు ఏ కొద్ది మాత్రమో ఉండును. కొంతమందికి చూపు బాగ ఉండును. కొంతమందికి సరిగలేక ఉండును. ఇంకా కొందరికి ఏమాత్రము చూపులేక గ్రుడ్డివారుగా ఉన్నారు కదా! అట్లే మూడవ నేత్రము అని అనుచున్నామే అదే జ్ఞాన దృష్టి ఇది అందరికి ఉన్నది అనుటకు ఆస్కారములేదు. కొందరికి పూర్తి ఉండును. కొందరికి కొంచెము మాత్రము ఉండును. కొంతమందికి పేరుకుమాత్రము ఉండును.

జ్ఞానము అనగా యదార్థము తెలిసినది. అజ్ఞానము అనగా యదార్థము తెలియనిది. జ్ఞానదృష్టి అనగా జీవునకు యదార్థము తెలిపినది అని అర్థము మూడవకన్ను మన శరీరమునందు ప్రత్యేకముగాలేదు. కాబట్టి ఈ చూపు కన్నులకుయున్న చూపు మాదిరి ఉండదు. ఇది ప్రత్యేకమైన చూపు. ఉదాహరణమునకు ఒక చిత్రము మాంసపు కన్నులతో చూచియున్న, మరుసటి దినము ఆ చిత్రమును అనుకున్న మాత్రమున దృశ్యములు అన్నియు తిరిగి చూచినట్లు జ్ఞాపకమునకు వచ్చును. కాని మొదటి చూపు వేరు ఈ చూపు వేరు. చిత్రములో పులిని చూచినపుడు మాంసపు కన్నులు ద్వారా తిరిగి దానిని జ్ఞాపకము తెచ్చుకున్నపుడు ఆ పులిని మనము చూచునట్లే అగును. కానీ ఆ చూపుకు ఈ చూపుకు తేడా ఉన్నది. దీనికి ప్రత్యేకమయిన కన్నులులేకున్న చూపునకు అందినట్లు ఉన్నది. కావున మనలో మూడవ కన్ను ఉన్నది అని పెద్దలు అన్నారు. జీవునకు ప్రత్యక్షముగా లేని దానిని తెలియజేయుచున్నది కావున జ్ఞాన నేత్రము అనికూడ పెద్దలు అన్నారు.

జ్ఞాననేత్రము చాలా పవిత్రమయినది. అది అందరకు ఉన్నది. కాని చాలామంది దానిని తెరువలేక ఉన్నారు. తెరువని దానికి చూపు ఎలా అందుతుంది? జ్ఞాన చక్షువు యొక్క చూపు చాలా అపారమైనది. ఇది స్థూల కన్నులకు కనుపించు దానినేకాక కనుపించని దానిని సహితము తెలియపరుచును. ఇంకనూ చెప్పవలయునంటే చూపు బాగాయుంటే భూమండలము మొదలుకొని సూర్య చంద్ర నక్షత్రమండలముల వరకు చూడగల శక్తి దీనికి గలదు. మాంసపు కన్నుల చూపుకు సూర్య, చంద్ర దీపముల వెలుగు, అట్లే జ్ఞాననేత్రమునకు వెలుగు గురువు [పరమాత్మ]. గురువు లేనిది జ్ఞాననేత్రము ప్రకాశించదు అనగా చూడలేదు మాంసపు కన్నులకు సూర్య, చంద్ర వెలుగులేకున్న అంతయు అంధకారము. చూపుకు ఏమియు అందదు. అట్లే జ్ఞాన నేత్రమునకు గురువు వెలుగు. ఈ వెలుగు లేనిది మిగులునది అజ్ఞానాంధకారము. ఈఅంధకారమునందు ఏమియు తెలియదు.

యోగదృష్టి:- యోగదృష్టియు, జ్ఞానదృష్టియు రెండు ఒక్కటియే కాని కొన్ని ప్రత్యేకతలవలన ఒకే దృష్టిని జ్ఞానదృష్టిగా మరియు యోగదృష్టిగా విడదీయడమయినది. ఆత్మ తప్ప ఆత్మ విషయములయిన అనేక సూక్ష్మముల వరకు తెలియజేయు దానిని ఒక దృష్టిగా, ఆత్మ విషయముల మినహా ఆత్మను మాత్రమే తెలియజేయు దానిని ఒక దృష్టిగా పెద్దలు విడదీసినారు. మొదటి దృష్టిని జ్ఞాన దృష్టి అనియు, రెండవ దానిని యోగదృష్టి అనియు పిలువబడెను. అందువలననే గీతాశాస్త్రమున క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగమునందు "క్షేత్ర క్షేత్రజ్ఞయోరేవ మన్తరం జ్ఞాన చక్షుషా, భూత ప్రకృతి మోక్షంచ యే విదుర్యాన్తి తే పరమ్" జ్ఞాన నేత్రముచే ఎవరు పురుషులకు ప్రకృతికి యున్న బేధమును, భూతజాలముల స్వభావంబును, మోక్షమును తెలుసుకోగలరో వారు బ్రహ్మంబును పొందగలరు" అని శ్రీకృష్ణ పరమాత్మ తెలియపరచినాడు. దీనియందున్న అంతరార్థము ఏమనగా? ప్రకృతి పురుషుల బేధములను, జీవుల స్వభావములను, మోక్షమును తెలుసుకోవడము ఒక భాగము,బ్రహ్మను పొందడము తర్వాత భాగము అని విడదీయవచ్చును. అన్నియు తెలిసిన తర్వాతనే బ్రహ్మను పొందుదురు అని భగవంతుడు చెప్పినాడు. మరియు ఆత్మ విషయకములయిన ప్రకృతి పురుషులను, జీవులను, మోక్షమును ఎవరయితే జ్ఞాన

నేత్రముచే తెలుసుకొందురో అనికూడ అన్నాడు. కావున జ్ఞాననేత్రమునకు ఆత్మతప్ప ఆత్మను తెలుసుకొను విషయములన్నియు తెలుసుకొనుటకు శక్తి ఉన్నది అని తెలియుచున్నది. మరియు ఆత్మవిషయములు మినహా యున్న ఆత్మను తెలుసుకొనుటకు యోగదృష్టి కావలయునని తెలియుచున్నది. దీనినిబట్టి ఒకే దృష్టి రెండుగా విభజింపబడి, ఒకటి నిరాకార సంబంధములను, రెండవది నిరాకారమైన పరమాత్మనే తెలియజేయుచున్నదని తెలియుచున్నది. అందువలననే జ్ఞానికి జ్ఞానముయున్నను యోగములేక ఏమి ప్రయోజనము లేదు. జ్ఞానదృష్టి కలిగియున్నను యోగదృష్టి లేనిది నిష్ప్రయోజనము. జ్ఞానదృష్టిని, యోగదృష్టిని యొసంగువాడు గురువు. గురువును నమ్మి కొలచిన ప్రతి జీవుడు అతి తొందరగా రెండు దృష్టులను పొందగలడు.

జ్ఞానదృష్టిని ఒక రూపమేర్పరుచుకొని చెప్పవచ్చును. కాని యోగదృష్టిని అట్లు చెప్పుటకు వీలుపడదు. అసలు దానికి పేరేలేదు. ఆత్మయందు ఐక్యతచెందిన వానికి చూపులేదు, కనుపించునదియు లేదు. అట్లుయున్న దానిని ఏమని చెప్పనగును? ఇట్లున్నదని చెప్పజాలము. మనము అర్థము చేసుకొనుటకు ఒక గుర్తు రూపమున దానికి యోగదృష్టి అనుపేరు యుంచినామే కాని దానికి పేరేలేదు. చూచువాడు యున్నకదా, కనుపించువాడు యుండునది. యోగమునందు చూచువాడు [జీవుడు] కనుపించువాడు [దేవుడు] ఒక్కటియైయున్న చూచునది లేదు, కనుపించునది లేదు, కావున దృష్టికాని దానిని బాహ్యార్థముకై మనము పేరుయుంచుకొని చెప్పుచున్నాము. కాని దానికి పేరు ఏమాత్రము లేదని ప్రతి ఒక్కరు తెలుసుకోవలయును.

మనకుయున్న స్థూల కన్నులద్వారా ఇతరుల కన్నులను చూచి వారికి చూపు యుందా లేదా? చూపుయున్న ఎంతమాత్రము ఉన్నది అని తెలుసుకున్నట్లు జ్ఞాన నేత్రముద్వారా ఇతరులకు యున్న జ్ఞాన నేత్రమును గ్రహించి [చూచి] దానికి చూపు యుందా లేదా? అనియు చూపుయున్న ఎంతమాత్రము యున్నదనియు తెలుసుకొనుటకు వీలగును. కాని యోగ నేత్రముద్వారా ఇతరులను చూచి ఆత్మయందు ఐక్యము చెందినాడా లేదా అన్నది ఏమాత్రము తెలుసుకొనుటకు వీలు ఉండదు. యోగదృష్టికి తెలియునది ఒక

పరమాత్మయే, దానియందు తానే సర్వ ప్రపంచము నిండియుండగా ఇతరత్ర ఎవరయినయుంటే కదా దానిని తెలుసుకోవలయుననునది. అసలుకు సంకల్పములే లేకున్న ఇతరులను తెలుసుకొనుట ఎట్లు? అందువలన ఇతరత్రా జీవుడు ఎంత జ్ఞానము యున్నవాడు అనునది జ్ఞానదృష్టి ద్వారానే తెలుసుకోవచ్చును. కాని వాడు ఆత్మయందు ఐక్యత చెందినాడా లేదా అనునది ఏమాత్రము తెలుసుకొనుటకు వీలుపడదు. కొంత మంది మేము తెలుసుకుంటాము అనువారు కలరు. వారు ఇతరులను వాదించి మెప్పించవచ్చునేమో కాని వారి అంతరాత్మయందు వారికే తెలుసు అట్లు కనుగొనలేమని కావున పైన నా బోధను ఒప్పుకోకపోయిన అంతరాత్మయందైనను ఒప్పుకుంటారు కదా! అందువలన నేనెప్పుడు సంతోషపరవశుడనే.

ఓ మానవులారా స్థూల కన్నులకు కనుపించు దానినే నిజమని నమ్ముకోక, స్థూల కన్నులకు కనుపించకయున్న విషయములను జ్ఞాననేత్రము తెరచి గురువు అను వెలుగులో పరికించిచూచి ఆత్మను తెలుసుకొని దానియందు ఐక్యము కావలెనని మిమ్ముల కోరుచున్నాను.

గ్రహాలు, విగ్రహాలు

పుట్టిన ప్రతిజీవి తప్పక మరణించవలసినదే. మరణించు స్థితిని మృత్యువు అంటారు. మృత్యువు కర్మను అనుసరించి రెండు రకములుగా నిర్దేశింపబడి ఉన్నది. అవి [1] కాలమృత్యువు [2] అకాలమృత్యువు. కాలమృత్యువు అనగా జీవునికి యుండబడిన ఆయుష్షు అంతయు అయి పోయిన తర్వాత వచ్చునది. అకాలమృత్యువు అనగా జీవునికి యుండబడు ఆయుష్షు అంతయు అయిపోక మునుపే సంభవించునది. కాలమృత్యువు నందు జీవుడు స్థూల, సూక్ష్మ శరీరములు వదలిపోవును. అకాల మృత్యువు నందు జీవుడు స్థూల శరీరము మాత్రము వదలివేయును, సూక్ష్మ శరీరము ధరించి ఉండును. అకాల మృత్యువుతో చనిపోయినవారు కాలమృత్యువు సంభవించునంతవరకు యుండి, కాలమృత్యువు

సంభవించిన వెంటనే అంత వరకుయున్న సూక్ష్మ శరీరమును కూడ వదలి కారణ శరీరము [పాపము, పుణ్యము] చేత బంధింపబడి పోయి వేరే శరీరము ధరించుచున్నారు. అందువలననే భగవద్గీతయందు సాంఖ్యయోగమున "దేహి దేహమును ధరించి దానియందు వరుసగా బాల్యమును, యౌవనమును, కౌమారము వృద్ధాప్యము అట్లే మృత్యువును పొందుచున్నాడు. మృత్యువును పొందిన వెంటనే మరియు క్రొత్త శరీరమును ధరించుచున్నాడు" అని పరమాత్మ తెలిపియున్నాడు.

చాలామందికి అకాలమృత్యువు ఎందుకు ఉన్నది? అకాల మృత్యువు పొందిన తర్వాత జీవుని రూపు ఎట్లు ఉండును? అకాల మృత్యువు పొందిన తర్వాత కాలమృత్యువు సంభవించునంతవరకు జీవుడు ఏమి చేయుచుండును? అను ఎన్నియో అనుమానములు బయలుదేరవచ్చును. వారు అడుగు ప్రశ్నలకు అడగలేని ప్రశ్నలకు నా సమాధానము ఏమనగా ! జీవుడు పాప పుణ్యములు సంపాదించుకొనుచున్నాడు కదా! వాటినే కదా మనము కర్మ అనుచున్నది. కర్మ రెండు రకములుగా ఉన్నది. ఒకటి మానసిక కర్మ, రెండవది శారీరక కర్మ. మానసిక కర్మ అనగా జీవుడు శరీరముతో కాకుండ మనస్సుతో సంపాదించుకొన్నది. మరియు మనస్సుతోనే అనుభవించునది. శారీరక కర్మ అనగా మనస్సుతో కాకుండ జీవుడు శరీరముతో చేసుకొన్నది, మరియు శరీరముతోనే అనుభవించునది. దీనినే ఇంకనూ వివరముగా తెలుసుకున్న మానసిక కర్మ అనగా జీవుడు సూక్ష్మ శరీరము ద్వారా అనుభవించునది అనియు, శారీరక కర్మ అనగా జీవుడు స్థూల శరీరముద్వారా అనుభవించుచున్నదనియు తెలియుచున్నది. ఈ రెండు కర్మలు దాదాపు సమానముగా యున్నవాడు రెండునూ అనుభవించుచూపోయి ప్రారబ్ధమున అవి అయిపోయిన వెంటనే కాలమృత్యువును పొందుచున్నాడు. అట్లుకాక శారీరక కర్మ తక్కువ ఉండి మానసిక ఎక్కువ ఉండిన, ప్రారబ్ధమున శారీరక కర్మ ముందుగా అయిపోయి మానసిక కర్మ ఒకటి మాత్రము మిగులును. శారీరక కర్మ ఎపుడు అయిపోవుచున్నాదో ఇక స్థూల దేహముతో పనిలేదు. కాబట్టి అకాలమృత్యువు సంభవించుచున్నది. అకాలమృత్యువులో మిగులునది సూక్ష్మ శరీరము. దానితోనే మానసిక కర్మ అంతయు అనుభవింపబడుచున్నది. పాప పుణ్యములు

[కర్మ] శారీరక మానసిక అని రెండు రకములుగా ఉన్నది కావున కాలమృత్యువు, అకాలమృత్యువు అని రెండు రకముల మృత్యువులను పరమాత్మ ప్రపంచములో వుంచాడు.

జీవుడు స్థూల శరీరములో యున్నప్పుడు బ్రతికి ఉన్నాడు అందురు. స్థూలశరీరము వీడిపోయిన వెంటనే చనిపోయినాడు అని అందురు. కాని ఆ మరణము కాల మరణమా? అకాల మరణమా? అని గుర్తించుటకు వీలుకాదు. అట్లే మనము ఎంతో మంది మరణించుట చూస్తున్నాము. జీవుడు కాలమరణము పొందెనా అకాల మరణము పొందెనా అని గుర్తించలేక పోవుచున్నాము. జీవుడు అకాల మృత్యువుతో చనిపోయిన తర్వాత, సూక్ష్మ శరీరము మాత్రము మిగులుచున్నది కదా! దాని రూపు ఎట్లుండుననగా ముందు ఏ స్థూలశరీరముతో కూడుకొని సూక్ష్మ శరీరము యుండునో దాని రూపునే సూక్ష్మ శరీరముకూడ పొంది ఉండును. కాని సూక్ష్మ శరీరమునకే మరియొక పేరు కలదు. దానినే "గ్రహ" అని అందురు. గ్రహ అను దానినే కొంతమంది దయ్యము అనికూడ అందురు. ఇంకా కొంతమంది భూతము అనికూడ అందురు. దయ్యము, భూతము, గ్రహ అని సూక్ష్మ శరీరమునే అందురు. జీవుడు ఒకమారు అకాలమృత్యువు ద్వారా తనకున్న స్థూల శరీరమును విడచిన తర్వాత దానియందు ఎప్పటికి ప్రవేశించలేడు. అట్లే మృతి పొందిన ఏ స్థూల దేహమునందును ప్రవేశించలేడు. కాని బ్రతికియున్న ఏ జీవ శరీరమునందైన ప్రవేశించగలడు. అందువలననే చచ్చినవారు వచ్చి బ్రతికియున్న వారియందు ప్రవేశించి మాట్లాడుట ప్రత్యక్షముగా అక్కడక్కడ చూచుచునేయున్నాము. ఇక్కడ కొంతమందికి, బ్రతికియున్న వారి శరీరములో సూక్ష్మ శరీరమున్నది కదా, వేరొక శరీరము ఎట్లు ప్రవేశించను? ముందునుండి ఆ శరీరములో యున్న సూక్ష్మ శరీరము ఆ సమయమున ఎక్కడ పోవును? అను అనుమానము రావచ్చును. దానికి సమాధానము ఏమనగా, సూక్ష్మ శరీరము బ్రతికియున్న శరీరములోనికి అవలీలగా ప్రవేశించగలదు. ఎట్లనిన సూర్యకిరణము గాజు అద్దములో దూరినట్లు సూక్ష్మశరీరము కూడ స్థూల దేహములందు దూరును. కాని జీవశరీరమునందు సూక్ష్మ శరీరముండునుకదా! అది వేరొక సూక్ష్మశరీరము తన స్థూలములోనికి వచ్చినపుడు నిద్రావస్థలోనికి పోవును. అందువలన వేరే గ్రహ [సూక్ష్మశరీరము] తనయందు ప్రవేశించి ఏమి చేసినది జీవునకు తెలియదు. గుఱ్ఱమును ఎక్కి

రౌతు తన ఇష్టప్రకారము గుఱ్ఱమును నడుపునట్లు, స్థూలదేహములోనికి ఏ సూక్ష్మ శరీరము చేరిన ఆ సూక్ష్మ శరీర ప్రకారమే స్థూలము నడుచుకొనును. ఏ విధముగా అనిన, తమలపాకు నములుటకు అలవాటులేని వానియందు వేరే గ్రహ [సూక్ష్మశరీరము] ప్రవేశించిన, ఆ గ్రహకు తాంబూలము అలవాటుయున్న, ఆ సమయములో తాంబూలము వేసుకొనును. మరియు తమిళ భాషరాని ఒకనియందు తమిళ భాష మాట్లాడు గ్రహ ప్రవేశించిన ఆ సమయములో తమిళభాషనే మాట్లాడును. అట్లే పాటలు రానివానికి పాటలుపాడు గ్రహపట్టిన ఆ సమయమున పాటలు పాడుచున్నాడు. ఈ విధముగా సూక్ష్మ శరీరము ఏ అలవాటు, ఏ గుణములు కలదియో, అది ప్రవేశించిన స్థూల దేహములో కూడ అవియే కనపడుచుండును.

ప్రపంచములో ఎంతో మంది అకాల మృత్యువు ద్వారా గ్రహాలుగా మారి ఉన్నారు. వారు అందరు ఇతరులయందు ప్రవేశించరు. కొంతమంది మాత్రము ఇతరులయందు ప్రవేశించుచుందురు. కాని ఇంకొక రహస్య మేమనగా 84 లక్షల జీవరాసుల స్థూలశరీరములు వేరైన, జీవులుమాత్రము ఒక్కటియే కదా, అందువలన గ్రహాలు [సూక్ష్మ శరీరములు] తమ జాతి శరీరములయందే కాక ఇతరజాతి శరీరములయందు కూడ ప్రవేశించుచున్నవి. మానవ శరీరములోనికి మానవ గ్రహాలు ప్రవేశించుచున్నవి, మరియు పాముల గ్రహాలు, ఇతరత్రా జాతి జీవుల గ్రహాలుకూడ ప్రవేశించుట సంభవించుచున్నది. మనిషియందు మనిషిజాతి గ్రహా ప్రవేశించిన మనిషి ప్రవర్తించినట్లే ప్రవర్తించును. మానవుడు మాట్లాడునట్లే మాట్లాడును. మనిషియందు పాముజాతి గ్రహ ప్రవేశించిన పాము ప్రాకినట్లే ప్రాకును, పాము బుసకొట్టినట్లే బుసకొట్టును. ఏ భాష మాట్లాడలేక పోవును. పూర్వము మనిషి సూక్ష్మ శరీరము ఇతరజాతి మృగములయందు ప్రవేశించి మానవభాష మాట్లాడిన సంఘటనలు ఉన్నాయి. దీనిని బట్టి చూచిన ఒక్క మానవ సూక్ష్మ శరీరములేకాక 84 లక్షల రకముల జీవరాసుల యొక్క సూక్ష్మ శరీరములు ప్రపంచములో ఉన్నట్లు తెలియుచున్నది. సూక్ష్మ దేహములు ధరించియున్న జీవరాసులన్నింటిని జ్ఞానదృష్టితో చూచిన రెండవ ప్రపంచమా అనునట్లు తోచుచున్నది. మానవులకు దీని విషయము తెలిసిన తెలియకపోయినా స్థూల కంటికి కనపడని ప్రపంచముయుండనే ఉన్నది. దానియందు సర్వజీవరాసులు, మానవులు పాపపుణ్యముల ఫలితములయిన సుఖ దుఃఖములు

అనుభవించినట్లే అనుభవించుచున్నారు. ఈ ప్రపంచములో మనమందరము కష్టపడునట్లే గ్రహాలు కూడ కష్టపడుచున్నవి. మనమందరము ఒకరికొకరు పరస్పర సంబంధము కలిగియున్నట్లే అవియు పరస్పర సంబంధము కల్గియున్నవి. మనము ఒకరికొకరు మాట్లాడుకొనునట్లే అవియు ఒకరుకొకరు మాట్లాడుకొనుచున్నవి. ఏ జాతికి ఏ ప్రవర్తన యుండునో ఆ జాతికి ఆ ప్రవర్తనయే ఉండును. సూక్ష్మశరీరమునందు జ్ఞాత, బుద్ధి, మనస్సు, అహంకారము ఉన్నవి. కాబట్టి మానవులకు యున్న గుణములు మానవ గ్రహాలకు కూడ ఉండును. సూక్ష్మశరీరముల మయమైన రెండవ ప్రపంచము మన కన్నులకు కనుపించదు. సూక్ష్మశరీరములు మన కంటికి కనుపించవు కాని సూక్ష్మ శరీరముల చూపుకు సూక్ష్మ శరీరములేకాక స్థూల శరీరములు అన్నియు కనుపించుచూ ఉండును. అనగా వాటిని మనము చూడలేకున్న మనలను గ్రహాలు చూడగలుగుచున్నవి. కొంతమంది మేము గ్రహాలను చూచినాము అని వాదించుచున్నారు. దానికి నా సమాధానము ఏమనగా! పగలుపూట గ్రహాలు సాధారణముగా ఎవరికి కనుపించవు. రాత్రిపూట కనుపించుటకు ఆస్కారము ఉన్నది. అదియు ఎట్లనిన రాత్రి పూటకూడ జాగ్రతావస్థ బాగాయున్న వారికి ఏమాత్రము కనుపించవు. జాగ్రతావస్థ బాగాయుండక జాగ్రత్తలోనే నిద్రావస్థ పొందినవారికి, అనగా దారిన నడుస్తున్నపుడైన నిద్రమత్తులో వున్న వారికి స్థూలశరీరము పూర్తిగా జాగ్రత్తలో ఉండదు. కనుక వాని సూక్ష్మశరీరచూపుకు గ్రహాలు కనుపించవచ్చును. అదియు పూర్తి రూపు కనిపించదు. పలానా జాతి అని మాత్రము తెలియును. అందువలననే నిద్ర ఎక్కువగా యున్న మనుషులు రాత్రిపూట బయట సంచారము చేసిన వారికి గ్రహాలు కనుపించుచున్నవి. అవియు మానవ గ్రహాలేకాక ఇతర జాతి గ్రహాలు కూడ కనుపించును. అందువలన కొందరు నాకు దయ్యము కుక్కమాదిరి కనిపించినది, నాకు దున్నపోతు మాదిరి కనుపించినది, నాకు పొట్టేలుమాదిరి కనిపించినది అని రక రకములుగ చెప్పుచుందురు. ఎట్లు కనిపించిన స్థూలదృష్టికి ఏమాత్రము ఉండదు. సూక్ష్మ శరీర చూపుకు కొద్దిగా కనిపించి ఉండవచ్చు.

జీవుడు అకాల మృత్యువును పొంది సూక్ష్మ శరీరముతో ఎంతో కాలము యుండవలసివచ్చునుకదా! అంతవరకు ఎక్కడ నివాసము చేయు చుండుననగా కొంతమంది స్మశానములలోనే నివాసము చేయుచున్నారు. కొంతమంది పాడుపడిన

గృహములలో నివాసము చేయుచున్నారు. మరి కొంతమంది, చింతచెట్లు, జమ్మిచెట్లు, మఱ్ఱిచెట్లు, జువ్విచెట్లు, మేడిచెట్లు యందు నివాసము యుంటున్నారు. కొంతమంది చచ్చిన చోటునే యుంటున్నారు. మనకు పగలు మెలుకువ, రాత్రినిద్రయున్నట్లు సూక్ష్మ శరీరములకు రాత్రి మెలుకువ, పగలు నిద్ర ఉన్నది. కావున గ్రహాలు రాత్రిపూట ఎక్కువ సంచారము చేయుచుండును. చీకటి మనకు ఎట్లు మత్తు తెస్తుయున్నదో అట్లే సూర్యకిరణములు గ్రహాలకు మత్తు తెచ్చును. మనకు ఆకలి యున్నట్లే సూక్ష్మ శరీరములకు కూడ ఆకలి ఉన్నది. మనము ఆకలి కోసము అనేక పాట్లు పడినట్లు సూక్ష్మ శరీరములు కూడ ఆకలి తీర్చుకొనుటకు అనేక పాట్లు పడుచున్నవి. మనము భుజించు ఆహారమే గ్రహాలు భుజించుచున్నవి. మనకు తెలియకనే మన ఆహారమును, ధాన్యమును గ్రహాలు తీసుకపోవును. అట్లు తీసుకపోవుటను ఎవరు గ్రహించలేరు. కాని పూర్వము జ్ఞానదృష్టియున్న పెద్దలు గ్రహాలయొక్క స్థితి గతులను తెలుసుకొన్నవారై ధాన్యమును కల్లముగా చేసి కుప్పగా [రాశిగా] పోసిన సమయములో గ్రహాలు భయపడి రాశి దగ్గరకు రాకుండుటకు బాకునో, బల్లెమునో, కొడవలినో, టెంకాయనో ఏదో ఒక దానిని ఆ ధాన్యము రాశి మీద ఉంచెడివారు మరియు రాశిచుట్టు గీత గీచెడివారు. ఆ పనిని కొంత మంది ఇప్పటికి కూడ చేయుచున్నారు. కాని ఎందుకు చేయుచున్నది ఏమాత్రము తెలియదు. ధాన్యము రాశిపోసినపుడే గ్రహాలు ఆ రాశిలోని ధాన్యమును అదృశ్యరూపము చేసుకొని తీసుకపోవుటకు ఎక్కువ ఆస్కారము ఉన్నది. కావున ఎవరయిన కల్లముచేయు వేళ ధాన్యము మీద ఏదో ఒకటి యుంచకపోతే నూరు బస్తాలు అవుతాయనుకున్న ధాన్యము కొలిచేటప్పటికీ ఎనభై బస్తాలుకే దిగును. ఇట్లు అనేక చోట్ల జరుగుచుండును. గ్రహాలు నివాసము చేయు గ్రహములలో సంసారము వృద్ధి లేకుండ పోవుటకుకూడ కారణము ఇదియే. కొన్ని పొలములలోకూడ కంకులతో యున్న గింజలనే గ్రహాలు మాయము చేయగలవు. కావున అవి అట్లు చేయకుండుటకు పూర్వము పెద్దలు పొలములలో పొలి అనుపేరుతో కోడినో, లేక పోట్లేలునో కోసి గ్రహాలకు విందు చేయుచుండిరి. ఆ విందును ఆరగించిన గ్రహాలు వారిమీద దయదలచి వారి పొలములోనికి రాకుండ పోవుచుండెడివి. ఈ కాలములో కొన్ని స్థలములయందు ఇప్పటికి పొలి చేయుచున్నారు కాని అది ఎందుకో ఎవరికి తెలియదు. పొలి గ్రహాలుకు విందని ఏమాత్రము చాలామందికి తెలియదు. తెలిసిన తెలియకపోయిన పొలి మాత్రము గ్రహాలకు విందే. ఈ విషయము తెలియక పొలి చేయని

చేనులో, మరియు కల్లములలో దిగుబడి తక్కువ వచ్చుచుండెను. ఇంతే కాక అన్నము రాశియొద్ద కూడ ఇట్లే జరుగుచుండును. పొట్టేల్లను కోసి మాంసము కుప్పవేయు స్థలములలో కూడ గ్రహాలు దొంగతనము చేయు చుండును. కొన్ని చోట్ల ముందు తూకము చేసిన మాంసమును మరల తూకముచేసిన చాలా తగ్గి ఉండును. కారణము గ్రహాలు తీసుకపోయి ఉండును. ఈ విధముగా అదృశ్యరూపములోయున్న సూక్ష్మ శరీరములు తమ ఆహారమును సంపాదించుకొనుచున్నవి.

గ్రహాలు ఒక చోటినుండి ఇంకొక చోటికి పోవలయునంటె మనమాదిరే రైల్లు, బస్సులయందు ప్రయాణము చేయుచున్నవి. వాటిని టికెట్లు అడుగువారు ఎవరులేరు. ఆడ మగ బేధములు సూక్ష్మ శరీరములు కలిగి ఉన్నవికదా! అందువలన మనమాదిరే సూక్ష్మశరీరములు స్త్రీ, పురుష సంయోగములు చేయుచున్నవి. గ్రహాలుగా మారియున్న వారికి బ్రతికిన వారిని సంయోగించవలయునని కోర్కెకలిగిన వారు బ్రతికిన వారిని సంయోగము చేయుచున్నారు. కాని ఎట్లు అనునది సామాన్యముగా ఎవరికి తెలియదు. గ్రహాలుగాయున్నవారు వారిలోనే ఒకరికొకరు కొట్టుకొనుచున్నారు మరియు తిట్టుకొనుచున్నారు. మొత్తముమీద జీవితమంతయు మనకున్నట్లే ఉండును. ఇదియంతయు మనకంటికి అగుపించదు. కావున కొంతమంది నమ్మకపోవచ్చును. నమ్మనివారికి అకాలమృత్యువు వస్తే అపుడయిన చెప్పినదంతయు నిజమని తెలుసుకుంటారు.

గ్రహాలు అనగా ఎవరో కాదు మనలోయున్న జీవరాసులే. గ్రహాలకు అజ్ఞానులు భయపడుదురు. అవియు వారినే పీడించును. జ్ఞానులు మాత్రము భయపడరు అవి వారిని భయపెట్టలేవు, బాధించలేవు, గ్రహాలు అజ్ఞానుల శరీరములలో ప్రవేశించినట్లు జ్ఞానుల శరీరములోనికి ప్రవేశింపలేవు. ఎందుకనగా మండుచున్న అగ్ని గుండములోమనము నిలబడగలమా? లేక అడుగయిన పెట్టగలమా? అట్లే గ్రహాలు జ్ఞానాగ్నియున్న శరీరములయందు ప్రవేశించలేవు. ఒకవేళ దగ్గరకు వచ్చినా జ్ఞానాగ్ని వేడిమికి నిలువలేక దూరముగా పోవును. మరియు జ్ఞానవంతులయిన యోగులకు గ్రహాలు భయపడును. అందువలననే యేసు ప్రభవును చూచి కొన్ని గ్రహాలు పారిపోయినాయి. యోగుల జ్ఞానదృష్టికి

గ్రహాలు కనుపించును. కావుననే శ్రీ వీరబ్రహ్మముగారి శిష్యుడు సిద్దయ్య చెట్టుమీదయున్న గ్రహాను జుట్టుపట్టుకొని క్రిందికి దించి గురువుగారికి అప్పచెప్పినాడు. ఈ విధముగా జ్ఞాన వంతులకు గ్రహాలు చాలాచోట్ల లొంగిపోయినవి. జ్ఞానులుకాక అజ్ఞానులై తెలిసినవారిని హేళనచేసి మేము పెద్ద చదువులు చదివినాముకదా, మా చదువులలో దయ్యాలు ఉన్నట్లు వ్రాయలేదే అని అనుకొనువారు కూడ ఉన్నారు. ప్రాపంచిక చదువు చదివితే కంటికి కనుపించునదే తెలుసును. కాని పరమాత్మ చదువు చదివితే కంటికి కనిపించనిది కూడ తెలియును. అజ్ఞానములోయున్న వారిని గ్రహాలు అనేక రకములుగా బాధించుచున్నవి కొన్ని బాధలు గ్రహాలువలననే సంభవించుచున్నవని చాలామందికి తెలియదు. ఆ బాధలు ఎట్లుండుననగా, కొంతమందికి శరీరములో గ్రహాలు ప్రవేశించి కడుపులో ఎక్కువ నొప్పి వచ్చునట్లు చేయుచున్నవి. ఈ కడుపు నొప్పికి మందులు ఏమాత్రము పనిచేయవు. మందులు పనిచేయకపోగా యక్స్ రే తీయించిన ఫిల్మునందు ఏ దోషము కనుపించదు. కొంతమందికి గ్రహాలు ప్రవేశించి దొమ్మలయందు నొప్పి వచ్చునట్లు చేయుచున్నవి.

కొంతమందికి తలనొప్పి వచ్చునట్లు చేయుచున్నవి. మరికొంతమందిని చిక్కి శల్యమై పోవునట్లు చేయుచున్నవి. కొంతమంది స్త్రీలకు మయిల [రక్తస్రావము] ఎక్కువగునట్లు చేయుచున్నవి. మరియు మూర్ఛలు వచ్చునట్లు, అపస్మారకముగా పిలచిన పలుకనట్లు కొందరిని చేయుచున్నవి. కొందరికి ఒక కాలు, ఒక చేయి చచ్చుపడునట్లు చేయుచున్నవి. ఈ విధముగా చచ్చుపడడము నూటికి డెబ్బయి మందికి గ్రహా దోషమే అయి ఉండును. కొంతమందికి తినిన ఆహారము జీర్ణాశయములో యుండక వాంతి అగునట్లు చేయుచున్నవి. ఈ విధముగా గ్రహాలు మానవులను బాధించుచున్నవి. ఒక్క మానవులకే కాక ఇతర జాతులకు కూడ గ్రహ బాధలు ఉండును. గ్రహ బాధలు తప్పించుకోవలయునంటే ఎవరయిన భక్తిమార్గము అనుసరించవలసినదే, అట్లుకాక మంత్ర యంత్రములతో తప్పించుకొందము అంటే కొంతకాలము తప్పించుకోగలరేమో కాని ఎప్పటికి మాత్రము తప్పించుకోలేరు. జ్ఞానశక్తిని మించిన శక్తిలేదు. కావున దానివలననే తప్పించుకొనుటకు వీలగును.

ఇప్పటికి గ్రహాలు అనగా ఏమిటివి? వాటియొక్క స్థితిగతులు ఏమి? అని ఆమూలాగ్రముగా తెలిసినది. ఇక విగ్రహాలను గురించి తెలుసుకొందాము. మానవుని సూక్ష్మశరీరమును గ్రహ అనుచున్నాము కదా అట్లే ఒక ప్రతిమలో యుండబడిన సూక్ష్మ శరీరమును విగ్రహ అని అంటున్నాము. మానవునికి సూక్ష్మశరీరము స్థూలశరీరములో అణిగి ఉన్నది. పైకి మానవుని స్థూల దేహము కనుపించును. కాని సూక్ష్మదేహము కనిపించదు. ఆ విధముగానే గుడిలో యున్న దేవునికి స్థూలదేహము ప్రతిమ సూక్ష్మదేహము విగ్రహము ప్రతిమయందు విగ్రహము అనిగి ఉన్నది. పైకి ఆ దేవుని ప్రతిమ ఆకారము అగుపించును కాని సూక్ష్మశరీరము [విగ్రహ] ఆకారము కనుపించదు. పుట్టిన ప్రతిమానవునకు సూక్ష్మ శరీరము యున్నట్లే ప్రతిష్ఠించిన ప్రతి ప్రతిమకు విగ్రహ ఉండును. మానవునకు సూక్ష్మశరీరము పోయిన స్థూలకళేబరము మిగిలినట్లే దేవునికి విగ్రహ పోయిన స్థూలదేహమయిన ప్రతిమ మాత్రము మిగిలి ఉండును. అనగా చచ్చిన మానవ కళేబరము విగ్రహలేని ప్రతిమ రెండు ఒక్కటే నన్నమాట. మానవుని సూక్ష్మదేహము స్థూలదేహము యొక్క ఆకారమునే పొంది ఉండును. అట్లే దేవుని ప్రతిమ ఆకారమునే విగ్రహపొంది ఉండును. కాని గ్రహాలుకు విగ్రహాలుకు కొన్ని విషయములయందు చాలా బేధము ఉన్నది. వాటిని గురించి వివరించెదను వినుము.

గ్రహ ఒక్కమారు తన స్థూలదేహమును విడచి బయటికి వచ్చిన తిరిగి అందు ప్రవేశించలేదు. విగ్రహ తన స్థూలశరీరమును విడచి బయటికి వచ్చి తిరిగి ప్రవేశించగలదు. గ్రహ ఇతరుల పదార్థములను దొంగలించును. విగ్రహ ఆ విధముగా దొంగలించదు. గ్రహ ఇతరులను రోగ రూపమున బాధించును. విగ్రహాలుకూడ కొంతమందిని బాధించును, మరియు కొందరిని బాధలనుండి విముక్తులను చేయును. గ్రహాలు కొన్ని ఆత్మశక్తి కలిగి ఉండును. కొన్ని మాత్రము ఆత్మశక్తిలేనివై ఉండును. విగ్రహాలు అన్నియు ఆత్మశక్తి కలవియై ఉండును, కాని కొద్దినుంచి గొప్పవరకు అంచెలవారిగా శక్తి కలవియై ఉండును. గ్రహాలు నీతి నిజాయితీ లేకుండ ప్రవర్తించగలవు. విగ్రహాలు ఆవిధముగా ప్రవర్తించవు. గ్రహాలుకు విగ్రహాలు విరోధములై ఉండును. ఈ విధముగా గ్రహాలుకు విగ్రహాలుకు కొన్ని బేధములున్నవి. కావున గ్రహాలను చిన్న దయ్యములని అనవచ్చును.

పరమాత్మ జీవుని కారణ శరీరము ద్వారా తెచ్చి వేరే తల్లి గర్భములో యున్న శిశువు శరీరములోనికి వేసి శిశువు శరీరమునకు ప్రాణము పోసినట్లు, శిల్పాచార్యునిచేత తయారయిన ప్రతిమలోనికి పరమాత్మ ఒక జీవుని ప్రవేశింపజేసి ప్రతిమకు ప్రాణము పోయిచున్నాడు. ఆ జీవునికి స్థూలశరీరము ప్రతిమ, సూక్ష్మశరీరము విగ్రహ. ఈ విధముగా ప్రతిమ ప్రాణమును పొంది ఉండును. మానవ శరీరము మాదిరి ప్రతిమ శరీరము చలించలేదు. మానవుని సూక్ష్మశరీరము సంచరించినట్లు ప్రతిమ సూక్ష్మ శరీరము సంచరించగలదు. సర్వ జీవరాసులయందు ఏ చైతన్యము కలదో ఆ చైతన్యమే ప్రతిమలందుండు జీవునిలో కలదు. యోగులయందు, భోగులయందు, పాపులయందు, జంతువులయందు, మరియు గుడిలోని దేవునియందు, అన్ని జీవులయందు ఆత్మ సమానముగా ఉన్నది. మనుష్య జన్మ యెత్తుటకు ఎంతో పుణ్యము కావలసి ఉండును. అట్లే దేవ ప్రతిమ యందు జీవుడు చేరుటకు దైవశక్తి ఎంతో అవసరము. దైవశక్తి యున్నవారు కర్మానుసారముగ దైవ ప్రతిమలలో జీవులుగాచేరి, అందును యోగమాచరించి దైవశక్తి ఎక్కువగా పొందబడినవారై, వారికున్న కర్మ తొలగగానే పరమాత్మయందు ఐక్యత చెందుచున్నారు. కొంతమంది అట్లుకాక దైవ ప్రతిమలలో జీవునిగా చేరినప్పటికి సరిగ యోగమాచరించక ప్రపంచ మాయలో మునుగుచున్నారు. ఇక్కడ గుళ్లో దేవతలు పెద్దవాల్లు అని నమ్ముకొని యున్నవారికి నేను చెప్పునది అర్థముకాక పోవడమేకాక, ఇది అంతయు తెలియపరుచు నన్ను కూడ అపార్థము చేసుకుందురేమో, దయ చేసి విగ్రహాలను అర్థము చేసుకున్న చేసుకోలేకపోయిన నన్ను మాత్రము అపార్థము చేసికోక ముందుకు మీ చూపును నడుపవలయునని కోరుచున్నాను.

భగవద్గీతా శాస్త్రమునందు విజ్ఞానయోగములో "ప్రకృతి సంబంధములగు పాపములతో కోర్కెలయందు మునిగి అజ్ఞానులగుచు నన్ను పూజించక అన్యదేవతాధన మానవులు చేయుచున్నారు. ఎవ్వడు ఏ విధమయిన శ్రద్ధతో దేవతను పూజించునో వానికి ఆ దేవతమీదనే నమ్మకముండునట్లు చేసి ఆ దేవతనయిన శ్రద్ధతో పూజించునట్లు చేయుదును వాడు ఆ దేవతనే నమ్ముకొని శ్రద్ధగా ఆరాధించుచుండిన ఆరాధన ఫలితముగ వారికి కోరుకున్న కోర్కెలను నెరవేర్తును." అని పరమాత్మ తెలిపి ఉన్నాడు. దీనివలన గుళ్లో దేవుడు

ఏమి చేయలేదు. గుళ్లో దేవుని అంతరాత్మ అయిన పరమాత్మయే అంతయుచేయుచున్నాడు అని తెలియుచున్నది. మనకు ఏమి చేసినను పరమాత్మయే చేయవలయును. ప్రపంచములోని ప్రజలకు, దేవలయములలోని దేవతలకు, అండపిండ బ్రహ్మాండమునకు అధిపతి పరమాత్మయే. పరమాత్మను నమ్మి కొంత దైవశక్తి సంపాదించుకొన్న వారే ప్రతిమలలో విగ్రహాలుగామారి పుణ్యవశమున అనేక పూజలును, నైవేద్యములను ఆరగించుచున్నారు.

దైవ ప్రతిమలలో యుండిన జీవులు కొంతమంది దయ్యములు ఆవహించినట్లు, ఇతరుల శరీరములను ఆవహించి మాకు ఫలానా పూజలు చేయండి అని చెప్పుచున్నారు. మరియు తన ఎదుట ఫలానా వస్తువు మొక్కుబడిగా ఇస్తాను అని చెప్పి ఇవ్వకపోయిన వానిని కూడ ఇతరులలో ఆవహించి నా మొక్కుబడి ఇయ్యమని అడుగుచున్నారు. ఇంకనూ నాకు పూజలు సక్రమముగా చేయడములేదు మిమ్ములను ఏమి చేయుదునో చూడండి అని బెదిరించువారుకూడ ఉన్నారు. వీరు అంతయు ప్రతిమలలో యుండియు, మాయలో పడినారని తెలియుచున్నది. కొంతమంది దేవతలు తమకు పూజలు చేసిన చేయకపోయిన, తిట్టినా పొగడిన ఏమియు అనుకోక మౌనముగాయుండి యోగము చేయుచున్నారు.

ఒకేపేరు పెట్టబడిన మానవులు ఎంతో మంది యుండినట్లు ఒకే పేరు పెట్టబడిన దేవత ప్రతిమలు ఎన్నియో ఉన్నవి. ఎల్లన్న అనుపేరు కలిగిన మనుషులు ఎంతోమంది యున్నట్లు శ్రీరాముడు అను పేరు ఉండిన ప్రతిమలు ఎన్నియో ఉన్నవి. ఒకే పేరు అయినా ఎల్లన్నగారు అందరు ఒకే విధముగా ఉందురా? ఉండరు. ఒకే పేరు గలిగిన ఒక ఎల్లన్నకు ఇంకొక ఎల్లన్నకు రూపములోను, గుణములలోను తేడాయున్నట్లే ఒకే పేరు యుంచబడిన రామ ప్రతిమలన్నియు ఒకే విధముగా ఉండవు. ఒక రామ ప్రతిమకు ఇంకొక రామ ప్రతిమకు పుణ్యములోను, ఆకారములోను దైవశక్తిలోను, గుణములలోను, తేడా ఉండును. అందువలననే దేశములోయున్న ఒకే పేరు గల ప్రతిమలకు వేరువేరు రకములుగా పూజలు జరుగుచుండును. ఆంజనేయస్వామి అనుపేరుగల ప్రతిమలు దేశములో ఎన్నియో కలవు. కాని అన్ని ప్రతిమల జీవులు ఒకే శక్తి కలిగి ఉండవు. మరియు ఒకే పుణ్యము కలిగి ఉండవు.

కావుననే అనేక రక ఆంజనేయులకు అనేక రకములుగా పూజలు జరుగుచుండును. ఒక గుళ్లో ఆంజనేయునికి నిత్య పూజలు జరుగుచుండును. వేరొక గుళ్లో ఆంజనేయునికి ఏమియు జరుగక ఉండును. అందరు ఆంజనేయస్వామి అనుపేరు గలిగియున్న, శత్రువులైన గ్రహాలు గుడిలో ప్రవేశించిన కొంతమంది ఆంజనేయస్వాములు వాటిని ఏమి చేయలేకపోవుచున్నారు. కొంతమంది ఆంజనేయస్వాములు గ్రహలతో పోట్లాడి తామే ఓడిపోవుచున్నారు. కొంతమంది విశేష బలము కలిగినవారై గ్రహాలను కొట్టి తరిమివేయుచున్నారు. మానవులయందు గ్రహాలు ఆవహించువారు బలము ఎక్కువగాయున్న ఆంజనేయస్వాముల వద్దకు పోయి శరణువేడిన ఆ స్వాములు ఆ గ్రహాలను బాధించి ఇక మీద ఎప్పటికి వారి దగ్గరకు రాకుండ చేయుచున్నారు. ఇవి అన్నియు మనము కొన్ని స్థలములయందు దృష్టాంతముగా చూచుచునే ఉన్నాము. గ్రహాలు అయిన మానవులకు విగ్రహా అయిన ఆంజనేయస్వామికి ప్రతిరోజు సాయంకాలము ఘర్షణ కసాపురమునందు జరుగుచుండును. తెలియనివారు అక్కడకు పోయి గమనింపవచ్చును.

యోగశక్తి కలిగినవారికి విగ్రహాలుకూడ మాట వినును. ఎందుకనగా దైవశక్తి విగ్రహాలుకంటే యోగులయందు అధికముగా ఉండును. కనుక విగ్రహాలు అందరి యెడల ప్రవర్తించినట్లు ప్రవర్తించక యోగులు తమ యొద్దకు వచ్చినపుడు వినయ విధేయతలతో ఉండును. యోగి అయిన వీరబ్రహ్మముగారు గ్రామదేవతయిన పోలేరమ్మను నిప్పు తెమ్మని ఆదేశించగా పోలేరమ్మ నిప్పు తెచ్చి ఇచ్చెను. దీనివలన యోగి యెడల ఒక దేవత ఎట్లు ప్రవర్తించినది తెలియుచున్నది. మరియొక చోట ఒక దేవాలయములో యోగి పండుకొని యుండగా, ప్రతిరోజు ఒకనిని ఆవహించి మాట్లాడి పూజలు అందుకొను ఆ దేవాలయ దేవత ఆ రోజు ఎన్ని పూజలు చేసిన ఆవహించి మాట్లాడలేదు, ఎందుకనగా తాను చేయు పని యోగి చూచి కోపగించుకొనునేమోనని ఇక్కడకూడ యోగికి విగ్రహ బయపడినదని తెలియుచున్నది. అందువలననే తెలిసిన యోగులు కొందరు ఏ దేవాలయమునకు వెళ్లరు. మరియు దేవర్ల [జాతర్లు] జరుగు స్థలమునకు, పీర్ల పండుగలలో పీర్ల దగ్గరకు, దేవతలు ఒళ్ళునిండి మాట్లాడుచున్నారను స్థలమునకు వెల్లరు. ఒకవేళ వెళ్లిన జ్ఞానాగ్ని వేడిమికి ఆ విగ్రహాలు బాధపడవలసి ఉండును.

ఓ మానవులారా! దేవాలయములో దేవునియందుకూడ అంతర్యామియైయున్న పరమాత్మను తెలుసుకొనుటకు యోగి అయిన గురువును ఆశ్రయించి ఆయన యిచ్చు బోధలను అమృతము త్రాగి మృత్యుంజయుడవు కమ్ము అట్లులేకున్న చచ్చుట పుట్టుట తప్పదు. కష్టసుఖములు అనుభవించుట తప్పదు. ఘోరమయిన బాధలు వచ్చినపుడు పరమాత్మను తలంచిన పరమాత్మ దయదలచువాడు కాదు. కర్మనుండి తప్పించుకోవలయునంటే జ్ఞానము ప్రాముఖ్యము. అందువలననే గీతాశాస్త్రములో జ్ఞానయోగములో "కర్మను కాల్చుటకు జ్ఞానమను అగ్ని కావలయును. జ్ఞానము కావలయునన్న జ్ఞాన ధనముయున్న వారియొద్దకు పోయి అడుగుకోవలయును." అని పరమాత్మ అన్నాడు. కావున ప్రతిఒక్కరు జ్ఞానమును సంపాదించుకొనుటకు మొదలు పెట్టవలయును. మొదట దేవాలయముయందలి పూజలు చేయుచు కోర్కెలు కోరక దేవాలయముల బాహ్యార్థములనన్నిటిని తెలుసుకొని దాని తర్వాత గురువు యొద్ద ఉపదేశము పొంది యోగసాధన చేయుచు యోగశక్తి సంపాదించుకొని, యోగశక్తి పరిపూర్ణ స్థితి పొందుతూనే ఆత్మయందు ఐక్యము కావలయును.

దేవాలయములలోని ప్రతిమలయందు కూడ పరమాత్మ యున్నాడని యదార్థము తెలుసుకొన్న జ్ఞానులుకాని, అజ్ఞానులుకాని, చేయు పూజలందు భోక్త పరమాత్మయే, అన్ని పూజలు ఆయనకే చేరును. అందువలననే గీతాశాస్త్రమున రాజవిద్యా రాజగుహ్య యోగములో పరమాత్మ "శ్రద్ధగలిగి ఎవడు అన్యదేవతల నారాధించునో యతడుకూడ తనకు తెలియకనే నన్నే ఆరాధించిన వాడవుచున్నాడు." అని అన్నాడు.

ఎవడయితే ఆత్మ అన్ని జీవులందున్నట్లు అన్ని ప్రతిమల యందుకూడ యున్నదని, మన పూజలన్నియు ఆత్మకే చేరుననుచు, యదార్థము తెలుసుకొన్నాడో వానికి ఆత్మప్రాప్తి కలుగును. అట్లుకాక దైవ ప్రతిమలందుగల అంతర్యామి అయిన పరమాత్మను తెలుసుకోలేని వారు పూజలు చేయుచున్నాను, దానివలన పుణ్యము కలిగి, ఆ పుణ్యము వలన సుఖము కలుగును. ఆ పుణ్యము అయిపోయిన వెంటనే ఆ సుఖము కూడ అయిపోవును. అందువలన

దేవతా ప్రతిమలయందుగల అంతర్యామి అయిన ఆత్మను గుర్తించలేనివారు సుఖమును పొందుదురు కాని ఆ సుఖము అయిపోయిన తర్వాత కష్టములు కూడ సంభవించును. కావుననే గీత యందు రాజవిద్యా రాజగుహ్య యోగమున పరమాత్మ “సర్వ దేవతలకు సల్పు యజ్ఞములందు భోక్తను నేను, మరియు ప్రభువును నేను. నన్ను యదార్థరీతి గనని వారలకెల్ల సుఖము కలిగి పిదప ఆ సుఖములనుండి తప్పిపోవుటకూడ సంభవించును” అని అన్నాడు. అందువలన మానవులమయిన మనము గ్రహాలు అంటే ఏమిటి? విగ్రహాలు అంటే ఏమిటి? అని విశదీకరించి తెలుసుకొని, గ్రహాల యందును విగ్రహాల యందును యున్న పరమాత్మను తెలుసుకొన్న, వానికంటే జ్ఞాని ఇంకొకడు లేడని చెప్పవచ్చు. అటువంటి జ్ఞానియొక్క భావము అంతయు పరమాత్మనే ఆశ్రయించి ఉండును, కావున వాడు పరమాత్మనే చేరగలడు.

దేవతలు – రాక్షసులు

ప్రపంచములో అనేకమంది దేవతలు ఉన్నారు. మరియు రాక్షసులు ఉన్నారు. ప్రపంచములో రెండే జాతులు మానవులయందు ఆదినుంచి ఇప్పటికిని ఉన్నవి. అవియే [1] దేవతా జాతి [2] రాక్షస జాతి. జ్ఞానమున్నవారు ఈ రెండు జాతులను గుర్తించవచ్చును. మరియు తను ఏజాతి వాడయినది తెలుసుకోవచ్చును. ఈ రెండు జాతులు ఎట్లు ఏర్పడుచున్నవనగా! గుణముల బట్టియే. ఈ గుణములున్న రాక్షసులనియు, ఈ గుణములున్న దేవతలనియు గుర్తించనగును. భగవద్గీతయందు దైవాసుర సంపద్విభాగ యోగములో పరమాత్మ దేవతల గుణములను రాక్షస గుణములను తెలిపినాడు. మరియు వారి ప్రవర్తనలుకూడ తెలిపియున్నాడు. ఇంకనూ కృష్ణపరమాత్మ ఏమన్నాడనగా “ద్వొభూత సర్గౌ లోకేస్మిన్ దైవ అసుర ఏవచ” ఓ అర్జునా లోకమున దేవతలు రాక్షసులు అను రెండు విధములగు జీవరాసులు భూమిమీద పుట్టుచున్నవి.” అని అన్నాడు. కావున భూమిమీదనే దేవతలు రాక్షసులు యున్నారని తెలియుచున్నది.

దేవతలు ముప్పది మూడు కోట్లు ఉందురని ఒక ప్రతీతి. వారు ఎంతమంది అయినా విష్ణు, ఈశ్వర మొదలుకొని ఇంద్రుడు ఇంద్ర పరిపాలనయందుండు దిక్పాలకులవరకు దేవతలే కదా! వారు ఎక్కడ ఉన్నారు? వారు భూమిమీద ఎక్కడ గుర్తింపబడరే అని కొంతమందికి అనుమానము రావచ్చును. దానికి సమాధానము ఏమనగా! పరమాత్మ చెప్పినట్లు దేవతలు అందరు భూమిమీదనే ఉన్నారు కాని మనము గుర్తించ లేకపోవుచున్నాము. మనకు చూపులేక ఎదుట ఏమి లేదన్నట్లు మనము వారినిచూడలేక దేవతలు భూమిమీద లేరంటున్నాము. మనకున్న స్థూల కన్నులతో చూచినా అన్ని మానవాకారాలే కనుపించును. కాని మానవాకారములయందే యున్న దైవత్వము ఏ మాత్రము కనుపించదు. మానవులయందున్న దైవత్వమును గుర్తించి ఈయన ఫలానా దేవుడు అని తెలుసుకొనుటకు జ్ఞానదృష్టి కావలయును. జ్ఞానదృష్టి లేకున్న స్థూలదృష్టికి పై ఆకారములే కనుపించును. దానివలన అందరు మానవులే అని అనుకొందుము. స్థూలదృష్టితో దేవతలను గుర్తించలేము.

జ్ఞానశక్తి యున్న వారందరు దైవాంశపరులే అనగా దేవతలే. దేవతలు అందరు సమానముకాదు ఎందుకనగా వారియందుండు జ్ఞానశక్తి సమానముగా ఉండదు. అత్యధిక జ్ఞానశక్తి యున్నవాడు విష్ణువు. అక్కడనుంచి యోగశక్తి తగ్గుకొలది ఈశ్వర, బ్రహ్మ మొదలుకొని దిక్పాలకుల వరకు ఉందురు. అట్లే అజ్ఞానము యున్నవారు రాక్షసులు వారుకూడ అందరు ఒకే రకముగా ఉండరు. వారి అజ్ఞానమునుబట్టి వారియందు చిన్న పెద్ద అను బేధములు యుంచుటకు వీలు ఉన్నది. దీనిని బట్టి జ్ఞానశక్తి యున్నవారంతయు దేవతలనియు, జ్ఞానశక్తి లేనివారంతయు రాక్షసులనియు తేలుచున్నది.

దేవతలయిన విష్ణు, ఈశ్వర, బ్రహ్మ మొదలగువారు ఈ కలియుగమునందు కూడ యున్నారా! విష్ణు, ఈశ్వర, మొదలగువారు పెద్దజ్ఞానులయిన ఆత్మయందు ఐక్యము చెందక కలియుగమునందు కూడ ఉన్నారా! వారికి మోక్షము లేదా! వారుకూడ అందరి మాదిరి జన్మ ఎత్తచునే ఉందురా! అను అనుమానము అందరకు రావచ్చును. వారికి నా సమాధానము ఏమనగా! దేశములో రాజు, యువరాజు, మంత్రి, ముఖ్యమంత్రి సేనాధిపతి

అని ఎన్నియో పదవులు కలవు కదా, మొదటినుంచి ఒకే జీవుడు రాజుగా ఒకే జీవుడు మంత్రిగా ఉన్నారా, అట్లు ఎవరు లేరు. రాజు, మంత్రి మొదలగు పదవులు మాత్రము అట్లే ఉన్నవి. ఆ పదవులలో ఒకరి తర్వాత ఒకరు వారి యోగ్యతనుబట్టి నిర్ణయించబడుచున్నారు. ఈ విధముగానే ప్రపంచములో విష్ణు, ఈశ్వర, బ్రహ్మ అనబడు మొదలగు పదవులు కలవు. యోగశక్తినిబట్టి విష్ణు, ఈశ్వర మొదలగు పదవులు జీవులకు ఇయ్యబడుచున్నవి. ఒక జీవుడు ప్రపంచమంతటిలోను యోగశక్తి యందు మొదట వాడయినాడనుకొనుము. ఆ జీవుడు ఒక శరీరమును ధరించి భూమిమీద పుట్టును. యోగశక్తి యందు మొదటివాడయిన దానివల్ల మొదటి దేవతా పదవి అయిన విష్ణు పదవికి అతను అర్హుడు. కావున ఆ జీవుడే దేశములో విష్ణువు. ఆ జీవుడు ఆ జన్మలోకూడ యోగము సాధించి పూర్తి యోగశక్తి సంపాదించుకొన్నవాడయి ఆత్మయందు ఐక్యత చెందుచున్నాడు. అందువలననే పూర్వకాలము వైకుంఠములోయున్న విష్ణువు కూడ యోగము చేసినట్లు తెలియుచున్నది. అదే అంశకు తగిన వీరబ్రహ్మముగారు కూడ యోగము చేసినట్లు తెలియుచున్నది. విష్ణు పదవిని ఒక జీవుడు కొంతకాలము అధిష్టించి ఆత్మయందు ఐక్యము కాగానే ఆ సీటుకు తగిన వేరొక జీవి ప్రపంచములో తయారయే ఉండును. రాజు పదవి ఖాళి ఏర్పడగానే దేశములో వేరొకడు ఆ పదవికి అర్హుడైనట్లు ప్రపంచములో విష్ణు ఈశ్వర బ్రహ్మ మొదలగు పదవులు ఖాళి ఏర్పడుతునే ఆ అంశకు తగిన జ్ఞానశక్తి [యోగశక్తి] పరులు తయారగుచునే ఉందురు. కావున విష్ణు ఈశ్వర బ్రహ్మ మొదలగువారు కూడ శరీరములు ధరించి ఉన్నారు. వారుకూడ మోక్షము కోసరము విశేషముగా యోగమాచరించుచున్నారు. వారు వారియందు యోగశక్తి సంపూర్ణస్థితి చెందుతూనే పరమాత్మయందు లీనమగుచున్నారు. తిరిగి వేరే జీవులు వారి అంశకు తగినవారై వారి పదవియొక్క నామమును పొందగలుగుచున్నారు.

ఇక్కడ కొంతమంది ఒకే కాలములో ఒకే అంశకు చెందినవారు ఇద్దరు జీవులు ఉందురా! రాముడు, పరుశురాముడు విష్ణువాంశపరులేకదా అని సంశయ పడవచ్చును. దానికి నా సమాధానము. ఒకే కాలములో ఒకే అంశకు చెందిన ఇద్దరు జీవులు యుండుట ఎప్పటికి సంభవింపదు. ఇక రాముడు, పరుశురాముడన్న ఇద్దరు విష్ణు అంశను

అలంకరించిన వారే కాని ఇద్దరు ఒకే కాలములో విష్ణు అంశకు సరికాలేదు. కొంతకాలము పరుశురామునిపట్ల కొంతకాలము రామునిపట్ల విష్ణువాంశ నిలబడినది. అనగా కొంతకాలము ఒకజీవుడు విష్ణువు మరి కొంతకాలము వేరొక జీవుడు విష్ణువు. రామునకు వివాహమగునంతవరకు విష్ణువు అను పదముకు పరుశురాముడే అర్హుడు. అంతవరకు యోగశక్తియందు అతనిని మించినవారు ప్రపంచమున లేకుండిరి. రాముని వివాహ సమయమున పరుశురాముడు రాముని ఎదుర్కొనిన సమయమున, యోగశక్తియందు మిన్న రాముడే ఆయెను పరుశురాముని యోగశక్తిని రాముడు మించినవాడై నాటినుండి రాముని జీవితాంతము రాముడే విష్ణువయినట్లు తెలియుచున్నది. కావున రాముడు పరుశురాముడు ఇద్దరు విష్ణువాంశసంభూతులే అని తెలియుచున్నది. ఈవిధముగానే ముప్పది మూడుకోట్ల దేవతా అంశలు ఉన్నవి. ఆ అంశలకు తగిన జ్ఞానశక్తిగల జీవులు ఆ దేవతలు అని అనిపించుకొందురు జరిగిన కాలమును విశదీకరించిచూచిన శ్రీ వీరబ్రహ్మముగారు విష్ణుపదవికి ఆయన శిష్యుడు సియ్యగారు ఈశ్వరపదవికి తమ జీవితకాలములో అర్హులైనట్లు తెలియుచున్నది. మరియు మశ్చీంద్రుడు విష్ణుపదవికి ఆయన శిష్యుడు గోరా కుమారుడు ఈశ్వర పదవికి అర్హుడయినట్లు తెలియుచున్నది. శ్రీ కృష్ణుడుకూడ తన జీవితకాలములో విష్ణు పదవికి అర్హుడైనట్లు తెలియుచున్నది. ఆకాలములలోనే కాక ఈకాలములోకూడ విష్ణు ఈశ్వర మొదలు కొని ఆఖరువరకు యోగ్యత కలిగిన యోగశక్తిపరులు ఉన్నారు. కొంత మంది మాయవలన వారి యోగ్యత వారికే తెలియక ఉన్నారు. కొంత మంది తమ యోగ్యతను తెలుసుకొని ఉన్నారు. గీతలో పరమాత్మ చెప్పినట్లు భూమిమీదనే సజీవులై దేవతలు అందరు ఉన్నారు. వారు పరమాత్మకు భక్తిపరులయి యోగము చేయుచునే ఉన్నారు.

జ్ఞానులకు అనగా జ్ఞానశక్తి కల్గినవారికి [దేవతలుకు] విరుద్ధముగాయుండు వారందరు రాక్షసులే. వీరియందు జ్ఞానశక్తి ఏమాత్రము ఉండదు అన్నియు తమ శక్తి వలననే జరుగుచుండును అని అనుకొందురు. పరమాత్మ విషయము వీరికి వ్యతిరేకముగా ఉండును. అనేక భయంకరమైన పాపములు సంపాదించుకొనెడివారై ఉందురు. రాక్షసులందరు ఆశకు మించిన కోర్కెలు కోరుచుందురు, వారియందు డంభము గర్వము

తాండవించుచుండును. అపరిమితమయిన కోర్కెలతో విషయ సుఖములకంటే వేరే సుఖములు పెద్దవి లేవని చెప్పుచుందురు. మరియు ఆశ అను తాడుచేత కట్టబడినవారై సుఖములు కావలయునని ఆశించుచు ఆ సుఖములకొరకు ధనమును చాలా అధర్మమార్గములలో సంపాదించుచున్నారు. తాను సంపాదించినది అంతా తనదే అని గర్వపడుచున్నారు. ఇంకా తనకంటే ఎవరు తెలిసినవారు లేరని వారి ఇష్టానుసారముగా పూజలు చేయుచున్నారు. ఇటువంటి రాక్షసులను గీతనందు పరమాత్మ "కౄరులును, ద్వేషులును మంచిని దూషించువారును అయిన ఈ నరులను రాక్షస గర్భములయందు జన్మించునట్లుచేసి వారిని మాయలో దుఃఖములను పొందునట్లు చేయుదును. ఈ విధముగా రాక్షసుల కడుపులలోనే జన్మించి జన్మ జన్మకు అజ్ఞానులగుచు నన్ను తెలుసుకొను జ్ఞానముయొక్క గట్టు ఏమాత్రము కనుపించక అధమ గతికి పోవుదురు" అని తెలిపి ఉన్నాడు. కావున ప్రపంచములో అజ్ఞానములోపడి రాక్షస జన్మ యెత్తక జ్ఞానమార్గము ననుసరించి జ్ఞానశక్తి సంపాదించుకొని దేవతల కడుపుననే జన్మించుచు జన్మ జన్మకు యోగశక్తి ఎక్కువయినవారై ఆఖరుకు పరమాత్మయందు లీనులు కావలయునని తెలుపుచున్నాను.

ఇంతవరకు చెప్పినను కొందరికి ఇంకను అనుమానముండి గీతా శాస్త్రములో అక్షర పరబ్రహ్మ యోగమున శ్రీ కృష్ణుడు "ఆబ్రహ్మ భువనాల్లోకాః పునరావర్తినోఽర్జున! మాము పేత్యతు కౌన్తేయ! పునర్జన్మ న విద్యతే" "బ్రహ్మలోకమాది మొదలగు లోకములన్నియు మరల జన్మ కలుగజేయును. కాని నన్ను పొందినవారికి తిరిగి జన్మరాదు" అని అన్నారు కదా! ఈ మాటతో లోకములు వేరు ఉన్నట్లు అక్కడ దేవతలు ఉన్నట్లు తెలియుచున్నదే అని అడుగవచ్చును. దానికి నా సమాధానము దేవతలందరు ఇక్కడే ఉన్నారు వారిసామీప్యమున జన్మించవలయునంటే ఎంతో పుణ్యముచేసి యుండవలయును. వారియొద్ద జన్మించడమే వారిలోకమున జన్మించడము. అట్లు పుణ్యముచేసి వారియొద్ద జన్మించినప్పటికి వారికి తిరిగి జన్మలు ఉన్నవి. కాని నన్ను పొందినవానికి తిరిగి జన్మలేదు అని పరమాత్మ తెలియజేసినాడు కాని వేరుకాదు. అట్లే రాజవిద్యా రాజ గుహ్య యోగమున" త్రైవిద్యా మాం సోమపాః పూత పాపా యజ్ఞై రిష్ట్వా స్వర్గతిం ప్రార్థయన్తే,

తేపుణ్య మాసాద్య సురేంద్రలోక మశ్నన్తి దివ్యాన్ దివి దేవభోగాన్" "తేతం భుక్త్వా స్వర్గలోకం విశాలం క్షీణేపుణ్యే మర్త్య లోకం విశన్తి, ఏవం త్రయీధర్మ మను ప్రసన్నా గతాగతం కామ కామా లభన్తే" "యాజ్ఞికులు, సోమపానులు, పాపము లేనివారై నా దయచే స్వర్గము చేరగలిగి మిక్కిలి పుణ్య జన్మములను, దివ్యములైన భోగములను దివ్యసుఖములను అనుభవించుచుందురు. అట్లు స్వర్గ సుఖములను అనుభవించిన తర్వాత తగ్గులోకమునకు వచ్చుచుందురు. ఇట్లు కామపరులయి పుణ్యము సంపాదించుకొన్న వారి గతి ఉండును. వారికి అశాశ్వితములైన సుఖములే లభించును" అని పరమాత్మ అన్నాడు. ఇక్కడకూడ స్వర్గలోకము వేరువున్నదని చాలామంది పొరపాటుపడుచున్నారు. పుణ్యము చేసిన వారికి స్వర్గము ఇచటనే ఉన్నది. వారు స్వర్గ సుఖములను ఇచటనే అనుభవించుచున్నారు. పుణ్యఫలితము అయిపోయిన వెంటనే కష్టపడు జన్మలు తిరిగి ఎత్తుచున్నారు. అందులకే మనము అనుభవరీత్యా బాగుగ సుఖపడు వానిని పై స్థితిలో ఉన్నాడని, కష్టపడువానిని తగ్గు స్థితిలో ఉన్నాడని అనుచున్నాము. అట్లే ధనికుడిని బీదవానిని పోల్చు సమయములో కూడ వాడెక్కడ వీడెక్కడ అని అంటున్నాము. ఈ మాటలోకూడ వానికి వీనికి ఎంతో దూరము అన్నట్లున్నది. ఆ దూరము ఏమిటో అర్థము చేసుకోవలయును. ఆ బేధము భూమిమీదనే కనపడుచున్నదని తెలుసుకోవలయును. వాడు పై స్థితిలో వీడు తగ్గు స్థితిలో వున్నాడు అంటున్నాము. వాని పై స్థితి వీని క్రింది స్థితి భూమిమీదనే ఉన్నదని తెలుసుకోవలయును. అట్లే ఒకడు బాగుగ బ్రతికి సుఖములు అనుభవించి తర్వాత వాడు కష్టాలపాలైనాడనుకొనుము, అపుడు కూడ వాడు అధోగతి పట్టినాడని అంటున్నాము. అధోగతి అంటే తగ్గుగతి ఆ తగ్గుగతికూడ భూమిమీదనే ఉన్నట్లు తెలుసుకోవలయును.

పుణ్యము చేసినవాడు భూమిమీదనే స్వర్గసుఖములు అనుభవించుచున్నాడు. పాపము చేసినవాడు భూమిమీదనే నరకము అనుభవించుచున్నాడు. పై లోకము క్రిందిలోకము అనునవి అన్నియు ఈభూమి మీదనే ఉన్నాయి. ఎవని లోకము వానిది, వాని లోకమునకు వీడు రాడు వీనిలోకమునకు వాడు రాడు అని జ్ఞానిని అజ్ఞాని పోల్చి చెప్పు సమయమున కూడ అనుచుందుము. ఒకనాడు గురువుగారైన బ్రహ్మముగారు

శిష్యుడైన సిద్ధయ్యను లోకము ఎట్లున్నది అని ప్రశ్నించగా ఎవని లోకము వానిది స్వామి అని సమాధానముగా సిద్దయ్య చెప్పెను. పరమాత్మకూడ నేను ముల్లోకములు ఆవహించియున్నాను. నేను లేని చోటులేదని తెల్పెను. చివరకు లోకములను గురించి తెలుసుకోవలయునంటే జ్ఞానదృష్టి చేతనే తెలుసుకొనుటకు వీలగును. అన్ని లోకములు భూమిమీదనే ఉన్నవి. వీటిని గురించి పూర్తిగా తెలుసుకోవలయునంటే అసాధ్యమయిన పని ఏమోనని అనిపించును.

ముఖ్యముగా వున్నవి మూడు లోకములే. అందు ఒక్కొక్క లోకములో కొన్నివేల ఉపలోకములు వున్నవి. ఒక జీవుడు వాని కర్మానుసారము శరీరధారియై భూమిమీదనే వుండు లోకములలో చిక్కుకొనుచుండును. ఎవని లోకము వానికి మంచిగ కనుపించుచుండును. వీటిని వివరించుతూ పోవుటకు నేనుకూడ తెలిసినవాడనుకాదు. కాబట్టి ఇంతలో లోకముల విమర్శనను విరమించుకొంటూ, స్వర్గ సుఖములను జీవుడు ఇచటనే అనుభవించుచున్నాడని తెలుపుచున్నాను. అట్లుకాక స్వర్గలోకము నరలోకము ఇతరముగా వుండిన, పుణ్యపాపములు రెండునూ జీవుడు అక్కడే అనుభవించితే, ఇక్కడ భూమిమీద పుట్టనవసరములేదుకదా! పాప పుణ్యముల కారణముచేత మనము జన్మకు వచ్చుచున్నామని బాగుగ తెలిసియు పాప పుణ్యములను ఎక్కడో అనుభవించి వస్తాము అంటే దానికి అర్థమే లేదు. వేరే లోకములలో పాప పుణ్యములను అనుభవించితే ఇక్కడ జన్మించనవసరమే లేదు. కావున అన్నిలోకములు ఇక్కడే ఉన్నవని దేవత లందరు ఇక్కడే ఉన్నారని తెలుసుకోవలయును. పరమాత్మ కూడ ఇదే భావనతో గీతయందు చెప్పియున్నాడు. ఆ భావనను అర్థము చేసుకోలేక మనమే తికమక పడుచున్నాము. పరమాత్మ తెలిపిన గీతాశాస్త్రమును పరమాత్మభావన ప్రకారమే అర్థము చేసుకోవలయునంటే ఎంతో పుణ్యము చేసి ఉండవలయును. అట్లు కాకపోతే వేరేవిధముగా అర్థమగును. ఎవని పుణ్య ఫలితమునుబట్టి వానికి అర్థమగును. అందులకే ఈ కాలములో ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా చెప్పుకొనుచున్నారు. మా దృష్టిలో గీతాశాస్త్రమును వక్రమార్గములో అర్థము చేసుకొను వారికి పరమాత్మ తిరిగి మానవ రూపముగా వచ్చి

చెప్పినను అక్కడికి అర్థము చేసుకోలేక చెప్పేవాడు మన మాదిరి మనిషేకదా! మాకంటే వీనికి ఎక్కువ తెలిసియుండునా అను అహంకారము విడువకుందురని అనుకుంటున్నాను.


మనము ఏనాడయితే అహమును విడచి మనకు తెలియని యదార్థము ఇంకా ఎంతో ఉన్నదను భావనకు వచ్చిననాడే బాగుపడుదుమని తెలుపుచున్నాను. కావున "నేను" అను అహమును విడచినవారై దేవతలు, వారిలోకములు ఇక్కడ ఉన్నవని తెలుసుకోవలయును. మరియు రాక్షసులు వారి లోకములు ఇక్కడనే వున్నవని కూడ తెలుసుకోవలయును.

కర్మ, కాల, బ్రహ్మ చక్రములు

జీవుని చావు పుట్టుకలకు కారణము కర్మ. కర్మను జీవుడు అనుభవించుచునే ఉండును. మరియు సంపాదించుచునే ఉండును. పోయిన జన్మ కర్మ ఈ జన్మలో, ఈ జన్మ కర్మ వచ్చే జన్మలో అనుభవించుచు కర్మ చక్రములో నుండి బయట పడలేక అనేక బాధలు సుఖములు జీవుడు అనుభవించుచునే ఉన్నాడు. కర్మ చక్రములో నుంచి తప్పించుకోవలయునంటే, కర్మ అంటే ఏమిటి? అది ఎక్కడ నుండి మన మీదపడి బాధించుచున్నది? దానినుండి విముక్తి ఎట్లు? అని విశదీకరించుకొన్న, కర్మచక్రము నుండి జీవుడు తప్పించుకొనుటకు కొంత ఆస్కారము ఏర్పడవచ్చును. కనుక కర్మ చక్రమును గురించి కొద్దిగా తెలియజేతును.

కర్మ అనగా పాపము పుణ్యము కదా! ఈ పాపపుణ్యములు రెండు చుట్టు ఆవహించుకొని ఒక చక్రముగా తయారయి జీవుని ఆ చక్రములోనే గిర గిర తిప్పుచు పాపము, పుణ్యములను అనుభవించునట్లు చేయుచున్నవి. మనము సంపాదించుకొను పాపము, పుణ్యము కర్మ చక్రములోనికి చేరి నిలువయుండి కాలానుగుణ్యముగా తిరిగి మన మీదికే ప్రసారమగును ఎవని కర్మ వాని కర్మ చక్రమునందే పోయి చేరును, తిరిగి


వానికే ప్రసారమగును. కర్మ చక్రము ప్రతి జీవుని మెదడునందు ఉన్నది. పాప, పుణ్యములు కంటికి కనుపించవు. కావున పాప పుణ్య మిశ్రమమయిన ఈ చక్రము మెదడునందు కంటికి ఎవరికి కనుపించదు. చూడవలయునన్న మూడవకన్ను అయిన జ్ఞాన నేత్రముతో చూడవచ్చును. మెదడునందు ఈ చక్రము పన్నెండు భాగములుగా విభజింపబడి ఉన్నది. కర్మ చక్రమును ప్రక్క పేజీలో 1వ పటములో చూడవచ్చును.



1వ పటము

ఈ విధముగా పన్నెండు భాగములుగాయున్న చక్రములోనికి జీవునియొక్క పాప పుణ్యములు నిర్ణీతమయిన భాగములోనికి పోయి చేరుచుండును. అది ఎట్లనిన కర్మచక్రములోయున్న ఒకటి, ఐదు, తొమ్మిది భాగములలో జీవుని పుణ్యము చేరును. అట్లే మూడు, ఏడు, పదకొండు భాగములలో జీవుని పాపము చేరును. మిగత ఆరు భాగములయందు పాప పుణ్యములు రెండును చేరును. కొన్ని భాగములలో పాపము,

కొన్ని భాగములలో పుణ్యము, కొన్ని భాగములలో పాప పుణ్యములు రెండును ఎందుకు చేరుచున్నవని కొందరికి అనుమానము రావచ్చును. దానిని గురించి పెద్దలు ఏమి చెప్పుచున్నారనగా మానవుడు తన జీవితకాలములో ఒకే రక పుణ్యము ఒకే రక పాపము సంపాదించుకొనడు అనేక రకముల పనులు చేయుచు అనేక రకముల పాప పుణ్యములు సంపాదించుకొనుచుండును. ఒక్కొక్క రకము పుణ్యము కర్మ చక్రమునందు ఒక్కొక్క నిర్ణీత భాగమునే చేరును. అట్లే ఒక్కొక్క రకము పాపము కర్మ చక్రము నందు ఒక్కొక్క నిర్ణీత భాగమునే చేరును. అందువలననే కొన్ని భాగములయందు పుణ్యము, కొన్ని భాగములయందు పాపము, మరికొన్ని భాగములయందు పాపపుణ్యములు రెండును చేరి ఉండును. అవి ఎట్లుయున్నవనగా ప్రక్కనున్న 2వ పటమున చూడవచ్చును.



2వ పటము


ఈ విధముగా అనేక రక పాప పుణ్యములు జీవుడు సంపాదించు కొలది కపాలము యందున్న కర్మచక్రమును చేరుచుండును. కర్మ చక్రము నందలి కర్మను జీవుల మీదికి ప్రసారింప చేయువారు నవగ్రహములగు సూర్య, చంద్ర, అంగారక, బుధ, గురు, శుక్ర, శని, రాహువు, కేతువులు. ఈ తొమ్మిది మంది కాలచక్రములో చిక్కుకొని కాలచక్రము భ్రమించినట్లు వీరును తిరుగుచు కర్మచక్రములోని పాప పుణ్యములను కాలానుగుణ్యముగా

జీవుల మీదికి వదలుచున్నారు. కాల చక్రములో నవగ్రహములు తిరుగు చుండుట వలననే పాప పుణ్యములు ఒకేసారి ప్రసారముకాక కొంత కొంత మిశ్రమ రూపములో ప్రసారమగుచున్నవి దానినే ప్రారబ్దము అని అందురు.

కర్మ చక్రము మన శిరస్సునందు వుండుటవలననే ప్రతి ఒక్కరు నా కర్మ అని తలవైపు చేయి చూపుచుందురు. మరియు ఒక పని నెరవేరనపుడు కూడ నా తలవ్రాత అట్లున్నదని అంటున్నారు. వేరొకనికి ఎక్కువ లాభము వచ్చినపుడు వాని పుణ్యము అట్లున్నదని, ఒకనికి నష్టము వచ్చి నపుడు వాడు పాపము చేసినాడని మనము అనుచునే ఉన్నాము. జరిగిన పనులకు పుణ్యము, జరగని పనులకు పాపము అని మనకు తెలియకనే మన నోట వచ్చుచున్నది. మరియు అట్లే నా తలవ్రాత అని, నా కర్మ అని, మనకు తెలియకనే నోట పలుకుచు మన చేయి తలవైపు చూపుచున్నది. తనకు పూర్తి తెలిసి తలవైపు నా కర్మ అని చూపినాడు అంటే ఏమాత్రము తెలిసియుండదు. ఇక్కడ తెలుసుకోవలసినది ఏమనగా! కర్మ
చక్రమునందు మనము చేసుకున్న పాపము, పుణ్యము ఉన్నది. ఆ పాప పుణ్యములనే మనము అనుభవించుచున్నాము. అందువలన మన శిరస్సునందు గల కర్మచక్రమువైపే మనకు తెలియకుండినా విధిపూర్వకముగా చేయి చూపుచున్నాము.

కర్మ చక్రములోయున్న కర్మకు అధినేతలు నవగ్రహములు. కావున కర్మ చక్రములోయున్న కర్మానుసారము జీవులను నవగ్రహములు త్రిప్పుచుండును. కర్మచక్రమువలె కాలచక్రము పన్నెండు భాగములైనది. పన్నెండు భాగములకు ఆదియందు యున్న సప్తగ్రహములు అధినేతలుగా నియమింపబడిరి. కాలచక్రములోని పన్నెండు భాగములకు పన్నెండు పేర్లు పెట్టబడెను. అవి ఏవనగా [1] మేషము [2] వృషభము [3] మిథునము [4] కర్కాటకము [5] సింహము [6] కన్య [7] తుల [8] వృశ్చికము [9] ధనుస్సు [10] మకరము [11] కుంభము [12] మీనము. ఈ పన్నెండు భాగములకు సప్తగ్రహములు స్వంతహక్కులుగలిగి ఉండును. ఏవిధముగా అనగా సూర్యుడు సింహరాశికి అధినేత అనగా సింహము అనుపేరు కలిగిన భాగము సూర్యుని


స్వంత స్థానము అని అర్థము. అట్లే చంద్రునకు కర్కాటక భాగము, అంగారకునికి మేషము మరియు వృశ్చికము అను రెండు భాగములు, బుధునికి మిథునము, కన్య అను రెండు భాగములు, గురువుకు మీనము, ధనస్సు అను రెండు భాగములు, శుక్రునకు వృషభ, తుల అను రెండు భాగములు శనికి మకరము, కుంభము అను రెండు భాగములు స్వంత భాగములుగా పరిగణింపబడెను. ఈ విధముగా పన్నెండు భాగములకు ఏడుగురు అధినేతలు ఆదినుంచి యున్నారు. మధ్యలో వచ్చిన రాహువు శని స్వంత భాగము అయిన కుంభమునందు, కేతువు గురువు స్వంత భాగమయిన మీనమునందు స్వంత స్థానము ఏర్పరచుకొనిరి. తొమ్మిది గ్రహములు పన్నెండు భాగములకు అధినేతలయిరి. ఈ కాలచక్రము కర్మ చక్రమునకు ఆనుకొని పైన తిరుగుచుండును. దానిని ప్రక్క పేజీలో 3వ పటమునందు చూడవచ్చును.



3వ పటము

కర్మ చక్రములో కర్మను త్రిప్పువారు నవగ్రహములు. అట్లే కాలచక్రములో నవగ్రహములను త్రిప్పువాడు కాలుడు [యముడు]. కాలుడు తన ఆధీనమందున్న నవగ్రహములతో కర్మను జీవులమీదికి విధించుచున్నాడు. జీవరాసుల శరీరములోయున్న కపాల స్థానమున కర్మచక్రము కాలచక్రములు పరిభ్రమించుచున్నవి. కర్మ చక్రముమీద అధికారము నవగ్రహములు కలిగి ఉండును. దీనినే గ్రహచారము అనికూడ అందురు. కాలచక్రముమీద అధికారము కాలునికి ఉండును. కాలుడు ధర్మము తప్పక కాలచక్రమును

పరిభ్రమింపజేయును. కర్మమును నవగ్రహములు నడుపగా నవగ్రహములను యముడు నడుపగా, వీటినన్నిటిని గురువు మధ్యన యుండి గురుత్వాకర్షణ శక్తితో తనచుట్టు తిరుగునట్లు చేయుచున్నాడు. మధ్యనయున్న గురుత్వాకర్షణ శక్తిని ప్రక్క పేజీలో 4వ పటమునందు చూడవచ్చును.




(4వ పటము)

కర్మ, కాల, చక్రములకు ఇరుసుగా పరమాత్మ యుండి , కాలుడను నవగ్రహములను, కర్మమును తన ఆకర్షణ శక్తి చేత నడుపుచు సాక్షిమాత్రునిగా ఉన్నాడు. కావుననే గీతాశాస్త్రములో రాజ విద్య రాజగుహ్య యోగములో ఇట్లన్నాడు "భూమిమీదనే ప్రకృతికి అధ్యక్షత వహించి ఉన్నాను. నావలన జీవరాసులు పుట్టుచున్నవి మరియు చచ్చు చున్నవి. ఈ కారణముతోనే జగము చక్రమువలె తిరుగుచున్నది."

సర్వ జీవరాసులకు బ్రహ్మనాడియందు పరమాత్మ ఉన్నాడు. బ్రహ్మనాడియొక్క సప్తస్థానమున పరమాత్మ శక్తి కేంద్రీకృతమై ఉన్నది. సప్త స్థానమును కేంద్రముగా చేసుకొని దానిచుట్టు కర్మ, కాల చక్రములు తిరుగుచున్నవి. కాలచక్రములో రాత్రి పగలు,

శుక్లపక్షము, కృష్ణపక్షములు మాసములు ఉత్తర దక్షిణాయనములు, సంవత్సరములు జరుగుచునే ఉన్నవి. రాత్రి పగలు మొదలుకొని సంవత్సర కాలమువరకు కర్మను జీవరాసులు అనుభవించుచున్నవి. కాలచక్రములో రాత్రి పగళ్లు ఎలా సంభవించుచున్నవనగా! కర్మ చక్రములోయున్న భాగములను సూర్యుడు దాటుచూ ప్రయాణము చేయుచుండును. ఒక్కొక్క భాగమును దాటుటకు రెండు గంటల కాలము పట్టును. సూర్యోదయము మొదలుకొని ఆరు భాగములు దాటుటకు పన్నెండు గంటలు పట్టును. దీనినే పగలుగా మనము చూస్తూ ఉన్నాము. అట్లే మిగత ఆరుభాగములు దాటుటకు పన్నెండు గంటల కాలము పట్టును. దీనినే రాత్రి అనుచున్నాము. మన కపాలములో యున్న కర్మచక్రమును దాటుచు సూర్యుడు కాలచక్రములో పయనించుచున్నాడు ఇట్లు కాలచక్రములో పయనించుచు కర్మచక్రము పన్నెండు భాగములను దాటుటకు 24 గంటలు కాలము పట్టుచున్నది. 24 గంటలను ఒక దినము అని అనుచున్నాము. కర్మచక్రములో మధ్యరేఖ ఉన్నది. మధ్యరేఖకు ఎడమ ప్రక్క ఆరు భాగములు పగలు, కుడి ప్రక్క ఆరు భాగములు రాత్రిగా సూర్యభ్రమణములో తెలియుచున్నది. వెనుక పేజీలో యున్న 5 వ పటములో రాత్రి పగలు భాగములను చూడవచ్చును.

సూర్యుడు కాలచక్రములో పరిభ్రమించుచున్నాడు కదా! కాలచక్రము పన్నెండు భాగములు కదా! సూర్యుడు ఒక్కొక్క భాగమును దాటుటకు ఒకమాసపు కాలము పట్టును. కాలచక్రము యొక్క పన్నెండు భాగములను




5వ పటము

సూర్యుడు పూర్తి దాటుటకు పన్నెండు మాసములు పట్టును. దానినే ఒక సంవత్సరము అని అనుచున్నాము. కాలచక్రములో మధ్య జీవరేఖ యున్నది. జీవరేఖకు ఎడమప్రక్క యుండు ఆరు భాగములను సూర్యుడు దాటుటకు ఆరు మాసములు పట్టును. ఆ కాలమునే ఉత్తరాయణమని అనుచున్నాము. అట్లే జీవుని కుడిప్రక్క యుండు ఆరు భాగములను దాటుటకు ఆరు మాసములు పట్టును. ఆ కాలమునే దక్షిణాయణమని అనుచున్నాము. ఉత్తర దక్షిణాయణములను ప్రక్క పేజీలో యున్న 6వ పటములో చూడవచ్చును.

కాలచక్రములో చంద్రుడు ఒక్కొక్క భాగమును దాటుటకు 2 ½ దినము పట్టును. జీవరేఖకు ఒక ప్రక్కయున్న ఆరు భాగములు దాటుటకు 15 దినములు, మరియొక

ప్రక్కయున్న ఆరు భాగములు దాటుటకు 15 దినములు




6వ పటము

పట్టును. చంద్రుడు పన్నెండు భాగములు దాటుటకు 30 దినముల కాలము పట్టును. చంద్రుడు జీవరేఖకు ఎడమప్రక్క యున్న భాగములు దాటుకాలమును శుక్లపక్షము అనియు, కుడిప్రక్క యున్న భాగములు దాటుకాలమును కృష్ణపక్షము అనియు అందురు. కృష్ణ శుక్ల పక్షములను ప్రక్క పేజీలో యున్న 7వ పటములో చూడవచ్చును.


ఈ విధముగా కాలచక్రములో రాత్రి పగలు, శుక్ల కృష్ణ పక్షములు ఆయణములు జరుగుచున్నవి. జీవునకు యోగముచేత లభించిన యోగశక్తి అంతయు కర్మ కాలచక్ర

మధ్యయందున్న గురుకేంద్రమును చేరుచుండును ఎవనికి యోగశక్తి పరిపూర్ణస్థితికి వచ్చునో వానికి సూర్యుడు జీవరేఖకు ఎడమప్రక్క యున్నపుడే, మరియు సూర్యుడు కర్మచక్రము మీదకూడ జీవరేఖకు




7వ పటము

ఎడమప్రక్క యున్నపుడే, చంద్రుడుకూడ కాలచక్రములో జీవరేఖకు ఎడమప్రక్క యున్నపుడే మరణము సంభవించును. ఆవిధముగా మరణించిన జీవుడు మధ్యలో యున్న కేంద్రములోనికి పోవుచున్నాడు. అనగా ఆత్మయందు లీనమవుచున్నాడు. ఇతర సమయములలో చనిపోయిన జీవుడు కేంద్రములో యున్న ఆత్మను చేరలేడు. పగలు, శుక్ల పక్షము ఉత్తరాయణము కలసిన కాలములో ఆత్మను చేరుటకు జీవునకు మార్గము ఏర్పడును. అట్లుకాక పోయిన దారి ఉండదు. ఈ మార్గములను క్రింద 8 వ పటములో చూడవచ్చును. రాత్రి, శుక్లపక్షము, దక్షిణాయనములో మరణించిన జీవుడు ఆత్మను చేరలేడు. ఆ సమయములో మరణించిన జీవునికి కాల చక్రములో ఆత్మను చేరు మార్గము




8వ పటము

లభించదు. రాత్రి, శుక్లపక్షము, దక్షిణాయణములో కాలచక్రములో మార్గములు ఎట్లు ఉన్నది క్రింద 9వ పటములో చూడవచ్చును.



9వ పటము

పగలు, శుక్లపక్షము, దక్షిణాయణములో మరణించిన జీవుడు ఆత్మను చేరలేడు. ఆ సమయములో మరణించిన జీవునకు కాలచక్రములో ఆత్మను చేరు మార్గము ఉండదు. పగలు శుక్లపక్షము, దక్షిణాయనములో కాలచక్రములో మార్గము ఎట్లు ఉన్నది ప్రక్క పేజిలోనున్న 10వ పటములో చూడవచ్చును.




10వ పటము

ఆత్మను చేరుటకు అన్ని ద్వారములు ఒకే ప్రక్క, అనగా ఎడమవైపే వచ్చి ఉండవలయును. అట్లుకాక కాల చక్రములో ఏ ద్వారము కుడి ప్రక్కకు పోయిన జీవునికి ఎడమవైపు మార్గము లభించక తిరిగి వేరే శరీరమును ఆశ్రయించి పుట్టుచుండును. ఇది యోగులకు మాత్రము నిర్ణయించబడి ఉన్నది.

యోగి ఉత్తరాయణములో, కృష్ణపక్షములో పగలు మరణించిన ఆత్మను చేరలేడు. ఆ సమయమున మరణించిన యోగికి కాల చక్రములో ఆత్మను చేరు మార్గము ఉండదు. ఆ సమయమున కాల చక్రము ఎట్లుండుననగా ప్రక్క 11వ పటములో చూడవచ్చును.

ఇట్లు జీవునికి ఆత్మను చేరుటకు మార్గము లభించక తిరిగి జన్మ ఎత్తుట సంభవించుచున్నది. దీనిని గురించి భగవద్గీతాశాస్త్రమునందు అక్షర పరబ్రహ్మ యోగములో శ్రీ కృష్ణ పరమాత్మ ఈ విధముగా అన్నాడు.**"అర్జునా యోగులు ఎప్పుడు మరణించిన మరల జన్మించరో మరియు ఎట్టి సమయమున మరణించిన**




11వ పటము

వారు తిరిగిభూమిమీద పుట్టుదురో తెలుపుదును వినుము. తేజస్సు గలిగిన దినమున పగలుయందు, శుక్లపక్షములో , ఉత్తరాయణమున యోగులు మరణించిన వారికి ఆత్మను చేరు భాగ్యము కల్గును. అట్లుకాక ధూమముతో కూడుకొన్న దినమున రాత్రియందు, కృష్ణపక్షమందు, దక్షిణాయణమున యోగులు మరణించిన, వారు చంద్రతేజమును పొంది తిరిగి జన్మింతురు" పూర్తి యోగపరులు చనిపోవు ఆ సమయము పగలుగానే, శుక్లపక్షముగానే ఉత్తరాయణముగానే ఉండును. ప్రపంచములో స్వాములనుపించుకొనినా యోగశక్తి సంపూర్ణస్థితి చెందనివారు చనిపోయిన ఆ సమయము రాత్రిగానో, కృష్ణపక్షముగానో దక్షిణాయణముగానో ఉండును. కావున బ్రతికిన బ్రతుకంతయు చావులోనే తెలుస్తుంది అని పెద్దలు అన్నారు.

కాల చక్రములో సూర్యుని ద్వారా దినములు, ఆయనములు, సంవత్సరములు, లెక్కించుకొనుచున్నాము. ఈలెక్క ప్రకారము మనకు యుగములు గడుస్తున్నవి. ఒక

యుగములో మనము శతకోటి లేక అంతకంటే ఎక్కువ జన్మలు ఎత్తవలసి ఉంటుంది. ఇటువంటి యుగములు వేయి అయినా పరమాత్మ లెక్కకు ఒక పగలు, అట్లే వేయి యుగములు పరమాత్మ లెక్కకు ఒక రాత్రి. ఈ పగలు రాత్రులు ఎటువంటివనగా, ఆత్మకు పగలు అయిన వేయియుగముల కాలమున జీవరాసులకు చావుపుట్టుకలు కల్గుచుండును ఆత్మ పగలు [బ్రహ్మపగలు] వేయి యుగములు గడచిన వెంటనే బ్రహ్మరాత్రి ప్రారంభమగును. రాత్రి ప్రారంభమయిన వెంటనే జీవులన్నియు ప్రళయము చెందును. రాత్రి కాలము వేయి యుగములు గడుచునంత వరకు జీవులు కాని, ప్రకృతికాని ఏది ఉండదు. అనగా కాలచక్రము, కర్మచక్రములు లేవు. అంతయు ఊహించరాని శూన్యముగా ఉండిపోవును. బ్రహ్మరాత్రి కాలము వేయియుగములు గడచి పగలు వచ్చిన వెంటనే జీవులు ప్రకృతి పుట్టును. [భగవద్గీత: అక్షర పరబ్రహ్మ యోగములో 17, 18, 19, 20 శ్లోకములు చూడుము] బ్రహ్మపగలు బ్రహ్మరాత్రిని క్రింది పటములో చూడవచ్చును.



ఈ విధముగా బ్రహ్మ చక్రము వేయి యుగములు పగలుగా, వేయి యుగములు రాత్రిగా పరిభ్రమించుచున్నది. ఓ జీవులారా! ఇంతవరకు తెలుసుకున్న కాల, కర్మ, బ్రహ్మచక్రములలో చిక్కుకొనక వాటిని దాటి ఆత్మను చేరిన ఏ బాధలు ఉండవు. అందువలన నేటినుంచి పాపపుణ్యములను కర్మచక్రములోనికి పోయి చేరకుండ చేసుకోవలయునని నీకే.... నీకే.... నీకే....మరి....మరి.... తెలుపుచున్నాను.

-( )(ం)( )-

ప్రాణాయామము

జీవుల శరీరములందు ఐదు వాయువులున్నవి. వాటిని పంచ ప్రాణములని అందురు. ఈ ఐదు వాయువులకు ఐదు ఉపవాయువులున్నవి. అవి ఈ ఐదు వాయువులయందే యిమిడి ఉండును. పంచ ప్రాణములని పేరుగాంచిన ఈ ఐదు వాయువులు ఒక్కటి కావడమును "ప్రాణాయామము" అని అందురు. ప్రాణాయామము తారకమునందు ఒక భాగము. ప్రాణాయామము రెండురకములుగా ఉన్నది. ఆ రెండురకములు ఎట్లువున్న వనగా! జీవులు శ్వాసను పీల్చడమును పూరకము [ఉశ్చ్వాసము] అనియు, శ్వాసను బయటికి వదలడమును రేచకము [నిశ్చ్వాసము] అనియు, లోపలకు పీల్చిన శ్వాసను బయటికి వదలకుండ లోపలనే బిగించి యుంచడమును కుంభకము అనియు అందురు. కుంభకము ద్వారా శ్వాసను బిగించి లోపలయున్న వాయువులన్నిటిని ఏకము చేయడము ఒక విధ ప్రాణాయామము. జీవుడు కుంభించి శ్వాసను నిలుపకనే యోగము వలన శ్వాస తనంతట తాను నిలిచిపోయి లోపలయున్న వాయువులన్నియు ఏకము కావడము వేరొక విధ ప్రాణాయామము. ఈ రెండు విధములయందు ఏది జరిగిన దానిని ప్రాణాయామము అనియే అందురు. రెండు రకముల ప్రాణాయామములలో కుంభించి శ్వాసను నిలుపు పద్ధతి చాలా కష్టమయినది, మరియు ప్రాణాపాయకరమయినది. రెండవ పద్ధతి కష్టములేనిది, మరియు ప్రాణాపాయకరము లేనిది. రెండు పద్ధతులను ఆమూలాగ్రముగా వివరించెదను వినుము.

ప్రతి మానవునియందు [జీవుని యందు] బ్రహ్మనాడి వున్నది. దానినే వెన్నుపాము అని అందురు. బ్రహ్మనాడి మెదడునుండి ప్రారంభమై వీపునవున్న వెన్నుముకద్వారా గుద స్థానము వరకు వ్యాపించి ఉన్నది. మెదడునుండి క్రిందివరకు వ్యాపించియున్న

బ్రహ్మనాడియందు ముఖ్యమయిన నరాశయ కేంద్రములు ఏడు ఉన్నవి ఈ నరాశయ కేంద్రములనే సప్తస్థానములనియు, సప్త చక్రములనియు, సప్త కమలములనియు యోగులు అంటున్నారు. ఈ నరాశయ కేంద్రములే మానవుని [జీవుని] చలించునట్లు అన్ని పనులు చేయునట్లు చేయుచున్నవి. శరీరము లోపలయున్న అవయవములను, బయటనున్న అవయవములను పని చేయునట్లు చేయుచున్నవి. ఈ నరాశయ కేంద్రములనుండి బయల్పడిన నరములే ఊపిరి తిత్తులను ముడుచుకొనునట్లు వికసించుకొనునట్లు చేయుచున్నవి. ఊపిరితిత్తులు ముడుచుకొన్నపుడు శ్వాస బయటికి పోవుచున్నది. దానినే నిశ్వాసము అని అందురు. ఊపిరితిత్తులు తెరుచుకున్నపుడు శ్వాసలోపలికి ప్రవేశించుచున్నది. దానినే ఉశ్వాసము అని అనుచున్నారు. బ్రహ్మనాడియందుగల నరాశయ కేంద్రములే తమ నుండి బయలుదేరివచ్చిన నరములతో ఊపిరితిత్తులను ఆడించుచు, జీవునికి ఉశ్వాస నిశ్వాసలు జరుగునట్లు చేయుచున్నవి. జీవునికి శ్వాస లోపలికిపోయి బయటికి వచ్చిన ఒక్క శ్వాస గడచినట్లగుచున్నది. శ్వాసనే హంస అనికూడ అందురు. ఇట్లు దినమునకు 21,600 శ్వాసలు జీవునికి గడుచుచుండును. ఈ 21,600 శ్వాసలు గడచునట్లు బ్రహ్మనాడియందుగల కేంద్రములే చేయుచున్నవి. ఆ కేంద్రములే శ్వాసను ఎట్లు నడుపుచున్నవనగా! బ్రహ్మనాడియందు ఏడు కేంద్రములు కలవుకదా! అందు అన్నిటికంటే క్రిందయున్న కేంద్రమును ఆధారకమలము అని అనుచున్నారు. ఈ కేంద్రము గుద స్థానమునకు సరిగ ఉన్న వెన్నెముకలోని బ్రహ్మనాడిలో ఉన్నది. కావున ఆధార కమలము [ఆధార చక్రము] గుదస్థానమువద్ద యున్నదని పెద్దలు అనుచున్నారు. ఈ ఆధారచక్రమనబడు నరాశయ కేంద్రమునుండి బయల్పడిన కొన్ని నరములు ప్రక్కనయున్న సూర్య చంద్రనాడులతో కలసి ఊపిరితిత్తులకు పోయి ఉండును. సూర్య చంద్రనాడులనునవి బ్రహ్మనాడికి రెండుప్రక్కల రెండు ఉన్నవి. బ్రహ్మనాడికి కుడిప్రక్కయున్న నాడిని సూర్యనాడి అనియు, ఎడమప్రక్కయున్న నాడిని చంద్రనాడి అనియు, పెద్దలు చెప్పుచుందురు. వీటినే ఇడ, పింగళ నాడులు అనికూడ అనుచున్నారు. వీటినే డాక్టర్లు సింపతెటిక్ దండలు [sympathetic chains] అనికూడ అనుచున్నారు. చివరగాయున్న ఆధార నరాశయకేంద్రము తన నరములద్వార ఊపిరితిత్తులను సూర్యోదయము మొదలుకొని “600” శ్వాసలు గడచు వరకు నడుపును. 600 శ్వాసలు

గడచిన వెంటనే తన పనిని విరమించుకొనును. ఆ తర్వాత రెండవ నరాశయ కేంద్రమున్నదికదా! ఆ రెండవదానిపేరు స్వాధిష్టాన పద్మము [స్వాధిష్టాన చక్రము] అని అంటున్నారు. ఈ కేంద్రము స్త్రీలకు యోని స్థానమునకు సరిగ, పురుషునకు లింగస్థానమునకు సరిగయున్న వెన్నెముకలోని బ్రహ్మనాడియందు కలదు. కావున స్వాధిష్టానచక్రము లింగస్థానమువద్ద ఉన్నది అనుచున్నారు. ఈ స్వాధిష్టాన చక్రమనబడు నరాశయ కేంద్రమునుండి బయల్పడిన కొన్ని నరములు ప్రక్కనున్న సూర్య చంద్రనాడులతో కలసి ఊపిరితిత్తులకు పోయియుండును. రెండవ కేంద్రమయిన ఈ స్వాధిష్టాన కేంద్రము తన నరములద్వార ఊపిరితిత్తులను మొదటి కేంద్రము పని చాలించుకొన్నది మొదలు 6000 శ్వాసలు గడచునంతవరకు నడపుచుండును. 6000 శ్వాసలు అయిపోయిన వెంటనే తన పనిని విరమించుకొనును. ఆ తర్వాత మూడవ నరాశయ కేంద్రము ఉన్నది కదా! ఆ కేంద్రము పేరు మణిపూరక పద్మము [మణిపూరక చక్రము] అని అనుచున్నారు. ఈ కేంద్రము నాభి [బొడ్డు] కు సరిగ యున్న వెన్నెముకలోని బ్రహ్మనాడియందు ఉన్నది. కావున మణిపూరకచక్రము నాభి స్థానమువద్ద ఉన్నది అని అనుచున్నారు. ఈ మణిపూరకపద్మమనబడు నరాశయ కేంద్రమునుండి ప్రారంభమయిన నరములు కొన్ని ప్రక్కనున్న సూర్యచంద్రనాడులతో కలసి ఊపిరితిత్తులకు పోయివుండును. మణిపూరక నరకేంద్రం తననరములద్వారా ఊపిరితిత్తులను రెండవకేంద్రము తన పని చాలించుకొన్నది మొదలు 6000 శ్వాసలు అయిపోవు వరకు నడుపుచుండును. 6000 శ్వాసలు అయిపోయిన వెంటనే తన పనిని విరమించుకొనును. ఆ తర్వాత నాల్గవ నరాశయ కేంద్రమున్నదికదా! ఆ నాల్గవ నరాశయ కేంద్రము పేరు అనాహత పద్మము [అనాహత చక్రము] అని అనుచున్నారు. ఈ కేంద్రము హృదయమునకు సరిగయుండు వెన్నెముకలోని బ్రహ్మనాడియందు వున్నదని అనుచున్నారు. నాల్గవ చక్రమయిన అనాహత కేంద్రమునుండి బయలుదేరిన కొన్ని నరములు ప్రక్కన ఉన్న సూర్య చంద్రనాడులతో కలిసి ఊపిరితిత్తులకు పోయివుండును. అనాహత నరకేంద్రము తన నరములద్వారా ఊపిరితిత్తులను మూడవ కేంద్రము తన పనిని చాలించుకొన్నది మొదలు 6000 శ్వాసలు అయిపోవువరకు నడపుచుండును. 6000 శ్వాసలు అయిపోయిన వెంటనే తన పనిని విరమించుకొనును. ఆ తర్వాత ఐదవ నరాశయ కేంద్రమున్నదికదా! ఆ ఐదవ నరాశయ

కేంద్రము పేరు విశుద్ధ పద్మము [విశుద్ధ చక్రము] అని అనుచున్నారు. ఈ కేంద్రము కంఠస్థానమునకు సరిగయున్న వెన్నెముకలోని బ్రహ్మనాడియందు ఉన్నది. కనుక విశుద్ధ చక్రము కంఠస్థానమువద్దయున్నది అనుచున్నారు. ఐదవ కేంద్రమయిన విశుద్ధ చక్రమునుండి బయలుదేరిన కొన్ని నరములు ప్రక్కనున్న సూర్య చంద్రనాడులతో కలసి ఊపిరితిత్తులకు పోయివుండును. విశుద్ధ నరకేంద్రము తన నరములతో ఊపిరితిత్తులను నాల్గవ కేంద్రము పని చాలించుకొన్నది మొదలు 1000 శ్వాసలు అయిపోవువరకు నడుపుచుండును. 1000 శ్వాసలు అయిపోయిన వెంటనే తన పనిని విరమించుకొనును. ఆ తర్వాత ఆరవ నరాశయ కేంద్రమున్నది కదా! ఆ ఆరవ నరాశయ కేంద్రము పేరు ఆగ్నేయ పద్మము [ఆగ్నేయ చక్రము] అని అనుచున్నారు. ఈ కేంద్రము కనుబొమ్మల మధ్యకు సరిగ [భ్రూమధ్య స్థానముకు సరిగ]తలలోయున్న బ్రహ్మనాడియందు ఉన్నది. కనుక ఆగ్నేయచక్రము భ్రూమధ్య స్థానము వద్దయున్నది అనుచున్నారు. ఆరవ నరకేంద్రమయిన ఆగ్నేయచక్రము నుండి బయలుదేరిన కొన్ని నరములు ప్రక్కనున్న సూర్య చంద్ర నాడులతో కలిసి ఊపిరితిత్తులను చేరియుండును. ఆగ్నేయ నరకేంద్రము తన నరములద్వారా ఊపిరితిత్తులను ఐదవ చక్రముపని చాలించుకొన్నది మొదలు 1000 శ్వాసలు అయిపోవువరకు నడుపుచుండును. 1000 శ్వాసలు అయిపోయిన వెంటనే తనపనిని విరమించుకొనును. ఆ తర్వాత ఏడవ నరకేంద్రమున్నది కదా! ఆ ఏడవ నరకేంద్రము పేరు సహస్రారపద్మము [సహస్రార చక్రము] అనుచున్నారు ఈ కేంద్రము శిరస్సు మధ్య భాగముననున్నది. ఈ కేంద్రము నుండి బయలుదేరిన కొన్ని నరములు ప్రక్కనయున్న సూర్యచంద్ర నాడులతో కలసి ఊపిరితిత్తులను చేరివుండును ఏడవ నరకేంద్రమయిన సహస్రారపద్మము తన నరముల ద్వారా ఊపిరితిత్తులను ఆరవ కేంద్రము పని చాలించుకొన్నది. మొదలు 1000 శ్వాసలు జరుగునంత వరకు నడుపుచుండును 1000 శ్వాసలు అయిపోయిన వెంటనే తిరిగి మొదటి కేంద్రమయిన ఆధారచక్రము ఊపిరితిత్తులను నడుపుటకు ప్రారంభించును. దానితర్వాత రెండవ కేంద్రము, దానితర్వాత మూడవ కేంద్రము ఇట్లు ఒక కేంద్రము తర్వాత ఒక కేంద్రము ఊపిరితిత్తులను నడుపుచుండును. ఏడవ కేంద్రమయిన వెంటనే మొదటి కేంద్రము పని ప్రారంభించును. కనుక అన్నివేళల యందు శ్వాస నడుచుచునే ఉన్నది. అన్ని చక్రములు

కలసి మొత్తము 21600 శ్వాసలు నడుపుచున్నవి. సూర్యోదయము మొదలుకొని అన్ని చక్రములు పనిచేయుటకు తిరిగి సూర్యోదయము వచ్చుచున్నది. కావున ఒక్కదినమునకు 21600 శ్వాసలు జరుగుచున్నవని తెలియుచున్నది.

కొన్ని గ్రంధములందు శ్వాస లోపలనున్న చక్రములకు ప్రదక్షణలు చేసివస్తున్నదని వ్రాసినారు. శ్వాస చక్రముల వరకు పోయి ప్రదక్షణలు చేసి రావడము అన్న విషయము శుద్ధ అపద్ధము. శ్వాస చక్రములకు ప్రదక్షణలుచేసి వస్తున్నదని డాక్టర్లు వినినంతనే ఈ మాట అబద్ధము అని అనుచున్నారు. దానితో శరీర పరిశోధకులయిన డాక్టర్లు బ్రహ్మవిద్య అంతయు అబద్ధము అనుకొను పరిస్థితి ఏర్పడినది. ఈ విషయములో బ్రహ్మవిద్యలో పూర్తి పరిశోధనలు జరుపనివారు, మొదట ఒకరుచెప్పగా పరంపరగా అదేమాటను అందరు చెప్పుచుపోయినారు, కావున శ్వాస ఎక్కడికో పోయివస్తున్నదని తెలిపినారు. ఎక్కడికో పోయివచ్చు మాట అబద్ధము. శ్వాస ఊపిరితిత్తుల వరకే పోయివచ్చుచున్నదని తెలుసుకోవలయును. బ్రహ్మవిద్యలో ఏమాత్రము పరిశోధన చేయక, ఫలితమును కనిపెట్టలేక పోయినా ఎవడో ఒకడు చెప్పిన మాటను పట్టుకొని అందరు అదే మాటను చెప్పుచు పోవుచుందురు. ఇది నిజమెంత? అబద్ధ మెంత అని ఏమాత్రము విశదీకరించుకొని, సాధనద్వారా తెలుసుకోవడములేదు. అటువంటివారు కుండలీశక్తి పాముమాదిరి వుందని, అది నిద్రపోవుచున్నదని, స్ప్రింగుచుట్ట ఆకారముతో నాభిస్థానము వద్దయున్నది అని నానావిధములుగా చెప్పుచున్నారు. మేము చెప్పుచున్నది నిజమేనా అని వారికే తెలియదు. కాని తెలిసినవారు చెప్పితే వారిమాట వినక నిజముగా చూచిన వారిమాదిరి వాదించుచున్నారు. మాటలు బహు నేర్చి వాదనలలో గట్టివారు అని అనిపించుకొనినా, ఎంతో మందితో అభినందనలు పొందినా, నిజముతెలియనిది ఏమి ప్రయోజనము లేదు.

పరమాత్మ మనవాదనలను ఒప్పుకోడు. కావున ప్రతి విషయమును మీరు స్వయముగా తెలుసుకుంటే ఎంతో బాగుండును. వారుచెప్పినారు, వీరు చెప్పినారు అని వారిమాదిరే మనము చెప్పుచు పోయిన, ఒక గొర్రె బావిలోనికి దూకితే మిగతా గొర్రెలు

కూడ అట్లే దూకినట్లుండును. కావున కుండలీశక్తి అంటే ఏమిటి? దానికి ఆకారమున్నదా? దానికి నిదుర మెలుకవలు మనకున్నట్లున్నవా? అను ప్రశ్నలకు సరైన సమాధానములు తెలుసుకోవలయునని కోరుచున్నాను.

బ్రహ్మనాడియందు మొత్తము ఏడు కేంద్రములున్నవికదా! అందు ఆరు కేంద్రములు ఒక్కొక్కటి ఒక్కొక్క శక్తికలిగి ఉన్నవి. ఆ శక్తులు కొంతమంది దేవతా శక్తులకు సమానమైయున్నవి. కావున పెద్దలు ఆయా చక్రములలో ఆయాదేవతలున్నారని తెలిపినారు. అందలి రహస్యము ఆ దేవతల శక్తికి సమానమయినశక్తి ఆయాకేంద్రములలో ఇమిడి ఉన్నది. కావున ఒకదాని తర్వాత ఒకటి పనిచేయుచున్నది. ఈ ఆరు కేంద్రములశక్తి కూడలినే "కుండలీశక్తి" అని కొందరు పెద్దలు చెప్పుచున్నారు. కొందరు అజ్ఞానవశమున కుండలీశక్తి నిదురించుచున్నది. దానిని నిదురలేపవలెను అని అనుచున్నారు. ఆరు కేంద్రముల చైతన్యమునే కుండలి అనబడుచున్నది. ఆ కుండలీశక్తి ఎల్లవేళల ఊపిరితిత్తులను ఆడించు పనియందు నిమగ్నమయి మరియు శరీరమున కొన్ని పనులు వర్తించుటయందు లయమై ఎల్లవేళల పనిచేయుచుండగ ఏలా నిదురించుచున్నదని చెప్పనగును. ఆరు కేంద్రముల చైతన్యము [కుండలీ] ఎఱుకయందులేక మరుపును [నిద్రకు] పోయిన జీవుడు చనిపోవును. స్వానుభవముతో పరిశోధించిన భక్తులు కొందరు పొరపాటుతో కుండలీ యనుదానిని వేరొక విధముగా పోల్చుకొని తికమకపడుచున్నారు. కుండలీశక్తి అనునదియే బ్రహ్మనాడియందలి చైతన్యశక్తి. బ్రహ్మనాడి ఏడు భాగములుగా యోగవిద్యయందు విభజింపబడివున్నది. అందు ఆరు భాగములవరకు యుండు చైతన్యశక్తిని కుండలీశక్తి అని పిలువబడును. ఒక్క ఏడవకేంద్రమందలి చైతన్యశక్తిని మాత్రము పరమాత్మశక్తియని పిలువబడును. ఆరు కేంద్రములశక్తి ఏడవ కేంద్రములోయున్న శక్తికి లోబడి ఉండును. అనగా కుండలీశక్తి పరమాత్మ శక్తికి లోబడి యున్నదన్నమాట. ఆరు కేంద్రముల శక్తికి ఆధారము ఏడవ కేంద్రమందలి శక్తియే ఏడవ కేంద్రములో శక్తిలేకున్న ఆరు కేంద్రములలో శక్తి లేకుండ పోవును. ఏడవ కేంద్రములోయున్న శక్తి ఏ దేవతాశక్తికి సమానమయినది కాదు. ఏడవ కేంద్రములోయున్న శక్తిని తెలుసుకొన్నవారే యోగులు.

బ్రహ్మనాడియందు బయలుదేరిన కొన్ని నరములు ప్రక్కనయున్న సూర్య చంద్రనాడులలోనికి పోయి, అక్కడనుండి ఊపిరితిత్తులకు పోయి ఊపిరితిత్తులను ఆడునట్లు చేయుచున్నవి. ఈ విధముగా ఆడు శ్వాసలను జీవుడు [మానవుడు] రెండు పద్ధతులద్వారా నిలుపుచున్నాడు. అనగా అనిచ్ఛాధీనముగా యున్న ఊపిరితిత్తులను ఇచ్ఛాధీనముగా చేయుచున్నాడు. అనిచ్ఛాదీన అవయవములను ఇచ్ఛాదీన అవయవములుగా మార్చుశక్తి ఒక్క యోగులకుమాత్రమే ఉండును. ఒక్క యోగికి శ్వాస రెండు పద్ధతులద్వారా ఎట్లు నిలుచుచున్నదో తెలుపుదును.

శ్వాసను కుంభించి నిలిపి మనస్సును బ్రహ్మనాడియందు చేర్చవలయునని అనుకొన్న యోగి ఒక స్థలమునందు కదలక కూర్చొని మొదట శ్వాసను ఊపిరితిత్తులనిండా ఏమాత్రము ఖాళీలేకుండ పీల్చును. పీల్చిన శ్వాసను ఏమాత్రము బయటికి వదలకుండ మూడు లేక నాలుగు నిమిషములు ఉండును. ఇట్లున్న తర్వాత మరియు బయటి గాలినే లోపలికి పీల్చును. ఇక్కడ గమనింపవలసిన విషయము మొదట ఊపిరితిత్తులు ఏమాత్రము ఖాళీలేకుండ గాలి పీల్చినాడుకదా, ఖాళీలేని ఊపిరితిత్తులందు తిరిగి గాలి ఎట్లు ప్రవేశించినదని అనుమానము కలుగవచ్చును. దానికి సమాధానము మొదట ఖాళీలేని ఊపిరితిత్తులందు మూడు, నాలుగు నిమిషములు తర్వాత కొద్దిగా ఖాళీ ఏర్పడియుండును. ఆ ఖాళీస్థలము ఎట్లేర్పడినదనగా ఊపిరితిత్తులయందున్న గాలి మూడు నాలుగు నిమిషములకు బయటికి రావలయునని ప్రయత్నించును. కాని బయటికి రాకుండ నిరోధించి యున్నందువలన కంఠమార్గముగుండా కొద్దిగా ఉదరము చేరియుండును. కావున ఊపిరితిత్తులు కొద్దిగ ఖాళీ ఏర్పడియుండును ఆ ఖాళీ పూర్తిఅగునట్లు రెండవసారి యోగి బయటిగాలిని పీల్చి పూరించుచున్నాడు. ఇట్లు రెండవమారు గాలిని పీల్చిన మూడు లేక నాలుగు నిమిషములవరకు శ్వాసను బయటికి వదలకయుండి, తర్వాత ఇంకా తనయందు గాలి ప్రవేశించునేమోనని మూడవమారు పీల్చిచూచును. అపుడు కూడ గాలి కొద్దిగ లోపలికి పోవును. ఇట్లు రెండు మూడుమార్లు శ్వాసను పీల్చి ఉదరమునందును ఊపిరితిత్తులందును గాలిని భర్తిగా చేసుకొని బయటికి

వదలక ప్రయత్నపూర్వకముగా బిగించియుండును. దీనినే "కుంభకము" అని అందురు. ఈ విధముగా కుంభింపబడిన గాలి బంతియందు బంధింపబడినట్లుండును.

[1] గాలిని ఆధారము చేసుకొని ఆడుచున్న ఊపిరితిత్తులు గాలి కదలక నిలిచిన వెంటనే నిలిచిపోవుచున్నవి.


[2] ఊపిరితిత్తులు నిలిచిన వెంటనే ఊపిరితిత్తులను నడుపు చున్న నరములందు చైతన్యముకూడ నిలిచిపోవును.

[3] నరములందు చైతన్యము నిలిచిన వెంటనే ఆ నరములతో సంబంధమున్న సూర్య చంద్రనాడుల అందుండు చైతన్యము నిలిచిపోవును

[4] సూర్య చంద్రనాడులందు చైతన్యము నిలిచిన వెంటనే సూర్య చంద్రనాడులను ఆధారముగా చేసుకొని చలించుచున్న మనస్సు కదలక నిలిచిపోవును.

[5] మనస్సు నిలిచిపోయిన వెంటనే మనస్సును ఆధారముగా చేసుకొని జీవులను నడుపుచున్న ఆరు నరకేంద్రమందలి చైతన్యశక్తి నిలిచి పోవును. అనగా కుండలీశక్తి ఆటకట్టబడినదన్నమాట. నరకేంద్రముల చైతన్యమునకు ఆధారమైయున్న ఏడవ కేంద్రము ఒక్కటి తన శక్తిని కోల్పోక యుండును. ఆరుకేంద్రముల చైతన్యశక్తి నిలిచి పోయినను ఏడవ కేంద్రమందున్న చైతన్యశక్తి నిలిచిపోక ఉండును. ఏడవ కేంద్రమందలి శక్తి అపారమైనది, ఊహించరానిది, చెప్పుటకు శక్యముకానిది, దానినే పరమాత్మ అని యోగులు అంటున్నారు. ఈ ఏడవ కేంద్రమునందలి చైతన్యము జీవుని నిదుర, మెలకువ, స్వప్నములందు సమానముగ ఉండును. అందువలన ఏడవ కేంద్రమందున్న చైతన్యమునే మూడవస్థలయందు సాక్షిగ యున్నదని చెప్పవచ్చు. బ్రహ్మనాడియందలి ఏడవ కేంద్రముకే చర ప్రకృతి 25 భాగములు లోబడియుండును. కావున కుంభకముద్వారా నిలిచిన మనస్సు బ్రహ్మనాడి యందు ఏడవ కేంద్రము చేరి అందు ఇమిడిపోవుచున్నది. మనస్సుతోపాటు

అంతఃకరణములయిన జీవుడు కూడ ఏడవ కేంద్రములోయున్న పరమాత్మయందే లీనమయిపోవుచున్నాడు. జీవుడు ఆత్మయందు లీనముకావడమునే "యోగము" అంటున్నారు. ఈ విధముగా యోగి శ్వాసను కుంభించి నిలిపి యోగమును పొందుచున్నాడు. కుంభకముద్వారా యోగమందున్న ఒక యోగి చిత్రమును క్రింద చూడవచ్చును.



77 వ సంవత్సరంలో ప్రబోధానంద స్వామి యోగమందున్న సమయములో తీసిన ఛాయా చిత్రము.

కుంభకమునే పూర్వము యోగి అయిన శ్రీ వీరబ్రహ్మంగారు ఒక తత్వముగా చెప్పియున్నారు. కుండలీశక్తిని వేరుగా పోల్చుకొన్న వారు, కుండలీశక్తి నిదురపోతున్నదన్నవారు యుండుటవలన ఆ తత్వమునకు అర్థమే తెలియకపోయి, ఆఖరుకు బిక్షగాళ్లు పాడుకొనుటకు ఉపయోగపడుచున్నది. గుడ్డివానికి రత్నమును ఇచ్చిన వ్యర్థమయినట్లు శ్రీ వీరబ్రహ్మముగారు ఎంతో జ్ఞానమును ఉపయోగించి, జ్ఞానదృష్టిచేత తెలుసుకొని చెప్పినమాటను తెలియని మనము వ్యర్థము చేయుచున్నాము. కుండలినే పెద్దగా పెట్టుకొన్నవారు, మరియు విన్నవారు, శ్రీ పోతులూరి వీరబ్రహ్మము గారు చెప్పిన క్రింది తత్వమును గ్రహించవలయునని తెలుపుచున్నాను.

ఆహా బ్రహ్మండమైనది ఆదిమంత్రము మన బ్రహ్మంగారు చెప్పినది పెద్దమంత్రము.

[1] రెక్క ముక్కులేని పక్షి రేయి పగలు తపస్సుచేసి
ఒక చెరువు చేపలన్ని ఒకటే మ్రింగెను. "ఆహా"

[2] ఇంటివెనుక తుట్టెపురుగు ఇంటిలోఅందరిని మ్రింగె,
చూడవచ్చిన జనులనెల్ల చూచిమ్రింగెను "ఆహా"

[3] కాళ్లు చేతులులేనివాడు కడవముంత చేతపట్టి
నిండుబావి నీళ్లన్ని ఒక్కడే ముంచెను "ఆహా"

[4] యేటిమీద స్వాతికొంగ వేటలాడుచురాగ
చాటునున్న మీనుపిల్ల అట్టె మ్రింగె "ఆహా"

[5] చెప్పినాడు వీరదాసు చోద్యముగాను ఆత్మతత్వము
గొప్పవారు దీని భావము విప్పిచెప్పితే చాలు "ఆహా"

దీని అర్థమేమనగా:- గొప్ప మంత్రము బ్రహ్మముగారు చెప్పినది. ఆమంత్రము మనశ్వాసయే. శ్వాసలోపలకు ప్రవేశించినపుడు "సో" అను శబ్దముతో, బయటికి వచ్చునపుడు "హం" అను శబ్దముతో చలించుచున్నది. ఈరెండు శబ్దములు కలసి "సోహం" అను శబ్దము ఏర్పడినది. ఈ శబ్దము మహిమకలది కావున దీనిని మంత్రము అని చెప్పబడినది. మరియు అక్షర సమ్మేళనములతో కూడుకొన్నది. కావున మంత్రము అని చెప్పబడినది. "సోహం" అనుమంత్రము ఆదిమంత్రముగా మారుచున్నది. అది ఎట్లనగా! "సో" అను శబ్దమునందు చివరిగా "ఓ" అను శబ్దమున్నది. "హం" అను శబ్దమునందు చివరిగా "మ్" అను శబ్దమున్నది. ఒక్కమారు శ్వాస లోపలికిపోయి బయటికి వస్తే "సోహం" అను మంత్రము ఏర్పడుచున్నది. ఆ సోహం మంత్రమునందే "ఓమ్" అను శబ్దము ఇమిడియున్నది. కావున "సోహం" తల్లి "ఓమ్" శిశువు. "ఓం" ప్రపంచపుట్టుకలో మొదటపుట్టిన శబ్దము కావున దీనిని ఆదిమంత్రము అనుట సంభవించినది.

[1] ముక్కుపుటములందు ప్రవేశించు శ్వాసకు ఆకారము లేదు కావున రెక్క ముక్కులేని పక్షి అని చెప్పబడినది. శ్వాస రేయి పగలు విడువక సోహం అను మంత్రమును జపించుచున్నది. కావున పక్షి రేయి పగలు తపస్సుచేసె అని చెప్పబడినది. ఈ శ్వాసయే శరీరములోనికి ప్రవేశించి కుంభకముద్వారా నిలిచి శరీరములోనున్న కదలికల [చైతన్యముల] అన్నిటిని నిలిపివేయుచున్నది. కావున చెరువులో అనేక విధములుగా చలించు చేపలన్నిటిని మ్రింగెను అని చెప్పబడినది.

[2] శ్వాస యెల్లవేళల "సోహం" అను శబ్దము చేయుచున్నది. కావున "గీ" మని అరచు తుట్టెపురుగుగా చెప్పబడినది. శ్వాసకు ఆధారము శరీరములో కనపడకయున్న బ్రహ్మనాడి, కావున ఇంటి వెనుక పురుగు అని చెప్పబడినది. ఇల్లు అనగా శరీరము. శ్వాస కుంభకముద్వారా శరీరములో నున్న వ్యాన, సమాన, ఉదాన, అపాన వాయువులన్నియు బంధింపబడుచున్నవి. కావున ఇంటిలోనందరిని మ్రింగెను అని చెప్పబడియున్నది. శ్వాస కుంభించిన తర్వాత ఊపిరితిత్తులు ఖాళీవల్ల రెండు లేక మూడుమార్లు కొద్ది కొద్దిగా

బయటిగాలి లోపలికి ప్రవేశించి, ప్రవేశించిన గాలి తిరిగి బయటికిరాక నిలచుటవలన చూడవచ్చిన జనులనెల్ల చూచి మ్రింగెను అని చెప్పబడినది.

[3] శ్వాసకు రూపము లేదు కావున కాళ్లు చేతులు లేనివాడని చెప్పబడినది. శ్వాస ముక్కురంధ్రములలో ఒక దానియందు ఎక్కువ ఒక దానియందు తక్కువ లోపలకి బయటికి చలించుచున్నది, కావున కడవ ముంత చేతపట్టి అనిచెప్పబడినది. శరీరములోని తలంపులన్ని శ్వాస ఒక్కటి నిలుపడము వల్ల నిలిచిపోవుచున్నవి. కావున బావినీళ్లన్ని ఒక్కడేముంచెను అని చెప్పబడియున్నది. శరీరమును బావిగా పోల్చడమైనది.

[4] శ్వాస శరీరములో నిలిచిపోయిన దానివలన ఊపిరితిత్తులు తర్వాత నరములు, ఆ తర్వాత సూర్య చంద్రనాడులు, షట్ చక్రములు ఒకదాని తర్వాత ఒకటి తమతమ చైతన్యమును కోల్పోవుచున్నవి. కావున యేటిమీద స్వాతికొంగ వేటలాడుచురాగ అని చెప్పబడినది. ఒకదాని తర్వాత ఒకటి తమ చైతన్యములను కోల్పోయినను, ఆఖరున గల ఏడవ కేంద్రము శ్వాస నిరోధమువల్ల తన శక్తిని కోల్పోక నిలచిన దానివలన అన్నిటియొక్క చైతన్యములను నిలిపివేసిన శ్వాస ఏడవ కేంద్రము వద్దకు వచ్చి తనశక్తి చాలక నిలిచిపోయిన దానివలన చాటునున్న చేపపిల్ల కొంగను మ్రింగెను అని చెప్పబడినది. ఇటువంటి తత్త్వములు ప్రాణాయామమును గురించి ఎన్నియో పెద్దలు చెప్పిఉన్నారు. కాని నేటిప్రజలు వాటికి సరియైన అర్థము తెలుసుకొన లేక జన్మను వ్యర్థము చేసుకొనుచున్నారు.

కుండలీ శక్తి వశపరచుకొన్నవారు అనగా అనిచ్ఛాధీనముగాయున్న అవయవములను ఇచ్ఛాధీనముగా మార్చుకున్న వారు అష్టసిద్ధులను పొందవచ్చును అని ఒక ప్రతీతి కలదు. అది నిజమే ఎవనికయితే అష్టమహాసిద్ధుల మీద ఆశవుండునో వారికి మాత్రము సిద్ధులు సిద్ధించును. ఆశలేకుండ కుండలీ శక్తిని నిరోధించిన వారికి అష్టసిద్ధులు కలుగవు. కాని పరమాత్మప్రాప్తి కలుగును. అష్టమహాసిద్ధుల మీద ఆశ యున్నవానికి పరమాత్మప్రాప్తి కలుగదు. అష్టమహాసిద్ధులు పొందిన తిరిగి రెండవ జన్మ ఎత్తవలసినదే. సిద్ధులను కొరక యున్న వానికి మోక్షము తనంతట తాను వచ్చిచేరును. వానికి తిరిగి

జన్మయుండదు. కావున కుండలిని వశపరుచుకొని, అష్టసిద్ధులు పొందవలయునని భ్రమయున్న మానవులార జాగ్రత్త! అష్టమహాసిద్ధులు అష్టమహాసర్పములు.

గాలి తత్వముతో ఆకాశతత్వము కలిసి మనస్సు పుట్టియున్నది. కావున మనస్సుకు శ్వాసకు అవినాభావ సంబంధము కలదు. శ్వాస నిలిచిన మనస్సు నిలుచును, లేక మనస్సు నిలిచిన శ్వాస నిలచును. శ్వాస నిలిచిన తర్వాత మనస్సు నిలవడమును కుంభకము అని అందురు. కుంభక పద్ధతి తారక యోగమునకు సంబంధించినది. మనస్సు నిలిచిన తర్వాత శ్వాస నిలవడమును ప్రాణాయామమే అనవచ్చును. కాని ఈ పద్ధతి అమనస్క యోగమునకు చెందినది.

అమనస్క పద్ధతి ద్వారా యోగులు ప్రాణాయామము ఎట్లు చేయుచున్నారనగా:- యోగి కదలక కూర్చొని మనస్సును ప్రయత్నము ద్వారా సంకల్పములు లేకుండ చేయును. బ్రహ్మనాడి యందలి నరకేంద్రముల చైతన్యము మనస్సును చలించునట్లు చేయుచుండును. మనస్సు చలించక నిలిచిన వెంటనే మనస్సుకు స్థానమైన సూర్య చంద్రనాడులు తమ చైతన్యమును కోల్పోవును. సూర్య చంద్రనాడులు తమ చైతన్యమును వీడిన వెంటనే మనస్సు సూర్య చంద్రనాడుల మధ్యనున్న బ్రహ్మనాడియందు ప్రవేశించుచున్నది. మనస్సు బ్రహ్మనాడియందు ప్రవేశించిన వెంటనే బ్రహ్మనాడి యందు గల నరకేంద్రములు తమ చైతన్యమును కోల్పోవుచున్నది. ఇట్లు మనస్సు నిలవడము ద్వారా సూర్య చంద్రనాడులు బ్రహ్మనాడి ఆరు కేంద్రములు తమ తమ శక్తిని కోల్పోవుచున్నవి. శ్వాసను నడుపుశక్తి సూర్య చంద్రనాడుల మీదుగా బ్రహ్మనాడి ఆరు కేంద్రములకు ఉన్నది. అందువలన ఈ కేంద్రములన్నియు నిలిచిన వెంటనే శ్వాసయు నిలిచిపోవును. ఈవిధముగా కొందరుయోగులు మనస్సు ద్వారా శ్వాసలు నిలుపుచున్నారు. దీనిని బట్టి ప్రాణాయామము రెండు విధములుగా ఉన్నదని, ఒకటి తారక పద్ధతి రెండవది అమనస్క పద్ధతి అని చెప్పవచ్చును.

శ్వాసకు మనస్సుకు సూర్య చంద్రనాడులద్వారా సంబంధమున్నది. అందువలననే మనస్సు నిలుచుకొద్ది శ్వాస నిలుచును అని చెప్పుచున్నాము. ఇక్కడ కొందరికి ఒక అనుమానము రావచ్చును. నిద్రయందు మనస్సు నిలచుచున్నది కదా! అపుడు శ్వాసకూడ నిలువవలయును కదా! అట్లుకాక శ్వాస మామూలుకంటె నిద్రలో ఎక్కువగుచున్నది. దీనిని బట్టి మనస్సు నిలిచిన శ్వాస నిలచును అని ఎట్లుచెప్పనగును? అని అడుగవచ్చును. దానికి నా సమాధానము నిద్రయందు మనస్సు తనకు తాను నిలుచుచున్నది. కావున సూర్య చంద్రనాడులు తమ చైతన్యమును కోల్పోకయుండి, మనస్సు ఆ నాడుల మీదలేక యుండుటవలన స్వతంత్రించినవై తమ ఇష్టానుసారముగా శ్వాసను నడుపును. మనస్సు సూర్య చంద్రనాడుల మీద యున్నపుడు శ్వాస మనస్సును అనుసరించి చలించుచుండును. మనస్సు ఎప్పుడైతే జీవునికి తెలియకనే తనకు తానుగా బ్రహ్మనాడియందు కలయునో అపుడు శ్వాస మనస్సును అనుసరించి తిరుగక తన ఇష్టానుసారముగా చలించుటకు మొదలు పెట్టును. అందువలననే కొందరికి నిద్ర వచ్చిన వెంటనే శ్వాస అధికముగ చలించుచుండును. యోగమందు అట్లు కాక మనస్సు జీవుని ప్రయత్నముతో బ్రహ్మనాడి యందు లయమగుచున్నది. యోగమందు షట్ చక్రములు తమ చైతన్యమును కోల్పోవు చున్నవి, సూర్య చంద్రనాడులు కూడ తమ చైతన్యమును కోల్పోయి తమద్వారా ఆడు శ్వాసకు బలము లేక పోవుచున్నది. యోగమునకు నిద్రకు చాలా భేదమున్నది. నిద్ర అజ్ఞాన స్వరూపమైనది. యోగము జ్ఞానస్వరూపమైనది. నిద్రయందు జీవుడు తన్ను తాను మరచిపోవును. యోగమందు జీవుడు తన్ను తాను తెలుసుకొనును. నిద్రలో జ్ఞానశక్తి శరీరములోనికి ప్రవేశించదు. యోగములో జ్ఞానశక్తి శరీరములోనికి ప్రవేశించును. నిద్రకు యోగముకు ఒక్క శ్వాసలోనే కాక శరీరములో అనేక కార్యములందు భేదమున్నది.

ప్రతి మానవునికి శ్వాస ముక్కురంధ్రముల నుంచి సాధారణముగా 12 ఇంచులు బయటికి వచ్చిపోవుచుండును. యోగసాధన ద్వార మనస్సు కొద్దిగ నిలుచువారికి శ్వాస 12 అంగుళములు పొడవు బయటికి రాక కొన్ని ఇంచులు మాత్రము వచ్చిపోవుచుండును. మనస్సు నిలచుకొద్ది శ్వాస వేగము నిలిచిపోవును. మనస్సు పూర్తి నిలిచిన శ్వాస ఏమాత్రము బయటికిరాక నిలిచిపోవును. అట్లే మనస్సు చలించుకొద్ది శ్వాస వేగము

ఎక్కువగును మనస్సు ఎక్కువ ఉద్రిక్తమయినపుడు శ్వాస 12 అంగుళములే కాక 18 అంగుళముల వరకువచ్చి పోవుచుండును. మానవుని ఆయుష్షు శ్వాస మీదనే నిర్ణయింపబడిఉండును. శ్వాసమీదనే కాల కర్మ చక్రముల గమనములు ఆధారపడి ఉన్నవి. మనము సెకండ్ల ద్వారా నిమిషములను, గంటలను గుర్తించినట్లు, పరమాత్మ శ్వాసద్వార జీవునికి కాలమును కర్మమును గుర్తించును. మనము ఒక నిర్ణీతకాలమును సెకను అని అన్నట్లు పరమాత్మ ఒక నిర్ణీత పొడవు గలిగిన శ్వాసను ఒక శ్వాస [ఒక హంస] అని గుర్తించును. పరమాత్మ దృష్టియందు జీవుని నాశిక [ముక్కు] రంధ్రముల వెడల్పుకు 24 అంతలు ఎక్కువ పొడవు గలిగిన ఊపిరిని ఒక శ్వాస అని అనబడుచున్నది. అందువలన మానవునకు సాధారణముగా 12 అంగుళముల శ్వాస ఆడుచున్నదని చెప్పవచ్చును. ఇక్కడ కొందరికి "జీవుని నాశిక రంధ్రములకు వెడల్పుకు 24 అంతలు ఎక్కువ అని ఏ ఆధారముతో చెప్పనగును" అని అనుమానము రావచ్చును. దానికి సమాధానము మన కపాలమందు గల కాల కర్మచక్రముల భాగములకు జీవుని ముక్కుపుటములకు సంబంధమున్నది. కావున అట్లు చెప్పనగును. మానవుని ముక్కుపుటముల ననుసరించి 12 ఇంచులు అని చెప్పవచ్చును. ఏనుగు ముక్కుపుటములననుసరించి ఆరు అడుగుల పొడవు గలిగిన శ్వాసను ఒక్క శ్వాసగ లెక్కించవచ్చును, అట్లే ఈగ ముక్కుపుటములననుసరించి ఒక అంగుళముకంటే ఇంకా తక్కువగ ఒక శ్వాస యుండునని చెప్పవచ్చును. ఈ సూత్రము ప్రకారము ఏ శరీరమునందుగల జీవునికైన శ్వాస పొడవును నిర్ణయించి చెప్పవచ్చును.

యోగ సాధన ద్వార శ్వాస పొడవును 12 ఇంచుల నుంచి 1 ఇంచు వరకు తగ్గించవచ్చును. మానవునికి 12 ఇంచులు శ్వాస 21600 సార్లు బయటికి వచ్చిపోయిన పరమాత్మ దృష్టియందు ఒక దినముగా జీవునికి లెక్కింపబడుచున్నది. యోగసాధన ద్వారా 1 ఇంచు శ్వాస ఆడిన 11 ఇంచులు శ్వాస మిగులుచున్నదికదా! 1 ఇంచి శ్వాస 21600 సార్లు బయటికి వచ్చిపోయినను పరమాత్మ దృష్టియందు ఒక దినముగా లెక్కింపబడదు. కాల, కర్మ చక్రముల భ్రమణము కూడ 11 వంతులు తగ్గిపోయి ఉండును. మామూలు మానవునికి 12 ఇంచీలు శ్వాస 21600 సార్లు ఆడిన ఒక దినము అని లెక్కింపబడిన,

యోగసాధనగల మానవునకు 1 ఇంచు శ్వాస 21600 సార్లు ఆడినను ఒక దినముగా లెక్కింపబడక 12 దినములకు ఒక దినము అయినట్లు లెక్కింపబడును. కావున మానవుని ఆయుష్షు ఎక్కుటకు తగ్గుటకు శ్వాసమీద ఆధారపడియున్నది. కొంతమంది యోగులు శ్వాసను పూర్తి బంధించి ఆయుష్షును అభివృద్ధి చేసుకొనుచున్నారు.

ప్రారబ్ధముననుసరించి జీవునికి [మానవునికి] కొన్ని శ్వాసలు పరమాత్మ నిర్ణయించియుండును. నిర్ణయింపబడిన శ్వాసలందు ప్రతిదినము 21600 శ్వాసలు ఖర్చయిపోవుచుండును. ఇట్లు ఖర్చవుతూపోయి నిర్ణయింపబడిన శ్వాసలు అన్నియు అయిపోయిన వెంటనే జీవుడు శరీరము వదలిపోవుట సంభవించును. కొంతమంది జ్ఞానులు ప్రాణాయామము వలన శ్వాసలను దినమునకు తక్కువ ఖర్చగునట్లు చేసుకొని, దానివలన ఆయుష్షును అభివృద్ధి చేసుకొనుచున్నారు. అది ఎట్లనగా ఒక చిన్న ఉదాహరణ చెప్పుదును. మానవునికి ప్రారబ్ధముననుసరించి 31,10,40,000 శ్వాసలు గడచునంతవరకు జీవుడు శరీరమున ఉండునట్లు పరమాత్మ నిర్ణయించి యుండెను. దినమునకు 21,600 శ్వాసలు గడచిన 31,10,40,000 శ్వాసలు అయిపోవుటకు 40 సంవత్సరముల కాలముపట్టును. అందువలన వాని ఆయుస్సు 40 సంవత్సరములు అని చెప్పవచ్చును. కాని ఆ మానవుడు ప్రాణాయామము చేయ మొదలు పెట్టెను. ప్రతిదినము 2 గంటల కాలము ప్రాణాయామము చేయుచుండెను. ఆ రెండు గంటల కాలము శ్వాస ఆడక రెండు గంటలకు 1800 శ్వాసలు జీవునికి మిగిలిపోయెను. ఆ జీవునికి ఒక దినమునకు 1800 శ్వాసలుమిగులుచు 19,800 శ్వాసలు ఖర్చవుచుయుండెను. ఈ ప్రకారము ఆ జీవునికి నిర్ణయింపబడిన శ్వాసలు అయిపోవుటకు 43 సంవత్సరముల, 7 నెలల, 19 దినముల, 2 గంటల కాలము పట్టును. అప్పటికి ఆ జీవుని ఆయుస్సు 3 సంవత్సరముల, 7 నెలల, 19 దినముల, 2 గంటల కాలము పెరిగెను. ఈ విధముగ యోగులు కొందరు ప్రాణాయామము వలన ఆయుస్సును అభివృద్ధి చేసుకొని ఎక్కువ కాలము బ్రతుకుటకు ఆస్కారము ఉన్నది. పూర్వము కొంతమంది ఆయుసష్షును అభివృద్ధి చేసుకొని కొన్ని వందల సంవత్సరములు బ్రతికినట్లు చరిత్రలో తెలియుచున్నది.



బ్రహ్మయోగము : రాజయోగము

ప్రపంచములో యోగులు సాంఖ్య తారక అమనస్క పద్ధతుల ద్వారా యోగము ఆచరించుచుందురు. అట్లు ఆచరించు యోగములయందు జీవుడు రెండువిధములుగా వర్తించుట సంభవించుచున్నధి. యోగమునందే రెండు విధములు ఏవనగా ఒకటి రాజయోగము రెండు బ్రహ్మయోగము. యోగి ఏ పద్ధతి ద్వారా యోగమాచరించిన అటు రాజయోగమందునో ఇటు బ్రహ్మయోగమునందునో ఉండుట సంభవించుచున్నది. పూర్వము కొంతమంది ఎక్కువ బ్రహ్మయోగమునసున్నట్లు మరి కొంతమంది ఎక్కువ రాజయోగమందు ఉన్నట్లు తెలియచున్నది. యోగమునందు రాజయోగము , బ్రహ్మయోగము ఏ విధముగా ఉండుననగా మొదట బ్రహ్మయోగమును ఆ తరువాత రాజయోగమును గురించి తెలుపుదును.

1.బ్రహ్మ యోగము: యోగము అనగా శరీరములో జీవుడు దేవునియందు కలసి వుండుట అని భావము కదా ! బ్రహ్మయోగమునందు అంతకరణములైన జీవుడు మనసు , బుద్ధి , చిత్తము , అహంకారము అన్నియు , బ్రహ్మనాడి యందు ఐక్యము చెందుచున్నవి. మనసుకు ఆధారముగా నిలిచియున్న సూర్యచంద్ర నాడులు మనస్సు బ్రహ్మనాడియందు చేరిన వెంటనే నిలిచిపోవుచున్నవి. సూర్యచంద్ర నాడుల శక్తి నిలచిన వెంటనే సూర్యచంద్ర నాడుల ద్వారా ఆడుచున్న శ్వాస కూడా తగ్గిపోవును. ప్రాణవాయువుతో పాటు శరీరములో యున్న వాయువులన్నియు నిలిచిపోవుచున్నవి. పంచ వాయువులు నిలచిన వెంటనే వాయువులను చలింపచేయు నాడీ కేంద్రములు నిలచిపోవుచున్నవి. షట్ చక్ర కేంద్రములు నిలచిన వెంటనే శరీరమంతయు అనగా 25 తత్త్వముల సారాంశము అంతయు నిలచిపోవుచున్నది. అపుడు శరీరమునందు మిగిలి ఉన్నది బ్రహ్మనాడి యందు ఏడవ కేంద్రమునందలి శక్తి ఒక్కటియే. ఇది 25 తత్త్వములకు అతీతమైన శక్తి , ఈ శక్తి శరీరమునందు వున్నది కావున శరీరము బ్రతికి ఉన్నది అని చెప్పుటకు ఆస్కారము ఉన్నది. బ్రహ్మయోగము నందు 25 తత్వములు స్తంభించి పోయినవి కావున చర్మమునకు స్పర్శ జ్ఞానము ఏ మాత్రము ఉండదు. అందువలన బ్రహ్మయోగి శరీరము మీద పాములు ప్రాకినను తెలియక ఉండును.బ్రహ్మయోగమునందున్న యోగికి ముక్కులు ఘ్రాణ శక్తి కోల్పోయి ఉండును.కావున ఏ వాసనను గుర్తించలేవు. మొత్తము మీద బ్రహ్మయోగి ప్రకృతికి అతీతుడై ఉండును అని చెప్పవచ్చును. బ్రహ్మ యోగమునందు శరీర బాధలు కాని ఇతర బయటి బాధలు కాని జీవుడు అనుభవించుటకు వీలులేదు. దీనివలన బ్రహ్మయోగమునందు జీవుడు కర్మను ఏ మాత్రము అనుభవించదుఅని తెలియుచున్నది.బ్రహ్మ యోగమునందు జీవుడు ప్రపంచ జీవులతో సంబంధము లేక ఉండును. కావుననే గీత శాస్త్రమున 5 వ అధ్యాయములో 21 శ్లోకము బాహ్య స్పర్శే ష్వసక్తాత్మా విన్దత్యాత్మని యస్సుఖమ్ , సబ్రహ్మయోగయుక్తాత్మా సుఖమయమశ్నుతే “ పరమాత్మ ఈ విధముగా “ ఎవడైతే బాహ్య శబ్దాదుల యందు సంబంధపడక అంతరాత్మనే సుఖము పొందుచుండునో అతనినే బ్రహ్మ యోగ యుక్తాత్ముడని అందురు. వానికి నాశనము లేనట్టి సుఖము లభించును “ అని అన్నాడు. బ్రహ్మయోగము నందున్న వాల్మీకి చర ప్రకృతి అయిన 25 తత్వములకు అతీతుడై వున్నాడు. కావున ఆయన మీద పాములు ప్రాకినను తెలియలేదు. గాలికి ఆకులు పుల్లలు వచ్చి శరీరమునకు ఆనుకున్న

తెలియలేదు. శరీరము మీద పుట్ట పెరిగిన తెలియలేదు. చచ్చిన కళేబరములు దగ్గర పడియుండి కుళ్లిన వాసన వస్తున్న ఆయనకు ఆ వాసన సోకలేదు. దీనినే బ్రహ్మయోగము అని పెద్దలుచెప్పుచుందురు. బ్రహ్మయోగమునందు వాల్మీకికి యెంతయో ప్రారబ్ధ కర్మమున్ననూ అనుభవించలేదు. యెక్కువ పాపాత్ముడైన వాల్మీకి బ్రహ్మయోగము ద్వారా ఏ మాత్రము కర్మ అనుభవించక కాలము నుండి తప్పించుకొనెను. వాల్మీకియందు యోగసమయమున ప్రవేశించు యోగాగ్ని ఆయన యందున్న కర్మనంతయుకాల్చును మొదలు పెట్టెను. కొంతకాలమునకు కర్మనంతయు కాల్చి మరుజన్మము రాకుండ చేసెను. బ్రహ్మ యోగము నందున్న ప్రత్యేకత ఏమనగా కర్మను ఏ మాత్రము అనుభవించక దానిని నాశనము చేయవచ్చును. ఇంకనూ అర్థము కావలెయును అంటే బ్రహ్మయోగమునందున్న యోగికి కర్మ,కాలచక్రములు నిలిచి యుండును. కర్మ చక్రము నిలిచిన దానివలన కర్మ అనుభవించరు. కాలచక్రము నిలచిన దాని వలన ఎన్ని సంవత్సరముల కాలమైనను జీవింపగలరు.తారక యోగమందుయున్న ప్రాణాయామ పద్ధతి కూడ బ్రహ్మయోగమునకు సంబంధించినదియే.శ్రీ వీరబ్రహ్మముగారు బ్రహ్మయోగము ఆచరించియే సమాధి యందు కూర్చొని యున్నారు. శ్రీ వీరబ్రహ్మము గారు బ్రహ్మయోగములో ఉన్నదాని వలన ఆయన కాలచక్రము పరిభ్రమించక నిలచి యున్నది. కావున సమాధియందు కూర్చున్న సమయమున ఆయనకు ఏ వయసు యుండునో నేటికి కూడ ఆ వయస్సే ఉండును. పూర్వకాలమున చాలా మంది బ్రహ్మయోగమును ఆచరించిరి అని తెలియుచున్నది.

2.రాజయోగము: యోగము అనునది ఒకటే అయినా రాజయోగమునకు,బ్రహ్మయోగమునకు చాలా వ్యత్యాసము ఉన్నది. రాజయోగమునందు యోగి శరీరములో ఉన్న 24 తత్త్వములు పనిచేయుచుండును. కాని ఒక్క తత్వము మాత్రము బ్రహ్మనాడి యొక్క ఏడవ కేంద్రములో ఐక్యత చెందియుండును. ఆ ఒక్క తత్వము ఏది అనగా అతఃకరణములయందు మొదటిది అయిన జీవుడు. జీవుడు ఒక్కడు బ్రహ్మనాడి యందు చేరివుండి మిగతా తత్త్వములు చేరక ఉండడమును రాజయోగము అని అందురు. రాజయోగము జీవునకు ఎట్లు ప్రాప్తించుచున్నదనగా యోగికి రాజయోగము ద్వారా శరీరమున ముఖ్యమైన జీవుడు బ్రహ్మనాడియందు ఎరుకతో లీనమై ఉండును. ఇక్కడ

కొంతమంది జీవుడు ఎక్కడ వుండును ? జీవుడు ఎక్కడ నుండి బ్రహ్మనాడి ని చేరును ? అను సంశయములుబయలుదేరవచ్చును. దీనికి సమాధానము యేమనగ !

జీవుడు శరీరమునందు బ్రహ్మనాడిలో ఏడవకేంద్రమందే ఉండును. ఏడవ కేంద్రములో యున్న జీవుడు నేను వేరు పరమాత్మ వేరు అను భ్రమచేత వుండుట వలన జీవుడు అను ఖండముగానే ఉండును. యోగము వలన పరమాత్మ నేను ఒక్కటే అని తనను తాను తెలుసుకొన్న సమయమున జీవుడే దేవునిగా ఏడవ కేంద్రమునందు అఖండముగా మారుచున్నాడు. శరీరములో జీవుడు బ్రహ్మనాడి ఏడవ కేంద్రమందే ఉన్నాడు. కావున యోగ సమయములో జీవుడు ఎక్కడ నుండి బ్రహ్మనాడి యందు చేరలేదు. భ్రమను (మాయను) వీడి తనను తాను తెలుసుకొన్న యోగి రాజయోగి. ఇట్లు రాజయోగములోయున్న యోగులకు షట్చక్రముల యందు చైతన్య శక్తి ఉండును. దాని వలన శరీరములో 24 తత్వములు మామూలుగా పనిచేయుచునే ఉండును. కావున రాజయోగులు యోగమందే యుండి మాట్లాడగలరు. మరియు మామూలుగా పనిచేయగలరు. కాని వారు ఏ పని ఆచరించిన జీవునిగా ఆచరించడము లేదు. ప్రతి పనియు యోగమున యుండి రాజయోగులు చేయగలరు. కావున చేసిన పనుల యందు కర్మ ఏ మాత్రము వారికి తగలదు. రాజయోగమందున్న యోగి ప్రారబ్ధకర్మ అనుభవించుచునే ఉండును. రాముడు రాజయోగి గా యుండి కర్మ అనుభవించినాడు. కృష్ణుడు కూడా రాజయోగమందు ఉండి యెన్నియో పనులు చేసినాడు. కానీ ఆయన అవి నన్ను అంటవు అన్నాడు. మరియు కృష్ణుడు రాజయోగమందుండి కొన్ని కర్మలు అనుభవించినాడు. అటులనే శ్రీ వీరబ్రహ్మము గారు కొంతకాలము రాజయోగము ఆచరించి భార్యా పిల్లలతో కాపురం చేసినట్టు తెలియుచున్నది. కావున రాజయోగమందు బయటి ప్రపంచ జీవులతో సంబంధముండును అని తెలియుచున్నది. రాజయోగమున జీవుడు కర్మ అనుభవించుచున్నాడు. రాజయోగమున జీవుడు తనమీద తనకు ఎరుక కల్గి ఉండును. రాజయోగమున జీవుడే దేవుడుగా ఉండును. కావున తన్నుతాను తెలుసుకొని, తన ద్వారానే 24 తత్త్వములు చలించుచున్నవని వాస్తవమును తెలుసుకొని , తనయందే తానుయుంటూ ప్రపంచమున అనేక రకములుగా తిరిగిన రాముడు, కృష్ణుడు, శ్రీ వీరబ్రహ్మము గారు తెలిసిన వారి దృష్టియందు దేవుళ్లుగా (

ఆత్మ స్వరూపులుగా) పరిగణింపబడిరి. రాజయోగము బ్రహ్మయోగము కంటే కష్టమయినది. బ్రహ్మయోగమున తన శరీరమందు 25 తత్త్వములు ఆత్మయందే లీనమయి పోవును. రాజయోగమున అట్లు కాక జీవుడు తన శరీరమునందు 24 తత్త్వములు చలించునట్లు చేయుచు, మాయలో ఉన్నట్లు పైకి కనిపించుచు, మాయలో ఏ మాత్రము ఉండక, తన్ను తాను చూచుకొని తననే అన్ని శరీరములయందు చూచుకుంటూ, మాయలో ఇరుక్కొనక ఎరుకతో యుండి తప్పించుకోవడము చాలా కష్టము. బ్రహ్మయోగమందు ప్రపంచముతో సంబంధము లేదు కావున బ్రహ్మయోగి యోగభ్రష్ఠుడు అగుటకు ఆస్కారము లేదు. రాజయోగి ప్రపంచ సంబంధముతో ఉన్నాడు. కావున ఒక్కొక్కప్పుడు భ్రమ చేత తన్ను తాను మరచిపోయి యోగ భ్రష్ఠుడు అగుటకు ఆస్కారము ఉన్నది. జ్ఞానదృష్టితో చూచిన ఈ కాలమందు కూడ మానవులయందు రాజయోగము బ్రహ్మయోగము ఆచరించువారు ఉన్నారు. బ్రహ్మయోగమాచరించు వారు నిద్ర ఆహారము లేక కదలక మెదలక శరీరము చెడక ఉన్నారు. వారిని కొన్ని స్థలముల యందు చూడవచ్చును. చూచిన వెంటనే బ్రహ్మయోగులని తెలుసుకోవచ్చును. కాని రాజయోగులను చూచిన ఎవరు గుర్తించలేరు. కారణము మనమాదిరే వారు ఉండడమే. రాజయోగులందు మామూలు మనుషులకంటే ప్రత్యేకత ఏమి ఉండదు. కావున వారిని చూచి గుర్తించుట చాలా కష్టము. అందువలననే రాజయోగులయిన కృష్ణుడును, వీరబ్రహ్మముగారిని ఎందరో చూచిన ఎవరు వారిని గుర్తించలేదు. ఈ కాలమున బ్రహ్మయోగము ఆచరించు వారు ఎక్కువ. రాజయోగమాచరించు వారు తక్కువ ఉన్నారు. ఈ కాలములో కొందరు భార్య పిల్లలు లేనివారిని బ్రహ్మయోగులని, భార్య పిల్లలు ఉన్న వారిని రాజయోగులని అనుకొంటున్నారు. భార్య పిల్లలు ఉండడముకాని లేకపోవడము కాని యోగమునకు సంబంధించదు. యోగమందు విధానముల బట్టి రాజయోగులు బ్రహ్మయోగులు అని చెప్పవచ్చును. బ్రహ్మయోగులకయిన భార్య పిల్లలు ఉండవచ్చును. దినమునకు ఒక గంట కాలము బ్రహ్మయోగ మాచరించి తిరిగి మిగతా సమయములలో కాపురము చేయవచ్చును కదా ! కావున భార్య పిల్లలను విడిచిపెట్టవలెయునని, పెళ్లిచేసుకోకూడదని చెప్పుటకు యోగవిద్య యందు ఎక్కడ ఆస్కారము లేదు. కావున నిజము తెలుసుకొని ప్రవర్తించవలెయునని కోరుచున్నాను.

మంత్రశక్తి

నేటి ప్రపంచములో మాంత్రికులు కూడా ఉన్నారు. మంత్రాలకు ప్రభావము ఉన్నదని నిరూపించుచున్నారు. యోగులను చూచి మీరు చేయు చున్న అభ్యాసము కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుంటుంది. ఎంతో కష్టపడితే కాని కొద్ది ఫలితము కూడ ఉండదు.అదే అభ్యాసము మేము చేయుచున్న విధానముతో చేసిన మీరు తొందరగా ఫలితమును పొందవచ్చును, పొందినట్లు ఇతరులకు నిరూపించవచ్చును. అని యోగమునే కించపరుస్తూ యోగభ్యాసకులనే పనికిరాని పని చేయుచున్న వారిగా భావించి చెప్పుచున్నారు. దానితో యోగభ్యాసపరులు కూడ వారు చెప్పునది నిజమేనని నమ్మి తొందరగా ఫలితమిచ్చు మంత్రమార్గమునే అనుసరించుచున్నారు.ఇది అంతయు గమనించితే యోగశక్తికి మంత్రశక్తికి గల భేదము ఏమిటి? అన్న విషయము తెలియకపోవడము వలనను, మరియు యోగము అంటే ఏమిటి? మంత్రమంటే ఏమిటి? అను విషయము తెలియక పోవడము వలన కొందరు యోగభ్రష్టులు అగుచున్నారని తెలియుచున్నది. అందువలన మంత్రములను, మంత్రశక్తిని గురించి కొద్దిగ చెప్పదలచుకొన్నాను.

కొన్ని ఇటుకలను తెచ్చి వరుసగా పేర్చుచుపోయిన చివరకు ఒక గృహము తయారగును. అట్లే ఒక యంత్రమును చేసుకొనుటకు కొన్ని ఇనుప ముక్కలను సేకరించవలయును. పుస్తకమును తయారుచేయుటకు కొన్ని కాగితము లను సేకరించవలెను.కొన్ని ఇటుకల కూడలినే గృహము అనుచున్నాము. కొన్ని ఇనిప ముక్కల కూడలినే యంత్రము అనుచున్నాము. కొన్ని కాగితముల కూడలినే పుస్తకము అనుచున్నాము. ఒక్కొక్క వస్తువును తయారుచేయుటకు దానికి సంబంధించిన కొన్ని ముక్కలను కూర్చి పేర్చినట్లు, ఒక్కొక్క కార్యమును సాధించుటకు ఒక్కొక్క విధ మంత్రముల వలన కార్యములను చేయుట ఎట్లు అను సంశయము బయలుదేరవచ్చును. దానికి సమాధానము ఏమనగా!

మంత్రము అనగా ఒక నిర్ణీత శక్తి యుక్తమైనది. మంత్రము కొన్ని అక్షరములతో కాని లేక ఒక్క అక్షరముతో కాని ఉండునది. అక్షరముల మిశ్రితమును బట్టి, లేక అక్షరమును బట్టి

ఆ మంత్రమునకు ప్రభావ ముండును. ఉదాహరణకు “రం” అనునది ఒక మంత్రము. “ హ్రీం “ ఒక మంత్రము, అట్లే కొన్ని అక్షరముల కూడలి అయిన “ శ్రీం హ్రీం క్లీం ఐం రం “ అనునవి ఒక మంత్రము. ఇట్లు అనేక అక్షర సమ్మేళనములలో ఎన్నియో మంత్రములున్నవి. ఒక్కొక్క రక మంత్రమునకు ఒక్కొక్క శక్తి ఉండును. ఆ శక్తి ఏవిధమైనదో తెలుసుకొన్నవారు ఆ శక్తి సంపాదించుకొని, దానికి సంబంధించిన పనిని నెరవేర్చుకొనెడివారు. మంత్రశక్తిని వారు ఎట్లు సంపాదించుకొన్నారు అని మనము అనుకోవచ్చును. అదెట్లనిన ఉదాహరణకు, కొన్ని అక్షరములతో కూడిన మంత్రము మారణమంత్రము అనబడును. ఆ మారణమంత్రమును కొన్ని నియమముల ప్రకారము నిర్ణీతమయిన సంఖ్యలో మనస్సుతో ఉచ్చాటన చేసిన ఆ మంత్రమునందలి శక్తి అంతయు ఒక కూడలిగా ఏర్పడి అది మారణము చేయు ప్రభావము కలది అగును. ఆ మంత్ర ప్రభావము ఉచ్చాటన చేసిన వాని యందు నిగూఢమై నిలచిపోవును. అట్లు మంత్ర ప్రభావమును సంపాదించుకోవడమునే మంత్రసిద్ధి అని అందురు. ఆ సిద్ధి పొందిన వ్యక్తి తిరిగి ఆ మారణమంత్రమును ఉచ్చరించుకొని ఎవరిమీద దాని ప్రభావము చూపవలయునని సంకల్పించుకొనునో వాని మీద అది ప్రసరించి వానిని మారణము చేయుచున్నది. ఒక్క మారణమునే కాక అనేక విధ కార్యములను మంత్ర ప్రభావములతో పూర్వము కొందరుచేసినట్లు తెలియుచున్నది.పూర్వము మంత్ర ప్రభావముతో వినియోగించు ఆయుధములను అస్త్రములు అని అనుచుండిరి. పూర్వము నాగాస్త్రము, బ్రహ్మాస్త్రము అను నానా విధ అస్త్రములు ఉండినట్లు తెలియుచున్నది. ఒక్కొక్క అస్త్రము ఒక్కొక్క మంత్ర ప్రభావముతో కూడుకొని ఉండును. ఆ ప్రభావమును బట్టి ఫలితముండును. కావున అన్నిటికంటే ఎక్కువ ప్రభావము కలిగినది బ్రహ్మాస్త్రము అని చరిత్రలో తెలియుచున్నది. వారు ఆనాడు ధనస్సుకు ఒక బాణమును సంధించి విడిచి ఇది సహస్రమారణాస్త్రము, ఇది వెయ్యి మందిని చంపును అని చెప్పెడివారు. ఒక బాణము వెయ్యి మందిని ఎట్లు చంపును అని మనకు అనుమానము రావచ్చును. దానికి సమాధానము విడిచిన ఒక్క బాణము మంత్రప్రభావము వలన వెయ్యి బాణములుగా మారి వెయ్యి మందిని చంపెడిది.అస్త్రము ఒక్కటయిన ఫలితము వెయ్యి మందిని చంపడము వెయ్యిమందిని చంపు శక్తి ఆ సమయములో ఆ పుల్ల (బాణము) అందు నిగూఢమైయున్నది. పూర్వకాలము నుండి నేటి వరకు మంత్రములు నానావిధ ప్రభావములు కలవియై ఉన్నవి. పాముకు ఒకవిధ మంత్రము, తేలుకు ఒక విధ మంత్రము,

దయ్యాలకు ఒక విధ మంత్రము, మారణమునకు ఒక విధ మంత్రము ఇట్లు అనేక విధ మంత్రములు నేటికినీ ఉన్నవి. ఒక్కొక్క విధ మంత్రమునకు ఒక్కొక్క విధ ఆచారము ఉండును. ఆ ఆచార ప్రకారముననే ఆ మంత్రము ఫలించును. ఆ ఆచారము విడిచిన ఆ మంత్రము ఫలించదు. ముఖ్యముగా చెప్పవలెయునంటే మంత్రము అక్షరములతో కూడినదై, ఎన్నియో నియమములు కలదియై ఉండును. నియమములు అతిక్రమించిన మంత్రసిద్ధి వ్యర్థమగును. అతిక్రమించని ఎడల ఎంతకాలమైన మంత్ర ప్రభావము అట్లే ఉండును. ఒక కత్తిని కొన్ని కట్టెలు కొట్టుటకు వినియోగించిన ఆ కత్తి పదును తగ్గి మొద్దు పోవును. అపుడు ఆ కత్తికి తిరిగి పదును పెట్టవలసి ఉండును. లేనియెడల కత్తి కట్టెలను నరుకలేదు. అట్లే మంత్రములను సిద్ధి చేసుకొన్న తర్వాత దానిని ఒక పనికి వినియోగించిన ఆ పని నెరవేరును. కానీ రెండవ మారు ఆ మంత్రము బలము తగ్గినదై ఉండును.దానికి బలము చేకూర్చుటకై తిరిగి ఆ మంత్రమును కొన్ని మార్లు పాటించవలసి ఉండును.మంత్రమును నియమముల ప్రకారము నిత్యము పటించుచుండిన పని నెరవేర్చుటకు ఆ మంత్రములు సామర్థ్యములు కల్గి ఉండును. అట్లు పటించకుండా ఉండిన కత్తి ఉన్నను మొద్దు పోయిన తెగని విధముగ మంత్ర సిద్ధి పొందినను ఆ మంత్రము పని చేయలేక పోవును. మంత్రముల ప్రభావములతో కొంతమంది దేవతలను వశము చేసుకొని వారిని తమ పనుల యందు వినియోగించుట కూడ జరుగుచున్నది. కాళి శక్తిని వశము చేసుకొన్న వారు, భగళాముఖి శక్తిని వశము చేసుకొన్న వారు, కాటేరి దేవతను వశము చేసుకొన్న వారు, ఆంజనేయుని వశము చేసుకొన్నవారు ఈ కాలములో కూడా నేటికిని ఉన్నారు. అట్లు వశము చేసుకొన్నవారికి కొంతకాలమునకు ఆ దేవతతోనే అపాయము జరుగుచుండుట కూడ సంభవించు చున్నది. అట్లు ఎందుకు జరుగుచున్నదనగా ! ఒక బలవంతుని కారాగారము (జైలు) లో వేసి దానిచేత పనులు చేయించుకొనుచున్నామనుకొనుము. అతనికి ఎల్లవేళల ఆ బందిఖానానుంచి బయటపడవలయునను చింతయే చేయుచుండును. ఎప్పుడు అను కూలించిన అపుడు ఆ బందిఖానానుంచి తప్పించుకొనును. అట్లే బలమైన దేవతలను వశము చేసుకొనిన ఆ దేవతలు వాని మంత్రములకు కట్టుబడి వాడు చెప్పిన పనులు చేయుచుండును. కాని ఆ దేవతలు వీని నుండి ఎపుడు తప్పించుకొందామా అని ఆలోచించుచునే ఉండును. ఎప్పుడయిన వీలు కలిగిన అనగా ఆ మంత్రమునకున్న ఆచారములను మంత్రగాడు తప్పిన

సమయములలో ఆ దేవతలు మంత్రగాని మీదనే వాటి ప్రభావము చూపి వానిని మరణించునట్లు చేసి తప్పించుకొని ఇష్టము వచ్చినట్లు పోవుచున్నవి. కొన్ని దేవతలు మంత్రగానిని చంపక కాలునో, చెయ్యినో లేక స్వరమునో లేకుండ చేసి పోవుచున్నవి.మంత్రగానిని ఊరక వదలక అట్లు ఎందుకు చేసి పోవుచున్నవనగా! వాడు ఇన్నాళ్ళు నన్ను తన ఆధీనములో పెట్టుకొని నాతో పనులు చేయించినాడు కదా ! అను కోపము కల్గి ఉండుట వలనను మరియు ఊరక వదిలి పోయిన తిరిగి నన్ను మంత్రసాధనతో తన స్వాధీనము చేసుకొనును అను భయము కల్గి ఉండుటవలనను, వాడు తిరిగి మంత్రసాధన చేయకుండునట్లుగా ఆ దేవతలు వానిని మరణించునట్లునో లేక అవయవలోపము అగునట్లునో చేసి పోవుచున్నారు.కావున దేవతలను వశము చేసుకొనుట అనునది చాలా పనికిమాలిన పని. దాని ద్వారా చివరకు నష్టమే సంభవించుచున్నది అని తెలియుచున్నది.

మంత్రములు నేర్చిన దానివలన తాత్కాలికమునకు ఫలితము ఉండును. కాని తిరిగి దాని ద్వారా నష్టములు, కష్టములు చాలా ఉండును. మంత్రములతో స్థూలకన్నులకు అగుపించునట్లు తేళ్ళు, పాములు, ఇంకా కొన్ని వస్తువులను తయారుచేయవచ్చును. కానీ అవి అన్నియు కొన్ని నిమిషములు లేక కొన్ని గంటల కాలము వుండునవే. అంతకంటే మించి వుండవు. తిరిగి అవి అదృశ్యమగును. ఈ కాలములో పెద్ద మంత్రములను సాధించు మంత్రవేత్తలు లేకున్నా, చిన్న చిన్న మంత్రములను నేర్చినవారు కొందరు అక్కడక్కడ ఉన్నారు.ఎంతో చిన్న మంత్రములను బహు కష్టముతో నేర్చి మాకంటే పెద్దవారు లేరు అనువారు కూడ ఉన్నారు. క్షుద్ర దేవతలను వశము చేసుకొని వాటి ద్వారా మనకంటికి అగుపడని వస్తువులను ఫలానచోట ఉన్నవని చెప్పుచున్నారు. అంత మాత్రమున వారు జ్ఞాననేత్రులా? ఏ మాత్రము కారు, కాలేరు. కర్ణ పిశాచిని అడిగి ఎక్కడో జరిగిన విషయములను దాని ద్వారా తెలుసుకొని, అక్కడ ఇట్లు జరిగినది అని చెప్పచున్నారు. అంతమాత్రమున వారు జ్యోతిష్యులా? ఏ మాత్రము కారు, కాలేరు.మంత్రప్రయోగము (చేతబడి) చేసి ఒక వ్యక్తిని మరణించునట్లునో, లేక అంగలోపమగునట్లునో చేసి నేను ఎట్లు చేయవలెనంటే అట్లు చేయగలను అని పెద్ద శాపము పెట్టు మహర్షి మాదిరి తనకు తాను గర్వపడుచున్నాడు.అట్లు చేసినంత మాత్రమున ఆ మంత్రగాడు మహర్షి అగునా? ఎప్పటికి కాదు, కాలేదు. మంత్రముల నేర్చి వాటిని సిద్ధిపొందినవారు, వాటి ఫలితములకు

యోగాభ్యాసవరులకు చూపగా, దానిని చూచిన యోగులు కొందరు అజ్ఞాన వశమున మంత్రముల ప్రభావము తెలుసుకోలేక ,మేము ఎన్ని రోజులు యోగము చేసినను, వీరు సృష్టించిన ఒక చిన్న తేలునయిన సృష్టించలేకపోతిని కదా! వీడు నాకంటే గొప్పవాడు. నా మార్గము కంటే వీని మార్గమే గొప్పది అని యోగి మంత్రగానిని ఆశ్రయించుచున్నాడు. జ్ఞాన దీపకాంతిలో యోగమునకు మంత్రమునకు గల భేదములు తెలుసుకొన్న యోగులు అట్లు చేయరు. ఎందుకనగా! మంత్రములు వివిధ ఆచారములతోను, జంతు బలులతోను, నానా విధ నైవేద్యములతోను, అనేక నియమములతో కూడుకొని ఉన్నవి. యోగము అట్లు ఆచార నియమము లేక జంతు బలులు , వివిధ నైవేద్యములు లేక, మంత్రయుక్తమైనది కాక, బయటి వస్తువులకు ఏ దానికి సంబంధము లేక ఉన్నది. మంత్రముల వలన దేవతలు వశమగుదురు కాని మంత్రగాని మీదనే ద్వేషము పూని వుందురు. యోగము వలన దేవతలు వశము కారు కాని యోగి ఎక్కడైనా కనబడితే ఆ దేవతలు యోగివద్ద భక్తి భావము కలిగి వినయ విధేయతలతో నడుచుకొందురు. ఎటువంటి మంత్ర ప్రయోగమయిన యోగిని ఏమి చేయలేవు. మంత్ర బలము మంచిది కాదు అని చెప్పిన యోగుల మీద మాంత్రికులు ద్వేషముపూని మంత్రప్రయోగము చేసి వారి ప్రయోగములు ఫలించక దిగులు చెందినారు. మాంత్రికుల మంత్రశక్తికి మించినది యోగశక్తి కావున మంత్రశక్తి యోగశక్తి ఉన్న యోగులను ఏమియు చేయలేదు. మాంత్రికుల ప్రయోగములు యోగుల పట్ల నెరవేరవు. యోగులు సంకల్పించుకుంటే మాంత్రికుల యందు వున్న మంత్ర శక్తి యంతయు పటాపంచలయిపోగలదు. తర్వాత వారు మంత్రములందు నిర్భలులై ఏ పనిని నెరవేర్చలేక పోవుదురు. మాంత్రికులకు వశమై ఉన్న దేవతలు యోగులను హింసించలేవు. ఒకవేళ యోగులను బాధ పెట్టుటకు మాంత్రికుల ప్రేరణ వలన ఆ దేవతలు వచ్చిన యెడల అగ్నిగుండము వద్దకు వచ్చిన మిడుత బూడిదై పోయినట్లు యోగుల వద్ద నున్న జ్ఞానాగ్నికి ఆ దేవతలు భస్మమయి పోవుదురు. లేకున్నా దగ్గరకు వచ్చినంత మాత్రముననే జ్ఞానాగ్ని యొక్క వేడిమిని తట్టుకోలేక పారిపోవుదురు. పూర్వము మంత్రయుక్తమైన అస్త్రములు కూడ యోగులను ఏమియు చేయలేక పోయినవి.అన్నిటికంటే ఎక్కువ ప్రభావము కల్గిన బ్రహ్మాస్త్రమును వశిష్టుని ఏమి చేయలేక ఆయన యందే లీనమయి పోయినది. అట్లే శ్రీరాముడు ఆంజనేయుడు యయాతి రాజు కోసం యుద్ధము పూనినపుడు శ్రీరాముడు తిరుగులేని

అస్త్రమును ప్రయోగించగా అది ఆంజనేయుని ఏమి చేయలేక అతనిలో ఉన్న యోగశక్తికి కట్టుబడినదై ఆంజనేయుని మెడలో పూలహారమై పడినది , ఒకప్పుడు అర్జునుడు బోయ వేషధారియైయున్న మహాయోగి అయిన ఈశ్వరుని మీదికి దివ్యఅస్త్రములను ప్రయోగించినా అవి ఈశ్వరుని ఏమి చేయలేకపోయినవి. అన్ని శక్తులకు మించినది జ్ఞానశక్తి కావున దానిముందర ఏ శక్తి పని చేయలేదు. జ్ఞాన శక్తి కంటే పవిత్రమైనది దానితో సాటి అయినది ఏ శక్తియును ప్రపంచమున లేదు. ఇది నిశ్చయము.

అందువలన భగవద్గీత యందు జ్ఞానయోగములో పరమాత్మ "నహి జ్ఞానేన సదృశం పవిత్రమిహ విద్యతే" "జ్ఞానమునకు ఈ జగమున సాటి అయినది లేదు. అంతకంటెను పవిత్రమైనది లేదు." అని అన్నారు కావున మంత్ర, యంత్ర, తంత్రములు, గజకర్ణ గోకర్ణ , ఇంద్రజాల మహేంద్రజాల విద్యలు, మరియు యక్ష, రాక్షస, కిన్నెర, కింపురుష, గరుడ, గంధర్వ, నాగ, భూత, ప్రేత పిశాచములు అన్నియు జ్ఞానమున కంటే హీనము. అన్నిటికంటే అగ్రస్థానము వహించినది పరమాత్మ జ్ఞానము. ఆత్మజ్ఞానమును పొందినవాడు లోకమున ఏ శక్తికి బయటపడడు. ఇతరులను బయటపెట్టడు. భయము , మనోవ్యాకులము లేక నిశ్చలుడై ఉండును. అట్టివాడు పరమాత్మకు ప్రీతిపాత్రుడు కూడ అయి ఉండును. కావున గీతాశాస్త్రములో భక్తియోగమున పరమాత్మ "యస్మాన్నో ద్విజతే లోకో లోకాన్నో ద్విజతే చయ:, హర్షా మర్ష భయోద్వేగైర్ముక్తో యస్సచమే ప్రియః " జగతిచే ఎట్టి వానికి జడుపు లేదో, జగతికి ఎవనిచే జడుపు కలుగదో వాడు సంతోషమును, కోపమును, మనోవ్యాకులము లేక భయమును పొందడు. అతడే నాకు ప్రియుడు అని అన్నాడు. కావున జ్ఞాని అయిన వాడు మంత్ర తంత్రములను ఆశ్రయించక యోగశక్తినే సంపాదించుకొనును. నేడు దేశమున కొందరు మంత్రములనాశ్రయించి, క్షుద్రదేవతలను ఆరాధించుచు,నిజమైన భక్తులమనుకొని, మాకంటే జ్ఞానులు లేరని భ్రమించుచున్నారు. మంత్రములకు యోగమునకు గల వ్యత్యాసము తెలుసుకొంటే, ఏది మంచిదో నిజముగా తెలియగలరు. మంత్రప్రభావములతో యోగుల మీదకే ద్వేషము పూని వారినే కించ పరుస్తూ ఉన్నారు. యోగులు సామాన్యముగా ఎవరు ఏమనుకున్నా ఊరక యుందురు. ఒకవేళ యోగులకు కోపము వచ్చినదా, వారు జ్ఞాన నేత్రమును ఎర్రగా చేసినారా మాంత్రికుల మంత్రశక్తి

భస్మమయి పోవును. తర్వాత నష్టము మరియు కష్టము మాంత్రికులకే ఉండును. పూర్వము యోగుల మీదికి మంత్రములతో దండయాత్ర చేసిన వారు మంత్ర భ్రష్టులు అయి మరుజన్మమున ఎన్నియో కష్టములు అనుభవించినారు.కావున మాంత్రికులు యోగులను కించపరచక ఉండవలయునని కోరుచున్నాను.మాంత్రికులు కూడ ఎప్పుడో ఒకప్పుడు తమకే నష్టము తెచ్చు మంత్రముల వదిలి , పరమాత్మ నాశ్రయించి , దైవ సాధన చేసిన ఎంతో బాగుండునని నేను భావించుచున్నాను. మంత్ర సాధన కంటే యోగసాధన పవిత్రమైనది. మంత్ర సాధన ద్వారా ప్రపంచ కార్యములను, ప్రపంచ గౌరవములను పొందవచ్చును. కానీ మోక్షమును ఏ మాత్రమును సంపాదించుకోలేరు. కావున మంత్రముల విషయము తెలిసినవారు మరియు తెలియనివారు మంత్రముల వద్దకు పోక మంత్రముల నేర్పించు గురువులను ఆశ్రయించక యోగమార్గము అన్వేషించుచు, పరమాత్మ బోధచేయు గురువులనాశ్రయించి జన్మను సార్థకము చేసుకోవలయునని కోరుచున్నాను.

శరీరము బాడుగ ఇల్లు

జీవుడు కర్మను అనుభవించుటకు శరీరము నందు ప్రవేశించుట జరుగుచున్నది. శరీరము బాల్య , యవ్వన, కౌమార, వృద్ధాప్యములుగా నాలుగు దశలు పొంది తుదకు జీవుడు దేహమును విడిచిపోయి వేరొక శరీరమును చూచుకొనుట సంభవించుచున్నది.శరీరములో జీవుడు ఎంతకాలము ఉండునో జీవునికి ఏ మాత్రము తెలియదు. మరియు తాను ఏ సమయములో శరీరమును విడిచి పోవలసి వచ్చునో కూడ తెలియదు. కావున శరీరమునకు జీవునకు గట్టి సంబంధము ఏ మాత్రము లేదని తెలియుచున్నది. శరీరము నందు జీవుడు నివాసము చేయుచున్నాడు కావున శరీరమునకు క్షేత్రము అను పేరు వచ్చింది.మనము బాడుగ ఇంట్లో కొంతకాలము ఉండి ఇంటి యజమాని ఎపుడు పొమ్మనగానే అపుడు ఆ గృహము విడిచి వేరొక గృహము చూచుకొన్నట్లు జీవుడు శరీరము నందు కొంతకాలముండి తిరిగి వేరొక శరీరమునకు ప్రయాణమగును.ఎందుకనగా ఇంటి యజమాని ఇండ్లు విడువమన్నట్లు క్షేత్రవేత్త అయిన పరమాత్మ శరీరములను వదులునట్లు చేయుచున్నాడు. కావున శరీరము ఒక బాడుగ గృహముతో సమానముగా ఉన్నది. ప్రపంచములో బాడుగ గృహములకు నెలకొక్క మారు బాడుగ కట్టుచుండవలయును. అట్లు కట్టని యెడల నీ

స్వాధీనము తప్పుటకు మొదలుపెట్టును. మామూలు బాడుగ ఇండ్లకు నెలకొక్కమారు డబ్బు రూపముతో చెల్లించవచ్చును కాని శరీరమనెడి ఇంటికి దినమునకు మూడు లేక నాలుగు సార్లు బాడుగ చెల్లించిన చక్కగ నీ స్వాధీనముండును. శరీరమనెడి ఇంటికి బాడుగ ఆహారరూపముగా చెల్లించవలయును. ఆహారము శరీరమునకు ఇవ్వనిదే అది నీ స్వాధీనము తప్పుటకు మొదలుపెట్టును.కొన్ని రోజులు నీవు ఏమాత్రము శరీర ఇంటికి బాడుగ ఇవ్వనిపక్షములో నీవు ఇల్లు విడచి పోవలసిన పని ఏర్పడును. జీవుడు శరీరగృహమునకు బాడుగ చెల్లించుటకు దేశములో అనేక మోసములు చేసి పాపమును సంపాదించుకొనుచున్నాడు.ఈ బాడుగ కోసమే కోటి విద్యలు నేర్చుచున్నాడు. కొద్దికాలము ఉండి పోయే ఇంటికోసము కోటి విద్యలు నేర్చుచున్నాడు. కానీ ఇండ్లతో అవసరము లేకుండ చేయు బ్రహ్మవిద్యను నేర్చుకోలేకపోవుచున్నాడు.కొంతమంది బ్రహ్మవిద్యను కొద్దిగా నేర్చి దానిని కూడ శరీర ఇంటి బాడుగ సంపాదించుటకే వినియోగించుచున్నారు.

జీవుడు శరీర మనెడి ఇంటిలో చేరి తన శరీరమునకే బాడుగ కట్టుకొనే దానికి అనేక పనులు చేయుచు పాప పుణ్యములు సంపాదించుకొనుచున్నాడు. ఇట్లుండు సమయములో తన శరీరమునకే కాక ఇతర జీవులు యుండు శరీరములకు కూడ బాడుగ చెల్లించుతానని ఒప్పుకొని తన శరీరము కోసము ఇతరుల శరీరముల కోసము ఎక్కువ పని చేసి ఎక్కువ పాప పుణ్యములను సంపాదించుకొని జన్మలకు పోవుచున్నాడు. పురుషులకు యవ్వనకాలము వచ్చిన వెంటనే పెళ్ళిచేసుకొని భార్య శరీర బాడుగ బాధ్యతకూడ తన మీదే వేసుకొందురు. ఇపుడు పురుషులకు రెండు ఇండ్లకు బాడుగ కట్టవలసిన పని ఏర్పడినది. తర్వాత కొంత కాలమునకు పిల్లలు పుట్టగా ఆ చిన్న ఇండ్లకు చిన్న బాడుగలు కట్టు బాధ్యత కూడ మరింత ఎక్కువగును. అపుడు మానవులకు సంపాదించవలయునను తాపత్రయము ఎక్కువయి దేశమున పాప పుణ్యభీతి లేకుండ మిక్కిలి అధర్మమార్గములో డబ్బు సంపాదించుటకు మొదలు పెట్టుదురు. దానితో జీవులు కర్మబద్ధులు అగుదురు. కర్మ వలన కాలచక్రములో చిక్కుకొని చచ్చిపుట్టి కర్మముల అనుభవించుటయే మన పని అగును.

శరీరములు అనునవి ఒక రకమైన తోలుగృహములు. అవి కొంత కాలమునకు మెత్తబడి శిథిలమగును. అపుడు వేరొక ఇంటిని నీవు ఆశ్రయించక తప్పదు. ఎన్నాళ్లు ఎంత మంచి బాడుగ ఈ ఇండ్లకు కట్టిన ఏమి ప్రయోజనము లేదు. నీవు ఎన్ని సంవత్సరములు శ్రమ పడిన ఈ బాడుగకే సరిపోవును కానీ నీకు ఏమి మిగలదు. మోక్షము అను గొప్ప గృహమును నీవు చేరుకొన్న దానికి బాడుగ కట్టవలసి పని లేదు. మోక్షము అను గృహము ఎప్పటికి శిథిలము కాక ఎప్పటికీ ఒకేరకముగా ఉండును. అది నీకు సంతోషకరమైన గృహమై ఉండును. దాని యందు ప్రవేశించిన దాని నుండి విడువమను వారు లేరు , విడువవలసిన అవసరము లేదు. కావున ఓ జీవులరా! శరీరమనెడి గృహమును నమ్ముకొనక మోక్షమనెడి గృహమును చేరుకోవలయునన్న గురువును ఆశ్రయించి గురుకరుణ సంపాదించి పరికరముల సహాయమున యోగమాచరించి మోక్ష సామ్రాజ్యమను ఇంటిని మీరు అధిష్టించగలరు. అట్లు కాని యెడల మనము తిప్పలు పడి ఎంతకాలమైన ఈ తోలు ఇండ్లకు బాడుగలు కట్టుచుండవలసినదే. ఈ కస్టమే భగవంతుని విషయమందు చేసిన పరమాత్మ తన స్వంత స్థానమైన మోక్షమను గృహమును మనకు శాశ్వతముగా ఇచ్చును.

తెలియక కర్మ సంపాదించుకొని శరీరగృహములో చిక్కుకొని ఆహారమనే బాడుగ కట్టుచున్నాము.తెలుసుకున్న తర్వాత కూడా బాడుగ కట్టవలసి ఉండునా ? అను సంశయము కొందరికి బయలు దేరవచ్చును. దానికి సమాధానము , తెలియక చేసుకున్న ప్రారబ్ధము అనుభవించుటకే జీవుడు శరీరమును ధరించినాడు కానీ జ్ఞానముచేత పరమాత్మను నమ్మిన వారికి శరీరగృహమునకు బాడుగ కట్టవలసిన పని తప్పిపోవును అని చెప్పుటకు ఆస్కారము ఉన్నది. ఆ బాడుగను ఏవిధముగా పరమాత్మ జీవాత్మ చేత కట్టించడములేదో విశదీకరించిన క్రింద విధముగా తెలియుచున్నది. జీవుడు బ్రహ్మయోగమాచరించిన యోగమందు మనస్సు నిలచిన వెంటనే బ్రహ్మనాడియందు షట్ స్థానములు తమ చైతన్యములను కోల్పోవుచున్నవి. షట్ స్థానములు తమ చైతన్యమును కోల్పోయినవెంటనే జీర్ణశయము కదలిక నిలిచిపోవుచున్నది. కాలేయములో జరుగుపని నిలిచిపోవుచున్నది. కాలేయములో పని నిలచిన వెంటనే కాలేయములో ఊరి జీర్ణశయములోకివచ్చు పైత్యరసము నిలిచిపోవుచున్నది. క్లోమరసగ్రంధి లో కూడ పని నిలిచిపోయిన దానివలన క్లోమరసముకూడ జీర్ణాశయము లోనికి వచ్చుట నిలిచిపోవుచున్నది. మరియు నోటియందు ఊరు లాలా జలము

కూడ నిలిచిపోయి జీర్ణాశయము చేరకపోవును. ఈవిధముగా జీర్ణాశయము చేరు రసములన్నియు స్థంభించిపోవడంవల్ల జీర్ణాశయము ఆహారమును జీర్ణించలేకపోవును. మానవునకు జీర్ణాశయమునందు రసములు కలియుటచేత రసముల రసాయనికశక్తికి ఆహారము జీర్ణమవుచుండును. రసములు జీర్ణాశయములో ఆహారము లేని సమయమున జీర్ణాశయ గోడలకు తగిలిన ఒక విధమైన మంట (చురుకు)పుట్టును. దానినే ఆకలి అంటున్నాము. ఈ ఆకలి బ్రహ్మయోగులకు ఉండదు. బ్రహ్మయోగులకు రసగ్రంధులు చైతన్యమును కోల్పోయి రసములు జీర్ణాశయము చేరక పోవుటచే ఆకలి ఏ మాత్రం కనిపించదు. ఆకలి లేనిది ఆహారము అవసరము లేదు. బ్రహ్మయోగులు కదలికలేక ఉందురు. కావున వారి శరీరమునకు ఆహార శక్తి కూడ అవసరము లేదు. కావున బ్రహ్మయోగులు శరీరముయందు ఉండి కూడ శరీరఇంటికి బాడుగ కట్టక ఉన్నారు. ఇది తెలియనివారు యోగికి యోగమందున్నపుడు అమృతము చుక్కలు కపాలము లోనుండి వచ్చుచుండును. కావున వారికి ఆకలి ఉండదు అన్నారు. ఆ మాట నిజమైనది కాదు అని తెలుసుకోవలయును.

పని ఏ మాత్రములేక ఉన్న ఆహారముతో ఎవరికి అవసరము యుండదు అని కొంతమంది అనవచ్చును. దానికి సమాధానము పని లేక యున్న ఆకలి ఇంకా ఎక్కువ అగును కానీ ఏ మాత్రం తగ్గదు. పనిలేని వారు ఆలోచించుట ఎక్కువ. మనస్సు చలించుకొలది జీర్ణాశయ కదలిక ఎక్కువ అగును.కావున ఆకలి కూడ ఎక్కువగును. మనస్సుకు జీర్ణాశయముకు నరాశయ కేంద్రములద్వారా అవినాభావ సంబంధము యుండుటవలన మనస్సు కదిలిన జీర్ణాశయము కదలును. మనస్సు నిలచిన జీర్ణాశయము నిలుచును. నిద్రావస్థయందు మనస్సు నిలుచునున్నది కావున జీర్ణాశయము కూడా నిలుచుచున్నది. కావున రాత్రి 12 గంటల కాలములో ఆకలి కాక ఉన్నది. జాగ్రతావస్థయందు మనస్సు చలించుచున్నది. కావున పగలు 12 గంటల కాలంలో మూడు నాలుగు సార్లు ఆకలి అగుచున్నది. యోగము యందు మనస్సు నిలచిపోవుచున్నది కావున జీర్ణాశయము మొదలుకొని అన్ని అవయవములు నిలిచిపోవుచున్నవి. జీర్ణాశయ చైతన్యము నిలిచినవెంటనే ఆకలి ఏ మాత్రం కనిపించకపోవుచున్నది. బ్రహ్మయోగమందు యోగులు ఎంతకాలం ఉండిన అంత కాలము వారి శరీరమునకు ఆహారం అవసరం లేదు.

మానవులు ఆహారం కోసం పడరానిపాట్లు పడుచున్నారు. బ్రహ్మయోగులు ఆహారంకోసము ఏవిధ కష్టము పడకుండా ఉండడమే కాక ముఖ్యమైన నిద్రను, ఆకలిని జయించి పరమాత్మ శక్తిని సంపాదించుకొని దానిద్వారా కర్మను కాల్చి ఆత్మ యందు ఐక్యము చెందుచున్నారు. అజ్ఞానులు ఆహారం కొరకు కష్టపడడమే కాక దాని ద్వారా పాపపుణ్యములు సంపాదించుకొని కర్మను వృద్ధిచేసుకొంటు జన్మలు పొందుచున్నారు.

దానములు

దానము అనగా తనకున్న దానిని ఇతరులకు ఇవ్వడము. దానములు రెండు రకములుగా ఉన్నవి ఒక దాని ద్వారా పాపము వచ్చును. ఇంకొక దాని ద్వారా పుణ్యము వచ్చును. కొంతమంది దానము చేసిన పుణ్యమే వచ్చునని భావించి దానములు చేయుచున్నారు. కాని దానివలన పాపము కూడా సంభవించుచుండునని ఏ మాత్రము వారికి తెలియలేదు. దానములు కూడ పరమాత్మ యందు జీవుడు కలియుటకు ఉపయోగపడుచుండుట వలన తప్పక తెలుసుకోవలెయును.

ఒక జీవుడు రెండవ జీవునికి దానము చేయగా, ఆ జీవుడు దానము చేయబడిన దానిని పుణ్యములు వచ్చు పనులయందే వినియోగించిన , ఆ జీవునికి వచ్చిన పుణ్యము నందు సగభాగము మొదట జీవునికి లభించును. అట్లు కాక రెండవ జీవుడు పాపపుణ్యములకై వినియోగించిన దాని వలన వచ్చు పాపము నందు సగభాగము దానము చేసిన మొదటి జీవునకి వచ్చును. దీనిని బట్టి చూచిన దానము చేయగా తీసుకొన్నవాడు ఆ దానము మంచి పనుల యందు వినియోగించిన పుణ్యము , చెడ్డపనులయందు వినియోగించిన పాపము దానము చేసిన వారికి లభించునని తెలియుచున్నది. కావున దానములు పాపము వచ్చునవి పుణ్యములు వచ్చునవి అని రెండు రకములుగా విభజింపబడివున్నవి. అందువలన దానము చేయవలయునన్న దానము స్వీకరించు వానిని వీడు ఆ దానమునకు అర్హుడా? అనర్హుడా? అని తెలుసుకొని అర్హుడయిన ఇవ్వవలయును. అనర్హుడయిన దానము ఇవ్వక

మానుకొనవలయును. యోగ్యత అయోగ్యత తెలుసుకొనక దానములు ఇచ్చిన వారిని గురించి తెలుసుకొందాము.

ఒక వ్యక్తి దండిగా డబ్బు సంపాదించివుండెను. అతనికి బిక్షగాండ్లను చూచి దానము చేయవలయునని తలంపు పుట్టెను. అప్పటి నుంచి తన వద్దకు వచ్చి అడిగిన వానికి లేదనకుండా దానము చేయుచుండెను. ఒక రోజు ఒకడు వచ్చి నా భార్యా పిల్లలు మూడురోజుల నుంచి అన్నము లేక ఆకలికి బాధపడుచున్నారు అని దానము అడిగెను. అంత ఆ ధనికుని హృదయము కరిగి వానికి పది రూపాయలు దానము ఇచ్చెను. భార్య పిల్లల మీద అబద్ధము చెప్పి పది రూపాయలు తీసుకొన్నవాడు నేరుగా సారాయి దుకాణమునకు వెళ్ళి ఆ డబ్బుతో సారాయి త్రాగెను. ఆ తర్వాత సారాయి కైపు ఎక్కినవాడై ఇతరులను దూషించి వారితో వాదములు పెట్టుకొని వారిని తల పగుల గొట్టెను. ఈ విధముగా వాడు చేసిన పని అంతయు పాపపు పనియే. ఈ పాపము పది రూపాయలతో చేసినాడు. ఆ పది రూపాయలు లేకున్న వాడు త్రాగేవాడు కాదు. కావున ఆ పది రూపాయల ద్వారా వాడు సంపాదించుకొన్న పాపములో సగము పది రూపాయలు దానము చేసిన వానికి కూడ చెందినది. పుణ్యము సంపాదించుకొందాము అని చేసిన దానము పాపము సంపాదించి పెట్టినది.

ఒక ఊరిలో పుణ్యము సంపాదించుకొందాము అని ఒకడు అన్నసత్రము కట్టించి, దాని యందు ఆకలి గొన్న వారందరికి అన్న దానము చేయుచుండెను. ఒకడు రెండు రోజుల నుంచి ఆ ఊరి మార్గము మీద ప్రయాణము చేయుచు వచ్చుచుండెను. వాడు పరమ దొంగ. వానికి ఒక రోజు అన్నము లేకపోవుటచే ఆకలి వలన శరీరము చచ్చుపడి నడచుటకు కూడ కష్టముగా ఉండెను.అట్లున్నవాడు ఆ ఊరి యందు ప్రవేశించి, అన్నసత్రమును చూచి దానియందు అన్నము కడుపునిండా తిని, సాయంకాలము వరకు అక్కడనే విశ్రాంతి తీసుకొని రాత్రికి కూడ అక్కడనే భోజనము చేసి ఒక చోట పరుండెను. వాడు అన్నము తినిన దాని వలన వానికి శరీరము నందు తిరికి శక్తి వచ్చెను. వాడు ఆ రాత్రికి ఉరంతయు తిరిగి ఒక ఇంటికి రంధ్రము వేసి లోపలికి ప్రవేశించి కట్నము కొరకు తీసి ఉంచిన డబ్బు దొంగలించుకొని పోయెను. అట్లు పోతూ ఊరి బయట ఒంటరిగా కనిపించిన ఒక స్త్రీని మానభంగము చేసిపోయేను. వాడు

చేసిన రెండు పనులు పాపము వచ్చు పనులే. అన్నసత్రములో అన్నము తిన్న దాని వలన వాడు ఈ పని చేసెను. ఆ అన్నమే వాడు తినకున్న శరీరము నందు శక్తి లేక ముడుచుకొని ఒకచోట పరుండెటి వాడు. అందువలన ఆ పాపములో సగ భాగము అన్నము దానము చేసిన వానికి కూడ లభించినది. ఇట్లు కొంతమంది పుణ్యము సంపాదించు కొనవలయునను తలంపుతో తెలియక పాపము కూడ సంపాదించు కొనుచున్నారు. అందువలననే గీత యందు పాత్ర అపాత్ర యెరిగి దానము చేయవలయునని పరమాత్మ అన్నాడు. పాత్ర అపాత్ర తెలుసుకొనుట వల్ల పాపము వచ్చు దానములు విడచి, పుణ్యము వచ్చు దానములు మాత్రము చేయుటకు వీలగును. అట్లు తెలిసి పుణ్యము కోసము దానము చేసిన మరల వచ్చు జన్మమున ఇపుడు దానము చేసిన దాని కంటే నూరురెట్లు సుఖము లభించును. దానములు చేయువారందరు గీతయందు శ్రీ కృష్ణపరమాత్మ చెప్పినట్లు పాత్ర అపాత్రలు తెలుసుకొని దానము చేయవలయును. అట్లు కాక పోయిన చేసిన దానము వల్ల పాపమూ రావచ్చును లేక పుణ్యమూ రావచ్చును.

దానము వల్ల పుణ్యము పాపము వచ్చినయెడల యోగ్యత అయోగ్యత కని పెట్టి దానము చేయవలయునన్న ఎలా వీలగును. మంచి వాడు ఎవడు? చెడ్డ వాడు ఎవడు? అన్నదియే తెలియకున్న దానము చేయుట ఎట్లు ? లేక దానములు చేయుటయే మానిన ఏదియు రాక ఉండునుకదా! అను సంశయము అందరికి కలుగవచ్చును. దానికి నా సమాధానము పాత్ర అపాత్ర తెలుసుకొని బదులు మేలుచేయుశక్తి లేని సజ్జనునకు ఇచ్చు దానము త్రిగుణములయందు సాత్వికులు చేయు దానమగునని గీతయందు శద్ధాత్రయ విభాగయోగములో కృష్ణపరమాత్మ పలికినాడు. అటువంటి సాత్విక దానము చేయుటకుకూడ ఈ కాలమున తీసుకొనువాడు ఎటువంటివాడో తెలియుటకు కష్టముగాముగాఉన్నది. ఇటువంటి క్లిష్టపరిస్థితిలో దానము చేసినను అది సాత్వికము, రాజసము , తామసము గాక పాపపుణ్యములు ఏమాత్రము రాకుండ ఉండుటకు ఒక మార్గము ఉన్నది. అది ఎట్లనిన చేయుచున్న దానము పరమాత్మకు అర్పితమని తీసుకుంటున్న వానిని గురించి ఏమాత్రము ఆలోచించక , దానమువల్ల పుణ్యము వచ్చునను ఆశ ఏమాత్రము పెట్టుకొనక నిష్కామముగా దానము చేసిన ఆ దానము నేరుగా పరమాత్మకు చేరుటవలన ,

దాని వలన వచ్చు ఫలితమును ఆశించక చేసిన దాని వలన , దానము చేసిన వానికి ఏమాత్రము పాపము కానీ పుణ్యము కానీ రాక దాని వలన దాని ఫలితము జ్ఞానముగా మారి వచ్చే జన్మకు ఆ జీవుని జ్ఞాని గా మార్చి పరమాత్మను తెలుసుకొనుటకు ఉపయోగపడును. అందువలన ఈ విధముగ చేయు దానము చాలా పవిత్రమైనది అందరు ఈ విధముగ చేయడమే మంచిది. కొంతమందికి పుణ్యము వచ్చిన బాగుండును కదా! అను అనుమానము రావచ్చును దానము వల్ల పుణ్యము వచ్చిన ఇచ్చిన దానికంటే నూరు రెట్లు మళ్లీ జన్మ యందు అనుభవించ వచ్చును , పుణ్యము వల్ల ధనము కలిగి దాని వల్ల సుఖము కలిగిన సుఖములలో జీవుడు మునిగి పరమాత్మను మరచిపోవుటకు వీలు కల్గుచున్నది. కష్టములు లేక సుఖములు ఉన్న దేవునితో పని ఏమి? అని మానవుడు అనక మానడు. కావున పుణ్య దానము కన్న నిష్కామముగా పరమాత్మకే వచ్చుచున్నాడు అని తలంచుకొని ఇచ్చు ధానము పరమాత్మకే చేరును. దానివలన పాపపుణ్యములు ఏమాత్రం అంటక ఉండును. మరు జన్మమున దాని ఫలము జ్ఞాన ఫలముగా మారి జీవుని చేరును. అన్ని దానములకన్నా నిష్కామ దానము ప్రధానమైనది.

ఈ కాలమున కొందరు చేసిన దానము పేరు ప్రఖ్యాతుల కై ఉంటుంది. ఎవరు లేని చోట భిక్షగాలు అడిగితే లేదన్నవాడు గుంపులుగా జనం ఉన్న చోట అడిగిన ఇతరులు చూచుదానికి దానము చేయుచున్నాడు. ఇచ్చిన దానము విలాసరూపమున చెక్కించిన్నట్లు అయిన నూర్లు , వేలు దానము చేయువారు కూడ కలరు. దేవాలయములకు దానము చేసిన ధాతలు కొంతమంది ఇచ్చిన వస్తువు మీద వారి పేరును వ్రాయించుకొనుచున్నారు. సత్రములు కట్టిన చోట బావులు తవ్వినచోట కట్టించినవారి పేర్లు ఫలకముల మీద చూస్తూనే ఉన్నాము. దీని వలన పుణ్యము లభించును. దాని ఫలితముగా మరుజన్మమున సుఖము వచ్చును. కానీ మోక్షము ఏమాత్రము లభించదు. మోక్షము విలువ తెలియని వాడు సుఖమువచ్చిన చాలు కదా! అంతకంటే ఏమి కావలెయును! అని అనవచ్చును అటువంటి వారికి ఏమియు చెప్పలేము అని ముందుగానే ఒప్పుకోవడము మంచిది. ఎందుకనగా వారికి ఏమి చెప్పిన చెవిటివాని ముందుర శంకు ఊదినట్లు ఉండును. ఏసు ప్రభువు బైబిల్ నందు కుడి చేతితో దానము చేసిన ఎడమ చేతికి తెలియకూడదన్నాడు. శ్రీకృష్ణుడు గీత యందు ఆచరించు

ప్రతీకార్యము నిష్కామముగా చేయమన్నాడు. అట్లు కాక మనము చేసిన దానమును పేరు ప్రఖ్యాతులకై ఎంతో మందికి చెప్పుచున్నాము. మరియు మన విలాసములు రాళ్ళమీద వ్రాయించుకొనుచున్నాము. దాని వలన పుణ్యము వచ్చునేమో కానీ జ్ఞానము లభించుటకు పరమాత్మను తెలుసుకొనుటకు ఏమాత్రము వీలు ఉండదు. చేయు ప్రతి దానమును పరమాత్మకే ఇచ్చు చున్నాము అను తలంపుతో సంశయము లేక దాని వల్ల పాప పుణ్యములు ఏమాత్రము రాక మరు జన్మమున జ్ఞానము వచ్చును.

తపస్సు - యోగము

నేటి ప్రపంచములో దేవుడున్నాడు అను నమ్మిక కలవారు చాలా మంది ఉన్నారు. ఆ నమ్మియున్నవారు అనేక విధముల తన శక్తిని దేవునికి చూపుచున్నారు. కర్మను అనుసరించి వారు దేవుని యెడల భక్తి చూపు విధము కూడ నిర్ణయించబడి యుండును. ప్రపంచములో మానవులు అనేక రక కర్మయుతులు కావున వారు అనుసరించు భక్తి మార్గము కూడ అనేక రకములై ఉండును. కొందరు మంత్ర యుక్తమైన పూజలు చేయుచుందురు. కొందరు తమ తమ ఇష్టదైవములను ఆరాధించుచుందురు. మరి కొందరు హోమములు చేయుచుందురు. ఇంకా కొందరు తపస్సు చేయు వారు కూడ ఉన్నారు. కొందరు యోగమును ఆచరించువారు ఉన్నారు. ఇంకా ఎన్నో విధానములలో మానవులు దైవము ఎడల భక్తిని చూపుచున్నారు. అందరూ ఒకే మార్గమునే అనుసరించక అనేక మార్గములను అనుసరించుటకు కారణము కర్మయే. పూర్వ జన్మమున ఎవడు చేసుకొన్న పుణ్యఫలమును బట్టి వానికి ఈ జన్మలో భక్తి మార్గములో అనుసరించు విధానము కూడ నిర్ణయింపబడి ఉండును. సకల మానవులకు దైవము ఒక్కడే అయిన ఆయనను తెలుసుకొనుటకు అనేక మార్గములు ప్రపంచములో ఉన్నవి. నానా విధ పూజలు , క్రతువులు, తపస్సులు, యోగములు అనేకము ఆయనను తెలిసుకొనుటకు నిమిత్తమై ఉన్నవి. ప్రతి మానవుడు చేయు చిన్న పూజా సహితము ఆయనకే చేరుతుంది. సకల పూజలకు భోక్త ఒక్క పరమాత్మయే అయినా మానవులు ఆచరించు

విధానములు అనేక రకములుగా ఉన్నాయి. కావున వాటి యందు భక్తి విధానములు ఇన్ని రకములుగా ఉన్నాయి. కావున వాటి యందు ఏ విధానము మంచిదో తెలుసుకొని ఆచరింపవలసిన కర్తవ్యము మనకున్నది. మనము తెలివి ఉన్న మానవులము కావున ఏ విధానము మంచిదో తప్పక తెలుసుకొని ప్రవర్తించవలయును. అట్లు కాక అందరూ నడిచే మార్గముననే నేను పోవుచున్నాను అంటే , దాని గమ్యము దూరమో? లేక దగ్గరో? ఏ విధానమయిన మనము ఆచరించు భక్తి పరమాత్మకే చేరును. కానీ దాని వలన పొందు ఫలితము అనేక విధములయిన స్థాయిలలో ఉండును. ఎవ్వరు ఏ విధముగా ఆచరించుచుందురో వారికి ఆవిధమైన ఫలితమే అబ్బును.ఎవరు ఏ రూపమును ఆరాధించుచుందురో వారికి ఆ విధ రూపముతోనే పరమాత్మ వారి పూజలు స్వీకరించి ఫలితమునిచ్చును. ఆరాధనలు ఎన్ని అయినా ఏ రూపమయినా అన్నిటికి ఆదిపురుషుడు ఒక్కడే. కానీ ఆరాధించువానికి లభించు ఫలితములు వ్యత్యాసములు కల్గియున్నవి అన్నాము కదా!వాటి వ్యత్యాసములును మొదట రెండు రకములుగా విభజించవచ్చును. ఆ రెండు రకములు ఏవి అనగా ! ఒకటి కామ్యార్థసిద్ధి, రెండు మోక్షసిద్ధి , ప్రపంచములో ఈ రెండు ఫలితములందు మొదటిదైన కామ్యార్థసిద్ధిని కొరువారే నూటికి తొంభైమంది పాళ్ళు ఉన్నారు. మిగిలిన ఒక్క పాలులో కూడ మోక్షసిద్ధిని కొరువారు మిక్కిలి అరుదుగా ఉందురు. తెలిసిన జ్ఞానులు మోక్షసిద్ధిని గురించి చెప్పిన , దానితో ఏమి పని ? ప్రపంచములో అన్ని విధముల సుఖజీవనము గడుపుటకు దేవుని ఆరాధించితే చాలు. అంతకంటే ఇంకేమీ కావలయును? అను వారు చాలా మంది ఉన్నారు. కామ్యార్థసిద్ధిని కోరి చేయు ఆరాధనలు కూడ అనేక రకములై ఉన్నాయి. అందువలన కామ్యార్థసిద్ధిని కూడ మానవులు అనేక విధములుగానే పొందుచున్నారు. కొంతమంది మానవులు తాము కోరుకున్న కోర్కెలు ఈ జన్మలోనే నెరవేరును అని అనుకొనుచుందురు. అట్లు ఎప్పటికీ జరగడము లేదు. ప్రతి జీవుడు కోరుకొన్న కోర్కెలు మరు జన్మమున నెరవేరుచున్నవి. కామ్యార్థసిద్ధి శీఘ్రముగ ఫలమిచ్చును, అనగా మరుజన్మమందే నెరవేరును. మోక్షసిద్ధి అట్లు కాక కొన్ని జన్మల వరకు కూడ లభించకపోవును.

మోక్షసిద్ధినికోరి పరమాత్మను ఆరాధించు వారు చాలా కొంతమందే దేశములో ఉన్నారు. కామ్యార్థ సిద్ధిని కోరి ఆచరించువారు ఎక్కువ మంది యుండి మోక్షసిద్ధిని కోరి ఆచరించు వారు కొద్ది మందే ఎందుకు ఉన్నారు? మోక్షము పొందవలయునని అందరు ఎందుకు అనుకోవడము లేదు? అని కొందరికి అనుమానము రావచ్చును. దానికి నా సమాధానము ప్రపంచములో భక్తి కలవారు చాలా మంది ఉన్నారు. కానీ వారి భక్తి క్షుద్ర దేవతలను మొదలుకొని మహాదేవతల వరకు చూపబడుచున్నది.కొందరు పెద్దమ్మ,సుంకులమ్మ, కాళికా మొదలగు ఆడ దేవతలను ఆరాధించువారు , మరికొందరు ఇంద్రుడు,చంద్రుడు మొదలుకొని విష్ణు , ఈశ్వర , బ్రహ్మ వరకు ఆరాధించు వారు ఉన్నారు. కానీ ముప్పది మూడు కోట్ల దేవతల కంటెను , అనగా దేవతలయందు అగ్రగణ్యులయిన విష్ణు ఈశ్వర బ్రహ్మ కంటెను అతీతుడగనున్న , మరియు అందరి దేవతలందు కూడ అంతర్యామియై ఉన్న వానిని ఎవరు గ్రహించలేక ఉన్నారు. పూర్వ జన్మమున భక్తి మార్గములో విశేషమయిన పుణ్యమును ఎవరు సంపాదించుకొని యుందురో వారికి మాత్రమే దేవతలందరి కంటే అతీతుడైన దేవుడున్నాడను విషయము తెలియుచున్నది. పరమాత్మను ఆరాధించు వారే మోక్షసిద్ధిని కోరి ఆచరించువారని చెప్పవచ్చును. దేశములో భక్తి మార్గమున పుణ్యఫలితము తక్కువ యున్న వారే ఎక్కువ ఉన్నారు. కాబట్టి వారి వారి పుణ్య ఫలితములకు సమానమయిన దేవుడినే నమ్మి ఆరాధించుచున్నారు. అందువలన దేశములో దేవతలను ఆరాధించువారు చాలా మంది ఉన్నారు. అనగా కామ్యార్థసిద్ధిని పొందు వారు అధికముగా ఉన్నారని చెప్పవచ్చును.

అందరికీ అతీతుడై , ఎప్పటికి నాశనము లేని వాడై , విష్ణు ఈశ్వర బ్రహ్మ మొదలగు దేవతల చేతనే ఆరాధింపబడువాడైన పరమాత్మ ఒకడున్నాడను విషయము తెలియుటకే ఎన్నో జన్మల పుణ్యఫలితము అవసరము. పుణ్యఫల విశేషము వలన పరమాత్మ విలువ తెలుసుకున్న తర్వాత ఆయనను ఆరాధించి , పరమాత్మ ను పొందుటకు వారియొక్కఆరాధన తీవ్రతను బట్టి ఉండును. పరమాత్మను ఆరాధించుచుండినను కొందరు అనేక జన్మలకు , కొందరు కొన్ని జన్మలకు కొందరు ఒకేజన్మలోనే మోక్షమును పొందుచున్నారు. పరమాత్మను ఆరాధించు బుద్ధి పుట్టుటకు అనేక జన్మల పుణ్యఫలము అవసరమన్నాము కదా! దేశం లో

పుణ్యఫలము ఎక్కువయున్నవారు చాలా అరుదుగా ఉన్నారు. కావున మోక్షమును ఉపేక్షించి పరమాత్మను ఆరాధించు వారు కూడా అరుదుగా నే యుందురని చెప్పవచ్చును.దేశంలో ఎవరు ఏవిధానమును భక్తి మార్గములో ఆచరించు చున్నారో వారు ఆవిధానమే గొప్పదని అనుచున్నారు. అన్నివిధముల ఆచారమునకు నాయకుడు ఒక్కడేయని గ్రహించలేక ఉన్నారు. కొందరు మతములుగా విభజించుకొని మా మతము గొప్ప మా మతము గొప్ప అని వాదించుకొనుచున్నారు. అన్ని మతములకు యజమాని ఒక్కడే అని గ్రహించలేక ఉన్నారు. అట్లే పూజలు చేయువారు , హోమములు చేయువారు తపస్సు చేయువారు అనుకొనుచున్నారు. ఇవి అన్నియు పరమాత్మ యెడల సాధనములై ఉన్నవి. కానీ ఏసాధనమున మనము కడతేరవచ్చునో మానవులమైన మనము తప్పక తెలుసుకోవలెను. ఈవిషయము ఉద్దేశించి భగవద్గీత యందు విశ్వరూప సంధర్శనయోగం లో పరమాత్మ

11 శ్లో॥ 53 నాహం వేదైర్న తపసా న దానేన న చేజ్యయా ।
శక్య ఏవమ్ విధో ద్రష్టుం దృష్ట వానసి మాం యథా॥

అర్జునా ! తపము చేతనైనా , దానము చేతనైనా , క్రతువులనైనా ,వేదములచేతనైనా ఇపుడు నీవు చూచిన ఈ విశ్వరూపము చూడవలయునన్న శక్యము కాదు.

11 శ్లో॥ 48 న వేదయజ్ఞాధ్యయనైర్న దానైర్న చ క్రియాభిర్న తపోభిరుగ్రైః|
ఏవంరూపః శక్య అహం నృలోకే ద్రష్టుం త్వదన్యేన కురుప్రవీర॥

అర్జునా వేదధ్యాయనముల వలనగాని , వివిధ రక పూజలచే కాని , దానములవలన కాని ఉగ్రమైన తపస్సులవలన గాని , నన్ను తెలుసుకొనుటకు లోకములో శక్యము కాదు. అటువంటి నా రూపు నా అనుగ్రహము వలన నీవు చూడ గల్గితివి అని పరమాత్మ పల్కి ఉన్నాడు. అందువలన దేశం లో మనము ఆచరించు వివిధ ఆరాధనలు కాని , వేదములను కంఠాపాఠము చేసుకొని అధ్యయనము చేయుటవలన కాని , దానములన వలన కాని ,క్రతువుల వలన కాని , ఉగ్రమైన తపస్సులవలన కాని పరమాత్మను తెలుసుకొనుటకు పొందుటకు ఏమాత్రం వీలు పడదని తెలియుచున్నది. ఈ మాట తోనే చాలా మందికి బాధ కలగవచ్చును. ఎందుకనగా ! వారు చేయు ఆరాధనలు చిన్న పూజలు మొదలుకొని

హోమములు తపస్సుల వరకు ఉండును. తపస్సు గొప్పగా చేయువారు కూడ నన్ను తెలుసుకొనుటకు అనర్హులు అని పరమాత్మ యే పలికితే బాధ కాక యేమి పుట్టును ? పరమాత్మ మనలను బాధ పెట్టుటకు ఈ మాట పల్కిఉండలేదు. మనము సరైన మార్గం లో నడిచి , తనను తెలుసుకొను నిమిత్తమై పరమాత్మ ఆవిధముగా పల్కిఉన్నాడు. తపస్సుల వరకు నన్ను తెలుసుకొనుటకు శక్యము కాదు అంటే వేరే విధానము ఏదో ఒకటి ఉన్నదని తెలియుచునే ఉన్నది. ఈ విధానమేదో పరికించి చూచెదము.

దేశంలో అన్నిటికి మించినది తపస్సు అని చాలా మంది అభిప్రాయము ఉండవచ్చును అటువంటి వారు ఇంకా వేరువిధ అభిప్రాయములు కల వారు దేశం లో ఉన్నారను అభిప్రాయము తోనే పరమాత్మ గీతా శాస్త్రములో

6 శ్లో॥ 46 తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోఽపి మతోఽధికః ।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్యోగీ భవార్జున॥

అర్జునా యోగి తపస్సు చేయు వారికంటే ఉత్తముడు, జ్ఞానవంతుని కంటే ఘనుడు , మరియు కర్మముల చేయువారి కంటెను అధికుడు అగుట వలన నీవు కూడ యోగివి కమ్ము అన్నాడు.

దీనితో అందరికంటే ఉత్తముడు యోగి , అన్ని అభ్యాసముల కంటె యోగాభ్యాసమే పరమాత్మను తెలుసుకొనుటకు శ్రేయస్కరమైనదని తెలియుచున్నది. ఎవరు చెప్పిన మానవులు వినరని పరమాత్మయే తెలియజేసినాడు. ఇక్కడ కొందరు తపస్సు చేయు వారి కంటే యోగి ఉత్తముడని పరమాత్మ తెలియచేసినాడు. మరియు జ్ఞానియు యోగి కంటె తక్కువ వాడని తెలియచేసినారు. జ్ఞాని వేరు యోగి వేరునా? మరియు తపస్వికి యోగికి ఏమి బేధముండును ?" అని అడగవచ్చును. దానికి సమాధానము జ్ఞాని అనగా పరమాత్మ యొక్క సాధన విషయములు తెలుసుకున్నవాడు అని అర్థము. అజ్ఞానము అనగా తెలియని తనము అని అర్థము. ఒక ఊరికి పోవు దారిని తెలుసుకున్నంతమాత్రమున ఊరు చేరిన దానితో సమానమెట్లగును? అట్లే పరమాత్మను పొందు విషయములు తెలుసుకున్నంత మాత్రమున

పొందిన వాడెట్లగును? పాలు పెరుగుగా, తర్వాత వెన్నగా, ఆ తర్వాత నెయ్యిగా మారును అని తెలుసుకున్నంత మాత్రముననే నెయ్యి అగునా ? కాదు. పాలును కాచి పెరుగుగా పేరపెట్టి తర్వాత చిలికి వెన్నగా చేసి ఆ తర్వాత అగ్ని చేత వేడి చేసిన నెయ్యిని చూడవచ్చును. అట్లే ప్రపంచములో పరమాత్మను తెలుసుకొను మార్గములు తెలుసుకున్నంతనే పరమాత్మను పొందినాము అన్న మాట అద్దము నందు కనిపించు వస్తువును పట్టుకున్నాము అన్నట్లుండును. అందువలన జ్ఞాని అయినంతమాత్రముననే యోగి కాలేడు అని పరమాత్మ తెలిపియున్నాడు. యోగి అనగా పరమాత్మ యందు కలసిన వాడు అని అర్థము. జ్ఞాని అనగా పరమాత్మ యందు కలియు విధానము తెలిసినవాడు అని అర్థము. విధానము తెలిసినంత మాత్రముననే ఎవ్వడు యోగి కాలేడు. తెలిసిన విధానములను ఆచరించువాడే చివరకు యోగిగా మారును. కావుననే యోగి జ్ఞాని కంటే ఉత్తముడని చెప్పవచ్చును. తపస్సు చేయు వారికంటే యోగి ఉత్తముడని పరమాత్మ తెలియచేసినాడు. అట్లు ఎందుకు తెలియచేసినాడు అనగా ? యోగికి తపస్వికి చాలా భేదమున్నది. తపస్సు అనగా తపించడము. ఒక వ్యక్తి తపస్సు చేయుచున్నాడనగా ఆ వ్యక్తి ఏదో ఒక దేవుని ఆకారమును చూడవలయునను నిమిత్తమో లేక ఒక మంత్రమును మనస్సు నందు లయము చేసుకొని దాని కోసము తపించడమో అయి ఉండును. ఇంకా కొందరు మనస్సు ఒక చోట కేంద్రీకరించి కనపడు దృశ్యముల కోసము తపించుచున్నారు. మొత్తము మీద జీవుడు తన కంటే ఇతరములైన వస్తువుల మీద కాని దేవుళ్ళ మీద కాని తపించడమును తపస్సు అని అనవచ్చును. పూర్వము రావణాసురుడు ఈశ్వరుని కోసము తపించి, ఈశ్వరుని చూడగలిగినాడు మరియు మాట్లాడగలిగినాడు వరములు పొందగలిగినాడు.అట్లే హిరణ్యకశిపుడు బ్రహ్మ దేవుని కోసము అరణ్యములో తపించినాడు. చివరకు బ్రహ్మ దేవుని దర్శించగలిగినాడు. ఇట్లు అనేకులు పూర్వము తపస్సు చేసి వారి ఇష్టములను దేవతల చేత పొందినారు. జనసమూహములయందుండిన వారి తపనకు భంగము కలుగునని మానవ సంచారము లేని అడవులకు పోయి పూర్వము తపస్సు చేసుకొనెడివారు. పూర్వము చాలామంది కోర్కెలను నెరవేర్చుకొను నిమిత్తము తమ ఇష్టదైవమును దృష్టియందు పెట్టుకొని తపించి తపించి కొంత కాలమునకు తపస్సు ఫలించగ వారి కోర్కెలను నెరవేర్చుకొనెడివారు. అర్జునుడు పాశుపతాస్త్రము కోసరము ఈశ్వరుని తపించినాడు. విశ్వామిత్రుడు కూడ కొంతకాలము బ్రహ్మాస్త్రము కోసము తపించినట్టు

చరిత్రలో తెలియుచున్నది. తపస్సు వలన మోక్షసిద్ధిని పొందలేము. కామ్యార్థసిద్ధిని పొందవచ్చును. అందువలననే పరమాత్మ తపస్సు వలన నన్ను పొందుటకు శక్యము కాదు అని తెలియజేసినాడు. తపస్వికంటే పరమాత్మ మార్గమును తెలుసుకొన్న జ్ఞానియే ఉత్తముడని చెప్పవచ్చును. తపస్సు వలన పొందెడి ఫలము అనుభవించిన వెంటనే అయిపోవును. జ్ఞానము అట్లు కాక మరు జన్మ యందు కూడ పరమాత్మ మార్గమునే సూచించును. కావున తపస్వి కంటెను జ్ఞానియే ఉత్తముడని చెప్పవచ్చును. తెలిసిన వానికంటెను పొందినవాడు ఇంకనూ శ్రేయస్కరుడు కావున జ్ఞాని కంటే యోగి అధికుడు అని చెప్పవచ్చును. ఒక్క యోగి మాత్రము తన దేహామందున్న ఆత్మను యోగముద్వారా తెలుసుకొనుచున్నాడు. మిగతా వారు ఎవ్వరు తెలుసుకొనుటకు వీలు లేదు. అందువలన పరమాత్మ గీతా శాస్త్రమున

15 శ్లో॥ 11 యతన్తో యోగినశ్చైనం పశ్యన్త్యాత్మన్యవస్థితమ్ ।
యతన్తోऽప్యకృతాత్మానో నైనం పశ్యన్త్యచేతసః॥

ప్రయత్నము చేయు యోగులు మాత్రం దేహామందున్న ఆత్మను తెలుసుకోగలరు. మిగతావారు ఎంత ప్రయత్నించినను తెలుసుకోలేరు అని అన్నాడు.అందువలన ప్రపంచం లో పరమాత్మను తెలుసుకొనుటకు ఉత్తమమైన మార్గము యోగమే అని అన్ని విధముల తెలియుచున్నది. పరిశోధించి తెలుసుకొనుట మానవుల కర్తవ్యము. మా అనుభవములో తపస్సునే గొప్పగా భావించుకొనువారు చాలా మంది తటస్థించి నందు వలన తపస్సు కంటే యోగము మించినదని విశదీకరించి తెలియచేయడమైనది కావున తపస్సులైన గాని, జ్ఞానులైన గాని మమ్ములను కించపరచిన వారు అని అభిప్రాయపడక వాస్తవమును తెలుసుకోవలయునని తెలుపుచున్నాము.

మరియొక మాట ‘కర్మిభ్యశ్చాధికో యోగి “ అని పరమాత్మ ఆత్మసంయమయోగములో పలికినాడు కదా! కర్మ ఆచరించుచు, కర్మను సన్యసించి అందువలన వచ్చు పాపపుణ్యములను పొందకపోవచ్చును కదా! అదియు కర్మయోగమే కదా! మరి కర్మముల చేయువారికంటే యోగి అధికుడన్నారు కదా! ఎట్లు? అని కొందరడగవచ్చును. ఆ మాటను

నేను ఒప్పుకుందును. కానీ ఇక్కడ తెలుసుకోవలసిన రహస్యము ఒకటున్నది. అది ఏదనగా! కర్మను ఆచరించుచు అందు వచ్చు పాపపుణ్యములనుపొందక పోవుట కూడా యోగమే , అట్టి వానిని కర్మయోగి అందురు. ఆత్మసంయమయోగములో ఆత్మయోగిని గురించి పరమాత్మ తెలియచేసినాడు. కర్మయోగికంటే ఆత్మయోగి అధికుడు. యోగులందు కూడ చిన్నా పెద్ద ఉన్నారని ముందే తెలుసుకున్నాము. సర్వయోగులందు కూడ ఎన్నో తారతమ్యములు కలిగియున్నారు. కావుననే పరమాత్మ గీతా శాస్త్రములో అక్కడక్కడ "సర్వ యోగులందు నాకు ఫలానావారు ఉత్తములు ఈ విధముగా ఉన్న వారిని నేను శ్రేష్ఠులని తలంచుచుందును" అని అన్నాడు. మరియు ఆత్మ సంయమయోగములో ఆఖరున "సర్వయోగులందు ఎవరు సంపూర్ణముగా అంతరాత్మలో నన్నే ఆశ్రయించి శ్రద్ధ కలిగి నన్నే ఆరాధించుచుండునో వాడే ఉత్తముడని తలంచుచున్నాను" అని తెలియచేసినాడు. కావున యోగులయందు కూడ చిన్న పెద్దయున్నారని చెప్పవచ్చును. కర్మ యోగులకంటే ఆత్మయోగి ఎందుకు అధికుడు అన్న విషయమును తెలుసుకొందాము. కర్మయోగము ఆచరించి చేయుచున్న కార్యములందలి పాప పుణ్యములు ఆ జీవునికి ఏమాత్రము అంటవు. కానీ పోయిన జన్మలో చేసుకొనియున్న పాపపుణ్యములను అనగా ప్రారబ్ధమును తప్పక అనుభవింపవలసి ఉండును. బురదలో దూరిన కుమ్మరి పురుగుకు బురద అంటకుండునట్లు, కర్మయోగి కర్మముల ఆచరించినను ఆ కర్మయందలి పాపపుణ్యములు ఆ జీవునికి అంటకుండును. ఆ జన్మలో కర్మను కర్మయోగము చేత పొందకుండవచ్చును. కానీ పోయిన జన్మములయందు సంపాదించుకొన్న కర్మను కర్మయోగముచేత పోగొట్టుకోలేడు. కర్మయోగము యొక్క శక్తి ఆ జన్మలో కర్మను జయించుటకు మాత్రమే వెనుకటి జన్మలందు మనము చేసుకున్న పాపపుణ్యములను పోగొట్టుకో వలయునంటే ఒక్క ఆత్మయోగముచేతనే సాధ్యమగును. ఆత్మయోగము చేత ఆ జన్మకర్మను అంటకుండవచ్చును, మరియు వెనుకటి జన్మలందు సంపాదించుకున్న కర్మను జ్ఞానాగ్ని చేత కాల్చి వేయవచ్చును. జ్ఞానాగ్ని ఉత్పన్నమగునది ఒక్క ఆత్మయోగమందే. అందువలన ఆత్మయోగమును ఆచరించిన వాల్మీకి తన ప్రారబ్ధమును అంతటిని నాశనము చేసుకొని ఏ మాత్రము అనుభవించక తప్పించుకొనెను. మరియు ఆ జన్మ యందే మోక్షమును పొందెను. అర్జునుడు కర్మయోగమాచరించి ఆ జన్మలోని పాపపుణ్యములను అంటకుండ పోయెను. కానీ ముందు చేసుకున్న ఫలితమును అనుభవించుటకు తిరిగి కన్నప్పగా పుట్టవలసి

వచ్చెను. వీటన్నిటిని పరికించి చూచిన కర్మముల చేయువారికంటే యోగి అధికుడని పరమాత్మ ఎందుకు పలికినది అర్థమగును.

పవిత్రమైన మానవజన్మలోనికి వచ్చిన జీవులారా! మీలో అంటియున్న అహమును విడచి, ఇప్పటివరకు నమ్ముకున్న మార్గముల విడచి అత్యుత్తమమైన యోగమార్గమున అతివేగముగా ప్రయాణించి పరమపదమును పొందవలయునని మీకు తెలుపుచున్నాను. నేటి నా మాట నమ్మకుండిన ఆనాటి పరమాత్మమాట అయినా నమ్మి సరియైన మార్గమును చేరుకొందునని అనుకొంటున్నాను.

మనస్సు

ప్రతి జీవియందును మనస్సు ఉన్నది.మానవుని మాయయందు ముంచుటకును, మాయనుండి విముక్తుని చేయుటకును మనస్సు ముఖ్యమై ఉన్నది. అందువలన పరమాత్మను తెలుసుకోవలయునన్న ప్రతి ఒక్కరు మనస్సు గురించి తెలుసుకోవలసిందే. ముందుగా మనస్సును తెలుసుకోలేని వాడు దానిని స్వాధీన పరచుకోలేని వాడు, పరమాత్మను ఏ మాత్రము తెలుసుకోలేడు. కావుననే గీత యందు ఆత్మ సంయమయోగములో పరమాత్మ "మనస్సు చేత నాత్మకెనయు నౌన్నత్యంబు అధమ గతికి కూడ అదియె పంపు, కనుక ఆత్మ యెడల మనస్సు చరించెడు మిత్రమగుచు మరియు శత్రువగుచు" అని అన్నాడు. మరియు "ఎవడు మనస్సు నిగ్రహింపగల్గునో వాని ఆత్మకదియు మిత్రమగుచు జెలంగు మనస్సు నిగ్రహము చేయజాలని వాని ఆత్మ కదియు విరోధి" అని అన్నాడు. భగవంతుడు ఈ విధముగా చెప్పియుండగా కొంతమంది భగవంతుని మాటకు వ్యతిరేకముగా మనస్సుతో ఏమి పని లేదు నేనెవడను? అని కన్నులు మూసుకకూర్చున్న తన ఆత్మ తనకు తెలియును అని అంటున్నారు.నేనెవడను? అని అనుకున్నంత మాత్రమున ఆత్మ దర్శనము అంత సులభముగా ఎట్లు లభించునో మాకు ఏ మాత్రము అర్థము కావడము లేదు. అట్లు ఆత్మ దర్శనము

సులభముగా లభించినదన్నవారు కొంతకాలమునకు సంశయాత్మపరులగుటకు ఆస్కారము ఉన్నది. జ్ఞాని అయిన తర్వాత మనస్సును స్వాధీనపరచుకున్న తర్వాత నేనెవడను అను ప్రశ్నకు సమాధానము దొరకును. అట్లు జ్ఞాని కాక మునుపే , మనస్సు నిలపక మునుపే నేనెవడను అను ప్రశ్నకు సమాధానము దొరికినదనిన అద్దము ముందు కనుపించు వస్తువు చేతికి దొరికినది అన్నట్లుండును. దేశములో నేనెవడను అని అనుకున్నంత మాత్రముననే ఆత్మ దర్శనము అయినది అంటున్నారు. ఇటువంటివారు దేశములో ఉన్నారు.కావుననే గీతాశాస్త్రమందు దైవాసుర సంపద్విభాగమున పరమాత్మ "ఏ నరుడు శాస్త్ర విధులు విడచి ఇచ్ఛ వచ్చినట్లు సంచరించునో వాడు సిద్ధి పొందడు. సుఖముల వడయ లేడు. పరమ పదము చూడలేడు" అని అన్నాడు. దానికి అర్జునుడు " ఎవరైతే శాస్త్రీయ పద్ధతులనెల్ల విడచి శ్రద్ధ వహించి యజ్ఞములు చేయుచుందురో వారి నిష్ట త్రిగుణముల యందు సత్వమా , రాజసమా, తామసమా" అని అడుగగా దానికి పరమాత్మ ఈ విధముగా 'కామ రాగములతో దంభ గర్వములతో కూడుకొన్నవారై దారుణములను , శాస్త్రోపచారకములును అయిన తపములు చేయునట్టి వారు మూఢులయి తమలో భూతములకే కాక వాని లోపలి నాకును హాని సలిపి నృక్కజేతురు.అటువంటివారు రాక్షసులుగా ఉన్నవారని యెరుంగము" అని అర్జునుతో అన్నాడు. దీనిని బట్టి పరమాత్మను పొందవలెనని ఆజ్ఞానులు అశాస్త్రీయ పద్ధతులతో పూజలు చేయుచు తమకు తెలియకనే పరమాత్మకు దూరమగుచున్నారు అని తెలియుచున్నది. అందువలననే గీతాశాస్త్రమందు పరమాత్మ "నేను జ్ఞానికి దాపు అజ్ఞానికి దవ్వు " అని అన్నాడు. కావున జ్ఞాని కాక మునుపే నేనెవడను అని అనుకున్నంత మాత్రమున ఆత్మ తెలిసినదంటే ఆజ్ఞానులు నమ్మవచ్చుకానీ జ్ఞానులు ఏ మాత్రము నమ్మరు. జ్ఞాని అంటే ఎవరు అని కొంత మంది అడగవచ్చును. దానికి సమాధానము ఎవడైతే ఆత్మ విషయమును పూర్తి తెలుసుకొన్నాడో వాడే జ్ఞాని. జ్ఞానము అనగా తెలిసినది అనియు అజ్ఞానము ఆనగా తెలియనిది అనియు పెద్దలు చెప్పుచుందురు. గురువు నుండి ఆత్మ విషయములను పూర్తిగా తెలుసుకోవడమే జ్ఞానము అందురు. ఎవరికైనా ఆత్మ విషయములు ఏ కొద్దిగా తెలియకున్న కొద్దిగా అజ్ఞానము ఉందనే అనుకోవలయును. కావున ఆత్మ విషయములు మొదట సంపూర్ణముగా తెలుసుకొని ఆ తర్వాత యోగసాధన చేయవలయును. అట్లు కాక జ్ఞానము లేకనే యోగసాధన చేసిన బియ్యము లేకనే అన్నము లభించునన్నట్లు ఉండును.

అందువలననే గీతాశాస్త్రమున పరమాత్మ “నన్ను కొల్చు మానవులు నాల్గు రకములుగా ఉన్నారు. ఆర్తుడు , జిజ్ఞాసుడు , వర్థకామి ,జ్ఞాని అని వారి నామములు. వారందరూ నన్నే కొల్చువారైనా అందు జ్ఞాని నాకు శ్రేష్ఠుడు “అని అన్నాడు. పరమాత్మయే ఆ మాట చెప్పియుండగా ప్రపంచములో మాకు బోధతో పని లేదు అని ఒకటేమారు సాధనకు పూనుకొన్న ఆత్మదర్శనము ఎలా సాధ్యమగును? ఆత్మవిషయ బోధలేనిది ఆత్మను చేరుట అతి దుర్లభము. అందువలన ప్రతి ఒక్కరు మొదట బోధ విని జ్ఞానులయి యోగసాధనకు పూనిన ఆత్మదర్శనమగుటకు ఆస్కారము ఉన్నది. అట్లు కానియెడల ఏమి ప్రయోజనము ఉండదు. మోక్షసౌధమును అధిష్ఠించుటకు యోగము అను మెట్టు కంటే ముందు జ్ఞానము అను మెటిక ఉన్నదని తెలుసుకోవలెయును.

ఆత్మవిషయములందు మనస్సు ముఖ్యమైనది. కావున మనస్సును గురించి తెలుసుకొనుట జ్ఞానమునందు ముఖ్యమైన ఘట్టము. మనస్సును విశదీకరించిన మనలో ఉన్న సంకల్పములే మనస్సు అని చెప్పవచ్చును. మన యందు ఒక దాని తర్వాత ఒకటి ఒక నిమిషమైనను ఎడతెరపి లేకుండ ఆలోచనలు [సంకల్పములు] వచ్చుచుండును. మనస్సు అనేక విషయములను అనుక్షణము జీవుని అంతరదృష్టి యందు తెచ్చి పెడుతూ ఉండును. ఈ విధముగా జీవుని అంతరదృష్టి యందు విషయములను మనస్సు ఉంచుచూ ఉంటే జీవుడు ఆ విషయములందు లయమై తన్నుతాను మరచి ఉండును. ఉదయము లేచినది మొదలు నిద్రించు వరకు స్వప్నము నందును మనస్సు పని చేయుచునే ఉన్నది. కావున జాగ్రత్త యందును స్వప్నమునందును జీవుని దృష్టి విషయముల మీద ఉండును. కాని తన మీద తనకు ఉండదు. మనస్సు అనేక విషయములను సంకల్పముల ద్వారా తెచ్చి, జీవుని దృష్టి యందు పెట్టి జీవున్ని తన్నుతాను మరచునట్లు చేయుచున్నది. కావున జీవునికి మనస్సు శత్రువుగా ఉన్నదని పరమాత్మ గీతయందు అన్నాడు. మనస్సు సంకల్పముల ద్వారా విషయములను జీవుని దృష్టియందు పెట్టక ఊరక ఎప్పుడైతే నిలచి ఉండునో, అపుడు జీవుని దృష్టియందు ఏ విషయము లేక యుండుటవలన తన మీద తనకు ఎరుక కల్గి ఉండును. కావున నిలిచిన మనస్సు జీవునికి మిత్రుడని పరమాత్మ అన్నాడు. మనస్సు యొక్క స్వభావము ఎల్లప్పుడు అనేక విషయములను జీవుని దృష్టియందుంచడమే. కావున పని చేయు మనస్సు

జీవునికి దేవునికి మధ్య గోడ మాదిరి ఉండును. మొదట మధ్య ఉన్న గోడను తొలగించిన అవతలనున్నది కనుపించునట్లు చలించెడు మనస్సును చలించక చేసిన జీవాత్మకు పరమాత్మ తెలియును. మనస్సు నిలిచిన జీవుని దృష్టి యందు తనకు తానే కనిపించును.అపుడు నేనెవడు? అన్న ప్రశ్నకు సమాధానము లభించును. గీతయందు పరమాత్మ " భూమి మీద సంకల్ప జనితంబులయిన ఆశలెల్ల నిశ్శేషముగ వీడి మనస్సుచే ఇంద్రియముల సమస్త విషయముల వర్జితముగ నొనరింపవలయును.మరియు బుద్ధిచే మెలకువ గ్రహించి మెల్ల మెల్లగా ఇంద్రియ సంబంధముల నుండి వేరు విషయ చింతనముల నుండి మనస్సును వదలగొట్టి ఆత్మయందునే నిలుపవలయును. అట్లు ప్రయత్నము చేసి నిలిపినను అధిక చంచలము , అస్థిరము అయిన మనస్సు విషయములపైకే ప్రాకును.అట్లు ప్రాకినను దానిని ఆ విషయముల నుండి మరల్చి తిరిగి ఆత్మ యందే ఉండునట్లు చేయవలయును అని అన్నాడు.

వృక్షమునకు వేర్లు ఆధారమయినట్లు మనస్సుకు విషయములు ఆధారమయి ఉన్నవి. వృక్షము యొక్క వేర్లను నరికిన వృక్షము పడిపోయినట్లు మనస్సుకు ఆధారమైయున్న విషయములను లేకుండ చేసిన మనస్సు చలనము లేక నిలిచిపోవును. కావున యోగిగా కావాలనుకొన్నవాడు మనస్సును గురించి తెలుసుకొని , తర్వాత మనస్సును నిలబెట్టుకోవడానికి ప్రయత్నించును. మొదట సాధకుడు ప్రయత్నము చేయు సమయమున అధిక చంచలము అస్థిరము స్వభావమయియున్న మనస్సు వేరు విషయముల మీదికి చలించి ఆ విషయములను సాధకుని ముందర ఉంచును. సాధకుడు ఆ విషయములయందు చిక్కుకొని కొంతసేపుకు బుద్ధివలన, నేను యోగమందు కాక విషయములయందున్నాను అని గ్రహించి ఆ విషయముల నుండి బయల్పడి మనస్సును నిలిపి యోగమందు ఉండుటకు ప్రయత్నము చేయును. అట్లు సాధకుడు ప్రయత్నము చేయగానే మనస్సు జీవునికి తెలియకనే వేరే విషయమును జీవుని ముందర ఉంచియే ఉండును. జీవుడు ఆ విషయమందే ఉండును ఇట్లు జీవుడు యుండి తిరిగి తాను ఎక్కడున్నది గ్రహించుకొని ఆ విషయముల నుండి బయటపడి మనస్సును నిలుపుటకు ప్రయత్నము చేయుచుండును ఇట్లు సాధకుడు ప్రయత్నము చేయుకొలది మనస్సు చలించుచునే ఉండును. మనస్సును అసాధ్యమైనదని సాధకునకు అనిపించును. అట్లు అనిపించినను అధైర్యపడక కొంతకాలము సాధన

చేయుచుండిన మనస్సు తనకు స్వాధీనపడుటకు మొదలిడును. కావున గీతా యందు అర్జునుడు “అధిక చంచలము , అస్థిరము , అతిదృఢము,బలమునైన మనస్సును నిగ్రహింప గల్గుట దుష్కరంబని దోచుచున్నది కృష్ణా , మనస్సును నిలుపుతాను అన్నది గాలిని మూటగట్టినట్లు ఉన్నది “ అని అనగా అందుకు పరమాత్మ సమాధానముగా “ నీ మాట నిజమే అర్జునా మనస్సు అధిక చంచలమైనదే , దానిని ఒక్కమారు ఎవరు నిలుపలేరు. కాని అభ్యాస వైరాగ్యముల చేత దానిని నిలుపవచ్చును మనస్సు నిలుపలేని వానికి యోగమందు ఉండుట కష్టము “ అని అన్నాడు. మనస్సు యోగసాధకులకు ఒకమారు ప్రయత్నము చేసిన నిలువదు. మనస్సును నిలుపుటకు ఎంతో సాధన అవసరము. సాధన ద్వారా మనస్సు నిలచిన తరువాత జీవునకు ఆత్మ దర్శనము అగును. ఈ విధముగా కాక కొంతమంది ఆత్మను సులభముగా తెలుసుకోవచ్చును నేనెవడని చూచుకొన్న చాలు బోధ అవసరము లేదు అని అంటున్నారు. అటువంటి వారికి లోపల ఉన్న అంధకారము కనిపించును కాని ఆత్మ కనిపించదు.డాంబికమునకు అట్లు చెప్పు వారి మనస్సు తో వారికి ఎంతో కష్టము ఉండును. వారి మనస్సు అనేక విషయములందు సంచరించుచు మానసిక కర్మను అభివృద్ధి చేయుచునే ఉండును. ఆత్మ సమానముగా అన్నీ జీవరాశులయందు యట్లునది వారికి తెలియదు.

మనస్సును జయించవలయునన్న మనస్సు శరీరములోనే కదా ఉన్నది. కావున శరీరమును గురించి కూడ తప్పక తెలుసుకోవలసివుండును. శరీరము కర్మేంద్రియముల, జ్ఞానేంద్రియములద్వారా బయటి సంబంధము కలిగివున్నది. బయటి సంబంధములయిన కర్మ, జ్ఞానేంద్రియముల ఆధారముతోనే మనస్సు చలించుచుండును. యింద్రియములద్వారా లేనిది మనస్సు చలించుటకు ఏ విధ మార్గము లేదు. అదెట్లనగా కంటి ద్వారా ఒక దృశ్యమును చూచినకదా, ఆ విషయమును అప్పుడు గాని, ఇతర సమయములయందు కాని, మనస్సు జీవుని ముందర ఉంచును. కంటిద్వారా దృశ్యమును చూడనిదే, ఆ విషయమును అప్పుడుగాని, ఇతర సమయమందు కాని, జీవుని దృష్టికి మనస్సు తేలేదు మరియు చర్మముద్వారా స్పర్శ తగిలినగదా, ఇతర సమయములయందు మనసు తిరిగి దానిని జీవుని దృష్టికి తెచ్చి పెట్టును. నాలుక ద్వారా రుచి చూచియుండినకదా, మనస్సు ఆ రుచిని జీవునిలో దృష్టికి తిరిగి తెచ్చును. ఒక శబ్దము చెవులద్వారా వినియున్న కదా, ఆ శబ్దమునందలి

భావనను తిరిగి జీవుని ముందరకు మనస్సు తెచ్చును. ఒక వాసనను ముక్కులద్వారా చూచియుండినకదా, మనస్సు తిరిగి ఆ విషయమును జీవునికి జ్ఞప్తికి వచ్చునట్లు చేయును. కావున ఇంద్రియములకు మనస్సుకు గట్టి సంబంధముయున్నదని చెప్పవచ్చును. ఈ సంబంధములనుండి మనస్సును విడగొట్టిన వాడు యింద్రియాతీతుడగును, అనగా మనస్సును జయించినవాడగును. ఇక్కడ కొంతమందికి యింద్రియములును పనిచేయకుండా యుంచవలయునా? అట్లు యుంచిన బ్రతుకు తెరువు పనులు ఎట్లు జరుగును? అను అనుమానము రావచ్చును, దానికి సమాధానము ఏమనగా! పనులను విడిచిపెట్టి యింద్రియములను నిలుపమని ఏ మాత్రము చెప్పడము లేదు. చేయదగిన పనులను సాధారణముగా చేయుచు మనస్సును మాత్రము యింద్రియములందు లేకుండ చేసుకోవలెను ఇక్కడ పని చేయుచు మనస్సును యింద్రియములనుంచి ఎట్లు మళ్ళించినగును? అను సంశయము కొందరికి కలుగవచ్చును. దానికి సమాధా నము ఒకడు సైకిలు మీద బజారుకు పోయినాడనుకొనుము అతడు బజారునందు ఒక అద్దములతో కూడిన పెట్టెను కొన్నాడు. ఆ పెట్టెను సైకిలుమీద పెట్టుకొని ఇంటికి తెస్తూ ఉన్నాడు. అపుడు వాని మనస్సు అంతయు ఆ అద్దము పెట్టెపైనే ఉన్నది. ఆ అద్దము పెట్టె క్రింద పడిపోతుందేమోనని, అది పగిలిపోతుందేమోనని వాని నిఘా అంతయు దానిమీదనే యుంచి భద్రముగా తెచ్చెను. వచ్చుచున్న పుడు బజారులో ఎంతో మందిని బస్సులను, రిక్షాలను కంటిద్వారా చూచినాడు.వాటి నుండి నిదానముగా తప్పించుకొని వచ్చాడు. వచ్చినపుడు వాని అవయవములయిన కాళ్ళు, చేతులు, కండ్లు పని చేసినాయి. కానీ వాని మనస్సు ఆ అవయవముల మీద లేక అద్దము పెట్టెపై యుండుట వలన అద్దము పెట్టె ఏ ప్రక్కకు వరిగినది ఎన్నిమార్లు అదిరినది చెప్పగలడు. బజారులో వచ్చునపుడు నేత్రములు ఎవరిని చూచినది కాళ్ళు చేతులు నొప్పులు వచ్చినది, ఇవి అన్నియు తిరిగి చెప్పలేడు. కారణము మనస్సు ఇంద్రియముల మీదలేదు. పొలములో నీరు పారపెట్టువానికి మనస్సు ఆ పనిమీదనే యుండి ఇంద్రియముమీద లేకపోవుటచే వాని కాలిమీద తేలు కొంతవరకు ఎక్కినను గ్రహించలేకపోవుచున్నాడు. మరియు మనస్సును ఒక పని యందు కేంద్రీకరించి పనిచేయువానికి ఒక చిన్న దెబ్బతగిలి దానినుండి కొద్దిగా రక్తము వచ్చినప్పటికి వానికి తెలియకుండును. తర్వాత ఆ గాయమును చూచుకొని ఎప్పుడు తగిలినది అని ఆలోచించును.

మనస్సు పనిమీదయుండి ఇంద్రియములమీద లేదు కావున ఆ పనిలో ఇంద్రియములకు తగిలిన దెబ్బ గ్రహించలేక పోయినాడు. ఈ విధముగా ఇంద్రియములనువీడి మనస్సు ఉండగలదు. కావున చేయుపనిని ఇంద్రియములకు అప్పచెప్పి మనస్సును ఆ పనిమీదనే లేకుండ ఊరకవుండునట్లు [ఆత్మయందు ఐక్యమగునట్లు] చేయవచ్చును. ఏ పనిని చేయుచున్నను పరమాత్మయందు మనస్సును పెట్టి ఇంద్రియములద్వారా చేయవచ్చును. పని చేయుచున్నది ఇంద్రియములేకాని మనస్సు కాదుకదా! ఆ సమయములో మనస్సును ఊరకవుండునట్లుచేసి ఇంద్రియములతో పని చేయించవచ్చుకదా! ఒకడు దారిన నడుస్తున్నప్పుడు కాళ్ళు పని చేస్తున్నవి, మనస్సు అనేకమయిన ఆలోచనలు చేస్తూ ఉంటుంది. మనస్సును అట్లు ఆలోచనలయందు పోకుండచేసిన ఊరక ఆత్మయందే యుండును కదా! ఇంటిలో పొయ్యిని ఊదునప్పుడు నోరు, చేతులు పని చేయును, మనస్సు అనవసరమయిన విషయముల మీదనే ఉండును. అట్లు మనస్సును అనవసరమయిన విషయములమీదికి పోకుండ చేసిన బాగుండునుకదా! ఈ విధముగా మనముచేయు పనులయందు అవయములను నియమించి మనస్సును తప్పించవచ్చును. అట్లు చేసిన, చేసిన పని మంచిదయినా చెడుదయినా అందు కలుగు పాప పుణ్యములు ఏ మాత్రము ఆ జీవుని అంటవు. మనలో జరుగు సంకల్పములే మనస్సని తెలుసుకొని ఆ సంకల్పములమాట జీవుడు వినకున్న మనస్సుకు బలము తగ్గును. బలము తగ్గగా కొద్ది కాలమునకు వశమగును. కావున ప్రతి ఒక్కరు మనస్సును తెలుసుకొని దానిని జయించిన మోక్షము పొందుటకు అర్హులగుదురు. అట్లు కాకున్న చస్తూ పుట్టుచూ అనేక అగచాట్లు పడుచు ఎల్లప్పుడు కాల, కర్మ చక్రములలో ఇరుక్కొని యుండవలసినదే. కావున ఇప్పటికయిన జాగ్రత్తపడి మనస్సును నిరోధించి నిలుపుటకు ప్రయత్నించండి.

మూడు గుణములు

పరమాత్మ మూడు గుణములను గురించి గీతాశాస్త్రమున తెల్పుచు మొదట ఇట్లన్నాడు.

14 శ్లో॥ 1 పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।
యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధి మితో గతాః ॥

14 శ్లో ॥ 2 ఇదం జ్ఞాన ముపాశ్రిత్య మమసాధర్మ్య మాగతాః ।
సర్గే పి నోపజాయన్తే ప్రళయే నవ్యథన్తిచ ॥

అర్జునా! పరమమైనది, జ్ఞానములలోన ఉత్తమ జ్ఞానమైనదానిని ఇపుడు తెలుపుచున్నాను. మునీశ్వరులందరు దీనిని తెలుసుకున్న తర్వాతనే మోక్షమును పొందినారు. ఈ జ్ఞానమును ఎవరు ఆశ్రయించి తెలుసు కొందురో అట్టివారు నన్ను పొందగలిగి సృష్టిలో పుట్టబోరు, మరియు ప్రళయములో మరణించబోరు." ఈ విధముగా కృష్ణపరమాత్మయే తెలిపినాడు. కావున మూడు గుణములను తెలుసుకొనుటవలన ఎంత లాభము ఉన్నదో మీరే ఆలోచించండి. మునీశ్వరులు కూడ దీనిని తెలియనిదే మోక్షమును పొందలేరు అని పరమాత్మ స్వయముగ తెలియజేసియుంటే మనము త్రిగుణ జ్ఞానమును ఎంత జాగ్రత్తగా తెలుసుకోవలయునో ఆలోచించండి. జ్ఞానములలో కెల్ల ఉత్తమ జ్ఞానమని పరమాత్మయే తెలియజేసి ఈ జ్ఞానమును పొందుటవలన నన్ను చేరి తిరిగి పుట్టరు చావరు అన్నాడు. కావున మనము మిక్కిలి శ్రద్ధగలిగి మూడు గుణములను గురించి తెలుసుకొందాము.

ప్రపంచములో ప్రతి జీవుడు ఒక శరీరమును ధరించి ఉన్నాడు. ప్రతి శరీరమునందుయున్న జీవుడు కొన్ని గుణములు కల్గి ఉన్నాడు. అ గుణములచేతనే తాను శరీరముద్వారా అనేక కార్యముల చేయుచున్నాడు. కావుననే ప్రపంచములోని ప్రతి పని గుణముల ప్రేరేపితమువలన జీవుల ద్వారా జరుగుచున్నదని చెప్పవచ్చును. కార్యరూపమైయున్న ప్రపంచమునకు గుణములే కారణములు. జీవుడు గుణములచేత చిక్కి ఆ గుణముల స్వభావానుసారము ప్రవర్తించుచున్నాడు. గుణములే జీవుని మంచి పని యందును లేక చెడ్డ పనియందును ప్రవర్తింపజేసి దానిద్వారా పాప పుణ్యములు వచ్చునట్లు చేయుచున్నవి. కర్మకు గుణములే కారణమవుతున్నవి. గుణములు జీవుని పనులయందు ప్రవర్తింపజేయక పోయిన కర్మ రాదుకదా! గుణములే అనేక విధ కార్యములను జీవునిచేత చేయించి అనేక విధ కర్మలను సంపాదించి పెట్టుచున్నవి. కర్మ జీవునికి జన్మలు వచ్చునట్లు చేయుచున్నది. గుణముల వలన కర్మ, కర్మ వలన జన్మ సంభవించుచున్నది. కావున జీవుని జన్మలకు మూలము గుణములే అని చెప్పవచ్చును. గుణములు లేకున్న జన్మలే ఉండవు. అందువలన ముఖ్యముగా గుణములను గురించి తెలుసుకొని వాటిలో చిక్కుకొనక జీవుడు తప్పించుకొనిన కర్మ రాదు. కర్మ లేకున్న జీవునికి జన్మ రాదు. జన్మలేని దానివలన జీవుడు ఆత్మయందు ఐక్యము చెంది మోక్షమును పొందినవాడగుచున్నాడు. జీవునికి దేవునికి మధ్యన గుణములు పెద్ద గోడవలె నిలచి జీవుని పరమాత్మ యందు కలియకుండునట్లు చేయుచున్నవి. మధ్యన గోడలై నిలచిన గుణములను పడగొట్టి, వానిని దాటి పోయిన పరమాత్మ యందు చేరవచ్చును. కావున గుణములను గురించి తెలుసుకొందాము.

ప్రకృతికి సంబంధించిన విషయములనే గుణములు కలుగజేయుచున్నవి. ప్రకృతికి మినహా ఏ గుణములు లేవు. కావున గుణములను ప్రకృతి జన్యములని చెప్పవచ్చును. ప్రకృతి జనిత గుణముల వలన జరుగు పనులకు గుణములసంగతి తెలియనివాడు నేనే కర్తనని అనుకోనుచున్నాడు. వానికి ప్రతి పని గుణముల వలననే జరుగుచున్నదని తెలియని దానివలన కార్యములకు తానే కర్తననుకొని పొరపడుచున్నాడు. అందువలన గీతాశాస్త్రములో పరమాత్మ శ్రీకృష్ణుని శరీరములోనుంచి ఇట్లన్నాడు.

3 : శ్లో॥ 27 ప్రకృతేః క్రియమాణాని గుణైః కర్మాణి సర్వశః।
అహంకారవిమూఢాత్మ కర్తాహ మితి మన్యతే ॥

"ప్రకృతి జనితంబుల వలన వివిధ రూపములుగా జరిగెడు సర్వ కార్యములకు మూఢాత్ముడు అహంకారమగ్నుడై తానే కర్తననుకొనును."

పరమాత్మ చెప్పినట్లు అజ్ఞాని ప్రతిపనికి తానే కర్తననుకొని అందు సంభవించు పాప పుణ్యములు తనమీద వేసుకొనుచున్నాడు. జరిగెడు పనులకు నేను కర్తనుకాను. సర్వకార్యములను గుణములే చేయించుచున్నవి. గుణముల వలన జరిగెడు పనులవలననే పాప పుణ్యములు సంభవించుచున్నవి అని ఎవడయితే తెలుసుకొనునో వాడు ఆత్మను తెలుసుకొనును. మరియు గుణముల ప్రభావముల నెరింగినవాడై వాటిని సులభముగా జయించును. కావున పరమాత్మ గీతయందు ఇట్లన్నాడు;

3 శ్లో॥ 28 తత్త్వ విత్తు మహాబాహో గుణకర్మ విభాగయోః ।
గుణాఽగుణేషు వర్తన్త ఇతి మత్వాన సజ్జతే॥

"కర్మముల, గుణముల యొక్క విభాగములను తెలుసుకొన్న తత్త్వవేత్త త్రిగుణ కార్యముల వలననే పాప పుణ్యములు సంభవించుచున్నవని తెలుసుకొని వర్తించును."

కావున ప్రతి మానవుడు గుణములను తెలుసుకొని ప్రవర్తించుటకు ప్రయత్నించవలయును. అట్లుకాకున్న గుణములు మనమీద వాటి ప్రభావమును చూపుచు కర్మతంత్రులనుజేసి జన్మలందు చిక్కుకొనునట్లు చేయుచున్నవి. మనదృష్టి గుణముల మీదికి ఒక్కమారు మరలించి మనలను అనేక పనులు చేయించుచున్న గుణములు ఎటువంటివో తెలుసుకో వలయును. గుణములను వాటి స్వభావములను తెలుసుకొనినవాడు వాటిని సులభముగా జయించగలడు. గుణములు ఏవి? అని ఆలోచించిన ఆత్మ మినహా అంతయు

గుణములే కావున వేదములు కూడ గుణములకు సంబంధించినవియే. వేదముల అంత్యమునకు అనగా వేదముల దాటిపోయిన గుణములు దాటిపోయినట్లే. ఎవడయితే వేదాంతుడో అనగా వేదముల అతిక్రమించియున్నాడో వాడే గుణముల జయించినవాడు. ఎవడయితే వేదాంతుడు కాలేడో వాడు గుణములను దాటలేదని తెలియుచున్నది. కావుననే భగవద్గీతయందు పరమాత్మ ఇట్లన్నాడు.

శ్లో॥ 45 త్రైగుణ్యవిషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున ।
నిర్ద్వన్ద్వో నిత్య సత్వ స్థో నిర్యోగక్షేమ ఆత్మవాన్ ॥

"వేదములనగా త్రైగుణ్య విషములు ఆ మూటిని వర్జింప వలయును. పార్థ. ప్రేమ, ద్వేషము అనువాటిని విడచి ఎల్లప్పుడు సత్వమును [గుణములను మించిన స్థితిని] పొంది ఉండవలయును."

భగవంతుని మాట వలన గుణములు మూడు విధములు అని తెలియుచున్నది. మూడు గుణములు విషయములతో నిండుకొనినవే. వేదముల నెరింగి అనగా మూడు గుణముల నెరింగి గుణాతీతుడవు [వేదాంతుడవు] కమ్ము. తెలిసినవాడు వేదములనుండి ఏ విషయములు తనకు కావలయునో ఆ విషయములనే గ్రహించుకొనును. అట్లు అవసరమయిన విషయములను తెలుసుకొని వేదముల సారము నెరింగినవాడై వేదాతీతుడగును. ప్రతిమానవుడు మూడుగుణములచే కూడుకొని ఉన్నాడు. ఆ గుణములోనే ఉన్నాడు. కనుక తనకు అవసరమయిన గుణములను ఉపయోగించుకొని దానిద్వారా బయట పడవచ్చును. కావున పరమాత్మ గీతయందు

2 శ్లో॥ 46 యావానర్థ ఉదాపానే సర్వత స్సంప్లు తోదకే ।
తావాన్ సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః ॥


"జలసమృద్ధమై యుండు బావి నుండి తనకు కావలసిన నీరును మాత్రము ఉపయోగపరుచు కొన్నట్లు బ్రహ్మజ్ఞానము తెలిసిన వాడు సర్వవేదములనుండి తనకు కావలసిన విషయములనే తీసుకొనును" అని అన్నాడు. మరియు ముందుగానే వేదములు మూడుగుణములతో నిండు కొనినవని చెప్పియున్నాడు. కావున వేదములనన్నిటిని మానవుడు ఉపయోగించుకోవలయునంటే మూడు గుణములయందు మునిగి తేలవలసినదే. అట్లుకాక వేదములయందు ఆత్మను కనుగొనచేయుటకు అవసరమయిన వాటిని మాత్రము స్వీకరించి, వాటిని పరిశీలించి వాటి సారము తెలుసుకొని, వాటిని కూడ అతిక్రమించి పోవడము సరి అయిన పద్ధతి. వేదవిషయ అంత్యములకు ఎవడు పోవునో వాడే వేదాంతుడు. ఇక్కడ కొందరికి వేదములను పరమాత్మయే తనను తెలుసుకొను నిమిత్తము సృష్టించాడు కదా! వేదములనగా పవిత్రమయినవి కదా, వాటినే వర్జింపమని గీతయందు పరమాత్మ ఎందుకు చెప్పినాడు? అను సందేహము బయలుదేరవచ్చును. దానికి సమాధానము తిరుపతి వెంటకటేశ్వరస్వామిని చూచుటకు పర్వతముల ఎక్కిపోయి చూడవలసినదేకదా, పర్వతముల పైనకదా స్వామి ఉన్నది. వేంకటేశ్వరస్వామిని చూచుటకు ప్రతిఒక్కరు ముందు పర్వతముల దగ్గరకుపోవలసినదే. పర్వతములదగ్గరకు పోయి ఇష్టము వచ్చినట్లు పర్వతములు ఎక్కుటకు ప్రారంభించిన, ఒకమారు తూర్పుకు ఒకమారు పడమరకు ఒకమారు దక్షిణమునకు ఒకమారు ఉత్తరమునకు పోవుచు పర్వతముల మీదనే దారి తెలియక అనేక అగచాట్లు పడుచు పోవలసినపని ఉండును. ధ్యేయము స్వామివద్దకు పోవలయునని యుండిన, ఎక్కెడి పర్వతములు స్వామివే అయిన, అందు దారి లభించక బాధ పడవలసివుండును. ధ్యేయము స్వామిని చూడవలయునని ఉండినా పర్వతముల వెంబడి చూపుపారినట్లు అన్నివైపులా పోయిన, ఏడు కొండలు దాటలేదు, వేంకటేశ్వరుని చూడలేదు. సరి అయిన తెలివియున్నవాడు ఏడు కొండలు స్వామివే అయిన, పర్వతముల వెంబడి చూపుపారినట్లంతయు పోక, పర్వతములయందే యుండు సరి అయిన మార్గమును తెలుసుకొని వాని వెంబడి ప్రయాణించి కొండలు దాటి వేంకటేశ్వరుని చేరుకొనును. కొండలయందు దారులు ఎన్నియున్న అందు తెలిసినవాడు తనకు అనుకూలమయిన దారిని, తొందరగా వేంకటేశ్వరుని దగ్గరకు చేర్చుదారిని ఎన్నుకొని దాని వెంబడి ప్రయాణించి తొందరగా గమ్యము చేరును. అట్లే వేదములనుకూడ పర్వతములనుకొనుము. వేదముల

అంత్యములో ఉన్న పరమాత్మే పర్వతములపైనవున్న వెంకటేశ్వరుడను కొనుము. పర్వతముల వెంబడి చూపుకందినట్లు పోయిన దారి లభించనట్లే వేదముల ప్రతి విషయముపై మానవుని బుద్ధి పారిన ఏనాటికి ఆత్మను చేరుకోలేడు. పర్వతములందేయుండు సరి అయిన మార్గము వెంబడి పోయిన పర్వతములదాటి వేంకటేశ్వరుని చేరుకున్నట్లు వేదములందే ముఖ్యమయిన మరియు సరి అయిన విషయములను మాత్రమే పరికించి చూచిన వాని ద్వారా వేదములను దాటి ఆత్మను చేరుకోవచ్చును. ఏడు శిఖరములపైన వేంకటేశ్వరుడు ఉన్నాడు, అట్లే వేదములపైన పరమాత్మ ఉన్నాడు. వేంకటేశ్వరుని చూచుటకు ఏడు శిఖరములును ఎక్కవలసినదే. అట్లే ఆత్మను తెలుసుకొనుటకు వేదముల దాటవలసినదే. వేంకటేశ్వరుని చూచుటకు ముందు పర్వతములను ఆశ్రయించవలసినదే. వాని నుండి పోయి వేంకటేశ్వరుని దర్శించవలసినదే. అట్లే ఆత్మను తెలుసుకొనుటకు ముందు వేదములను ఆశ్రయించవలసినదే. వాటి నుండి పోయి ఆత్మను చేరవలసినదే. పర్వతముల దగ్గరకు పోనిదే, పర్వతములను ఎక్కనిదే, వేంకటేశ్వరుని చూడలేరు. అట్లే వేదములను తెలుసుకోనిదే, వాటిని ఆశ్రయించనిదే ఆత్మను చూడలేరు. వేంకటేశ్వరుని విలువ తెలిసినవాడు పర్వతములను పెద్దగా ఎంచుకొనక, పర్వతముల మీదయున్న వేంకటేశ్వరుని పెద్దగా ఎంచుకొనును. పర్వతములకంటే వెంకటేశ్వరునియందే శక్తి ఉన్నది అని తెలుసుకొనును. వేంకటేశ్వరుని ద్వారా పర్వతములకు విలువ ఉన్నది అని తెలుసుకొనును. అట్లే జ్ఞాని వేదములను పెద్దగా ఎంచుకొనక వేదముల అంత్యమునయున్న ఆత్మను పెద్దగా ఎంచుకొనును. వేదముల కంటే ఆత్మయే శక్తి కలదిగా తెలుసుకొనును. ఆత్మవలననే వేదములకు విలువ యున్నదని తెలుసుకొనును. కావున ప్రతి మానవుడు ముందు వేదములను తెలుసుకోవలయును. అందు తనకు కావలసిన విషయములనే తీసుకోవలయును. దానిద్వారానే ఆత్మను చేరవలయును. ఈ విషయమునే గీతయందు పరమాత్మ చెప్పియున్నాడు. పరమాత్మ చెప్పిన మాటను వేరే రకముగా భావించుకొని వేదములే పనికి రావు అని అనుకొన్న చాలా పొరపాటుపడిన వారమగుదుము. కావున భగవంతుడు చెప్పిన మాటను బాగుగా గ్రహించుకొని మొదట వేదముల యందు తనకు కావలసిన విషయములను తెలుసుకొని తర్వాత ఆత్మను చేరుకోవలయును. వేదములే త్రిగుణములు వాటిపై యున్నవాడే పరమాత్మ. దానినే ప్రపంచములో ప్రతి మానవుని స్థూల

దృష్టికి కనుపించునట్లు బాహ్యార్థముగా పరమాత్మయే వెంకటేశ్వరులుగా మారి వేదములనే పర్వతములుగచేసి నేడు తిరుపతియందు ప్రత్యక్షముగా కనుపించుచున్నాడు.

ప్రతి మానవుడు మూడు గుణములతో కూడుకొని ఉన్నాడు. ఇక్కడ కొందరు మానవునికి లెక్కలేనన్ని ఎన్నో గుణములు ఉన్నవే, మూడు అని చెప్పుచున్నారు అని అడుగవచ్చును. దానికి సమాధానము మానవునికి ఎన్నో గుణములున్న మాట నిజమే, కాని ఆ గుణములన్ని మూడు జాతులకు సంబంధించినవి. గుణములు అనేకమయిన, గుణముల జాతులు మూడు అయిన దానివలన మూడు గుణములు అని చెప్పబడుచున్నవి. ఒక కులములో ఎందరు యుండినా ఫలానా కులమువారు అని కులము పేరు చెప్పినట్లు ఒక జాతిలోని గుణములు ఎన్ని యున్నా ఆ జాతి పేరే చెప్పబడుచున్నది. గుణముల జాతుల పేర్లు ఏవి అనగా వరుసగా 1] సాత్త్వికము [2] రాజసము [3] తామసము. సాత్త్విక జాతిలో ఎన్ని గుణములు ఉండినా, అవి సాత్త్వికగుణము అని ఏకవచనముగా చెప్పబడుచున్నది. రాజసములో ఎన్ని గుణములు ఉండినా అవి రాజసగుణము అని చెప్పబడుచున్నది. అట్లే తామసములో ఎన్ని గుణములు ఉండినా అవి తామసగుణము అని చెప్పబడుచున్నది. మూడు గుణములు మానవుని శరీరమునందే యుండి ఆ శరీరమును అనేక రకములుగా చలించునట్లు అనగా పనులు చేయునట్లు ప్రేరేపించుచున్నవి. అవి శరీరమునందు ఎట్లు ఉన్నవి? ఎక్కడ ఉన్నవి? అను సంశయము చాలామందికి కలుగవచ్చును. దానికి నా సమాధానము మానవుని చలింపజేయు గుణములు మానవుని యందే ఉన్నవి. ఆ గుణములలో జీవుడు చిక్కుకొని ఆ గుణము ప్రేరేపించిన పనిని జీవుడు తన శరీరముద్వారా చేయుచున్నాడు. మానవుని శరీరమునందు ఉండు గుణములు కంటికి కనుపించునవి కావు ఈ గుణములు మానవుని జ్ఞానదృష్టికి కనుపించును. మూడుగుణములు వలయాకారముగా ఒకదానితర్వాత ఒకటి మానవుని కపాలమందు ఉన్నవి. మూడుగుణములు వలయాకార చక్రముగా కోట గోడలమాదిరి యుండి జీవుని ఆ గోడల మధ్యన బంధించి ఆ గోడలను దాటి ఆత్మను చేరకుండ చేయుచున్నవి. జీవుడు కపాలమునందు యున్న త్రిగుణ చక్రములో నివాసము చేయుచున్నాడు. త్రిగుణములయందు జీవుడు యున్నంతవరకు ఆత్మను

చూడలేదు త్రిగుణములను దాటినవాడు ఆత్మను చూడగలడు. కపాలములో త్రిగుణములు ఎట్లున్నది ప్రక్క పేజీలో 1 వ పటములో చూడవచ్చును.




1వ పటము

వలయాకారముగా ఏర్పడిన భాగములలో మొదటి పై భాగములో తామస జాతి గుణములు, రెండవ భాగములో రాజసజాతి గుణములు, మూడవభాగములో సాత్త్విక జాతి గుణములు నిండుకొని ఉన్నవి. మధ్యన యున్న భాగములో పరమాత్మ ఉన్నాడు. రాజసమునకు, తామసమునకు, సాత్త్వికమునకు ఆధారము ఆత్మయే. ఆత్మలేనిది మూడుగుణములు నిలువజాలవు. మూడు గుణములు ఆత్మయందే పుట్టి ఆత్మను ఇరుసుగా చేసుకొని తిరుగుచున్నవి కావుననే గీతయందు పరమాత్మ ఇట్లన్నాడు.

7 శ్లో॥ 12 యే చైవ సాత్త్వికా భావా రాజసా స్తామసాశ్చయే।
మత్త ఏవేతి తాన్విద్ధి న త్వహం తేషు తే మయి॥

"సాత్త్వికములైన, రాజసములైన, మరియు తామసములైన ప్రభవము [పుట్టుక] నా వలననే కలుగును. ఆ గుణములకు నేనే ఆధారమై ఉన్నాను. అవి నాయందే ఉన్నవి." పరమాత్మ మాట ప్రకారము గుణములు ఆయన యందే పుట్టి ఆయననే ఆధారము చేసుకొని ఉన్నవి. కాని ఆత్మ గుణముల మీద ఆధారపడి ఉండలేదు. గుణములే ఆత్మమీద ఆధారపడి ఉన్నవి.

ఆత్మ గుణములకే కాక గుణముల వలన కలుగు కర్మకు కాలముకు ఆధారమై వున్నాడు. శిరస్సులో అన్నిటికంటే బ్రహ్మచక్రము పైన వున్నది. దానిక్రింద కాలచక్రము దాని తర్వాత కర్మచక్రము, దానికంటే క్రింద త్రిగుణ చక్రములుండి పరిభ్రమించుచున్నవి. బ్రహ్మచక్రము చాలా మందగమనముగా ఉన్నది. అది ఆత్మను ఆధారము చేసుకొని ఒక చుట్టు తిరుగుటకు రెండువేల యుగములు పట్టుచున్నది. దానికంటే క్రింద ఉన్నది కాలచక్రము అది బ్రహ్మచక్రముకంటే విశేష వేగము కలిగి ఉన్నది. కాలచక్రములో పెద్దవాడయిన సూర్యుడు ఆత్మను ఆధారము చేసుకొని ఒక చుట్టు తిరుగుటకు ఒక సంవత్సరకాలము పట్టుచున్నది. దానికంటే క్రింద ఉన్నది కర్మచక్రము. కర్మచక్రముయొక్క వేగము కాలచక్రముకంటే ఎన్నో రెట్లు ఎక్కువ ఉండును. కర్మచక్రముయొక్క వేగము ఒక్కొక్క జీవునికి ఒక్కొక్క రకముగా ఉండును. కావున దాని వేగమును చెప్పుటకు శక్యముగాదు. కర్మచక్రము క్రింది భాగమున గుణ చక్రము వుండును. దీని వేగము అన్నిచక్రముల మించి వుండును. దీని వేగముకూడ అందరికి ఒకే మాదిరి యుండక వేరు వేరు విధములుగా వుండును. కపాలమునందు కంటికి కనపరాక ఒకదాని తర్వాత ఒకటి యుండు బ్రహ్మ, కాల, కర్మ, గుణచక్రములను ప్రక్క పేజీలో 2 వ పటములో చూడవచ్చును.



2వ పటము

త్రిగుణములలో జీవుడు చిక్కుకొని అందు గుణముల వలన కలుగు పనులను చేయుచున్నాడు. గుణములయందు చిక్కుకొని గుణముల అవతలయున్న ఆత్మను చూడలేక వున్నాడు. గుణములయందు భ్రమించి ఆత్మను మరచి వున్నాడు. కనుకనే భగవద్గీతయందు

7 శ్లో ॥ 13 త్రిభిర్గుణమయైర్భావై రేభి స్సర్వ మిదం జగత్॥
మోహితం నాభిజానాతి మామేభ్యః పరమవ్యయమ్॥

"ఈ జగంబంతయు సాత్వికము, రాజసము, తామసగుణమయమగుటచే నేను నాశనములేని వాడనని నా మహత్యము శ్రేష్ఠమైనదని తెలియక మానవులు మాయలో మునిగి వున్నారు" అని పరమాత్మ అన్నాడు.

మానవుడు మూడు గుణ చక్రములలోయుండి మూడు గుణముల ఆవరణములను దాటిపోయి పరమాత్మను చూడలేకవున్నాడు. ప్రకృతి సంబంధములగు గుణములలోనే మునిగి ఆత్మను తెలుసుకోలేక ఉన్నాడు. పరమాత్మలో పుట్టి పరమాత్మను ఇరుసుగా

చేసుకొని తిరుగుచున్న గుణములను దాటుటకు పరమాత్మను నమ్మినవానికే సాధ్యమగును. నమ్మనివానికి అసాధ్యమగును. దానికే గీతయందు పరమాత్మ

7 శ్లో॥ 4 దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా।
మామేవ యేప్రపద్యన్తే మాయా మేతాం తరన్తితే ॥

"దైవ నిర్మితమౌ నా మాయ దాటగల్గుటకు భూమిమీద చాలా కష్టము. కాని నన్ను శరణుజొచ్చిన నరులు దానిని శీఘ్రముగా దాటుదురు" అని అన్నాడు.


త్రిగుణములు ప్రకృతికి సంబంధించినవి కాన ప్రకృతి విషయములనే గుణములు ప్రేరేపించుచున్నవి. గుణములే ఆత్మను మరపించి మోహ బద్ధుని చేయుచున్నవి. కావున గుణములే జీవుని భ్రమకు మూలకారణము. అందువలన గుణములను మాయ అని అనవచ్చును. పరమాత్మ నిర్మితములయిన మాయతో కూడుకొన్న గుణములను దాటుటకు ప్రపంచములో కష్టము. కావున పరమాత్మను శరణుజొచ్చిన మనుజులు దానిని దాటగలరు. అట్లు కాదేని అతి కష్టము. ప్రతి ఒక్కరు ఆత్మను నమ్మిన గుణముల మాయను సులభముగా దాటగలరు.

త్రిగుణములలో జీవుడు ఒకప్పుడు సాత్వికమునందును, ఒకప్పుడు రాజసమునందును, వేరొకప్పుడు తామసమునందును, వుండుట సంభవించుచుండును. మూడు గుణములలో జీవుడు ఏదో ఒక గుణమునందుండును దానినే గీతలో కృష్ణపరమాత్మ ఇట్లన్నాడు

14 శ్లో॥ 10 రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత।
రజ స్సత్త్వం తమశ్చైవ తమ స్సత్త్వం రజస్తథా ॥


“ఒక సమయములో రాజసముల, తామసములకంటే సాత్త్వికము మించు, అట్లే మరియొక సమయమున సాత్త్విక తామసముల కంటే రాజసము మించు, మరియొక సమయమున సాత్త్విక రాజసములకంటే తామసము మించు”

పరమాత్మ చెప్పినట్లు త్రిగుణ చక్రమందు జీవుడు సాత్త్విక రాజసముల విడచి తామసము నందును, మరియొకప్పుడు రాజస తామసముల విడచి సాత్త్వికగుణ భాగమునందును, అట్లే కొన్ని సమయములలో సాత్త్వికము తామసముల విడచి రాజస భాగమందును వుండును ఏ గుణభాగములలో యుండిన ఆ గుణ భాగములోయున్న గుణముల స్వభావ పనులనే జీవుడు జేయుచుండును. మూడు గుణములందును అనగా కపాలములోయున్న గుణచక్ర మూడు భాగములలోను ఒక్కొక్క భాగములో ఎన్నో గుణములు వుండును. ఒక భాగములో యుండిన గుణములే ఇతర భాగములలో వుండును, కాని వాటియందు భేదము వుండును. తామసములో కామము అను గుణము వున్నది. రాజసములోనూ కామము అను గుణము వున్నది. కామమను పేరు గలిగిన గుణము ఒక్కటే అయినా రాజసములోయున్న కామమునకు తామసములోయున్న కామమునకు ఎంతో వ్యత్యాసము వుండును. అట్లే సాత్త్వికమునందుండును. జీవుడు గుణములయందు ఎట్లు యున్నది త్రిగుణములయందు సూక్ష్మ గుణములు ఎట్లు యున్నది ప్రక్కపేజీలో 3వ పటములో చూడవచ్చును.




3వ పటము

పై పటమున జీవుడు తామసమునందున్నాడు. సాత్వికములో రాజసములోలేడు. జీవుడు తామస గుణభాగములోయున్న సమయమున ఆ భాగములో యున్న గుణములనే మనస్సు సంకల్పించును. మనస్సు సంకల్పించిన దానినే జీవుడు చేయును. ఈ విధముగా జీవుడు ఏ భాగములో యుండునో ఆగుణముల పనులనే చేయుట సంభవించుచున్నది. జీవుడు కపాలములో తామసముల సాత్వికముల వదలి రాజసములోయున్న సమయమును ప్రక్క పేజీలో 4వ పటములో చూడవచ్చును.



4వ పటము

ఈ విధముగా ఒక్కొక్క సమయమున జీవుడు రాజసమునందుయుండుట సంభవించుచున్నది. మరియు కపాలములో సాత్వికమున జీవుడు వుండుట ప్రక్క పేజీలో 5వ పటమునందు చూడవచ్చును.



5వ పటము

ఈ విధముగా జీవుడు మెదడునందు కంటికి కనపరాకయున్న గుణచక్రములయందు ఉండును. మరణ సమయమున త్రిగుణచక్రములో జీవుడు ఏ భాగములో యుండునో ఆ భాగములోనే తిరిగి జన్మించిన శరీరములోకూడ ఉండును. మరణ సమయములో కంటికి కనపరాకయున్న బ్రహ్మ, కాల, కర్మ, గుణచక్రములు శరీరమునుండి బయటికి వచ్చి వేరే శరీరముయొక్క మెదడును చేరుచున్నవి. త్రిగుణచక్రములో జీవుడు ఎక్కడయుండునో అక్కడేయుండి త్రిగుణచక్రముతోపాటు వేరే శరీరమును చేరుచున్నాడు. గుణచక్రములో జీవుడు చిక్కుకొని ఉన్నాడు. కావున గుణచక్రముతోపాటు జీవుడు కూడ పోయి వేరే శరీరమును చేరుచున్నాడు. అట్లు చేరిన శరీరమునందు వయస్సు పెరుగుకొలది గుణములు బయటిపొడ చూపను మొదలుపెట్టును. ముందు జన్మమున జీవుడు సాత్త్వికములో వుండిన ఈ జన్మలోకూడ జీవుడు సాత్త్వికములోనే ఉండి అందుయున్న గుణముల ప్రవర్తననే ఆచరించును ముందు

జన్మమున జీవుడు రాజసములో వుండిన, ఈజన్మలోకూడ జీవుడు రాజసగుణ ప్రవర్తనమే ఆచరించును. అట్లే ముందు జన్మలో జీవుడు తామసములో ఉండిన ఈ జన్మలో కూడ తామసగుణములనే వర్తించును. ముందు జన్మలో ఏ గుణములందు జీవుడుండునో ఆ గుణములందే మళ్లీ జన్మలోకూడ ఉండును.

ఇంతవరకు జీవుడు మూడు గుణములందు చిక్కుకొని వాటిప్రకారము నడుచుచుండును అని తెలుసుకొన్నాము. జీవుడు కపాలములో ఏ గుణభాగమున యున్నపుడు ఏమి పనులు చేయును? ఆ పనులు ఎట్లు ఉండును? అను విషయములు పూర్తిగా క్రింద వివరించెదను దీనిని బాగా అర్థము చేసుకొన్నవాడు తప్పక ధన్యుడగును. జీవుడు తామసభాగమునయున్నపుడు కపాలమున 213 వ పేజీలో 3 వ పటములో యున్నట్లుఉండును.

తామసమున జీవుడు ఉన్నపుడు, ఆ భాగమున యుండిన గుణములనే సంకల్పములద్వారా మనస్సు జీవుని ముందరకు తెచ్చి పెట్టుచుండును. మనస్సు వలన ప్రేరేపింపబడిన గుణములు జీవుని కార్యములు చేయునట్లు చేయుచున్నవి. మనస్సు అనేకముగా సంకల్పించుచుండును కాని జీవుడు వాటియందు అనగా కర్మానుసారము కొన్ని పనులనే చేయుచుండును. తామసభాగమునందలి గుణములతో కూడుకొన్న జీవుడు ఎట్లుండునో పరమాత్మ భగవద్గీతయందు చెప్పియున్నాడు.

14 శ్లో॥ 8 తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।
ప్రమాదాలస్య నిద్రాభి స్తన్నిబధ్నాతి భారత ॥

“జ్ఞాన శూన్యమైన తామసము మోహమున సర్వదేహులను ముంచి వేయుచున్నది. మరియు తామసమునందుయున్న జీవుడు నిద్రలోను, బుద్ధి మాంధ్యముతోను, ఆలస్యములతోను, ప్రమాదములతోను కలిగిన పనులనే చేయుచుండును. తామసములో కూడుకొన్నవాడు అజ్ఞానము అభివృద్ధి అగుకార్యములనే చేయుచుండును. ఎందుకనగా

తామస భాగములోయున్న గుణములు అటువంటివి. ఇంకనూ ఆ గుణములు ఎట్లున్నవనగా!

14 శ్లో॥ 9 : జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత।

"తామసగుణము జ్ఞానమును కప్పిపుచ్చి విపరీత అజ్ఞానమును వృద్ధి చేసి ప్రమాదములతో కూడుకొన్న పనులయందు ఇష్టము పుట్టించు చున్నది."

మానవుని ప్రవర్తననుబట్టి ఆ శరీరమునందలి జీవుడు గుణచక్రములో ఏగుణమునందు ఉన్నాడు అని తెలుసుకోవచ్చును. కపాలములో తామసగుణములోయున్నవాడు చేయు కార్యములు ఇంకా ఎట్లు వున్నవనగా!

14 శ్లో॥ 13 అప్రకాశోஉప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవచ।
తమస్యేతాని జాయన్తే వివృద్ధే కురునందన॥

అర్జునా! అజ్ఞానము, మోహము, ఊరకయుండుట, ప్రమాదములతో కూడుకొన్న అకార్యముల జేయుటయందు మనస్సు ఎప్పుడు సంకల్పించునో అప్పుడు జీవుడు తమోగుణమునందున్నట్లు తెలియును"

14 శ్లో॥ 15 : ప్రలీన స్తమసి మూఢయోనిషు జాయతే।

"తమో గుణములందు జీవుడు యున్నపుడు మరణము సంభవించిన ఆ జీవుడు తిరిగి మూఢయోనులందు జన్మించును"

14 శ్లో॥ 16 మజ్ఞానం తమసః ఫలమ్.

"తామస గుణములందుండు జీవుడు చేయు పనులయందు కల్గు ఫలముకూడ అజ్ఞానము కల్గించునదియే ఉండును"

14 శ్లో॥ 17 ప్రమాద మోహౌ తమసో భవతోఽజ్ఞానమేవచ.

"తామసగుణభాగమునందుయున్న జీవునకు కల్గు గుణములు ప్రమాదములను భ్రాంతియును, జ్ఞానశూన్యమును కల్గించునవియైవుండును"

14 శ్లో॥ 18 జఘన్యగుణవృత్తిస్థా అధో గచ్ఛన్తి తామసాః

"తామస గుణమున యున్నవానికి అధమ గతియే కల్గును"

17 శ్లో॥ 4 ప్రేతాన్ భూత గణాంశ్చన్యే యజన్తే తామసా జనాః

"తామసగుణమునందలి జీవుడు ప్రేతములకు, భూతములకు పూజలు చేయును"

17 శ్లో॥ 10 యాతయామం గతరసం పూతి పర్యుషించయత్,
ఉచ్ఛిష్ట మపి చామేధ్యం భోజనం తామసప్రియమ్.

"తామసగుణములోని జీవుడు ఆ గుణములచేత రాత్రి గడచినది అనగా ముందురోజు వండినది, రుచి మారినది, దుర్వాసన కలిగి ఉన్నది, పాసిపోయినది, ఎంగిలి చేయబడినది, పవిత్రత లేనిది అయిన ఆహారమును తీసుకొనుటకు ఇష్టపడును"

17 శ్లో॥ 13 విధిహీన మసృష్టాన్నం మన్త్రహీన మదక్షిణమ్,
శ్రద్ధా విరహితం యజ్ఞం తామసం పరిచక్షతే.

"తామసగుణము కలిగినవాడు శాస్త్ర విధులను విడచి, అవినీతిగా సంపాదించిన ధనముతో మంత్రములు లేకుండ, దక్షిణలు ఇవ్వకనే, శ్రద్ధలేనివాడై పూజలు చేయును"

17 శ్లో॥ 19 మూఢగ్రాహేణాత్మనోయ త్పీడయా క్రియతేతపః,
పరస్యో త్సాదనార్థం వా తత్తామస ముదాహృతమ్.

"కపాలమునందు తామసగుణ భాగములోయున్న జీవుడు, తెలివిలేని పట్టుదలతోను, మిగుల కష్టములలోను కూడుకొన్న తపము జేయును వాడు చేయు తపము పర వినాశనము చేయునదియై ఉండును"

17 శ్లో॥ 22 అదేశకాలే యద్దాన మపాత్రేభ్యశ్చ దీయతే,
అసత్కృత మవజ్ఞాతం తత్తామస ముదాహృతమ్.

"తామసగుణముతో కూడుకొనియున్న జీవుడుచేయు దానము సత్కరింపు లేక, సన్మానమును లేక, దేశకాలమును తెలుసుకొనక దానమునకు పాత్రుడగునో కాదో పరికించి చూడక చేయునదియై ఉండును"

18 శ్లో॥ 7 నియతస్య తు సన్న్యాసః కర్మణో నోపపద్యతే,
మోహాత్తస్య పరిత్యాగ స్తామసః పరికీర్తితః ॥

"నియతమైన కార్యముల ఎన్నడు సన్యశించకూడదు. మోహమున కార్యముల త్యజించిన అట్టివాడు తామసగుణము కలిగివుండునని తెలియుము"

18 శ్లో॥ 22 యత్తు కృత్స్నవ దేకస్మి న్కార్యే సక్త మహేతుకమ్,
అతత్త్వార్థవ దల్పంచ తత్తామస ముదాహృతమ్॥

"తామసగుణమునందు యున్న జీవుడు కారణములేని దానిని, అసత్యమైయున్న కార్యమును చేపట్టి దానివలన సర్వార్థసిద్ధి కలుగుననుచు, వాని ఆసక్తి అంతయు, దానియందు యుంచి ఉండును. ఈ విధముగాయుండిన జ్ఞానమును తామస జ్ఞానము అని అందురు."

18 శ్లో॥ 25 అనుబన్ధం క్షయం హింసా మనపేక్ష్య చపౌరుషమ్,
మోహా దారభ్యతే కర్మ తత్తామస ముదాహృతమ్॥

"ఏదిచేయగా ఏది వచ్చును, ఏది పోవును, హింస ఏదయినా కలుగునా, ఎంత బరువు? ఎంత సులువు? అని యోచించకయే చేసెడిపని తామసగుణము యొక్క పనియే అని చెప్పవచ్చును"

18 శ్లో॥ 28 అయుక్తః ప్రాకృత స్తబ్ధః శ్శఠో నైకృతి కోఽలసః,
విషాదీ దీర్ఘసూత్రీచ కర్తా తామస ఉచ్యతే॥

"కపాలమునందు గుణచక్రములో తామసభాగమున యున్న జీవుడు విద్యలేని వాడును, మంచిపనులయందు అర్హతలేనివాడును, వంచనాపరుడును, పనులు చేయక మజ్జుగా యుండువాడును, ఎల్లపుడు చింతలు చేయువాడును, జుగుప్సతో కూడుకొని యుండువాడును, అనర్థములు కల్గించు తీర్పాలోచన చేయువాడును అయి ఉండును."

18 శ్లో॥ 32 అధర్మం ధర్మ మితియా మన్యతే తమసాఽవృతా,
సర్వార్థాన్ విపరీతాం శ్చ బుద్ధి స్సా పార్థ! తామసీ॥

"జీవుడు తామసగుణములతో కూడుకొని అధర్మమును ధర్మమని యెంచి పనులు చేయును మరియు ఆ పనులవలన కలుగు సర్వార్థములు వాని బుద్ధికి విపరీతముగా కనుపించును"


18 శ్లో॥ 35 యయా స్వప్నం భయం శోకం విషాదం మదమేవచ,
న విముంచతి దుర్మేధా ధృతిస్సా పార్థ! తామస.

" స్వప్న భయ శోకములును విషాదములు మొదలుగా గల విషయములను విడువకుండయుండు దృష్టుడు కలిగియున్న ధైర్యము తామస గుణ ధైర్యము అని అందురు"

18 శ్లో॥ 39 యదగ్రే చానుబన్ధేచ సుఖం మోహన మాత్మనః,
తన్ద్రాలస్య ప్రమాదోత్థం తత్తామస ముదాహృతమ్.

"తామస గుణమునందు మనస్సు సంకల్పించి జీవుని ఆదియందును అంత్యమందును నిద్రలోను, అజాగ్రత్తలోను నిండుకొనునట్లు చేయుచున్నది. మోహములో యుండునట్లు తామసగుణప్రభావములు ఉన్నవి"

ఈ విధముగా పరమాత్మ తామసగుణములు కలిగియున్నవారిని గురించి చెప్పివున్నాడు. తామసముయందును, సాత్వికమునందును లేకుండ రాజసమునందు జీవుడుయుండు అలవాటు కలిగిన, కపాలములోయున్న గుణచక్రమునందు మధ్యనయున్న రాజసగుణభాగములో యున్న జీవుడు అందుకల గుణములనే పొందుచుండును. ఆ గుణముల ప్రకారమే నడుచుకొనుచుండును. మెదడునందు కంటికి కనపరాకయున్న గుణ చక్రములో రాజసమునందు జీవుడు ఎట్లున్నది ప్రక్కపేజీలో 6వ పటములో చూడవచ్చును.



6వ పటము

మధ్యనయున్న రాజసగుణభాగములో గుండ్రముగా గుర్తింపబడినవి రాజస గుణములు. ఆ గుణములను మనస్సు సంకల్పముల ద్వారా తెచ్చి జీవునియొద్ద ఉంచును. అపుడు జీవుడు కర్మానుసారముగ ఆగుణములను పొందుట సంభవించుచున్నది. రాజసములోయున్న గుణములు పొందినవాడు ఎట్లున్నది భగవద్గీతయందు పరమాత్మ చెప్పుచున్నాడు.

14 శ్లో॥ 7 రజో రాగాత్మకం విద్ధి తృష్ణా సంగ సముద్భవమ్
తన్ని బధ్నాతి కౌన్తేయ! కర్మ సంగేన దేహినమ్॥

"రాజసగుణములు రాగములతో కూడుకొన్నవై విషయకాంక్షలను వృద్ధిచేయును. మరియు కర్మలయందు ఆసక్తి కల్పించి నరుని బంధనము చేయుచున్నవి."

14 శ్లో॥ 9 సంజయతి రజః కర్మణి,

"రాజసగుణము కోరికలతో కూడుకొన్న పనులయందే రక్తికల్పించును"

14 శ్లో॥ 12 లోభః ప్రవృత్తి రారమ్భః కర్మణా మసమ స్పృహా,

రజస్యేతాని జాయన్తే వివృద్ధే భరతర్షభ!

"లోభగుణములు, వృధాపనులు, ఫలాశతో కూడిన పనులు, అశాంతి ఈ గుణములు ఎపుడు జీవునకున్నవో, అపుడు ఆ జీవుడు గుణచక్రములో రజో గుణభాగమున ఉన్నట్లు తెలుసుకోవలయును"

14 శ్లో॥ 15 రజసి ప్రళయం గత్వా కర్మ సంగిషు జాయతే,

"రజోగుణమునందు యున్నపుడు జీవుడు మరణించిన తిరిగివచ్చు జన్మ కర్మలతో కూడుకొన్నదై ఉండును"

14 శ్లో॥ 16 రజసస్తు ఫలం దుఃఖమ్

"రాజసగుణమువలన కలుగు ఫలము దుఃఖములు కలుగజేయునది అయి ఉండును"

14 శ్లో॥ 17 రజసో లోభ ఏవచ,

"రాజసగుణము వలన లోభము ఉద్భవించును"

14 శ్లో॥ 18 మధ్యే తిష్ఠన్తి రాజసాః,

"రాజసగుణములో యున్నవానికి మధ్యతరగతి సంసార బంధమే కలుగుచుండును"

17 శ్లో॥ 4 యజంతే యక్ష రక్షాంసి రాజసాః,

"రాజసగుణములో యుండిన వారు యక్షులను, రాక్షసులను పూజింతురు"

17 శ్లో॥ 9 కట్వామ్ల లవణాత్యుష్ణ తీక్ష్ణ రూక్ష విదాహినః,
ఆహారా రాజస స్యేష్టా దుఃఖ శోకామయప్రదాః.

"ఉప్పు, చేదు, పులుపు, అతివేడిమి కలిగినవి, దప్పిక కలుగజేయునవి, దుఃఖవంతములు, వ్యాధికలుగజేయునవి అయిన ఆహారవస్తువులయందు రాజసగుణము కలిగినవారు ఆసక్తి కలిగివుందురు"

17 శ్లో॥ 12 అభి సందాయ తు ఫలం దంభార్థ మపి చైవయత్,
ఇజ్యతే భరతశ్రేష్ఠ! తం యజ్ఞం విద్ధి రాజసమ్.

"ఫలముకోరి చేయబడునట్టి పూజ, తమ గొప్పతనమును ప్రదర్శించు పూజ రాజసగుణములోయున్న జీవులు చేయుచుందురు"

17 శ్లో॥ 18 సత్కార మాన పూజార్థం తపో దంభేన చైవ యత్,
క్రియతే తదిహ ప్రోక్తం రాజసం చల మధ్రువమ్.

"సత్కరింపుకొరకు, సన్మానముకొరకు, పూజకొరకు, దంభముతో కూడుకొని చంచలము నాశనకరము అయిన తపములు రాజసగుణము కలవారు చేయుచుందురు"

17 శ్లో॥ 21 యత్తు ప్రత్యుపకారార్థం ఫలముద్దిశ్య వాపునః
దీయతే చ పరిక్లిష్టం తద్దానం రాజసం స్మృతమ్.

"ఫలితమునందు ఆశ, ప్రత్యుపకారమునందు ఉద్దేశ్యము కలిగి చేసెడి కష్టదానములను రాజసగుణము కలిగినవారు చేయుచుందురు"

18 శ్లో॥ 8 దుఃఖ మిత్యేవ యత్కర్మ కాయ క్లేశ భయాత్త్యజేత్,
సకృత్వా రాజసం త్యాగం నైవ త్యాగఫలం లభేత్.

"దుఃఖకరమని, శరీరమునకు కష్టమయినదని ఎవడు కర్మను విడచునో వాడు రాజసగుణ భాగమునందున్న వాడు"

18 శ్లో॥ 21 పృథక్త్వేన తు యద్ జ్ఞానం నానా భావాన్ పృథగ్విధాన్,
వేత్తి సర్వేషు భూతేషు తద్ జ్ఞానం విద్ధి రాజసమ్ !

"వేరు వేరు జీవరాసులందుండు ఆత్మ వేరు వేరు అని వాని గుణములను వేరు వేరు అని తెలియజేయు జ్ఞానము రాజసగుణభాగమునకు చెందినది"

18 శ్లో॥ 24 యత్తు కామేప్సునా కర్మ సాహంకారేణ వాపునః
క్రియతే బహుళాయాసం తద్రాజస ముదాహృతం.

"కోర్కెగలవాడగుచు, మిగుల ప్రయాసతోడ కర్త తానేయని గర్వపడుచు పనిని ఎవడు చేయుచున్నాడో వాడు రాజసగుణమునకు సంబంధించినవాడు"

18 శ్లో॥ 27 రాగీ కర్మఫల ప్రేప్సుర్లుబ్ధో హింసాత్మకోఽశుచిః,
హర్ష శోకాన్వితః కర్తా రాజసః పరికీర్తితః.

"కర్మఫలమునందు ఆసక్తి కలిగినవాడై, లోభముతో కూడుకొన్నవాడై, శుభ్రములేనివాడై, జీవులను హింసింపజేయువాడై, సంతోష దుఃఖములతో కూడుకొన్న వాడై పనిని చేయువాడు రాజసములందున్నవాడు"

18 శ్లో॥ 31 యయా ధర్మ మధర్మం చ కార్యం చాకార్య మేవచ,
అయథావ త్ప్రజానాతి బుద్ధిస్సా పార్థ! రాజసీ.

"ఇది ధర్మమనియు, ఇది అధర్మమనియు, మరియు ఇది కార్యమనియు ఇది అకార్యమనియు, నిర్భయముగా నిర్ణయింపలేని బుద్ధి రాజసగుణము కలవారికి ఉండును"

18 శ్లో॥ 34 యయాతు ధర్మకామార్థాన్ ధృత్యా ధారయతేఽర్జున!,
ప్రసంగేన ఫలాకాంక్షీ ధృతి స్సా పార్థ! రాజసీ.


"ఫలకాంక్షతో కూడుకొని ధర్మార్థ కామమోక్షములతో కూడుకొనియున్న ధైర్యము రాజసగుణభాగమునందలి జీవులకు ఉండును"

18 శ్లో॥ 38 విషయేంద్రియ సంయోగా ద్యత్త దగ్రేఽమృతోపయమ్,
పరిణామే విషమివ తత్సుఖం రాజసం స్మృతిమ్.

"యింద్రియముల విషయ సుఖములతోకూడి మొదట అమృతముతో సమానముగ త్రోచి తుదకు విషముతో సమానముగ కనుపించు సుఖము రాజసగుణము కలవారికి కలుగుచుండును"

ఈ విధముగా కపాలస్థానమందు కంటికి కనుపించకయున్న గుణచక్రములో రాజసభాగమునందుకల జీవుడు ఉండును. రాజసగుణము తామసముకంటే కొంచెము మేలు అని కృష్ణపరమాత్మ చెప్పిన దానిని బట్టి తెలియుచున్నది. గుణచక్రములో

సాత్వికభాగమునకు చెందిన జీవుడు తామసము, రాజసముకంటే ఉత్తముడై ఉండును. సాత్వికభాగమున యున్న జీవుడు అందుయున్న గుణమునుపొంది వర్తించుచుండును. కపాలములో సాత్వికభాగమునయున్న జీవుని క్రింది పటములో చూడవచ్చును.



7వ పటము

సాత్వికగుణభాగమున వక్రరేఖలుగా గుర్తింపబడినవి సాత్వికగుణములు. ఆ గుణములను అందుండు జీవుడుపొంది వాటిప్రకారమే నడుచుకొనును. సాత్వికగుణములోయున్న జీవుడు ఎట్లు వర్తించునది, భగవద్గీతయందు పరమాత్మ ఇట్లు చెప్పియున్నాడు.

14 శ్లో॥ 6 తత్ర సత్త్వం నిర్మలత్వా త్ప్రకాశక యనామయమ్,
సుఖ సంగేన బధ్నాతి జ్ఞాన సంగేన చానఘ!

“సత్వగుణమునందు యుండినవాడు నిర్మలత్వము, ప్రకాశంబు, మరియు అనామయము అయిన జ్ఞానసుఖములపొంది కర్మబద్ధుడై ఉండును”

14 శ్లో॥ 9 సత్త్వం సుఖే సంజయతి,

"సాత్వికగుణములోయున్న జీవుడు సుఖములమీద ఆసక్తి కల్గివుండును"

14 శ్లో॥ 11 సర్వేద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే,
జ్ఞానం యదా తదా విద్యా ద్వి వృద్ధం సత్త్వ మిత్యుత.

"దేహమందెల్ల యింద్రియములను విషయముల తెలియజేయు జ్ఞానము కలిగినవాడు సాత్వికగుణమునందు ఉండును"

14 శ్లో॥ 14 యదా సత్త్వే ప్రవృద్ధేతు ప్రలయం యాతి దేహభృత్,
తదోత్తమ విదాం లోకా నమలాన్ ప్రతి పద్యతే.

"సాత్విక గుణములోయున్న జీవుడు మరణించిన తిరిగి జన్మ ఉత్తమ జ్ఞానవంతుల ఇంట కల్గును."

14 శ్లో॥ 16 కర్మణ స్సుకృతస్యాఽహు స్సాత్త్వికం నిర్మలం ఫలమ్

"సాత్విక గుణభాగమునందలి జీవుడు మంచిపనులుచేసి దానిద్వారా నిర్మలమయిన ఫలితమును పొందును"

14 శ్లో॥ 17 సత్త్వాత్ సంజాయతే జ్ఞానం,

"సాత్వికగుణములోయున్న జీవునకు జ్ఞానముద్భవించును"

14 శ్లో॥ 18 ఊర్ధ్వం గచ్ఛన్తి సత్త్వస్థా,

"సాత్వికగుణముకలవాడు ఊర్ధ్వగతినిపొంది మోక్షమందు ఆశకలవాడై ఉండును"

17 శ్లో॥ 4 యజన్తే సాత్త్వికా దేవాన్,

"సాత్వికగుణభాగములో యున్నవారు దేవతలను పూజ చేయుచుందురు"

17 శ్లో॥ 8 ఆయుస్సత్త్వ బలారోగ్య సుఖప్రీతి వివర్ధనాః,
రస్యా స్నిగ్ధాస్థిరా హృ ద్యా ఆహార స్సాత్త్విక ప్రియాః.

"ఆయురారోగ్యములును, బలమును, నూనె వస్తువులును, చెడిపోకుండ ఉండునవి, రసములతో కూడుకొన్నవి, రుచికరమయినవి అయిన ఆహార వస్తువులు సాత్వికగుణము కలవారికి ప్రీతికరమై వుండును"

17 శ్లో॥ 11 అఫలాకాంక్షి భిర్యజ్ఞో విధిదృష్టోయ ఇజ్యతే,
యష్టవ్య మే వేతి మనస్సమాధాయ స సాత్త్వికః.

"సాత్వికగుణము కలిగినవాడు చేయవలసిన పూజలు చేయవలయునని మనస్సు నిశ్చలముచేసి, శాస్త్రవిధి అనుసరించి ఫలవిసర్జనచేసి పూజలు చేయుచుండును"

17 శ్లో॥ 17 శ్రద్ధయా పరయా తప్తం తపస్త త్రివిధం నరైః,
అపలాకాంక్షి భి ర్యుక్తై స్సాత్త్వికం పరిచక్షతే.

"సాత్వికగుణము కలిగినవాడు ఫలకాంక్ష లేక మూడు విధములైన తపములను చేయుచుండును"

17 శ్లో॥ 20 దాతవ్య మితి యద్దానం దీయతేఽనుపకారిణే,
దేశే కాలేచ పాత్రేచ తద్దానం సాత్త్వికం స్మృతమ్.

"దానము చేయవలయునను తలంపుగలిగి, సమయము దానము చేయదగినదా కాదా అని తెలుసుకొని, దానము తీసుకొనువాడు దానముకు యోగ్యుడా అయోగ్యుడా తెలుసుకొని, మేలు బదులు చేయనట్టి సజ్జనునకు దానము ఇచ్చుట సాత్వికగుణముకలవారు చేయుచుందురు"

18 శ్లో॥ 9 కార్యమిత్యేవ యత్కర్మ నియతం క్రియతేఽర్జున!
సంగం త్యక్త్వా ఫలం చైవ సత్యాగ స్సాత్త్వికో మతః

"కర్మ ఫలితమునందు, కర్మయందు ఆశయుంచక నియతమైన పని తప్పక చేయవలయునని అనుకొనుట సాత్వికగుణము కలవారియందు ఉండును."

18 శ్లో॥ 20 సర్వభూతేషు యేనైకం భావ మవ్యయ మీక్షతే,
అవిభక్తం విభక్తేషు తద్జ్ఞానం విద్ధి సాత్త్వికమ్.

"వేరు వేరు ఆకారములు కల్గియుండిన సర్వజీవరాసులందుండు ఆత్మ ఒక్కటే అని, అది నాశనము లేనిది అఖండముగా ఉన్నది అని ఎవ్వడు తెలుసుకొనుచున్నాడో వాడు సాత్వికగుణమునకు చెందినవాడు"

18 శ్లో॥ 23 నియతం సంగ రహిత మరాగ ద్వేషతః కృతమ్
అఫల ప్రేప్సునా కర్మ యత్తత్ సాత్త్విక ముచ్యతే.

"చేయవలసిన పనియందు కాంక్షలేక, ప్రేమలేకుండ, ద్వేషము లేకుండ ఫలితముమీద ఆశపెట్టుకోక సాత్వికగుణమునందు యుండువారు చేయుదురు"

18 శ్లో॥ 26 ముక్త సంగోఽన హం వాదీ ధృత్యుత్సాహసమన్వితః,
సిద్ధ్య సిద్ధ్యో ర్నిర్వికారః కర్తా సాత్త్విక ఉచ్యతే.

"చేయుచున్న పనిమీద మనస్సు యుంచుకొనక, ఈ పనికి కర్తను నేను కాను అని తలంచి, ధైర్యము, ఉత్సాహముకలిగి, ఆపనియందు లాభ నష్టములచే చింతపడక సాత్వికులు చేయుచుందురు"

18 శ్లో॥ 30 ప్రవృత్తిం చ నివృత్తించ కార్యా కార్యే భయా భయే,
బంధం మోక్షం చ యో వేత్తి బుద్ధి స్సా పార్థ! సాత్త్వికీ,

"ఇది పుట్టుక ఇది మరణము, ఇది చేయదగినపని ఇది చేయరాని పని, ఇది భయము ఇది భయములేనిది, ఇది బంధమోక్షము అని తెలియజేయు బుద్ధి సాత్వికగుణములు కలిగినవారికి ఉండును"

18 శ్లో॥ 33 ధృత్యా యయా ధారయతే మనః ప్రాణేంద్రియ క్రియాః
యోగేనా వ్యభిచారిణ్యా ధృతి స్సా పార్థ! సాత్త్వికీ.

"మనస్సును, యింద్రియములయొక్క పనులను, నిలబెట్టి యోగమందుండు ధైర్యము సాత్వికగుణభాగమునందుయుండు వారికే ఉండును"

18 శ్లో॥ 37 యత్త దగ్రే విషమివ పరిణామేఽమృతో పమమ్,
తత్సుఖం సాత్త్వికం ప్రోక్త మాత్మ బుద్ధిప్రసాదజమ్.

"మొదట విషతుల్యముగను తుదకు అమృతతుల్యముగను కనపడునట్టి సుఖము ఆత్మ వలన కలిగిన సుఖము అది సాత్వికులకు మాత్రమే కలుగును"

ఈ విధముగా సాత్వికగుణముయందు చిక్కుకొన్న జీవుడుఉండును. మూడు గుణములయందు యున్న జీవుడు అవతలయున్న ఆత్మను తెలుసుకోలేక పోవుచున్నాడు. గుణముల ఆవరణములో యున్నంతసేపు జీవుడు గుణములనే పొందుచుండును, కాని ఆత్మను పొందలేడు. ఎవడయితే గుణములను దాటి సర్వమునకు ఆధారమై మధ్యనయున్న ఆత్మను పొందునో వానికితిరిగి జన్మఉండదు. గుణచక్రములో మధ్యనయున్న ఆత్మ ఆవరణములోనికి రాక గుణములలోనే చిక్కుకొన్న జీవుడు ఆత్మను తెలుసుకోలేక ఉండును. ఆత్మ తెలియకుండునట్లు మూడు గుణములు జీవాత్మకు పరమాత్మకు మధ్యన పెద్ద గోడలై నిలచినవి. దానినే గీతయందు పరమాత్మ ఇట్లుఅన్నాడు.

14 శ్లో॥ 5 సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతి సమ్భవాః,
నిబధ్నన్తి మహా బాహూ, దేహే దేహిన మవ్యయమ్.

“జీవుడు ఆత్మ అంశ అయినను ప్రకృతి జనిత గుణములయిన, సాత్విక రాజస తామసములచే దేహమందు బంధింపబడి ఆత్మను చేరలేక ఉన్నాడు.”

ఆత్మ ఒకే అంశ అయినా మూడు గుణములచేత కట్టుబడియుండిన అంశకు జీవాత్మ అనియు, మూడు గుణములకు కట్టుబడక మూడు గుణములకు ఆధారమైయున్న అంశకు పరమాత్మ అనియు విభజింపబడినది. గుణములు తమలోనికి ప్రవేశించిన అంశను బంధించి జీవాత్మగా మార్చునవి. గుణములే సర్వకర్మలను జీవునిచే చేయించి అనుభవించునట్లు చేయుచున్నవి. మధ్యనయున్న ఆత్మ ఏ కర్మ అంటక జీవుడు గుణములవలన పడు అన్ని అగచాట్లను సాక్షిగా చూచుచున్నాడు. ఎవడయితే జ్ఞానము వలన మూడు గుణములతోనే నేను చలించుచున్నాను. ఈ మూడు గుణములే నాచే అన్ని పనులు చేయించుచున్నవి. అన్నిపనులకు ఈ మూడు గుణములే కర్త, నేను ఏమాత్రము జరిగెడు పనులకు కర్తను కాను. గుణములు వేరు నేను వేరు, నేను గుణములయందు చిక్కుకొని జరుగు పనులను నేనే చేయుచున్నానని పొరపాటు పడినాను. నేను స్వతాగా

ఏపనిని చేయడము లేదు. నన్నే గుణములు ప్రేరేపించి పని చేయునట్లు చేయుచున్నవి. నన్ను బంధించిన గుణములను ఛేదించి నేను స్వతంత్రుడనగుదును. అని గుణములను తనకంటే వేరుగా మరియు శత్రువులుగా ఎవడు తలంచుచున్నాడో వాడు ఆత్మను జేరుటకు అర్హుడగును. దానినే గీతయందు పరమాత్మ యిలా అన్నాడు.

14 శ్లో॥ 19 నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టాఽను షశ్యతి,
గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి.

"కర్త వేరొకడు కాడు గుణములే అన్ని పనులకు కర్తయని ఎపుడు ఎవడయితే తెలుసుకొనునో అపుడు వాడు గుణములు వేరు నేను వేరని తెలుసుకొని నన్ను చెందగలడు"

గుణములు వేరు తాను వేరని తెలుసుకొన్నవాడు ఆ గుణముల నుండి బయటపడి ఆత్మను చేరుటకు ప్రయత్నించును. తెలిసినవాడు ప్రయత్నించుకొలది గుణములు వానిని బంధించుచునే ఉండును. మూడు గుణముల ఆవరణములో ప్రతి గుణభాగములో ముఖ్యమయినవి ఆరు గుణములు ఉన్నవి. సాత్వికమునందు ఆరు, రాజసమునందు ఆరు, తామసమునందు ఆరు గుణములున్నవని బాగుగ తెలియవలెను. ఒక భాగములో ఆరు గుణములకు వేరొక భాగములో ఆరు గుణములకు వ్యత్యాసముండును. ఆ వ్యత్యాసము వలననే రాజసులు ఒక విధముగా తామసులు ఒక విధముగా సాత్వికులు ఒక విధముగా ప్రవర్తించుచున్నారు. ఆరుగుణముల పేర్లు వరుసగా [1]కామ [2]క్రోధ [3]లోభ [4]మోహ [5] మద [6]మాత్సర్యము. ఈ ఆరు గుణముల బాధ మూడు గుణభాగములలో ఎక్కడున్న తప్పదు. కావున జీవునికి ఈ ఆరుగుణములు శత్రువులుగా ఉన్నవి. ఈ శత్రువులను జయించనిదే మనకు సుఖము ఏనాటికి లేదు. అవి ఎల్లపుడు మనలను హింసించుచునే ఉండును. ఆరు గుణములు గుణచక్రములో ప్రతిభాగములోను ఉన్నవి. ఆరు గుణములకు ఉపగుణములు ఎన్నో లెక్కలేనన్ని ఉన్నవి. ఆరు గుణములయందు ఒక్కొక్క గుణమునకు కొన్ని వేల ఉప గుణములు ఉన్నవి వాటినే మనస్సు

సంకల్పరూపముగా అనుక్షణము చూపుచుండును. ఉపగుణములు ఎన్ని యుండినా త్రిగుణభాగములయందు ముఖ్యమయినవి ఆరు మాత్రమే. అందు అన్నిటికంటే ధృడమయినది, బలమయినది, మొట్ట మొదటిది కామగుణము. కామము [ఆశ] ను మానవుడు గెలచిన మిగత గుణములను సులభముగా జయించగలడు. త్రిగుణభాగములను దాటి ఆత్మను చేరవలెనన్న ఆ గుణ భాగాలయందుకల ఆరు గుణములను జయించవలయును. ఆరు గుణములను జయించవలెనన్న ఆ గుణములను బాగుగా తెలుసుకోవలయును.

త్రిగుణభాగములయందు కామము అన్ని గుణములలో పెద్దది, బలమయినది, మానవుని అన్ని గుణములకంటే ఈ గుణమే ఎక్కువగా మోహమున ముంచి వేయుచున్నది. ఇది క్రోధ గుణమునుకూడ జీవుని మీదకు బయలుదేరునట్లు చేయుచున్నది. దీనిని జయించుట చాలా కష్టముగా ఉండును. మానవుని జ్ఞానమునకు ఇది మొదటి శత్రువుగ ఉన్నది. దీని ప్రభావమే జీవులమీద అన్ని గుణములకంటే ఎక్కువగా ఉన్నది. మరియు ఈ కామ గుణము తన ఉపగుణములను ముండ్లుగా చేసుకొని తాను వృక్షముగా జ్ఞానమార్గములో అడ్డముగా యుండి, జ్ఞానమార్గమును మూచి ఉంచినది, మొదట ఈ కామమనెడి కంటక వృక్షమును నరుకనిదే జ్ఞానమార్గము లభించదు. మరియు కామగుణము జ్ఞానము యెడల ఎట్లున్నదనగా

గీత ౧ ॥ 3 శ్లో॥ 38 ధూమే నావ్రియతే వహ్ని ర్యథాఽఽదర్శో మలేనచ,
యతోల్బే నావృతోగర్భ స్తథాతే నే ద మావృతమ్.

"పొగయందు అగ్ని, దుమ్ముచే అద్దము, గర్భమావిచే కన్నబిడ్డ కప్పబడియున్నట్లు జ్ఞానము కామముచేత కప్పబడివున్నది."

ఈ విధముగా జ్ఞానము యెడల కామము గర్భ శత్రువుగా ఉన్నది. కామమును జయించనిదే జ్ఞానము గెలువదు. జ్ఞానము కావలయునన్నవారు కామమును [ఆశను]

జయించవలెను. కామము మనస్సు బుద్ధి ద్వారా యింద్రియములతో సంబంధము కల్గివున్నది. యింద్రియముల మీద తన అధికారము మనస్సు బుద్ధిద్వారా చలాయించును. జ్ఞానమును కప్పి మానవుని మాయలో చిక్కుకొనునట్లు చేయుచున్నది. ఇక్కడ కొందరికి, కామము మనస్సు బుద్ధిద్వార ఎట్లుతన పెత్తనము చలాయించుచున్నది? అను అనుమానము రావచ్చును. దానికి సమాధానము, మనస్సుకు స్థానము శరీరములోయున్న సూర్య చంద్రనాడులు. బుద్ధి, జీవునికి స్థానము కపాలమునందున్న త్రిగుణచక్రమే. సూర్య చంద్రనాడులకు కపాలమునయున్న గుణచక్రమునకు కొన్ని నరములద్వారా సంబంధమున్నది. కంటికి కనపరాకయున్న మనస్సు ఆ నరములద్వారా గుణచక్రములోని గుణములను సంకల్పించుచుండును. అనగా చలించుచున్న మనస్సు గుణముల పని చేయుచున్నది కనుక మనస్సుకూడ గుణములకు ఒక గుమాస్తాగా ఉన్నది. మనస్సు సంకల్పించు గుణ విషయములను బుద్ధి జీవుని చేరుటకు పురికొల్పుచున్నది, బుద్ధి కూడ గుణముల పక్షముననే ఉన్నది. కనుక బుద్ధి కూడ గుణములకు ఒక గుమస్తాగా ఉన్నది. గుణములు తమపనిని ఇంద్రియముల ద్వారా జీవుని ఒప్పించి చేయించు చున్నవి. జీవుడు కూడ గుణములు సూచించిన విషయములనే చేయుచున్నాడు, కనుక జీవుడు కూడ గుణములకు ఒక గుమస్తాగానే ఉన్నాడు. గుణముల పనులన్నియు ఇంద్రియముల ద్వారానే జరుగుచున్నవి. కావున ఇంద్రియములు కూడ గుణములకు గులాములై ఉన్నవి. మొదట జీవుడు ఎఱుక కల్గినవాడై గుణములు వేరు నేను వేరని తెలుసుకొని, అన్ని కార్యములను ఆ గుణములే చేయించుచున్నవని తెలుసు కొని, వాటిని జయించవలెనని పట్టు పట్టి, మొదట గుణములకు గులాములై యున్న ఇంద్రియములను, మనస్సును, బుద్ధిని, గుణములకు వ్యతిరేకించి వాటిని తమవైపు త్రిప్పుకోవలయును. అపుడు గుణములమాట శరీరములో ఆచరించు వారులేక గుణములకు బలము తగ్గిపోవును అపుడు ఇంద్రియములు, మనస్సు, బుద్ధి తనస్వాధీనమందున్న జీవుడు బలము కలిగిన వాడై త్రిగుణ గోడలను ఛేదించి మధ్యన యున్న ఆత్మను చేరగలడు. నిర్బలమయిన జీవుడు బలమయిన గుణములను జయించవలెనన్న ముందు ఇంద్రియములను మనస్సును బుద్ధిని వశపరుచు కోవలయును. గుణముల వైపుయున్న జీవుడు తాను వేరు అని తెలుసుకొనుటకు ఎంతో జ్ఞానము అవసరము.తానువేరని తెలుసు కొన్న తర్వాత గుణముల పక్షమున యున్న

ఇంద్రియములను మనస్సును బుద్ధిని తనవైపు లాగు కొనుటకు గుణములతో జీవుడు ఎంతో పోరాడవలసి ఉంటుంది. గుణములతో పోరాడు సమయమున గుణముల ఆధీనమునందున్న మనస్సు, ఇంద్రియములు, బుద్ధి, గుణములవైపే నిలచి జీవునితో యుద్ధము చేయును. జీవుడు ఒక్కడు ఒకప్రక్క, గుణములు మరియు గుణముల ఆధీనమునందుయున్న ఇంద్రియములు మనస్సు బుద్ధి ఒక ప్రక్కనిలచి పోరాడుచుండును. ఈ పోరాటమునే యోగసాధన అందురు. ఇట్లు పోరాడుచు గుణములవైపున యున్న ఇంద్రియములను మనస్సును బుద్ధిని ముందు జయించి తన ఆధీనమందుయుండునట్లు చేసుకొనిన, గుణముల పక్షమున బలము లేక పోవును.అపుడు జీవుడు గుణములను సులభముగా జయించి వాటిని దాటి ఆత్మను చేరగలడు. ఇక్కడ అనేక మందికి, మొదట గుణముల వైపు ఇంద్రియములు మనస్సు బుద్ధి యుండి గుణములు అనేక బలము కలిగి యుండగా బలములేని జీవుడు వానిని ఎట్లు జయించును? వాటితో పోరాడుటకు బలము ఎక్కడి నుండి వచ్చును? అను సంశయము కలుగ వచ్చును. దానికి సమాధానము, పరమాత్మను నమ్మి ఎల్లవేళల ఆత్మను చేరవలయునను తలంపు కలవానికి గుణములను జయించు బలము లేకున్నను వానికి కావలసిన బలము పరమాత్మయే ఇచ్చును. తనను నమ్ముకొనిన వాని పోరాటమునకు తానే బాధ్యత వహించును. కావుననే పరమాత్మ ఇట్లన్నాడు.

14 శ్లో॥ 26 మాంచయోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే,
సగుణా స్సమతీ త్యైతాన్ బ్రహ్మ భూయాయ కల్పతే.

"చలించని మనస్సుతో, పరమ భక్తితో ఎవడు నన్నే సేవించుచున్నాడో వాడు త్రిగుణములను గెల్చుటకు కావలసిన బలము కలవాడగును"

14 శ్లో॥ 27 బ్రహ్మణో హి ప్రతిష్ఠాఽహ మమృత స్యావ్య యస్యచ,
శాశ్వత స్య చ ధర్మ స్య సుఖస్యైకాంతి కస్యచ.

“నిత్యుడును నాశనములేని వాడును అయిన నిర్మలాత్మ యొక్క శాశ్వత ఐశ్వర్యమైనటువంటి పదవిని, జ్ఞానులు పొందెడి మోక్షమును పొందవలెనన్న జీవునకు నేనే ఆధారము బలము అయి ఉన్నాను.

౯ శ్లో॥ ౨౨ అనన్యాశ్చిన్త యన్తోమాం యే జనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభి యుక్తానాం యోగ క్షేమం వహామ్యహమ్

“అన్యచింతలేక ఎల్లప్పుడు నన్నే పరమ భక్తితో కొలుచుచు, నాయందే చేరవలయునని నిత్యము ప్రయత్నము చేయువారి క్షేమమును యోగమును నేనే వహించు చుందును”

ఈవిధముగా పరమాత్మ పలికిన మాటలను బట్టి త్రిగుణములను జయించి ఆత్మను కలియుటకు బలము లేని జీవునకు పరమాత్మయే బలమై ఉన్నాడు. ఆయనే జీవుని యోగక్షేమముల బాధ్యత భరించుచున్నాడు అని తెలియుచున్నది. కావున జీవుడు ప్రయత్నముచేసి గుణములను గుణముల పరివారము అయిన ఇంద్రియములాదిగా గల వానితోను వ్యతిరేకించి నిలచి, ఆత్మను నమ్మి పోరాటము (యోగసాధన) మొదలు పెట్టవలెను. అపుడు గుణములను గెల్చుశక్తి పరమాత్మ నుండియే లభించును. ఆయనే జీవుని యోగసాధన బాధ్యత వహించి నడిపించును. ఎంతోబలమయిన గుణముల గెల్చుటకు మానవుడు ఏమియు చేయలేడు. అంతయు పరమాత్మయే చేయుచున్నాడు. పరమాత్మను నమ్మి ఆయన యందు చేరవలయునని ప్రయత్నముచేయు వానికే పరమాత్మ బలమై నిలచును. అట్లు గుణములను జయించవలయుననుకొనక, పరమాత్మను నమ్మక, ఆయనను చేరవలయునను తలంపులేనివానికి పరమాత్మ యోగక్షేమ బాధ్యత వహించడు. పరమాత్మను నమ్మి అనుక్షణము ఆయననే ఆరాధించుచుండిన వానికి పరమాత్మశక్తి తోడై నిలచును. అట్లు నమ్మి ఆయన కరుణద్వారా త్రిగుణములను జయించినవాడు ఎట్లుండుననగా! భగవద్గీతయందు పరమాత్మ ఇట్లన్నాడు. “తనకు లభించిన పదార్థములపై ఎవడైతే ప్రేమ, అసూయ పొందడో, ఎవడయితే ద్వేషము లేనివాడో,

మరిణించినవానికై ఎవడు అణుమాత్రము బాధపడడో, సర్వవిషయములయందు తాను ఉండినను అందు గలుగు గుణ ప్రేరేపణలకు ఎవడు చలింపబడడో, ప్రతికార్యము గుణముల ప్రవర్తనయేనని ఎవడయితే తెలుసుకొని నిశ్చలత కలిగి ఉండునో, సుఖముల దుఃఖముల ఎవడయితే సమానముగా ఎంచుకొనునో, బంగారును, మట్టిని, రాళ్లను ఎవడయితే సమముగా చూచునో, మానమందును, అవమానమందును, ప్రీతియందును అప్రీతియందును, పొగడ్తలందును, నిందలయందును, ఎవడయితే సమచిత్తము కలిగిఉండునో, శత్రువులను మిత్రులను ఎవడయితే సమానముగా తలంచునో అట్టివాడు గుణాతీతుడు''

ఈ విధముగా గుణముల జయించినవాడు ఉండును. పైన ఎట్లు కనుపించిన అంతరంగమున పరమాత్మ చెప్పినట్లు గుణాతీతుడు ఉండును. కపాలములోయున్న గుణచక్రములోని గుణములు గుణాతీతుని ఏమియు చేయజాలవు. ఏ గుణము వానిని ప్రేరేపించలేదు. కావున గుణములను సులభముగా దాటి మధ్యన సర్వమునకు ఆధారమై ఆది అంత్యము తెలియని పరమాత్మను జీవుడు చేరుచున్నాడు.

ఇంతవరకు తెలిపినదంతయు చదివి, ఎవరు ఊహకొచ్చినట్లు వారు వ్రాయుదురు, నిజముగా వీరు చూచినారా? అనువారుకూడ మానవులయందు ఉన్నారు. వారికి నా ప్రత్యేకమైన మాట ఏమనగా ఇది అంతయు చూచి వ్రాసినదేకాని వేరుకాదు. తాను గ్రుడ్డివాడయి ఎదుటివానికి చూపు లేదంటే ఏమి ప్రయోజనము. స్థూలకన్నులకు కనుపించునది ఒక్క ప్రకృతి మాత్రమే. జ్ఞాననేత్రమునకు కనుపించునది ప్రకృతికి అతీతమైనది. జ్ఞాన నేత్రములేని శరీరశాస్త్రజ్ఞులు మెదడును గురించి వెన్నుపామును గురించి ఎన్నో పరిశోధనలు జరిపినారు. ఇప్పటికి జరుపుచునే ఉన్నారు. కాని గుణములు, కర్మ మానవునియందు ఎట్లున్నది ఇంతవరకు ఏమాత్రము తెలియలేదు. ఒక్కొక్క మానవునియందు ఒక్కొక్క విధముగాయున్న గుణములను కర్మలను కనుగొనలేక పోవుచున్నారు. అంతఃకరణములయిన జీవుడు, మనస్సు, బుద్ధి అహంకారము ఎవరికళ్లకు

కనుపించవు. అవి తెలియునది జ్ఞాననేత్రమునకు మాత్రమే. అందువలననే అర్జునునకు తన అంశను తెలియజేయవలయునని పరమాత్మ అర్జునునితో "నన్ను చూచుటకు స్థూలకన్నులు పనికిరావు జ్ఞాననేత్రమునకు మాత్రము నేను కనుపించుదును. నీకు జ్ఞానదృష్టిని నేనే ప్రసాదించుదును" అని అన్నాడు జ్ఞాన చూపు లభించవలయునన్న పరమాత్మయే ఇయ్యవలయును కాని మన పరిశోధన పరికరములు పనికిరావు. మనకున్న స్థూలకన్నులకు పరమాత్మ కనుపించకపోగా దేవుడే లేడనువారు కొందరున్నారు. పరమాత్మను నమ్మని అజ్ఞానులకు జ్ఞానదృష్టిని పరమాత్మ ఏమాత్రము ప్రసాదించడు. పరమాత్మను నమ్మినవానికే జ్ఞానదృష్టి లభించును, వానికే అనంత ఆత్మ అంతయు తెలియును. నేను ఈ గ్రంధమునందు చెప్పు విషయములు ఏ మాత్రము జ్ఞానదృష్టి లేనివారు నమ్మకపోవచ్చును కొద్దిమాత్రమయిన జ్ఞానదృష్టి యున్నవాడు తప్పక నా మాట విశ్వసించును. కావుననే భగవద్గీతయందు పరమాత్మ ఇట్లన్నాడు.

15 శ్లో॥ 10 ఉత్క్రామన్తం స్థితం వాపి భుంజానం నం వాగుణాన్వితమ్,
విమూఢా నాను పశ్యన్తి పశ్యన్తి జ్ఞాన చక్షుషః.

"ఆత్మ గుణములతో కూడుకొని శరీరము ధరించి వెలుగుచు విషయసుఖములను అనుభవించుచున్నాడు మూఢులకు ఇది కనుపించదు జ్ఞాననేత్రులుకు మాత్రము కనుపించును"

పరమాత్మ అన్నట్లు జ్ఞాననేత్రులకు మాత్రమే తెలియును. మిగతా వారికి జీవుడు శరీరములో ఎట్లున్నది తెలియదు. కావున తెలియనివారు తెలిసినవారి మాటలు వినిన బాగుండును. చూడనివారు చూచినవారి మాటలు విశ్వశింపవలయును. అప్పుడయితేనే వారుకూడ మారుటకు ఆస్కారము ఉన్నది. ఇంతగా వివరించి తెలిపిన నమ్మనివారు ఏనాటికిబాగుపడలేరు.

ఎవడయితే ఈ నా మాటలు నమ్మి, గుణములను సులభముగా తెలుసుకొని, వాటికి బలమయిన అంతఃకరణములను వశపరచుకొన్నవాడు అనగా గుణాతీతుడయినవాడు, ప్రపంచములో ఎక్కడయున్న ఏ పనులు చేయుచున్న, వానికి గుణముల వలన సంభవించు పాప పుణ్యములు అంటవు, కావుననే భగవద్గీతయందు పరమాత్మ యిలా అన్నాడు.

13 శ్లో॥ 32 అనాదిత్వా న్నిర్గుణత్వాత్పరమాత్మాయ మవ్యయః,
శరీరస్థోపి కౌన్తేయ నకరోతి నలిప్యతే.

"ఆది శూన్యుండగుచు, నాశనము లేని వాడగుచు, మూడు గుణములను దాటిన వాడగుచు యుండిన వాడు శరీరమున యున్నను మూడు గుణములతో ప్రేరేపితమయిన కర్మలు చేయడు. కర్మఫలితము వానికి తగులదు"

18 శ్లో॥ 17 యస్య నాహఙ్కృతో భావో బుద్ధిర్యస్య నలిప్యతే,
హత్వాపి సఇమాన్ లోకాన్ న హన్తి ననిబధ్యతే.

"ఎవని భావములో అహంకారము కలుగదో, ఫలముపై ఎవ్వనికి ఆశలేదో వాడు లోకములో జీవులను చంపినప్పటికి హంతకుడు కాడు.

అందువలన వచ్చు పాపము వానిని ఏమాత్రము అంటదు" ఇది అందరికి ఆశ్చర్యముగా ఉండును. హత్యచేసిన హత్యకాదు పాపము రాదు అంటే తెలియని వారికి ఆశ్చర్యమే యగును. గుణములను జయించిన వారికి మాత్రము ఇది వర్తించునని పరమాత్మ తెలిపి ఉన్నాడు. గుణముల జయించని వానికి ప్రతిపని యందును కర్మ తప్పక అంటుచుండును.

గుణముల జయించిన వానికి ఏకార్యమునందును ఏవిధకర్మ వాని కర్మచక్రమును చేరదు. అంతకు ముందు యున్న కర్మఅంతయు వానికి కలిగిన జ్ఞానాగ్ని వలన

కాలిపోవును. అపుడు శరీరమును విడచి ఆత్మయందు అతిసులువుగా జీవుడు చేరగలడు. గుణముల తెలుసుకొని వాటిని దాటక పోయిన ఏమి ప్రయోజనము ఉండదు. కావున నేటి నుండి ప్రతి ఒక్కరు గుణములను తెలుసు కొనుటకు ప్రయత్నము చేయవలయునని కోరుచున్నాను.

కొందరు ప్రపంచములో అన్నిటికంటే ఆదిశక్తి పెద్దది, ఆమెకు దేవతలందరు పుట్టినారని, ఆమెకు రాజరాజేశ్వరి అని, పరాశక్తి అని, ఇంకా ఎన్నో పేర్లు చెప్పుచున్నారు. అన్నిటికంటే పెద్దశక్తి ఒకటి ఉన్నది కాని, అది స్త్రీ కాదు, పురుషుడును కాదు. అసలుకు దానికి పేరే లేదు. దానిని తెలియజేయు నిమిత్తమే ఈ గ్రంధమునందు ఆశక్తిని పరమాత్మ అను పేరుతో చెప్పడమయినది. కావున మా ఆదిశక్తి పెద్దది, మా రాజ రాజేశ్వరి పెద్దది, అని అనుకొనువారి భావన వేరైన అసలుకు యున్నశక్తి ఒక్కటియే ఆశక్తియందు ఐక్యమయిన దానినే మోక్షము అని అనబడును. పరమాత్మ శక్తియందు కలియుటకు మానవునకు ఎన్నియో అనుమానములు యుద్భవించుచుండును, ఆ అనుమానములను విచ్ఛిన్నము చేయునిమిత్తమై ఈ గ్రంధము వ్రాయబడినది. ఈ గ్రంధము చదివిన వారంతయు జ్ఞాన మార్గమున సంశయములను ఖండించి నేరుగా ఆత్మను చేరగలరని నేను ఆశించుచున్నాను.

అసలయిన చైతన్యశక్తిని పరమాత్మ అని మనము ఇంత వరకు చెప్పుకొన్నాము. ఆశక్తి స్త్రీ పురుషుడు కాకపోయినా ఆశక్తిని పురుషునిగానే భావించి కొందరు పరమాత్ముడు అని అనుచున్నారు. మరికొందరు ఆశక్తిని స్త్రీగా భావించి పరాశక్తి, ఆదిశక్తి అనుపేర్లతో చెప్పుచుందురు. ఈ రెండు విధములందు అసలయిన శక్తిని పురుషునిగానే భావించి చెప్పుకోవడము ఉత్తమము. స్త్రీగా భావించి చెప్పుకోవడము తప్పుకాకపోయిన అంత ఉత్తమముగా ఉండదు. స్త్రీ, పురుషులతో పోల్చి చెప్పుకోవడము ఉత్తమము, ఉత్తమముకాకపోవడము అను విషయమునకు ఏమి ఆధారము అని కొందరు అడుగవచ్చును. దానికి నా సమాధానము, భగవద్గీతాశాస్త్రమే బ్రహ్మవిద్యకు ప్రమాణము. ఆశాస్త్రములో అసలయిన శక్తి అయిన పరమాత్మ తనను పురుషునిగానే వర్ణించి చెప్పినాడు.

గీత యందు గుణత్రయ విభాగయోగములో "ప్రకృతి యంతయు నాయోనిగా ఉన్నది. దానికి నేను బీజదాతగా ఉన్నాను. సర్వజీవరాసులు నావలననే పుట్టుచున్నవి. సర్వ యోనులందు పుట్టుచున్న జీవరాసులన్నిటికి ప్రకృతి తల్లి వంటిది. బీజదాతనైన నేను తండ్రి వంటి వాడను" అని పరమాత్మ తెలియజేసినాడు ఇక్కడ తనను పురుషునిగా, ప్రకృతిని తల్లిగా చెప్పి ఉన్నాడు. సర్వజీవరాసులకు తల్లి ప్రకృతియేనని తెలిపియుండగా, ప్రకృతికంటే అతీతమైయున్న పరమాత్మను స్త్రీగా మనము పోల్చుకొనుట బాగుండదు. సర్వజీవరాసులకు తల్లి ప్రకృతియే అని పరమాత్మ స్వయముగ తెలియజేసినాడు. కావున సర్వజీవరాసులందు మనము ఒక జీవరాసియైనందువలన స్త్రీతత్వమును ఎక్కడ పూజించిన, ఎక్కడ పొగిడినా ఆ పొగడ్త, ఆ పూజ ప్రకృతికే చెందును. సర్వజీవరాసులకు బీజదాతను మరియు తండ్రిని అని పరమాత్మయే తెలిపియుండగ, సర్వజీవులందు మనము ఒక జీవుడై తండ్రిని తల్లిగా చెప్పుకుంటే, నాన్నను అమ్మా అని పిలిచితే ఏమి బాగుండునో మీరే ఆలోచించండి.

గీతాశాస్త్రమందే పురుషోత్తమ ప్రాప్తి యోగములో శ్రీకృష్ణుని శరీరమునుండి పరమాత్మ ఇట్లన్నాడు.

15 శ్లో॥ 16 "ద్వావిమౌ పురుషౌ లోకే క్షర శ్చాక్షర ఏవచ,
క్షర స్సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే,

15 శ్లో॥ 17 ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః,
యోలోకత్రయ మావిశ్య బి భర్త్యవ్యయ ఈశ్వరః.

15 శ్లో॥ 18 యస్మాత్ క్షర మతీతోఽహ మక్షరాదపి చోత్తమః,
అతోఽస్మి లోకే వేదేచ ప్రథితః పురుషోత్తమః."

"లోకములలోని పురుషులలో క్షరుడు అక్షరుడు అని రెండు విధములు గలవు. సర్వభూతములను క్షరుడు అని చెప్పవచ్చును. సర్వ భూతములందు కూడుకొని

మార్పుచెందని యున్నవానిని అక్షరుడని అందురు. ఉత్తముడైన పురుషుడు వేరొకడు కలడు. వాడే పరమాత్మ అను పేరుతో పిలువబడుచుండును. అతడు లోకత్రయంబును ఆవహించి నాశనములేని దేవదేవుడై అంతటిని భరించుచున్నాడు. పరమాత్మనయిన నేను అక్షరునికంటే శ్రేష్ఠుండనగుటవలన, క్షరుని కంటె అతీతుని అగుటవలన స్మృతుల యందు శ్రుతుల ప్రసిద్ధిగా పురుషోత్తముడనని జ్ఞానులందరు నన్నే కొనియాడుచున్నారు.”

పైవిధముగా పరమాత్మ నేను పురుషులయందు పురుషోత్తమునిగా యున్నానని తెలిపి యుండగ, పరమాత్మ భావనను గ్రహించక ఆయనను స్త్రీగా పోల్చి చెప్పుకొన్న, దేవుని మాటకు వ్యతిరేకముగా ప్రవర్తించినవారము కామా! అందువలన పరమాత్మను పురుషునిగానే చెప్పుకోవడము సరిఅయిన మార్గమని నేను తలంచుచున్నాను.

పంచభూతములను ప్రకృతి అనుచున్నాము. ఈ ప్రకృతివలననే మనలోయున్న గుణములు ఉద్భవించినవి. కంటికి కనిపించు ప్రకృతినే మాయ అని కూడ అనుచున్నాము. ప్రకృతియే గుణములుగా యున్నందువలన, గుణములందు జీవుడు చిక్కు కొన్న దాని వలన జీవుడు మాయయందు చిక్కుకొనుచున్నాడు అని అనుచున్నాము. మాయ యందు ఏమానవులు చిక్కుకొనక అనగా గుణములందు జీవుడు బంధింపబడక గుణములను జయించుకొని పరమాత్మ యందు లీనము కావలయునని తెలుపుచున్నాను.



మానవుడైన శ్రీ కృష్ణుని శరీరములోనుండి
పరమాత్మ పలుకుచున్న దృశ్యము.

మానవుడైన శ్రీ కృష్ణుని శరీరములోనుండి పరమాత్మ పలుకుచున్న దృశ్యము.

గురు పూజ సందర్భము

18_9_80 తేది గురువారము జరిగిన గురుపూజలో శ్రీ ప్రబోధానంద స్వామివారి ప్రముఖ శిష్యులు వారి శక్త్యానుసారము గురుదేవుల పాదపూజ తేనె, పాలు, నీరుతో చేసుకొన్నారు. ఆ పూజయందు హాజరయినవారు కొందరు జ్ఞానులు, మరికొందరు అజ్ఞానులు. జ్ఞానులయినవారు ఆ పూజను చూచి "మేము ఎన్నోజన్మల పుణ్యముచేత ఈపూజకు హాజరైనాము" అని అనుకొనుచుండగ, అజ్ఞానులయినవారు "ఇది అంతయు ఒక బొమ్మలాట మాదిరి ఉన్నది. మన మాదిరేయున్న మనిషికి పూజలుచేయుచున్న ఈ శిష్యులు తెలివితక్కువవారు పూజ చేయించుకొనేవాడు మరీ తెలివితక్కువవాడు. మేము ఇక్కడికి వచ్చినది చాలా పొరపాటు" అని అనుకొన్నారు. ఆహ్వానము పంపకుండినా అక్కడకు వచ్చి ఆవిధముగా అనుకొను అజ్ఞానుల అంతరమును తెలుసుకొన్న గురుదేవులు వారినిఉద్దేశించి ఈ విధముగా అన్నాడు.

తెలియనివారికి గురుపూజ ఒక వినోదముగా ఉండవచ్చును. తెలిసిన వారికి మహాభాగ్యముగా ఉండును. గురువు శిష్యులకు మాత్రమే గురువు. మిగతావారందరికి సామాన్య మానవుడే. శిష్యులు గురువును ఆదిదేవునిగా భావించుచున్నారు. కాబట్టి వారికి మాత్రము గురువు ఆదిదేవుడే అయి ఉండును. సామాన్యమానవులు గురువును ఒక సాధారణ వ్యక్తిగా భావించుచున్నారు. కాబట్టి వారికి సాధారణ వ్యక్తిగానే ఉండును. ఎవరు ఏవిధముగా భావించుకొంటే ఆ విధముగనే గురువు ఉండును. జ్ఞానులతో గురువు నమస్కరింపబడును. కాని అజ్ఞానుల యెడల గురువే ముందుగ నమస్కరించి వారికి తాను సాధారణ మనిషి మాదిరే అగుపించును. అజ్ఞానులు జ్ఞానులుగా మారవలయునని అనుకొన్నపుడు, వారిని కడతేర్చుటకై గురువు గురువుగానే కనిపించును. అజ్ఞానులు అహంకారమును విడువక గురువును సాధారణవ్యక్తి అని అనుకుంటూయుంటే వారికి వారి భావన ప్రకారమే అగుపించును కాబట్టి అనుకోని విధముగా హాజరయిన అజ్ఞానులకు గురు

పూజ ఒక వింతగానే కనిపించియుండును.

గురువు అనగా ఒక శరీరమునందుండు వాడే కాడు. గురువు అన్ని శరీరములందు నివాసియై ఉన్నాడు. ముక్కోటి దేవతలందు, అజ్ఞానులందు, జ్ఞానులందు, ప్రతి జీవరాశి శరీరమునందున్న పరమాత్మయే గురువు. అంతట నివాసి అయినవాడు గురువు అయితే, ఒక మనిషిని గురువు అని శిష్యులు ఆ మనిషి శరీరమునకు ఎందుకు పూజ చేయవలయును? అని కొందరు అడుగవచ్చును. దానికి సమాధానము ఏమనగా! అన్ని శరీరములందు గురువు ఏక రూపుడై ఉండినా, ఏ శరీరమునుండి గురువు తానుగా పల్కి తన నిజస్వరూపాన్ని తెలియజేయుచున్నాడో ఆ శరీరమునకు ఎంతో ప్రత్యేకత ఉన్నది. జ్ఞానులు గురువును ఏ శరీరమునుండి గ్రహించుచున్నారో ఆ శరీరమునకే పూజ చేయుదురు. గురువు బయల్పడిన శరీరము ఎంతో పవిత్రమయినది. కాబట్టి ఆ శరీరమునకే శిష్యులు పూజచేయుదురు. జ్ఞానులయిన శిష్యులు గురుదేవుల శరీర ప్రత్యేకతను, పవిత్రతను గ్రహించి యుందురు కావున గురు శరీర పాదాభిషేక తీర్థము ధరణి పవిత్రమయిన పుణ్యక్షేత్ర తీర్థముకంటే అధికముగా భావించుచుందురు. అజ్ఞానులయినవారికి ఆ పాదతీర్థము అసహ్యముగ ఉండును. ఒకనాడు సిద్ధయ్య అను శిష్యుడు గురువును తెలుసుకొన్నవాడై ఆయన శరీరమునుండి వాంతిగా [వమనముగా] బయటికి వచ్చిన ఎంగిలి అన్నమును ఎంతో పవిత్రముగ స్వీకరించినాడు. ఆ సమయములో అజ్ఞానులయినవారు దానిని చూచి అసహ్యించుకొన్నారు. ఆ విధముగనే ఈ గురుపూజ యందున్న అజ్ఞానులు మా శిష్యులు చేయుచున్న పూజను చూచి ఇది ఒక పనికిమాలిన పని, ఇది ఒక బొమ్మలాట అని అనుకొన్నారు. తెలియని వారికి ఇది ఒక వింత బొమ్మలాట మాదిరే ఉండును. తెలిసినవారికి ఎన్నో జన్మల పుణ్యఫల విశేషమువలన జరుగుచున్న ఆచరణగా ఉండును.

భగవద్గీతయందు కూడ శరీర ప్రత్యేకతను మనము గ్రహింపవచ్చును. శ్రీకృష్ణపరమాత్మ అర్జునునకు జ్ఞానబోధ చేయుచు ఆత్మసంయమ యోగములో అర్జునుడు అడిగిన ప్రశ్నకు సమాధానముగా ఇటుల అన్నాడు [శ్లో ॥ 41, 42] “అర్జునా యోగమున

భ్రష్టులయిన వారు పుణ్యఫలమువలన వచ్చెడు లోకములకుపోయి పుణ్యులు ఐశ్వర్యవంతులు ఇండ్లయందే ఉద్భవించుచుందురు. అట్లు కాకపోతే బుద్ధిపరులయిన యోగపరుల ఇండ్లనే పుట్టుచుందురు. సామాన్యజనులందు ఎవరికయిన ఇట్టి జన్మ ఎంతయో దుర్లభముకదా!" ఈ వాక్యమును గ్రహించగా యోగుల శరీరముతో సంబంధముండవలెనన్న ఎంతయో దుర్లభముకదా అని పరమాత్మ తెలియజేసినట్లున్నది. మరియు గీతాశాస్త్రమందే దైవాసురసంప ద్విభాగయోగములో ఈ విధముగ [శ్లో ॥ 19, 20] "క్రూరులును ద్వేషులును, శుభదూరులును అగు నరాధములను అసురయోనులందే పుట్టునట్లుచేసి సంసార దుఃఖములను అనుభవించునట్లు నేనుచేయుదును. అసురయోనులందు పుట్టు వారు జన్మ జన్మలకు అజ్ఞానులగుచు నన్నుపొందెడి జ్ఞానముయొక్క గట్టు తెలుసుకొనలేక, జన్మ జన్మకు అధమగతికి పోవుచుందురు." అన్నాడు అసుర గుణములు కలిగిన అజ్ఞానులకు అసురయోని సంబంధము కలుగునని పరమాత్మ తెలియజేసినాడు. అజ్ఞానులకు నీచులయిన అసురుల శరీరములతోనే సంబంధము కల్గించును. జ్ఞానులకు యోగుల శరీరముతోనే సంబంధము కల్గించును. దీనినిబట్టి శరీరముల ప్రత్యేకత కొంత తెలియుచున్నది. యోగశక్తియున్న యోగుల శరీరములకే పరమాత్మ ప్రత్యేకత చూపించి వారియొద్ద పుట్టవలయునన్న ఎంతయో దుర్లభముకదా అనియుంటే, ఇక పరమాత్మయే బయటికి పలుకుచున్న శరీరమునకు ఎంత ప్రత్యేకమయిన పవిత్రతయుండునో మీరే ఆలోచించుకోండి. ప్రత్యేకతను తెలుసుకొన్న ప్రబోధానందస్వామి శిష్యులు ప్రబోధానంద శరీరములోయున్న ఆత్మను ఆయన శరీరముద్వారానే పూజించినారని అందరు తెలుసుకోవలయును.

గురుపాద పూజ మొదట తేనెతోను, తర్వాత పాలతోను ఆ తర్వాత నీరుతోను చేసినారే దానికి ఏమయిన అర్థముందా అని కొందరికి అనుమానము రావచ్చును. పూజల యొక్క ప్రతి పనికి అర్థము తెలుపుచున్న ప్రబోధానందుని పూజకు అర్థము లేక ఉండునా! తప్పక అర్థముండును.అది ఏమనగా

తేనె తీపుగలిగి జిగట గలిగి ఉండును. తేనె మాధుర్యము కోసము దానిపై వ్రాలిన కీటకములు అందు జిగటకు చిక్కుకొని తేనెయందే మునిగి చివరకు మరణించును. తేనె ఏవిధముగ ఉన్నదో ఆవిధముగనే తామసగుణభాగములో యున్న ఆరుగుణములు ప్రపంచములో జీవునకు మాధుర్యమును చూపించునవియై యుండి చివరకు ఆ గుణములందు చిక్కుకొన్న జీవుని సర్వనాశనము చేయుచున్నవి. మళ్ళీ జన్మకూడ అధమగతికి చెందునట్లు చేయుచున్నవి. కావున తామస గుణమును తేనెతో సమానముగా పోల్చి ఆ తేనెను శ్రీగురుపాదములకు సమర్పణ చేసిరి.


రెండవదయిన పాలు తేనె కంటె రంగు, రుచి యందు భేదము కలిగి ఉన్నవి. తేనె తర్వాత రుచింప దగినవి పాలు, పాలు కూడ రుచి వాసనతో కూడు కొన్నవి కావున వాటిని రాజస గుణముతోపోల్చి పాలను శ్రీగురుపాదములకు సమర్పణ చేసిరి.

మూడవ దయిన నీరు, తేనె పాలు కంటే రుచిలేనివి. కావున ప్రపంచములో జీవులు నీటిని అంత ప్రేమగా చూడరు. నీరు కంటే పాలను ప్రేమగా చూచువారు ఎక్కువ, పాలను ప్రేమగా చూచువారికంటే తేనెను ప్రేమగా చూచువారు మరిఎక్కువ. తేనె పాల కంటే నీరు తక్కువ అన్న భావన ఉన్నది. అట్లే ప్రపంచమున తామసములో ఎక్కువ, రాజసములో మధ్యరకముగా, సాత్వికములో తక్కువగా జీవులు ఉన్నారు. కావున నీటిని సాత్వికముతో సమానముగా పోల్చి శ్రీగురు పాదములకు సమర్పణ చేసినారు. శిష్యులు మాలోయున్న గుణములను నీపాదములకు సమర్పణ చేయుచున్నాము. ఈ గుణములను నీపాదముల నుండి బయల్పడు జ్ఞానాగ్ని వలన భస్మముచేసి మమ్ములను గుణరహితులుగా చేయుము అను భావముతో అట్లుచేసిరి.

ఇక్కడ ఒక సందేహము కొందరికి రావచ్చును. అది ఏమనగా గురువు పాదములపై గుణములు వేసినారు, సరే. గుణములుగా పోల్చి పాదములకు సమర్పణ చేసిన తేనె, పాలు, నీరును తిరిగి ప్రసాదములుగా ఎంతో సంతోషముతో కొందరు పంచుకొనుచున్నారే దీనికేమి అర్థముండును అని అడుగ వచ్చును. దానికి సమాధానము ఏమనగా, ప్రజలకు

హాని చేయు నరకాసురుడు మరణించిన దినమున వాని మరణమును మనము సంతోషముగా భావించి దీపావళి పండుగ చేసుకొనుచున్నాము. కదా! తనకు కీడుచేసిన దుశ్శాసనుని చంపి వాని రక్తమును భీముడు సంతోషముగా త్రాగినాడు కదా! అట్లే మనకు జన్మ జన్మకు హానిచేయుచు ఆగర్భశత్రువులైయున్న మూడు గుణములను గురువుగారి జ్ఞానాగ్ని భస్మముచేసినపుడు, గురుదేవుల పాదజనిత జ్ఞానాగ్నిచే కాల్చబడి బూడిదగా మారిన తేనె, పాలు, నీరు మిశ్రమములను సంతోషముగా గురు ప్రసాదముగా స్వీకరించుచున్నారు.

చింతకట్టెలను, వేపకట్టెలను, తుమ్మకట్టెలను ఒక చోట పేర్చి అగ్నియుంచిన అవి కాలి బూడిద అయిన తర్వాత ఇది ఏ కట్టె అని గుర్తించుటకు వీలు లేనట్లు మొదట వేరు వేరుగా యున్న పాలు, తేనె, నీరును గురుపాదముల మీద పోసిన తర్వాత ఇది నీరు, ఇది పాలు, ఇది తేనె అని వేరు వేరుగా గుర్తించలేనట్లు తయారయినవి. పులుపు గలిగిన చింతకట్టెను, చేదుకల్గిన వేపకట్టెను, వగరు గలిగిన తుమ్మకట్టెను కాల్చిన తర్వాత అవి వాటి రుచులను కోల్పోయి వాటి గుర్తుగా బూడిద మిగిలి నట్లు తేనె, పాలు, నీరు వాటి రుచిని కోల్పోయి వేరువిధముగా మారి ఉండును. గురువుగారి నుండి లభ్యమగునది త్రిగుణ రహిత పదము కావున కాలిన కట్టెలను గుర్తించలేనట్లు తేనె పాలు నీరును విడి విడిగా గుర్తించలేని మిశ్రమమును శ్రీగురు పాదజనిత త్రిగుణాతీత ప్రసాదముగా భావించి శిష్యులు తీసుకొన్నారు.



శ్రీ ప్రబోధానందస్వామి, వారి సతీమణి



గురు పూజా సందర్భములో హాజరైన భక్తబృందము

అగ్ని తగిలిన ఏ కట్టె అయినా తన రూపును రుచిని కోల్పోయినట్లు, గురుపాదము తగిలిన నీరుగాని లేక ఏ పదార్థముగాని పవిత్రతబడసినదే అగును. దానిని ప్రసాదముగా స్వీకరించుటవలన మనయందున్న కర్మ ఎంతయో నశించును. అందువలననే పెద్దలు ఇట్లన్నారు.

శ్లో ॥ శోషణం పాప పంకస్య దీపనం జ్ఞాన తేజస,
గురోః పాదోదకం సమ్యక్ సంసారార్ణవ తారకం.

తా॥ పాపమనెడు బురదను ఎండిపోవునట్లు చేయునది, బ్రహ్మ జ్ఞానమునకు ప్రకాశమును అయిన గురుపాదోదకము సంసార సముద్రమును దాటింపజేయుచున్నది.

శ్లో ॥ అజ్ఞాన మూలహరణం జన్మ కర్మ నివారణం,
జ్ఞాన వైరాగ్య సిద్ధర్థం గురుపాదోదకం పిబేత్.

తా॥ అజ్ఞానమును హరింపజేయునది. జన్మ కర్మలను నివారించు నది జ్ఞాన వైరాగ్యముల నిచ్చునదియైన గురుపాద తీర్థమును త్రాగవలెను.

పెద్దలమాట ప్రకారం గురుపాదములకు ఎంతో పవిత్రత ఉన్నది. కావున శ్రీ ప్రబోధానందస్వామి శిష్యులు త్రిగుణములకు బాహ్యార్థముగా తేనె పాలు నీరును చూపి పాదపూజ కావించుకొన్నారు.

శ్రీగురు శిష్యుల పూజ ముగిసిన తర్వాత కాలచక్రము 12 భాగములుగా ఎందుకు విభజింపబడినది? అని ఒక జ్ఞానార్థి అడిగినప్రశ్నకు సమాధానముగా శ్రీ ప్రబోధానందస్వామి ఇట్లన్నాడు.

ఈ ప్రశ్న చాలా సమంజసమయినది. దీని సమాధానము మేము మా గ్రంధములో ఎందుకు పొందుపరచలేదు అనగా, కాలచక్రము 12 భాగములుగా ఎందుకు యున్నదని తెలుసుకొను జ్ఞానము అత్యుత్తమమైనది. మరియు అతి ఉన్నతమైన జ్ఞానము. ఇటువంటి జ్ఞానమును బయలు పరచినను దానిని అర్థము చేసుకొనుటకు కొందరికి కష్టముగా యుండునేమోనని వ్రాయలేదు, ఇదిగురుసన్నిధిలో తెలియ జేయు జ్ఞానమేనను ఉద్దేశ్యముతో ఇంతవరకు గ్రంధములో తెలియ పరుచలేదు. కాని ఒక వ్యక్తి ప్రత్యేకించి అదే ప్రశ్నను అడిగిన దానివలన ఉన్నదున్నట్లు చెప్పవలసి వచ్చినది. దీనిని తెలుసుకొని సరియైనభావన పొందిన వారందరు ధన్యులే అని నాఉద్దేశ్యము.

ఇంతకు ముందు ఈగ్రంధములో మూడు గుణభాగములను గురించి విపులముగా తెలియజేసినాము. మూడు గుణభాగములందు ఆరు గుణములున్నవని, అవి ఈవిధముగా మనశిరస్సునందు ఇమిడి ఉన్నవని, వాటిని చిత్రరూపముగా కూడ చూపించినాము. అక్కడ తెలియజేసిన దానికంటే అతీతమైన జ్ఞానమును ఇక్కడ తెలియజేయడమవుచున్నది. అందువలన అందరు శ్రద్ధగలిగి తెలుసుకోవలయునని కోరుచున్నాను.

త్రిగుణభాగములందు ఆరు గుణములు మాత్రమే కాక ఇంకను ఆరు గుణములు ఇమిడి ఉన్నవి. ఒక్కొక్కగుణభాగమునందు మొత్తము గుణములు 12 ఉన్నవని అందరు తెలుసుకోవలయును. అందు మొదటి ఆరుగుణములు అందరికి తెలిసినవే. వాటిపేర్లు 1] కామము 2] క్రోధము 3] లోభము 4] మోహము 5] మదము 6] మాత్సర్యము. ఇంకనూయున్న ఆరు గుణముల పేర్లు ఏవి అనగా! 1] నిష్కామము 2] దయ 3] ఔదార్యము 4] వైరాగ్యము 5] వినయము 6] ప్రేమ.


ఒకమనిషికి పైన చెప్పిన 12 గుణములు ఉండినను, రెండవరకము ఆరుగుణములను చెప్పక అరిషడ్ వర్గములని పేరుకాంచిన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములనే చెప్పుచుందురు. మనము కూడ రెండవరక ఆరుగుణములను చెప్పక మొదటి ఆరుగుణములనే గ్రంధమునందు తెలిపి ఉన్నాము. రెండవరకము ఆరుగుణములు పేరుకు రాకపోవడమునకు ఒక పెద్దకారణము కలదు. అది ఏమనగా కామమునకు వ్యతిరేకగుణము నిష్కామముకదా! ఆ వ్యతిరేకగుణము అయిన నిష్కామము కూడ కామమునుండి పుట్టినది. అదిఎట్లనగా మొదటి కామమను గుణము కలదు కదా! ఆ కామ గుణమునకు కొన్ని వేలకు మించి ఉపగుణములున్నవి అని తెలుసుకున్నాము. ఆ ఉపగుణములు ఎట్లున్నవని ఇంకనూ విశదముగా పరిశీలించిన మొదట కామమను గుణము కలదు. దానిప్రక్కనే కామమునకు సంబంధించిన ఉపగుణము ఉండును. ఆఉపగుణము మొదటిగుణము కంటే పరిణామమందు తక్కువ ఉండును. అట్లే రెండవ ఉపగుణము ప్రక్కన మూడవ ఉపగుణము ఉండును. మూడవ ఉపగుణము రెండవ ఉపగుణము కంటే చిన్నదిగా ఉండును. అదేవిధముగా నాల్గవఉపగుణము మూడవ

దానికంటె చిన్నదిగా ఉండును. ఐదవది నాల్గవ దానికంటే చిన్నదిగా ఉండును. ఈవిధముగా ఉపగుణములు ఒకదానిప్రక్క ఒకటి ఉండి, ఒకదానికంటే ఒకటిది చిన్నదిగా మారుచు చివరకు అతిస్వల్పమయిన ఉపగుణము మిగులును. కామమను గుణములలో అతిచిన్నది మిగిలిన తరువాత దానిప్రక్కన ఆ చిన్న ఉపగుణము కంటే కొంచెము పెద్దదిగా వేరొక ఉపగుణముండును. దానిప్రక్కన దానికంటే కొంచెము పెద్దదిగా ఇంకొక ఉపగుణము ఉండును. ఇట్లు ఒకదాని ప్రక్కన ఒకటి పెద్దదిగా ఉపగుణములు తయారగుచు పోయి చివరకు మొదటి కామగుణముతో సమానమైన గుణము మిగులును. ఇక్కడి వరకు అనగా కామగుణము నుండి చిన్నదిగా మారుచువచ్చి ఆఖరుకు అతిచిన్నగుణముగా మారి ఆతర్వాత ఒక దానితర్వాత ఒకటి పెద్దదిగా మారుచు ఆఖరుకు మొదటిదాని యంతనే తయారయి నిలచి పోయినంత వరకు మొత్తము కామము అనియే పిలువబడుచున్నది. కాని ఇక్కడ ముఖ్యముగ గమనింప వలసిన విషయమమేమనగా! మొత్తము గుణములన్నిటికి కామగుణము అని పిలచినప్పటికిని అందు కామమునకు వ్యతిరేకమైన నిష్కామ గుణములున్నవి. కామము చిన్నదిగా మారి ఎక్కడ నుండి తిరిగి పెద్దదిగా మారుటకు ప్రారంభించునో అక్కడనుండియే వ్యతిరేకమైన నిష్కామగుణము మొదలయినదని తెలుసుకోవలయును. విపులముగా తెలుసుకోవలయునంటే మొదట పెద్దగానుండి మారుచుపోయి అతి చిన్నగా ఉన్నదాని వరకు కామ మనియు, చిన్నదాని తర్వాత పెద్దగా మారుటకు ప్రారంభమయి ఆఖరుకు పెద్దగాయున్న గుణము వరకు నిష్కామమనియు తెలుసుకోవలయును. కామమునుండియే ఉపగుణములు మార్పుచెందుచు పోయి ఆఖరుకు నిష్కామగుణముగా మారి ఉన్నవి. అందువలన మొదటిదయిన కామగుణమునే లెక్కించుచుందుము కాని దానియందే ఉద్భవించిన నిష్కామగుణమును లెక్కించకున్నాము. కామగుణమునందు నిష్కామగుణము తయారయినట్లే క్రోధము నందు దయయు, లోభగుణమునందు ఔదార్యము, మోహమునందు వైరాగ్యము, గర్వమునందు వినయము, అసూయయందు ప్రేమ పుట్టినవి. ఈవిధముగా మూడు గుణభాగములలో యున్న ఆరుగుణములు తయారయినవి.

మొదటి గుణము ఒక విధముగాయుండి దానికి వ్యతిరేకముగా మారి యున్నను వ్యతిరేకగుణము పేరుకురాక మొదటి గుణమే పేరుకు వచ్చినది. అయినప్పటికి మొదటి గుణములో జీవుడు చేరినపుడు ఏ అనుభూతిని పొందుచున్నాడో అదే అనుభూతిని దాని వ్యతిరేక గుణముతో కలసినపుడుకూడ పొందుచున్నాడు. ఉదాహరణ కోపముపొందిన జీవుడు ఒక విధమైన తాపము చెందుచున్నాడు. అట్లే కోపమునకు వ్యతిరేకగుణమైన దయ కలిగినపుడుకూడ అదే విధమైన తాపము పొందుచున్నాడు. సంతోషముతో నవ్వితే కన్నీరు వస్తాయి. సంతోషమునకు వ్యతిరేకమయిన దుఃఖము కలిగినపుడుకూడ కన్నీరే వస్తున్నవి. సంతోషముయొక్క వార్త వినినపుడు ఆ సంతోషముయొక్క అనుభూతికి శరీరములో గుండె నిలచిపోవుచున్నది. అట్లే దుఃఖకరమయిన వార్త వినినపుడుకూడ శరీరములో గుండె నిలచిపోవుచున్నది. ఇవన్నియు గమనించుచు పోయిన ప్రతి ఒక్క గుణమునందును గుణములు వ్యతిరిక్తముగ యున్నప్పటికి జీవుడు ఒకే అనుభూతిని పొందుచున్నాడని తెలియుచున్నది.

ఒక ఇక్కడ గుణమువలన పొందిన అనుభూతినే దాని వ్యతిరేక గుణమువలన ఎందుకు జీవుడు పొందుచున్నాడు. వ్యతిరేక గుణమువలన వేరువిధముగ అనుభూతిని పొందకూడదా? అనికొందరు అడుగవచ్చును. దానికి నా సమాధానము, చెట్టు ఒకటే అయినా దాని మొదలు ఒక రకముగా, కొమ్మలు ఒక రకముగా, ఆకులు ఒక రకముగా, కాయలు ఒక రకముగా ఉండును. చెట్టు వేపచెట్టయితే కాయలు కొమ్మలయందు మార్పు ఉన్నప్పటికి ఆ చెట్టును ఎక్కడ రుచి చూచిన దానినుండి చివరకు చేదునే గ్రహించుచున్నాము. అదే విధముగనే ఒక గుణముయందు మార్పు ఉండినా దానినుండి జీవుడు చివరకు ఒకే అనుభూతినే పొందుచున్నాడు. వేపచెట్టుయొక్క మొదలును ముట్టుకొనినకాని, కాయలను ముట్టుకొనినకాని వేపచెట్టునే ముట్టుకొన్నట్లు, కామమును పొందినా, నిష్కామమును పొందినా, జీవుడు కామ గుణముయందు చిక్కుకొన్నట్లే తెలుసుకోవలయును. నవ్వినా ఏడ్చినా కన్నీరే వస్తున్నవి. కనుక నవ్వులోనిదే ఏడ్పు అని గ్రహించుకోవలయును. ఎక్కడయితే కామమున్నదో అక్కడే నిష్కామముకూడ ఉద్భవించి ఉన్నది. ఎక్కడయితే క్రోధమున్నదో అక్కడే దయకూడ కలదు. దయవలన క్రోధమునకు,

కామమువలన నిష్కామమునకు, కష్టాలవలన సుఖాలకు, సుఖాలవలన కష్టాలకు విలువ వచ్చినది. మొదటి గుణమునందు రెండవ వ్యతిరేక గుణము ఉద్భవించకపోయియుంటే మొదటిగుణమునకు విలువఏమాత్రము లేకపోయెడిది అట్లే మొదటి గుణమునవలననే రెండవ గుణముకుకూడ విలువ వచ్చినది. క్రింది పటములో గుణముల మార్పును కొద్దిగ గ్రహించవచ్చును.



పై పటములో గుణముల మార్పులను అర్థము చేసుకొనుటకు కొద్దిగా చూపడమయినది. ఉపగుణములు కొన్నివేల సంఖ్యకు మించియున్నందువలన పూర్తిగా గుణముల అన్నిటిని చూపుటకు వీలుకాదు. కొద్ధి మాత్రము చూపిన గ్రహించుకొందురని తలంచుచున్నాము.

పైన చెప్పిన విధముగా గుణములు ఆరు అయినా మొత్తము 12 ఉన్నవి. మూడు గుణభాగములలో జీవుడు ఎక్కడో ఒక భాగమునందు మొత్తము 12 గుణములలో చిక్కుకొని, ఆ గుణములలో ఏదో ఒక దానిని చేరి దానిచేత ప్రేరేపింపబడినవాడై శరీరముతో పనులు చేయుచున్నాడు. వెలుపల శరీరముతో పనులు చేయునపుడుకూడ

లోపల జీవుడు ఏ గుణముతో ప్రేరేపింపబడినాడు అని తెలుసుకోవచ్చును. కామమను గుణమునకులోనయిన జీవుని పనిచూచి వాడు ఆశపడినాడు అని అంటున్నాము. జీవుడు లోపల కామములో పెద్ద గుణముతో కూడుకొనివుండిన వీడు అత్యాశపరుడని అనుచున్నాము. అట్లుకాక కామము అను గుణములలోనే జీవుడు చిన్న గుణమును పొందియుండిన మితమయిన ఆశకలవాడు అని అంటున్నాము. మితమయిన ఆశ అపరిమితమయిన ఆశ అని మనము అనుచునే ఉన్నాము. అట్లే నాకు చాలా కోపము వచ్చినదని, నాకు కొంచెము కోపము వచ్చినదని కొందరనుటకూడ వినుచున్నాము. వీటినిబట్టి మనకు లోపల ఒక గుణమే అనేక స్థాయిలలో ఉన్నదని, సులభముగ తెలియు చున్నది. అట్లే అన్ని గుణములను మనము గ్రహించవచ్చును.

శరీరము ధరించిన ప్రతి జీవుడు గుణచక్రములో గుణములందు చిక్కుకొని ఉన్నాడు. ఆ గుణముల కార్యములనే జీవుడు తన శరీరము ద్వారా చేయుచున్నాడు. జీవుడు చేయు ప్రతి కార్యమునకు కర్మ అనునది ఉన్నది. కర్మ సంభవించునది కార్యములవలన, కార్యములు సంభవించునది గుణములవలన గుణములు ఒకే జాతికాక వ్యతిరేక జాతిగాకూడ ఉన్నందువలన బయటి కార్యములుకూడ ఒకే గుణ కార్యములుకాక అందులకు వ్యతిరేకజాతి గుణ కార్యములుకూడ జరుగుచున్నవి. కార్యములను బట్టి కర్మ ఉండును. ఏగుణములకు జీవుడు చిక్కుబడి యుండునో అట్టి కార్యములనే, ఆచరించి అట్టి కర్మనే జీవుడు పొందుచున్నాడు. మొదటి ఆరు గుణములతో పనిచేసిన ఒక విధకర్మకలుగును. వ్యతిరేకమైన రెండవ ఆరు గుణములతో పనిచేసిన మరియొకవిధ కర్మకలుగును. గుణముల వలన రెండు విధముల కర్మ మానవులకు కలుగుచున్నది. ఆరెండు విధములు ఏవి అనగా ఒకటి పాపము రెండవది పుణ్యము. పాపపుణ్యములు రెండే అయినా పాపము అనేకరకములుగా ఉన్నది. మరియు పుణ్యము అనేక రకములుగా ఉన్నది. అట్లు పాపపుణ్యములు ఎందుకున్నవనగా! మొదటి కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యముల వలన పాపము సంభవించుచున్నది. ఈ పాపము కూడ ఒక్కొక్క గుణమునకు ఒక్కొక్క విధముగా ఉండును. ఆరు గుణములకు ఆరువిధములగు పాపములుండును. ఆ ఆరువిధముల పాపములయందు ఒక్కొక్క దానియందు అనేక

విధముల బేధములుండును. ఒక్కొక్కగుణమునకు అనేకమైన ఉపగుణములుండుట వలన, ఒక గుణమువలన సంభవించు ఒకపాపము కూడ ఉపగుణములనుబట్టి అనేక బేధము కల్గి ఉండును. అందువలననే నేడు ప్రపంచమున పాపము అనేక స్థాయిలలో అనుభవించు వారిని చూచుచున్నాము.

వ్యతిరేకమైన రెండవరక నిష్కామ, దయ, ఔదార్యము, వైరాగ్యము, వినయము, ప్రేమ అను ఆరుగుణముల వలన పుణ్యము లభించుచున్నది. ఆ పుణ్యము కూడ ఒక్కొక్క గుణమునకు ఒక్కొక్క విధముగా ఉండును. ఆరు గుణములకు ఆరు విధములైన పుణ్యములుండును. ఈ ఆరు విధ పుణ్యములందు ఒక్కొక్కదాని యందు అనేక విధములైన భేదములుండును. ఒక్కొక్క గుణమునకు అనేకమైన ఉపగుణములుండుట వలన, ఒక గుణమునందు సంభవించు పుణ్యముకూడ ఉపగుణములను బట్టి అనేక భేదములు కల్గిఉండును. అందువలననే ప్రపంచములో అనేక స్థాయిల పుణ్యము అనుభవించు పుణ్యాత్ములను చూచుచునే ఉన్నాము.

12 గుణముల వలన పాపపుణ్యములు సంభవించుచున్నవని, అందు పాపపుణ్యములు 12 విధములుగా ఉన్నవని, ఆ 12 విధములందు కూడ ఒక్కొక్క రకము అనేక రకములుగా ఉన్నదని తెలుసుకొన్నాము.

ఇంతవరకు పాపపుణ్యముల తారతమ్యములు, అవి ఎట్లు సంభవించుచున్నది తెలుసుకొన్నాము. పాపపుణ్యములు జీవుని శరీరమునందుగల కర్మచక్రమును చేరుచున్నవి. 12 గుణముల వలన సంభవించు 12 విధములైన పాపపుణ్యముల నిలువ యుండుటకు కర్మచక్రము 12 భాగములుగానే తయారయినది, కర్మచక్రమునందు పాపపుణ్యములు ఎట్లు నిలువ యుంటున్నది ఇంతకుముందే తెలుసు కొన్నాము.

కర్మచక్రము మీద అధికారము కాలచక్రము కల్గియున్నది. కర్మచక్రమునందలి కర్మను తిరిగి మానవులను అనుభవింపజేయువారు నవగ్రహములు. కర్మచక్రము 12

భాగములుగా యుండి అందు కర్మనిలువయున్నది కాబట్టి, కాలచక్రము కూడ 12 భాగములుగా తయారయి ఒక్కొక్క విధకర్మను అనుభవింప జేయుశక్తి ఒక్కొక్క భాగము కల్గియున్నది. కర్మచక్రములోని 12 భాగముల కర్మమీద కాలచక్రము 12 భాగములు అధికారము కలిగి 9 గ్రహములను తనయందు కాలానుగుణ్యముగ తిరుగునట్లు చేయుచున్నది.

కాలచక్రము 12 భాగములుగా తయారయిన దానికి కారణము కర్మచక్రము 12 భాగములు ఉండడమే, కర్మచక్రము 12 భాగములుగయుండుటకు కారణము కర్మ 12 విధములుగా ఉండడమే. కర్మ 12 విధములుగా యుండుటకు కారణము గుణములు 12 విధములుగా ఉండడమే. ఇట్లు ఒకదానికొకటి సంబంధము కల్గియుండుట వలన చివరకు కాలచక్రము 12 భాగములుగానే తయారయి నిలచినదని తెలుసుకోవలయును.

ఇంతవరకు ఎవ్వరు తెలియజేయని దానిని అనేకముగా నిదర్శనములతో తెలియజేసినాము. అట్లు తెలియజేయుటకు కారణము మా యొద్దనున్న జ్ఞానధనమును నిస్వార్థముగా పంచవలయునను కోరిక యుండడమే మరియు మాజ్ఞానము యొక్క స్థాయిని ప్రపంచములో ఎవ్వడో ఒక్కడయిన అందుకోగలడను ధ్యేయముతోనే తెలియపరచినాము. ప్రతియొక్క విషయమునకు పరమాత్మ చెప్పిన భగవద్గీతను ప్రమాణముగా చూపుచు, మరియు ప్రపంచములో కనుపించు నిదర్శనములను చూపుచు తెలిపినప్పటికి ఈజ్ఞానము అందరికి సరిపడదని నాకు బాగుగ తెలుసును. ప్రపంచ జ్ఞానములో పేరుగాంచినవారు, పరమాత్మ జ్ఞానములో ఏమాత్రము పరిచయములేని వారు నాజ్ఞానమును అర్థము చేసుకొనలేక వీడు ఎంతమటుకు వాడు అని నన్ను పరీక్షించుటకు మొదలు పెట్టుదురు. అజ్ఞానులు జ్ఞానులను పరీక్షించుటకు వీలుకాదని వారికి తెలియదు, ఎక్కువ చదువువచ్చిన వాడు తక్కువ చదువు వచ్చిన వానిని పరీక్షించవచ్చును. చదువురాని వాడుకాని తక్కువ చదువు వచ్చిన వాడుకాని ఎక్కువ చదువు వచ్చిన వానిని పరీక్షించుటకు ఎట్లగును. పూర్తి అజ్ఞానులుకాని, కొద్దిజ్ఞానమున్న వారుకాని పరిపూర్ణజ్ఞానులను

పరీక్షించితే, ఆపరీక్షకు జ్ఞానులు నిలచిన ఆపరీక్షఫలితమును అజ్ఞానులు గ్రహించలేక, జ్ఞానులను కూడ అజ్ఞానులుగానే లెక్కించుకొనుచున్నారు.

నన్ను తెలుసుకోలేని వారు రేపు నన్ను కూడ నీవు జ్ఞానివా! లేక యోగివా? అని అడుగవచ్చును. అందువలన నన్నుగురించి కొద్దిగ తెలుపుచున్నాను. నేను యోగిని కాను, జ్ఞానిని కాను అట్లని పూర్తి అజ్ఞానిని కాక ఒక సాధారణవ్యక్తిగ ఉన్నవాడిని. మూడు గుణములను జయించినవాడను ఏమాత్రము కాను. మూడు గుణములందు అన్ని భాగములతో సంబంధము కల్గియున్నవాడిని. నేటి ప్రపంచములో యున్న అజ్ఞానుల భావనకు మరియు జ్ఞానుల భావనకు సరిపడని వానిని. నాకు దగ్గరగాయుండి, నాకు భక్తులుగయున్న కొందరు జ్ఞానులు నన్ను సర్వప్రపంచము నిండిన ఆదిదేవునిగానే భావించుచుందురు. కొందరు నాకంటేచెద్దవాడులేడు అని కూడ అనుచుందురు. ఎవరు ఏవిధముగా భావించుకొనిన నేను మాత్రము సాధారణవ్యక్తినే. నేను ప్రపంచములో కమ్మకులమున పుట్టినవాడను. తల్లి తండ్రులు పెద్దమ్మ అనుగ్రామదేవతను కొలిచెడివారు కనుక నాకు పెద్దన్ననాయుడు అను పేరు ఉంచినారు. పుట్టినపుడు తల్లి తండ్రులు నామధేయము చేసినట్లు గురుపుత్రుడనైనపుడు గురువు ప్రబోధానంద అని పేరు పెట్టెను. ఈప్రపంచనాటకములో ఎన్ని పేర్లు పెట్టుకొన్న ఈవేష ముందువరకే. అందువలన నా నిజమైన అసలు పేరు నాకు ఏమాత్రము తెలియదనే చెప్పుచున్నాను. ఈగ్రంధములో చెప్పినంతటి జ్ఞానిని నేను ఏమాత్రము కాను. ఈ గ్రంధవిషయములన్నియు నాకు తెలియకుండినా పరమాత్మయే ప్రేరేపించి వ్రాయించినాడు. ఈగ్రంధరచయిత నిజముగ పరమాత్మయే. నిమిత్తమాత్రుడైన నేను ఒక కలములాంటి వాడనే. ఈగ్రంధమునకు కర్తయైనవాడు పరమాత్మయే కనుక దీని వలన లభించెడు కీర్తి అపకీర్తి ఆయనకే చెందును.

ఇంతవరకు కాల, కర్మ, చక్రములు 12 భాగములుగా ఎందుకున్నది తెలుసుకొన్నాము. మరియు గుణములు 12 ఉన్నవనికూడ తెలుసుకున్నాము. 12 గుణములందు జీవుడు బంధింపబడి అవి ప్రేరేపించినట్లు ఆడుచు కర్మలను సంపాదించుకొనుచున్నాడు. ఆ కర్మలు జన్మలకు కారణమవుచున్నవి. అందువలన

మనము కామ, క్రోధ, మద, మాత్సర్యములను కాని, నిష్కామ, దయ, ఔదార్య, వైరాగ్య వినయ, ప్రేమ గుణములను గాని చెందక యుండిన ఎట్టి విధ కర్మను పొందనివారమై జన్మ రాహిత్యమయిన మోక్షమును పొందుదుము. అట్లు కాకుండ 12 గుణములలో ఏ ఒక్క గుణమును పొందినా ఆగుణమువలన వచ్చుఫలితమును అనుభవించుటకు తిరిగి జన్మించవలసి వచ్చును. గుణములన్నియు ప్రకృతికి సంబంధించినవే కాబట్టి, మంచి గుణములనుగాని, చెడ్డగుణములను గాని నమ్మకయుండి మంచి చెడ్డకు సంబంధము లేక యుండినవారు పరమాత్మను చేరగలరు. ఇక్కడ కొందరు "చెడ్డగుణములను విడువవచ్చును కాని, మంచిగుణములనుకూడ విడువవలయునంటే ఇదేమి మాట. ప్రేమ భావమును, వైరాగ్యమును, దయా భావమును బోధించినవారు ఎందరోయుంటే, నీ బోధ వాటినికూడ విడువవలయునంటే, ఇదేమి బోధ. అట్లు ప్రేమను, దయను అన్నిటిని విడచిన మానవులు ఇంకా చెడిపోరా?" అని అడుగవచ్చును. ఈ సంశయము జ్ఞానమార్గములో ఒక పెద్ద కొండలాగ అడ్డముండేదే. కావున ఈ సంశయమును తీర్చుకొనుటకు నేనుకూడ ఎంతో ప్రయత్నించగా నా సంశయమునకు పరమాత్మనుండి క్రింది విధముగా సమాధానము లభించినది.

"నేను విడువమంటున్నది మొత్తము 12 గుణములను. 12 గుణములను విడిచిన వానివలన వాటినుండి జీవునకు విడుదల దొరుకుచున్నది. ఆ విడుదలనే ముక్తి అని అందురు. 12 గుణములను జయించుకొన్నవాడే త్రిగుణాతీతుడై నా దగ్గరకు చేరగలుగుచున్నాడు. ప్రేమను విడచి అసూయను పొందమని, నిష్కామమును విడచి కామమును పొందమని దయను విడచి క్రోధమును పొందమని నేను ఏ మాత్రము చెప్పలేదు. నాబోధను గ్రహించుకోలేనివారు, వేరువిధ భావనను పొంది నన్ను ఏమాత్రము తెలుసుకోలేరని తెలుపుచున్నాను. నాబోధయందలి రహస్యమును ఎవడు బాగుగ గ్రహించుకొనునో వాడు నన్ను సులభముగ చూడగలడు మరియు పొందగలడు. నేను గీతాశాస్త్రములోనే సుఖ దుఃఖములను, లాభ నష్టములను, మిత్ర శత్రువులను, మాన అవమానములను, ద్వందములను వర్జించవలయునని ఎన్నోమార్లు తెలిపినాను."

పై విధముగ పరమాత్మ తెలిపియుండగ మనము అర్థము చేసుకోలేక తిక మక పడుచున్నాము. కొంతమంది బోధకుల దగ్గరకుపోయి అసలయిన బోధ తెలుసుకుందాము అని అనుకుంటే అక్కడ బోధ చేయువారు చెడ్డగుణములను విడచి మంచి గుణములను అలవర్చుకొమ్మనియే చెప్పుచుందురు. మంచి గుణములవలనకూడ జన్మలు వచ్చుచున్నవని, జన్మలు లేని స్థితికి పోవలయునంటే మంచి చెడ్డ రెండింటిని విడువవలయునని చెప్పకున్నారు. ఒకవేళ ఎవడయిన చెడ్డకు వ్యతిరేకము మంచి. మంచికి వ్యతిరేకము చెడ్డ. ఈ మంచి చెడ్డగుణములను పూర్తిగ వదలవలయునని తెలిపిన, ఆ సమయములోనే అక్కడే మంచినే అలవర్చుకోలేనివారికి చెడ్డ మంచి విడచిపెట్టే బోధ చెప్పితే ఎట్లు అని అంటున్నారు. బ్రహ్మవిద్య పరమాత్మను తెలియజేయు బోధ కాబట్టి యదార్థము తెలియజేయవలసినదే. యదార్థము గ్రహించినవారు ప్రయత్నించి సాఫల్యము పొందవచ్చును. అట్లుకాక అది ఎలా సాధ్యమగును అని అనుకుంటూ యుండేవారు ఎప్ప టికి పరమాత్మను తెలుసుకోలేరు.

ప్రపంచములో అన్ని మనకిష్టమైనట్లే ఉండవలయునంటే ఎట్లు సాధ్యమగును. బ్రహ్మవిద్యయందుకూడ పరమాత్మ తెలియజేసిన ప్రకారము నడచుకుంటేనే బ్రహ్మవిద్యయందు ఉత్తీర్ణులగుదురు. అట్లు నడచుకొనక రామా, క్రిష్ణా అనుకుంటే చాలులే అంటే ఏమి ప్రయోజనము? పైన మన నోరు రామా, క్రిష్ణా అంటూయుండినా లోపల గుణములు మాత్రము జీవుని చిక్కించుకొనియే ఉండును. ప్రపంచములో ప్రజల మన్ననలను పొందవలయునను కోర్కెగలవారు ప్రజలను అనుసరించియే బోధించుచుందురు, ప్రజలకు అనుకూలముగానే చెప్పుచుందురు. ప్రజలుకూడ అట్టి బోధకులనే మెచ్చుకొనుచుందురు. పరమాత్మను సరిగ తెలియజేయు బోధకుడు పరమాత్మ చెప్పినయదార్థములనే నిష్కర్షగా చెప్పును. అట్టివాడు ప్రజలయందు నేను గౌరవము పొందుదునో లేదో అని ఏ మాత్రము అనుకొనడు.

దేశములో అసలయిన బోధచేయువారు, అసలయిన జ్ఞానము కలవారు మరియు యోగశక్తి కలవారు ఉన్నారు, వారు ఆచరించు ప్రతి ఆచరణ పరమాత్మ తెలిపిన ప్రకారమే

ఉండును. ఇంటి యజమాని ఏ ప్రకారము నడచుకొనుచుండునో అట్లే ఇంటిలోనివారందరు ప్రవర్తించినట్లు పరమాత్మ తన కిష్టమని ఎట్లు తెలిపియున్నాడో అట్లే ఆయన భక్తులు నడచుకొనుచుందురు. పరమాత్మ నేను ప్రపంచములోనికి ఒక ముఖ్యమైన పని కలిగి వచ్చుచున్నాను. ఆ పనిని నెరవేర్చడమే నా కర్తవ్యము అని అన్నాడు. ఆయన భక్తులుగూడ వారికి చేతనయినంత పరమాత్మ పనిని చేయవలయుననియే ఉందురు. తండ్రిచేయు పనిని బిడ్డలుగూడ తమ చేతనయినంత తప్పక చేయుదురు. పరమాత్మ నాకు ప్రపంచములో ఒకపని ఉన్నదని తెలియజేసిన తర్వాత ఆ పనిని ఆయన ప్రియకుమారులయిన వారు చేయక ఉందురా? ఇక్కడ కొంతమందికి పరమాత్మకు ఏమి పని ఉన్నది అను సంశయము బయలుదేరవచ్చును. దానికి సమాధానము, మొదట ప్రపంచములో పరమాత్మను [తన్నుతాను] మరువకుండుటకు, మాయలో చిక్కుకొని పోకుండుటకు కొన్ని ధర్మములను పరమాత్మయే నెలకొల్పినాడు. కాలక్రమేపి ఆ ధర్మములు ఒక్కొక్కటిగా నాశనమగుచు ధర్మములు అధర్మములుగా మారిపోవుట సంభవించుచుండును. అట్టి సమయములో ఎక్కడ అవసరమో అక్కడ పరమాత్మ ఒక శరీరమును ఆశ్రయించి, ఆ శరీరమునుండి తిరిగి మొదటి ధర్మములను ప్రతిష్ఠించుచుండును. ఈ ప్రకారము ప్రతి యుగములోను ధర్మములు అధర్మములుగా మారిపోవుచునే ఉన్నవి. వాటిని తిరిగి ధర్మములుగానే నెలకొల్పుటకు పరమాత్మ తాను మానవునిగానే వచ్చుచున్నాడు. దానివలననే తన శాస్త్రమయినగీతాశాస్త్రములో జ్ఞానయోగమందు

4 శ్లో॥ 7 యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్.

4 శ్లో॥ 8 పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్,
ధర్మ సంస్థాపనార్థాయ సమ్భవామి యుగే యుగే.

"భూమిమీద ఎప్పుడు ధర్మమునకు ముప్పుకలిగి అధర్మము వృద్ధి చెందునో అప్పుడు నన్ను నేను సృజించుకొని భూమిమీద అవతరించు చున్నాను. జ్ఞానులను సంరక్షణజేయుటకు, అజ్ఞానులను నాశనము చేయుటకు, సకల ధర్మములను నెలకొల్పుటకు నేను యుగ యుగమున పుట్టుచున్నాను" అని పరమాత్మ అన్నాడు. ఇచ్చట పరమాత్మ తన పనిని తెలిపివున్నాడు. ఆ పని సకల ధర్మములను నెల కొల్పుటయేననికూడ తెలిపి ఉన్నాడు. సకల ధర్మములు ఏవి? ఎట్లుండును అని మనము విశదీకరించుకొనిన ఆ ధర్మములన్నియు తన్నుతాను తెలుసుకొను నిమిత్తమైయున్నవని తెలియుచున్నది. అనగా పరమాత్మను తెలుసుకొను నిమిత్తముయుండునవి అని అర్థము. పరమాత్మ భూమిమీద అవతరించి తన్ను తాను తెలుపుపని చేయుచుండగా ఆయన ప్రియకుమారులైన జ్ఞానులు, యోగులు ఊరకయుండుట సమంజసమా? తన్ను తాను [పరమాత్మను] తెలుసుకొను ధర్మములను తెలిసినవాడు ఎప్పటికి ఊరకయుండడు. ప్రతి యోగి పరమాత్మ ధర్మములను నెలకొల్పుటకు అంతోఇంతో పాటుపడుచునే ఉండును.

భగవద్గీతాశాస్త్రమంతయు తన్నుతాను తెలుసుకొను నిమిత్తమై పరమాత్మ తెలిపి ఉన్నాడు. ఎక్కడ చూచినా పరమాత్మను తెలుసుకొని ఆయనయందు ఐక్యమగు ధర్మములే ఆయన పల్కిన గీతయందు కనుపించుచున్నవి. ఆనాడు అర్జునునికి బోధకుడు ఆ పరమాత్మయే, ఈనాడు నీకు మరియు నాకు బోధకుడు ఆ పరమాత్మయే. ఇక్కడ కొందరు అర్జునునికి కృష్ణుని రూపముగా పరమాత్మ తెలియజేసియుండవచ్చును. కాని ఇక్కడ ఇపుడు నీకు నాకు బోధ చేయువాడు పరమాత్మయే అని మీరు అంటున్నారే, పరమాత్మయే తెలుపుచున్నాడని మీరు ఎట్లు చెప్పగలరు అని అడుగవచ్చును. దానికి సమాధానము ఏమనగా! ప్రపంచములో ఎచ్చట తన్నుతాను తెలుసుకొను బోధజరుగుచున్నదో, ఎచ్చట అసలయిన పరమాత్మ తెలియజేయు బోధ జరుగుచున్నదో, ఎచట సమస్త జీవరాసులందలి మూల చైతన్యమును తెలియజేయు బోధ జరుగుచున్నదో, శరీరములోనే నేను ఉన్నాను. నీ చూపు అంతయు శరీరములోనేయుంచుకొని చూచుకో అని ఎచ్చట తెలియుచున్నదో అక్కడంత పరమాత్మయే పలుకుచున్నాడని తెలుసుకోవలయును.

ప్రపంచములోనే నేను ఉద్భవించుచున్నాను. అని పరమాత్మ తెలియజేసినాడు. ఆయన ఎచ్చట ఉద్భవించినది, ఏశరీరము ధరించినది తెలుసుకొనుట చాలా సులభము. ఎట్లనగా ఎచ్చటయితే పూర్వకాలముండి ఇప్పుడు లేకుండ పోయిన ధర్మములు నెలకొల్పబడుచున్నవో అచ్చట ఆయన ఉన్నాడని తెలుసుకోవచ్చును. ఏశరీరమునుండి ఈకాలములో రూపు మాత్రమైన లేకుండ, ఎవ్వరికి తెలియకుండ పోయిన ధర్మములు పలుక బడుచున్నవో ఆశరీరమునే పరమాత్మ ఆశ్రయించి వున్నాడని తెలుసుకోవచ్చును. అట్లు పరమాత్ముని దివ్యములైన పనులను, మరియు ఆయన జన్మములను ఎవడు గ్రహించుచున్నాడో వాడు మిక్కిలి జ్ఞానియై పరమాత్మయందు ఐక్యము కాగలడు. ఈనామాట అబద్ధమనుకొనువారు చాలామంది యుండవచ్చును. ఇదిఈనాటి నామాటయే కాదు, ఆనాటి పరమాత్మమాటయే "జన్మకర్మచమే దివ్యమేవం యోవేత్తి తత్త్వతః, త్యక్త్వాదేహం పునర్జన్మ నైతి మామేతి సోర్జునా!" "అర్జునా! కొద్దిమాత్రమైన నాదివ్య కర్మములను, జన్మములను గ్రహించెడి నరుడు మరణించినను వేరు జన్మము ఎత్తబోడు. వాడు నాశనములేని వాడై నాయందు ఐక్యము కాగలడు." ఈవిధముగ పరమాత్మ తెలియజేసియుండగ నమ్మలేనివారు, సంశయాత్మపరులు ఇహపరములందు శాంతి చెందలేక సంసార దుఃఖములనే పొందుచుందురు.

పరమాత్మయే ఆనాడు ఈనాడు శరీరమునుండి మాటల రూపముగ పల్కి అజ్ఞానులను జ్ఞానులుగా మార్చివేయుచున్నాడు. పరమాత్మ అంతటయుండినను ఒక శరీరమునుండి బయల్పడి తనధర్మములన్నియు తాను తెలియజేసుకొనుచున్నాడు. చివరకు తననే నమ్మమని, తననేకొల్చమని, తనకే సర్వస్వము అర్పణచేయమని నేనే నిన్ను ముక్తుని జేయువాడనని పెద్దధర్మములను తెలియజేసినాడు. ఇక్కడ ఇదిఏమి పెద్ద ధర్మమని కొందరడగవచ్చును. దానికి సమాధానము, గీతాశాస్త్రమందు పరమాత్మ అర్జునునికి అనేక ధర్మములను తెలియజేసి చివరకు అన్నిధర్మములకంటే మించిన ధర్మమును తెలియజేయుచున్నాను. ఇది అన్ని ధర్మముల యొక్క సారాంశము అని పరమాత్మ తెలియజేసినాడు.

18 శ్లో॥ 64 సర్వగుహ్యతమం భూయ శ్శృనుమే పరమం వచః,
ఇష్టోఽసి మేదృఢమితి తతో వక్ష్యామి తేహితమ్.

18 శ్లో॥ 65 మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు,
మామే వైష్యసి సత్యం తే ప్రతి జానే ప్రియోసిమే.

"అన్ని రహస్యములందు ఉత్తమమైన, ఇంతవరకు నేను పలికిన మాటల యొక్క సారాంశము వినుము. నీవు నాకు మిగుల ఇష్టుండవగుటచే నీకు ఇంతగా చెప్పుచున్నాను. నన్ను తలంచుచుండుము. నాకేభక్తుడువుగ ఉండుము. నన్నే మ్రొక్కుము. నాపూజయే చేయుము. అట్లుచేసిన నన్నేపొంది నాయందే ఐక్యమగుదువు. ఈమాటనిజము. ఈవిధముగ యుండిన నాకు ప్రియుడవగుదువని ప్రతిజ్ఞచేసి తెలుపుచున్నాను." అని తనధర్మములందు అత్యధికమైన దానిని స్వయముగ ఆయనే తెలియజేసినాడు ఇంత దృఢముగ తెలియజేసినను కొందరు గ్రహించలేక పోవుచున్నారు. ఎవరయిన తెలిసినవారు గీతాశాస్త్రమును గురించి, అందలి ధర్మములను గురించి, ఆ శాస్త్రమును బోధించినవానిని గురించి చెప్పితే, పరమాత్మ ధర్మములకు విరుద్ధముగా యున్న భక్తులందరు కృష్ణుడు దేవుడా? ఆయన మాట అంతప్రాముఖ్యమా! అని అనుచున్నారు. వారికి కృష్ణుడు మానవుడే అయిన ఆయన శరీరమునుండి పల్కుచున్నశక్తి పరమాత్మశక్తి అందువలన కృష్ణుడను పరమాత్ముడే అనుచున్నాము అని జవాబు చెప్పితే దానికివారు మనయందు కూడ పరమాత్మ ఉన్నాడు కదా! మన యందు మాట్లాడు శక్తికూడ అదేకదా! మనము కూడ పరమాత్ములమేనా అని తిరిగి ప్రశ్నించుచున్నారు. అటువంటి వారిని చూచి నవ్వాలో ఏడ్వాలో మాకు అర్థముకాలేదు.

అన్నిశరీరములందు పరమాత్మయే ఉండినా, ఆయనశక్తియే సర్వజీవరాసులను నడుపుచుండినా, మనమంతయు జీవాత్మలమే. పరమాత్మలము ఏమాత్రముకాదు, ఆత్మఒకటే అయిన జీవాత్మ పరమాత్మ అనిరెండు విధములుగ విభజింపబడినది, కర్మతో కూడుకొని గుణములందు చిక్కుకొనియుండు ఆత్మ జీవాత్మ. కర్మతో కూడు కొనక

గుణములందు చిక్కుకొనక యున్న ఆత్మ పరమాత్మ. జీవుడు జన్మజన్మల కర్మముల సంబంధము కల్గియుండును. పరమాత్మకు కర్మ ఏమాత్రము లేకుండిన తానే ఒక కర్మను స్వయముగ సృష్టించుకొని, ఒక శరీరమును ఆశ్రయించి భూమి మీద పుట్టుచున్నాడు. పరమాత్మ మానవుని మాదిరే ప్రవర్తించి తనధర్మములను మాత్రము సమయానుకూలముగ బయటికి తెలియజేసి పోవును. సాధారణజీవులు ధర్మములు ఏవోతెలియక అధర్మములను వర్తించుచున్నారు. ఇట్లు అనేకమైన భేదములు పరమాత్మ జీవాత్మల మధ్య యుండగా అది గ్రహించని మూఢులు కృష్ణుడు దేవుడైతే మేము దేవుళ్లము ఎందుకు కాము? అని ప్రశ్నించుచున్నారు. అహంకారముతో ఎవ్వడయితే వున్నాడో వారంతయు స్వయముగా పరమాత్మ తెలియజేయుచున్నను, నాకంటే గొప్పవాడ, నాకంటే తెలిసినవాడ అని అహముచేత పరమాత్మభావనను గ్రహించుకోలేక భ్రష్టులయిపోవుదురు. నేను అను అహమును విడచిన నీకంటే వేరై నీయందేవున్న సారాంశము నీకే తెలియును. అహమును విడువకున్నవారు వానియందే వానికంటే వేరైవున్న పరమాత్మను తెలుసుకోలేరు. అటువంటివారు పరమాత్మ మాటలను వినినను అహముచేత ఆ మాటలను లెక్కపెట్టుకోక దానికి వ్యతిరేకముగ నడిచి ఇంకనూ భ్రష్టులగుదురు. పరమాత్మ ఏదో ఒక సందర్భమును వినియోగించుకొని ఆయన విషయము మనకు తెలియజేసినప్పటికిని వినకుండ పోయినవారు తప్పక నాశనమగుదురు. ఈమాటనే గీతాశాస్త్రమున "మచ్చిత్త సర్వదుర్గాణి మత్ప్రసాదాత్తరిష్యసి, అథచేత్త్వ మహంకారాత్ న శ్రోష్యసి వినంక్ష్యసి." "చిత్తమున నన్నే నమ్ముకొనిన సర్వదుఃఖములను నాకటాక్షమే తొలుగజేయును. అట్లుకాక నీవు అహంకారమునే వహించి నామాట వినకుండిన నాశనమగుదువు" అన్నాడు. అందువలన పరమాత్మ స్వయముగ పల్కిన మాటలను ఎవరయితే వినియు వాటిని ఖండించి వ్యతిరేకముగ మాట్లాడుదురో వారికి పరమాత్మనుండి కష్టమే సంభవించును. ఆనాడు కృష్ణుడేకాడు ఈనాడు ఏశరీరమునుండి పరమాత్మ స్వయముగ పల్కుచున్నాడో ఆజీవుని కూడ దేవుడనే చెప్పవచ్చును.

ఈ కాలములోకూడ పవిత్రమయిన యోగులు భూమిమీద ఉన్నారు. యోగులందు విశేష జ్ఞానశక్తిగలవారుకూడ ఉన్నారు. వారిని ఉత్తమ యోగులని మనము అనుచున్నాము.

అట్టి యోగులు తమయందుయున్న జ్ఞానశక్తిని ఏమాత్రము కర్మకల వారియెడల వినియోగించరు. అణుమాత్రము జ్ఞానశక్తి నష్టమైన ఎంతో నష్టమైన దానితో సమానముగ వారు భావించుకొందురు. కాని అజ్ఞానులను జ్ఞానులుగామార్చు నిమిత్తమో, లేక ఎల్లప్పుడు తననే నమ్మి స్మరించువారిని కర్మనుండి విముక్తులచేయు నిమిత్తమో జ్ఞానశక్తిని యోగులు వినియోగించుదురు. యోగశక్తి [జ్ఞానశక్తి] ప్రపంచ కార్యముల నెరవేర్చుటకు పనికిరాదు. అందువలన ప్రపంచకార్యముల యెడల యోగశక్తిని వినియోగించరు.

యోగులకు యోగశక్తి అనునది కంటికి కనపరాని ధనము, కంటికి కనుపించు ప్రపంచ ధనమునుకూడ దానము చేయువేళదానమును అర్థించినవాడు ఈ దానమునకు తగునా? తగడా? అని ఆలోచించి దానము చేయవలయునని పెద్దలు తెలిపియుండిన, ప్రపంచధనముకంటే ఎన్నోరెట్లు విలువగల యోగశక్తి అను ధనమును దానము చేయవలయునంటే దానముచేయు యోగులు ఎంత జాగ్రత్త గలిగి దానము చేయుదురో మీరే ఆలోచించండి. ప్రపంచధనము దానము చేయుటకు యోగ్యత, అయోగ్యత చూడవలయునంటే ఇక జ్ఞాన ధనమును దానము చేయుటకు ఎంతగా యోగ్యత అయోగ్యతను చూడవలయునో మీరే ఆలోచించండి.

భూమిమీద యోగశక్తిగల యోగులు కొందరున్నారు. అటువంటి యోగులను మానవులు ఆశ్రయించి తమ కోర్కెలను తీర్చమని వేడుకొనుచుందురు. మానవులు అట్లు వేడుకొనినప్పటికి యోగులు ఏ మాత్రము తమ శక్తిని వారి కోర్కెల నిమిత్తము వినియోగించరు. ఎందుకనగా కోర్కెలు తీర్చు గుణము యోగశక్తికి లేదు. కర్మను కాల్చుగుణము మాత్రమే యోగశక్తికి కలదు. అందువలన యోగులు వారి కోర్కెలను తీర్చుటకు నిరాకరించుదురు. కొందరు మీవద్దయున్న జ్ఞానశక్తితో మా కర్మను తొలగించమనెడివారుకూడ కలరు. ఇతరుల కర్మను కాల్చుటకు యోగశక్తి ఉపయోగపడును. కాని యోగి తన యోగశక్తిని ఇతరులు కోరినంతనే వారికి వినియోగించడు. ఒకవేళ అటుల ఒకనికి వినియోగించిన రెండవవాడుకూడ అట్లే కోరును. వాని తర్వాత మూడవవాడు కోరును. ఇట్లు ఒక్కొక్కరికి తన శక్తిని వినియోగించిన

ఆఖరుకు యోగి కూడ శక్తిహీనుడై సాధారణ మానవుడైపోవును. అందువలన యోగులు శక్తిని భద్రముగా యుంచుకొందురు. తాము శక్తివంతులైనట్లు ఎవరికి తెలియకుందురు. ఒకవేళ ఇతరులకు తెలిసిన తమయొద్ద యోగశక్తి లేని మాదిరి ప్రవర్తించి వారినుండి తప్పించుకొందురు. ఇతరులను కర్మనుండి తప్పించవలయునని యోగికి తలంపు వచ్చినపుడు వాడు కోరకుండినా తానే తన యోగశక్తిని వినియోగించి వారి కర్మను తొలగించును.

భూమిమీద భక్తుల కోర్కెలు తీర్చువారుకూడ ఉన్నారు. వారు యోగులు కాకపోయినప్పటికి బహుశా యోగులను పేరుతోనే పిలువబడుచున్నారు. ప్రజలలెక్కలో వారు యోగులయిన పరమాత్మభావనలో వారు తపస్వికులే, తపస్సు చేసినవారు ఆ తపస్సుయొక్క ఫలితముగా తపశ్శక్తిని పొందియుందురు. తపశ్శక్తికి కర్మనుకాల్చుగుణము లేదు తపశ్శక్తికి ప్రపంచకార్యముల నెరవేర్చు గుణము కలదు. అందువలన తపశ్శక్తి పరులు తమ శక్తిచే ప్రపంచకార్యములనెరవేర్చుచు ప్రజలయందు కీర్తి ప్రతిష్టలు సంపాదించు కొనుచుందురు. యోగులకు తపస్వికులకు, యోగశక్తికి తపశ్శక్తికి ఎంతో భేదమున్నదని గ్రహించవలయును.

మానవులు తనను తెలుసుకొనునిమిత్తము పరమాత్మ అనేక అవతారములను ధరించి భూమిమీద తిరిగి ఎన్నియో బోధలు చేసినాడు. ఎన్ని అవతారములెత్తినా ఎచ్చట బోధించిన ఆ బోధలందలి సారాంశము తనను తెలుసుకొమ్మనియే ఉండును. పరమాత్మ బోధలయొక్క సారాంశము ఒక్కటే అయినా, ఆ బోధలను వినిన మానవులు అందలి సారాంశమును గ్రహించుకోలేకపోయినారు. ఒక అవతారమున చెప్పినమాటను పట్టుకొని ఇంకొక అవతారమున చెప్పిన మాటలను ఖండించుచున్నారు. కానీ రెండిటియొక్క సారము ఏమని తెలుసుకోలేదు. చెప్పినవాడు పరమాత్మయే అయినా అవతారములపేర్లు వేరు కాబట్టి ఒక్కొక్క అవతారమును కొందరునమ్మి ఆ అవతారముయొక్క బోధ ప్రకారము నడచుకొనుచు, వేరే అవతారమును వేరే బోధను ఒప్పుకోక మా దేవుడు వేరు మీ దేవుడు వేరు. మా మతముబోధ వేరు మీ మతముబోధ వేరు అని భేదములు కలిగి ఉన్నారు. ఈ

విధముగ 84 లక్షల జీవరాసులందు ఒకేజాతి అయిన మానవులు వేరు వేరు ప్రవర్తనలు, ఆచరణలు కలిగి ఉన్నారు.

మతములు ఎన్ని అయిన అందలి ఆచారాలు వేరు వేరుగయుండినా వాటి అన్నిటియొక్క భావము నన్ను తెలుసుకొమ్మని నాదగ్గరకు చేరమనియేకదా ఉన్నది. హిందూమతమున పరమాత్మ నన్ను తెలుసుకొమ్మని, నాలోనికి ఐక్యముకమ్మని బోధించినాడు. క్రైస్తవమతమున నాయందు విశ్వాసముంచుము. నీ పాపములను క్షమించి పరలోకరాజ్యమున చేర్చుకొందునని అన్నాడు. మహమ్మదీయ మతమునకూడ పరమాత్మ [అల్లా] యే మహమ్మద్ రూపమునవచ్చి అల్లాను తెలియబరచినాడు. అల్లా చెప్పిన ప్రకారము నడుచుకొమ్మన్నాడు. అట్లు నడచుకొనిన అల్లా దగ్గరకు పోయెదవు అని తెలియజేసినాడు. ఈ విధముగా పరమాత్మ అనేక అవతారములలో మనుష్యులందుండి వారికి తనను తెలియజేసి పోవుచున్నాడు. ఎక్కడ ఆయన ఏమి తెలియజేసిన ఒక్క విషయమేకదా! అని ఆలోచించలేని ప్రజలు మా మతమువేరు మా మతమువేరు అని వాదించుచున్నారు. తొమ్మిది రంధ్రముల శరీరముతో పుట్టిన మానవులు ఎన్ని మతములయినా పరమాత్మ మతము ఒక్కటియే.

పరమాత్మ మతము ప్రకారము సర్వజీవులు చావవలసినదే మరియు పుట్టవలసినదే. పరమాత్మ లెక్క ప్రకారము పుట్టి చచ్చుచున్న మానవులందరు ఒక్కటే అని చెప్పవచ్చును. అట్లుకాక కొందరైన పుట్టిన తర్వాత చావకుండిన వీరి మతము వేరు అని చెప్పవచ్చును. అందరు దేవుని లెక్క ప్రకారము పుట్టి చచ్చుచున్నారు. కావున మానవులందరిది ఒకే మతమని చెప్పవచ్చును. కాని వేరు వేరు మతమని ఎట్లు చెప్పనగును? మానవులందరు తొమ్మిది రంధ్రముల దేహములతోనే పుట్టుచున్నారని తెలిపినాడు. అదే విధముగ మనుష్యులందరి దేహములకు తొమ్మిది రంధ్రములు కలవు. అందువలన మనుష్యులందరు ఒకే మతమని చెప్పనగును,ఒకవేళ కొందరికి ఏడు రంధ్రములో లేక ఎనిమిదో అటుకాక పదియోయుండిన వీరి మతము వేరని విభజింపవచ్చును. కాని అందరికి తొమ్మిదేయుండగ వేరు మతమని ఎట్లు చెప్పనగును? అట్లే శరీరకార్యములందు

కూడ ఎవ్వరికి ఏ విధ భేదము పరమాత్మ యుంచలేదు. ఏ భేదములేని మానవులు అజ్ఞానముచేత అనేక మతములను సృష్టించుకొని, మేము వేరు మీరు వేరు అను భ్రమచేత మా దేవుడు వేరు మీ దేవుడు వేరు అని అనుచున్నారు. అందరికి దేవుడు ఒక్కడే అని తెలుసుకోలేకపోవుచున్నారు. ఏ మతము సారాంశమయిన దేవుని తెలుసుకొని అతని దగ్గరకు చేరమనియే ఉన్నది, కాని వేరు ఏ మాత్రము లేదు.

ఎవ్వరు ఏమతమును ఆచరించిన, ఏదేవుని ఒప్పుకొనిన అది అంతయు అసలయిన పరమాత్మకే చేరును. అన్నిటియందు వున్నది ఒక్క పరమాత్మయే. అన్నిటియొక్క సారాంశము తెలివిగల మానవులమైన మనము తెలుసు కోలేకపోతే ఇతర జంతువులు కనుగొనగలవా! పశుపక్షి మృగాలకంటే మేలైన జన్మయందున్న మనము దేవుని కనుగొనలేమా? తప్పక తెలుసుకోవచ్చును. దేవుని తెలుసుకొనుటకు ఆధారము దేవుడే కావున దేవుని నమ్మి ఆయన తెలిపిన బోధలను విశదముగ తెలుసుకొని ఆచరించిన తప్పక తెలుసుకోవచ్చును.



ఈ గ్రంథమును ప్రబోధానంద శరీరములో హృది మధ్య నెలకొనియుండి, ప్రతి అవయవమును కదిలించి వ్రాయించినది ఒక్క గురువే. ఆ గురుచేతిలో కీలుబొమ్మై గురువు ఆడించినట్లు చేతులను కదిలించినది ప్రబోధానందుడు. ప్రబోధానందుడు ఈ గ్రంథమునకు కలములాంటివాడు. ప్రబోధగ్రంథకర్త అన్నిటికి మధ్యనున్న ప్రబోధానందుని గురువని తెలుసుకోవలయును. ఈగ్రంథమున వచ్చుకీర్తి అపకీర్తులు గురువే భరించుటకు అర్హుడు. ప్రబోధానందుడని నాగురువుచేత నామధేయము పొందిన నేను ఏమాత్రము అర్హుడనుకాను.

ఇట్లు
ప్రబోధానందస్వామి.

★ స మా ప్త ము ★

తత్వములు

1 వ తత్వము

శ్రీ గురుచరణారవిందములు నమ్మికొలుతుము అనుదినమూ
ఇదే రీతిగా అదే బోధగా అనుదినమూ కొలతిమీ ॥శ్రీగురు॥

1) ఆగర్భ శత్రువుల ఆర్గుని చంపేవిధమూ తెలియని మాకూ

తేజమయిన కత్తుల నిమ్మని కోరితిమీ ॥శ్రీగురు॥

2) ఐదు పడగల పాము విషముతో బాధపడే మాకూ
బోధామృతమనే మందిమ్మని కోరితిమీ ॥శ్రీగురు॥

3) ఏడుకొండలు ఎక్కే మార్గము తెలియని మాకూ
కంటకములులేని మార్గము తెలుపమని కోరితిమీ ॥శ్రీగురు॥

4) అండము పిండము బ్రహ్మాండము తెలియని మాకూ
అంతా నిండియుండే వానిని తెలుపమని కోరితిమీ ॥శ్రీగురు॥

5) పుట్టలోని పామును పట్టే విధము తెలియని మాకూ
పామును పట్టే కట్టు మంత్రము తెలుపమని కోరితిమీ ॥శ్రీగురు॥

6) ధరణిలో కర్మజీవులమై ప్రబోధానంద పాదము పట్టినమాకు
మాయరూప ప్రపంచమునుండి కడతేర్చమని కోరితిమీ ॥శ్రీగురు॥

2 వ తత్వము

నుడువ బొయ్యే మూలమేదో యతులైతే తెలియండీ
తెలిసియుంటే యతీశ్వరులై వెలుగండీ ॥నుడువబొయ్యే॥

1) దీపముతో వెల్గించిన దీపమేదో తెలియండీ
ఎన్ని దీపముల వెల్గించిన తరగని కాంతి ఏదండీ ॥నుడువ॥

2) నూనెతో మండిన కట్టెతో మండిన దీపమేదో తెలియండీ

కట్టెను కాల్చే మట్టిని కాల్చే అగ్ని ఏదండీ ॥నుడువ॥

3) దీపములోని అగ్నివలన నీరు ఆవిరై పోతుందని తెలియండీ
అగ్నివలన ఆవిరైపోయే నీరు ఏదో తెలియండీ ॥నుడువ॥

4) ధరణిలో దీని అర్థము తెలిసి నడవండీ
నుడివి నాడు ప్రసిద్ధిగా ప్రబోధానందుడని తెలియండీ ॥నుడువ॥

3 వ తత్వము

మందుకొనరే జీవులారా మందుకొనరే
మొదట విషయమై తుదకు అమృతమయినది మందిది ॥మందు॥

1) చిన్నలకయిన పెద్దలకయన ఒకటే చేరము
ప్రొద్దు మునిగే వేళాయె సంత ముగిసే వేళాయే ॥మందు॥

2) ప్రపంచమనే సంతలో మందు అమ్మువాడు ఎవడో
అమ్మించువాడు దేవుడే కొన్నవారు జీవులే తిన్నవారు దేవులే ॥మందు॥

3) మాయ అనే రోగానికి మందిది అమృతమిది ఆశలు విడచిన
ప్రొద్దు మునిగే వేళాయే సంత ముగిసే వేళాయే ॥మందు॥

4) మనస్సు నిలకడ కలిగిన వారికి అమృతమైనది మందిది
నిలకడలేని మనుషులకు విషమైనది మందిది ॥మందు॥

5) ప్రాణ, ధన, దేహమనే డబ్బు ఇచ్చినగాని దొరకని మందిది

సులభముగా దొరుకునది మందు కాదది మట్టేయని తెలుసుకోండీ ॥మందు॥

౬) సంతలో అంగళ్లు మెండాయె బేరములు బహు చౌకాయె
పూర్వ పుణ్యము అనుసరించి దొరుకు అంగడి అందులోని మందు ॥మందు॥

౭) ధరణిలో మందుకోసము వెదకి వేసారిన నాకు
దొరికెను భయములేక ప్రబోధానందుని అంగడి ॥మందు॥

4వ తత్వము

వింటిని వింటిని సద్గురు బోధ వింటిని వింటిని గురువరబోధ
వింటిని వింటిని మూటిలోనున్న మూలంబంతయు వింటినీ ॥వింటిని॥

1) పంచరంగుల గూటిలో చిక్కిన చిలకనునేనే యని వింటినీ
పంచరంగుల గూటిలో బందిఖానా కావద్దని వింటినీ ॥వింటిని॥

౨) ఏడు మేడలపైన ఎగిరే చిన్నది యుందని వింటినీ
ఒంటి స్థంభపు మేడలు నేనే యని వింటినీ ॥వింటిని॥

౩) మూడునదులు కలచే చోటున చేపయుందని వింటినీ
చేపలోయుంటూ వెలిగే జ్యోతిని నేనేయని వింటినీ ॥వింటిని॥

౪) ధరణిలో దాసుడనై శ్రీ గురువర బోధ వింటినీ
అంతట యున్నది ప్రబోధానందుడే యని వింటినీ ॥వింటిని॥

5వ తత్వము

శ్రీ గురు రాయుడు మాయ మర్మము తెలిపినాడే
మాయలో యుంటూ లేని వాడు కమ్మన్నాడే ॥శ్రీగురు॥

1) మూటిని ద్రుంచి ఆరును నరుక మన్నాడే
మూటిని ఆరుని చేరక యుండమన్నాడే ॥శ్రీగురు॥

2) తొమ్మిది వాకిల్ల కొంపకు ఎందుండి వస్తివన్నాడే
ఎందుతిరిగినా ముందు చోటుకే పొమ్మన్నాడే ॥శ్రీగురు॥

3) ఆరు శిఖరములపైన వెయ్యి కాళ్ల మంటపమన్నాడే
ఆరు శిఖరములు ఎక్కి ఎగ చూడ మన్నాడే ॥శ్రీగురు॥

4) మూడు నదులు కలియుచోటు తెలియమన్నాడే
మూటిలో యుండే మూల పురుషుని చూడ మన్నాడే ॥శ్రీగురు॥

5) ధరణిలో పుట్టిన మాకు పైన క్రింద ముందు వెనక ఎవడన్నాడే
నమ్మిక యుంటే అంతా ప్రబోధానందుడే చూడమన్నాడే ॥శ్రీగురు॥

6వ తత్వము

కనుమా కనుమా ఆనందజ్యోతిని కనుమా
వినుమా వినుమా ఆనందబోధను వినుమా ॥కనుమా॥

1) జీవుడు దేవుడై యున్న చోటు కనుమా
జీవుడు దేవుడు ఒక్కడే యను మాట వినుమా ॥కనుమా॥

2) హృదయ మనే గుడిలో యున్న దేవుని కనుమా
శరీరమే ధ్వజస్థంభ మన్న మాట వినుమా ॥కనుమా॥

3) దేవుని ఆలయమునకు ఏడు మెట్టికలు కనుమా
దేవుని ముందర మ్రోగించే దశనాదములు వినుమా ॥కనుమా॥

4) గుడిలో హద్దు మీరి తిరిగే పామును కనుమా
పామును పట్టి దేవునికి పడగ పట్టించమనేమాట వినుమా ॥కనుమా॥

5) గుడిలో దేవుని ఆనంద రూపు కనుమా
తనలో కలుపమని చేతులు జోడించమనే మాట వినుమా ॥కనుమా॥

6) ధరణిలో శిశ్యుడు గురువు ఎవడో కనుమా
ధరణిలో ప్రబోధానందుడే గురువు శిశ్యుడని వినుమా ॥కనుమా॥

7వ తత్వము

యోగి ఎవరో భోగి ఎవరో కనుగొనుమా
యోగిని నేనే భోగిని నేనే అన్నిటిని యుండిన వాడను నేనే
అన్నవాడు ఎవడో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

1) కనుగొనుమా మాయనాటకంబున మరులు
కొల్పుచున్న వాడు ఎవడో కనుగొనుమా
మాయను నేనే మరులును నేనే అన్నిటిని యుండిన వాడను నేనే
అన్నవాడు ఎవడో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

2) కనుగొనుమా చూపు ఎవరో తేజమెవరో కనుగొనుమా
చూపును నేనే తేజము నేనే అన్నిటిని యుండిన వాడను నేనే
అన్నవాడు ఎవరో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

3) కనుగొనుమా రోగమెవరో వైద్యుడెవరో కనుగొనుమా
రోగము నేనే వైద్యుడు నేనే అన్నిటిని యుండిన వాడను నేనే
అన్నవాడు ఎవడో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

4) కనుగొనుమా పాపము ఏదో పుణ్యము ఏదో కనుగొనుమా
పాపము నేనే పుణ్యము నేనే అన్నిటిని యుండిన వాడనునేనే
అన్నవాడు ఎవడో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

5) కనుగొనుమా ధరణిలో నీవు ఎవరో నేను ఎవరో కనుగొనుమా
నీవు నేనే నేను నేనే అందరిని యుండిన వాడను నేనే
అన్న ప్రబోధానందుడు ఎవడో కనుగొనుమా ॥యోగి ఎవరో॥

8 వ తత్వము

రతిపోసినాడే సద్గురు రతిపోసినాడే

1) మాయగ్రహ బాధ పడుచున్న మమ్ముచూచి ॥రతి పోసి॥

2) ఎరుపు, తెలుపు: నలుపు,
బలుచిత్ర విచిత్ర మాయరంగులతో ॥రతి॥

3) బయటికి మంచిగ కనపడుచు అంతరమున
మసలుచున్న గ్రహను పైకి లాగ ॥రతి॥

4) బయటి ఎరుపు, తెలుపు, నలుపు,
రంగులచూచి తికమక పడుటకై ॥రతి॥

5) ఎరుపు ఒకవైపు పొడవ, తెలుపు ఒకవైపు పొడవ,
నలుపు పైకి త్రోయగా ॥రతి॥

6) మాయగ్రహ పైకి పూని నీవెంతటి వాడవని ధిక్కరించగా ॥రతి॥

7) ధిక్కరింపును బిగాలుగా చేసి మంత్రించు మంత్రగాడై ॥రతి॥

8) జీవస్వరూపమై నిలుచున్న మాయాగ్రహను చూచి
మాయదైవమై నిలచి ॥రతి॥

9) ధరణిలో శరీరధరుడైయున్న ప్రబోధానందుని ధరిచేరి
రతిముందర మమ్ము నిలుపవద్దని వందనమనేటట్లు ॥రతి॥

9వ తత్వము

తరమా తరమా గురుమాయను కనుగొనుట తరమా
అలనాడు కృష్ణునిగా వెలసి సత్యకై బాధ పడిన వాని
మాయను కనుగొనుట తరమా ॥తరమా॥

1) అలనాడు రాముడిగా వెలసి వాలి సుగ్రీవులను

కనుగొనలేక దండను ధరింపజేసినవాని
మాయను కనుగొనుట తరమా ॥తరమా॥

2) అలనాడు రామునిగా వెలసి పరుశురాముడైవచ్చి
ఎదొర్కొనిన వాని మాయను కనుగొనుట తరమా ॥తరమా॥

3) అలనాడు వీరబ్రహ్మవతారమున కూటికై పశువుల కాచినవాని
మాయను కనుగొనుట తరమా ॥తరమా॥

4) అలనాడు మర్చీంద్రుడై సంసారమున మునిగి శిశ్యుని పరీక్షించిన వాని
మాయను కనుగొనుట తరమా ॥తరమా॥

5) ఇలనాడు జీవుని దేవునిగా మార్చుటకై వచ్చిన ప్రబోధానందుని
మాయను కనుగొనుట తరమా ॥తరమా

10వ తత్వము

ఏడుగెనుపులా చెఱుకన్నా దీని మర్మము తెలియరన్నా
మాయ అనే బొప్పి వలచితే ఆనందమనే
తీపి తెలయునన్నా ॥ఏడు గెను॥

1) భార్య పిల్లలనే ఒగుడు వలవన్నా తలంపులనే పిల్లవేర్లు పెరుకన్నా
మనస్సు అనే మొదలు పీకి రసము తీయన్నా ॥ఏడు గెను॥

2) ఐదురంగుల చెఱుకన్నా రంగు మర్మము తెలియరన్నా
రంగులన్ని కలిపి పిండితే జ్ఞానమనే రసము వచ్చునన్నా ॥ఏడు గెను॥

3) ఎనిమిది వంపులా చెఱుకన్నా వంపులా సరిచేయవన్నా
ఆరు చీడపురుగులు దీనికి పురుగుల చంపకపోతే కలదు ముప్పన్నా ॥ఏడు గెను॥

4) జ్ఞానమనే రసముతీయన్నా భక్తియనే అగ్ని యుంచవన్నా
సాధన అనే పాకు చేస్తే ముక్తి అనే బెల్లము వచ్చునన్నా ॥ఏడు గెను॥

5) ధరణిలో చెఱుకును పిండే యంత్రము నీవేనని తెలిపెనన్నా
యంత్రమునడిపె జంత్రగాడు ప్రబోధానందుడేనన్నా ॥ఏడు గెను॥

11 వ తత్వము

తెలిపె తెలిపె అంతా నేనేయని సద్గురురాయుడు తెలిపె
తోక నేనే, పీక నేనే, పాకము నేనే,
శాకము నేనే అని తెలిపె ॥తెలిపె॥

1) సాధుల మర్మము తెలిపె సన్యాసుల మర్మము తెలిపె
భక్తుల మర్మము తెలిపె హరిభక్తుల మర్మము తెలిపె
ఆత్మే నేనని తెలిపె ॥తెలిపె॥

2) నామము తెలిపె శివ నామము తెలిపె
పామును తెలిపె పడగను తెలిపె
పామును పట్టే విధమును తెలిపె అంతా నేనేయని తెలిపె ॥తెలిపె॥

3) గ్రహను తెలిపె విగ్రహను తెలిపె స్థూలము తెలిపె
సూక్ష్మము తెలిపె సత్తు తెలిపె చిత్తు తెలిపె

నీవే నేనని తెలిపె ॥తెలిపె॥

4) నిద్రను తెలిపె మెలుకువ తెలిపె స్వప్నము తెలిపె
అండము తెలిపె పిండము తెలిపె బ్రహ్మాండము తెలిపె
నేనే నేనని తెలిపె ॥తెలిపె॥

5) ఇక్కడ తెలిపె అక్కడ తెలిపె పైన తెలిపె లోన తెలిపె
సర్వ దిక్కులు తెలిపే అణువణువున
శ్రీ ప్రబోధానందుడేనని తెలిపె ॥తెలిపె॥

12వ తత్వము.

రుచి చూచినానే నేరుచి చూచినానే సద్గురు ప్రసాదము
గురు ప్రసాదము మనస్సున వింటూ రుచి చూచినానే ॥రుచి॥

1) ఏమని తెలుపను గురు ప్రసాదమును
పచ్చిది కాదు, పాకము కాదు, వట్టిది కాదు, ఏమని తెలుపను ॥రుచి॥

2) ఏమని తెలుపను అందరికి మ్రింగడ పడని దానిని
అన్ని స్థలముల దొరుకు దానిని ఏమని తెలుపను ॥రుచి॥

3) ఏమని తెలుపను నీవద్ద నా వద్ద నివాసమై యున్నదానిని
పులుపు, కారము, చేదు, వగరు, ఏ రుచిలేని
దానిని ఏమని తెలుపను ॥రుచి॥

4) ఏమని తెలుపను చెప్ప మాట కాదు ఊహించ ఊహకాదు
నీవు రుచి చూచినకాని అర్థము కానిదానిని ఏమని తెలుపను ॥రుచి॥

5) ఏమని తెలుపను ధరణిలో నేను రుచి చూచిన దానిని
నమ్మిక యుండిన అందరికి రుచి తెలుసు
ప్రబోధానందుని ఏమని తెలుపను ॥రుచి॥

13వ తత్త్వము

మాయ అనే సముద్రములో కొట్టుక పోవుచుంటిని
భక్తి అనే పడవవేసి ఒడ్డున చేర్చితివి ॥మాయ॥

1) ఏమి ఎరుగని మూఢునికి జ్ఞానంబదియని తెలిపితివి
వానిలోనున్న అజ్ఞానంబంతయు తొలగించితివి ॥మాయ॥

2) సంసార సంద్రములో మొసల్లు కలవని తెలిపితివి
జ్ఞానమనే కోనేటిలో అమృతముందని తెలిపితివి ॥మాయ॥

3) ఆలు పిల్లలు అంతయు యమకింకరులని తెలిపితివి
సంతకూట సంసారంలో సారము లేదని తెలిపితివి ॥మాయ॥

4) సాంఖ్యములోనున్న సారంబంతయు తెలిపితివి
తారకములోనున్న తేజంబంతయు తెలిపితివి ॥మాయ॥

5) ఇడా పింగళ సుషుమ్న నాడులు వివరములా తెలిపితివి
మూడు కలచే చోటున ముక్తి మార్గంబిదియని తెలిపితివి ॥మాయ॥

6) ధరణిలో పుట్టిననేను ఎవరో తెలిపితివీ
సాకారమునయున్న ప్రబోధానందుడు ఎవరో తెలిపితివీ ॥మాయ॥

14వ తత్వము

భారం భారం భారం సంసార సాగరము భారం
మధురం మధురం మధురం బ్రహ్మజ్ఞానము మధురము ॥భారం॥

1) కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యముల
ఆర్గురునిమోయుట భారం
అన్నిటిని విడచి గురు పంచచేరిన మధురం మధురం ॥భారం॥

2) అడుగడుగున అర్థముకాని యమ బాధలు భారం
సద్ గురు బోధవింటూ గురుపాదసేవ చేసిన మధురం మధురం ॥భారం॥

3) మూడు ఆశలు మొదటికి నరుకక యున్న భారం
సద్ గురు పాదమే దిక్కని నమ్మిన మధురం మధురం ॥భారం॥

4) ప్రాణ ధన దేహంబును గురువునకు నైవేద్యము
చేయకయున్న భారం
మాయ కన్నులకు జ్ఞానమనే కాటుక పెట్టించుకొన్న
మధురం మధురం ॥భారం॥

5) ధరణిలో నాకు ఈ కర్మ జన్మ మోయుట భారం
సద్గురు ప్రబోధానందుని అండచేరి కడతేరిన
మధురం మధురం ॥భారం॥

15వ తత్వము

వినవే మనసా ఇప్పటికయినా

1) కుక్కవు నీవు ఇల్లిల్లు తిరుగవద్దు
కుక్కవు నీవైతే నిన్ను కొట్టే యజమాని యున్నాడు ॥వినవే॥

2) పందివి నీవు మురికిలో పొర్లాడవద్దు
పందివి నీవైతే నిన్ను చంపే మొనగాడు యున్నాడు ॥వినవే॥

3) మధించిన ఏనుగు నీవు ఇచ్ఛవచ్చినట్లు పోవద్దు
మదపుటేనుగు నీవైతే నిన్ను ఎక్కే మావటి యున్నాడు ॥వినవే॥

4) కోతివి నీవు కొమ్మ కొమ్మ ఎగురవద్దు
కోతివి నీవైతే నిన్ను కట్టివేసేవాడు యున్నాడు ॥వినవే॥

5) దొరకను నేనంటే నిన్ను పట్టే మంత్రగాడు యున్నాడు
ధరణిలో చిక్కను నీకంటే నిన్నుమించి
ప్రబోధానందుడు యున్నాడు ॥వినవే॥